సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 263

గురువారం 14-12-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'



ఉద్దానం కిడ్నీ వ్యాధిగ్రస్తుల సమస్యకు శాశ్వత పరిష్కారం అందిస్తూ..

రూ.700 కోట్ల వ్యయంతో నిర్మించిన వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తూ, అన్నిరకాల కిడ్నీ చికిత్సలతో పాటు కిడ్నీ వ్యాధిపై పరిశోధనలు చేసేందుకు వీలుగా రూ. 85 కోట్ల వ్యయంతో నిర్మించిన డా. వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ & సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ను నేడు లాంఛనంగా ప్రారంభించనున్న గౌరవ ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి..

ఉద్దానం ప్రాంతంలో కళ్లెదుటే కిడ్నీ సమస్య కనిపిస్తున్నా గతంలో ఎవ్వరూ ఎప్పుడూ పరిష్కారం కోసం కనీసం ఆలోచించే సాహసం కూడా చేయని పరిస్థితిలో, ఏకంగా రూ.785 కోట్లు ఖర్చు చేసి మరీ.. ఉద్దానం వ్యాధిగ్రస్తుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించిన జగనన్న ప్రభుత్వం..



శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి
గౌరవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి

ఉద్దానం కిడ్నీ వ్యాధిగ్రస్తుల సమస్యకు శాశ్వత పరిష్కారం అందిస్తూ..

పలాసలో

డా. వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ & సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్..

వైఎస్సార్ సుజలధార ప్రాజెక్ట్..

ప్రారంభోత్సవం..

.. శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతాన్ని వేధిస్తున్న కిడ్నీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తూ రూ.700 కోట్ల వ్యయంతో నిర్మించిన వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తూ, అన్నిరకాల కిడ్నీ చికిత్సలతో పాటు కిడ్నీ వ్యాధిపై పరిశోధనలు చేసేందుకు వీలుగా రూ. 85 కోట్ల వ్యయంతో నిర్మించిన డా. వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ & సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ను నేడు లాంఛనంగా ప్రారంభించనున్న గౌరవ ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి..




డా. వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ & సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ విశేషాలు..

- ఉద్దానం కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందించేందుకు మరియు కిడ్నీ వ్యాధులపై పరిశోధనలు చేసేందుకు రూ. 85 కోట్ల వ్యయంతో పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, డయాలసిస్ యూనిట్ల ఏర్పాటు..
- మూడు బ్లాకులుగా 4 అంతస్తుల్లో ఆసుపత్రి నిర్మాణం. క్యాజువాలిటీ, రేడియో డయాగ్నోసిస్, పాథాలజీ, మైక్రో బయాలజీ, బయో కెమిస్ట్రీ ల్యాబ్స్, సెంట్రల్ ల్యాబ్స్, నెఫ్రాలజీ, యూరాలజీ, జనరల్ మెడిసిన్, సర్జరీ, డయాలసిస్, పోస్ట్ ఆపరేటివ్/ఐసీయూ, రీసెర్చ్ ల్యాబ్‌లతో ప్రత్యేక వార్డులు..
- సీటీ స్కాన్, 2డీ ఎకో, హై ఎండ్ కలర్ డాప్లర్, మొబైల్ ఎక్స్‌రే (డిజిటల్), థూలియం లేజర్, యూరో డైనమిక్ మెషిన్ మొదలగు పరికరాలతో పాటు ఐసీయూ సౌకర్యాలు..
- జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, యూరాలజీ, నెఫ్రాలజీ వంటి వివిధ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో ఇప్పటికే 42 స్పెషాలిటీ డాక్టర్ పోస్టులు, 60 స్టాఫ్ నర్సు పోస్టులు, 60 ఇతర సహాయ సిబ్బంది పోస్టుల భర్తీ కార్యక్రమం పూర్తి చేసిన జగనన్న ప్రభుత్వం..










"వైఎస్సార్ సుజలధార ప్రాజెక్ట్" విశేషాలు

- సిక్కోలు వాసుల చిరకాల వాంఛను నెరవేరుస్తూ ఉద్దానం ప్రాంతంలో దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధులు (క్రానిక్ కిడ్నీ డిసీజెస్) ప్రబలంగా ఉన్న ఏడు మండలాల్లోని అన్ని గ్రామాలకు "వైఎస్సార్ సుజలధార" ప్రాజెక్టు ద్వారా శుద్ధి చేసిన రక్షిత తాగునీటి సరఫరా..
- హీర మండలం రిజర్వాయర్ నుండి నీటిని తీసుకుని శుద్ధి చేసి పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల పరిధిలో 7 మండలాల్లోని 807 గ్రామాలకు రక్షిత నీటి సరఫరా..
- ఈ ప్రాంతంలో ప్రస్తుతం ఉన్న 6.78 లక్షల జనాభా 2051 నాటికి 7.85 లక్షలకు చేరుతుందన్న అంచనాతో అప్పటి అవసరాలకు కూడా సరిపోయే విధంగా ఒక్కొక్కరికి రోజుకు 100 లీటర్ల చొప్పున నీరు సరఫరా చేసేలా ప్రాజెక్టు రూపకల్పన.. ఇప్పటికే 613 గ్రామాలకు నీటి సరఫరా.. ఈ నెలాఖరుకు మిగిలిన గ్రామాలకు సైతం నీటి సరఫరా..



ఉద్దానం కిడ్నీ బాధితులకు అండగా జగనన్న ప్రభుత్వం చేపట్టిన చర్యలు..

- గత ప్రభుత్వంలో డయాలసిస్ పేషెంట్లకు కేవలం రూ. 2,500 చొప్పున పెన్షన్ ఇస్తే మన జగనన్న ప్రభుత్వం ఏకంగా రూ.10 వేలకు పెంచి, ప్రతి నెలా 1వ తేదీన రంఛన్ గా లబ్ధిదారుల గుమ్మం వద్దనే వాలంటీర్లచే అందజేత..
- ఇప్పటికే టెక్కలి, పలాస, సోంపేట, కవిటి, హరిపురం ఆస్పత్రుల్లో 74 మెషీన్లతో డయాలసిస్ సేవలు..
- ఇలా వరుసగా 2019-20లో 37,454 సెషన్లు, 2020-21లో 46,162 సెషన్లు, 2021-22లో 54,520 సెషన్లు, 2022-23లో 55,520 సెషన్లు, 2023-24లో (అక్టోబర్ నాటికి) 38,513 సెషన్ల చొప్పున కిడ్నీ బాధితులకు డయాలసిస్ సేవలు అందించిన జగనన్న ప్రభుత్వం.. ఇప్పుడు దీనికి అదనంగా మరింత మెరుగైన సేవలు అందించేందుకు కిడ్నీ రీసెర్చ్ & సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్..



- వైద్య పరీక్షల కోసం ఉద్దానం ప్రాంతంలోని 18 పీహెచ్‌సీలు, 5 యూపీహెచ్‌సీలు, 6 సీహెచ్‌సీల్లో సెమీ ఆటో ఎనలైజర్స్, ఎలక్ట్రోలైట్ ఎనలైజర్స్, యూరిన్ ఎనలైజర్స్ ఏర్పాటు..
- గత ప్రభుత్వంలో డయాలసిస్ రోగులకు 20 రకాల మందులు మాత్రమే అరకొరగా అందజేస్తే.. ప్రస్తుతం ఇక్కడ ప్రతి ఆస్పత్రిలో 37 రకాల మందులు అందుబాటులో ఉంచిన జగనన్న ప్రభుత్వం..
- కొత్త కేసుల గుర్తింపునకు నిరంతరాయంగా కొనసాగుతున్న స్క్రీనింగ్.. వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్ లో పనిచేసే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో) లకు ప్రత్యేక యాప్ ..
- స్క్రీనింగ్ అనంతరం అనుమానిత లక్షణాలున్న వారి నుంచి రక్త నమూనాలు సేకరించి సీరమ్ క్రియాటినిన్ పరీక్షల కోసం సమీపంలోని పీహెచ్‌సీలకు తరలింపు..



శ్రీమతి. విడదల రజిని, వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి

శ్రీ. బూడి ముత్యాల నాయుడు, ఉప ముఖ్య మంత్రి, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి

గమనిక: రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి శ్రీకాకుళం జిల్లా పర్యటనలో భాగంగా 14 డిసెంబర్, 2023న వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉదయం 10 గం.ల నుండి ఈ కార్యక్రమాలను అన్ని ప్రముఖ న్యూస్ ఛానళ్లలో లైవ్‌లో వీక్షించవచ్చు.

జారీచేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం



'అర్జున' రేసులో మొహమ్మద్ షమీ

న్యూఢిల్లీ: భారత పేస్ బౌలర్ మొహమ్మద్ షమీకి జాతీయ క్రీడా పురస్కారం 'అర్జున' అవార్డు దక్కే అవకాశం ఉంది. ఈ మేరకు అతని పేరును అవార్డు కోసం బీసీసీఐ సిఫారసు చేసింది. ఇటీవలి వన్డే ప్రపంచకప్‌లో షమీ 24 వికెట్లతో చెలరేగాడు. ముందుగా నామినేట్ చేసిన జాబితాలో షమీ పేరు లేకపోయినా...బీసీసీఐ ప్రత్యేకంగా విజ్ఞప్తి చేయడంతో అతని పేరును చేర్చారు. భారత బ్యాడ్మింటన్ డబుల్స్ జంట సాత్విక్ సాయిరాజ్ – చిరాగ్ శెట్టి కూడా ప్రతిష్టాత్మక 'ఖేల్‌రత్న' అవార్డు కోసం రేసులో నిలిచారు. షమీ కాకుండా మరో 16 మంది ఆటగాళ్లు అర్జున అవార్డు కోసం పోటీ పడుతున్నారు. ఇందులో తెలంగాణ బాక్సర్ మొహమ్మద్ హుసాముద్దీన్, తమిళనాడు చెస్ ప్లేయర్ వైశాలి తదితరులు ఉన్నారు.

మహిళల 'టెస్టు'కు సిద్ధం



హర్మన్



హీతర్ నైట్

నేటినుంచి భారత్, ఇంగ్లండ్ సమరం
ఆత్మవిశ్వాసంతో హర్మన్ సేన
ఇంగ్లండ్‌కు 100వ టెస్టు మ్యాచ్
ఉ.గం.9.30నుంచి స్పోర్ట్స్–18లో ప్రత్యక్ష ప్రసారం

ముంబై: రెండేళ్ల విరామం తర్వాత భారత మహిళల క్రికెట్ జట్టు టెస్టు మ్యాచ్ బరిలోకి దిగుతోంది. టి20 సిరీస్ తర్వాత ఇంగ్లండ్‌తో నేటినుంచి జరిగే ఏకైక టెస్టు (నాలుగు రోజుల మ్యాచ్)లో భారత్ తలపడుతుంది. వన్డేలు, టి20లను పక్కన పెడితే టెస్టుల్లో భారత జట్టు ప్రత్యర్థితో పోలిస్తే అనుభవం, ఫలితాలపరంగా చాలా వెనుకబడి ఉంది. మన అమ్మాయిలకు ఎప్పుడో గానీ టెస్టులు ఆడే అవకాశం రాదు. ఓవరాల్‌గా భారత్ ఇప్పటి వరకు 38 టెస్టులు మాత్రమే ఆడగా...99 మ్యాచ్‌లు ఆడిన ఇంగ్లండ్ ఇప్పుడు 100వ మ్యాచ్‌కు సిద్ధమైంది. 2014 తర్వాత భారత్‌లో మహిళల టెస్టు జరగడం ఇదే మొదటిసారి కావడం విశేషం. భారత మహిళల క్రికెట్ దిగ్గజాలు మిథాలీరాజ్, జులన్ గోస్వామిల రిటైర్మెంట్ తర్వాత జట్టు ఆడుతున్న మొదటి టెస్టు ఇదే కానుంది. ఈ నేపథ్యంలో టెస్టు అనుభవంపై ఇంగ్లండ్ ఆధారపడుతుండగా... సొంతగడ్డపై ఆడుతున్న అనుకూలతను హర్మన్ సేన నమ్ముకుంది. 2021 సెప్టెంబర్‌లో ఆఖరి సారిగా టెస్టు ఆడిన భారత్ ఆసీస్‌తో జరిగిన ఆ మ్యాచ్‌ను 'డ్రా'గా ముగించగలిగింది.

ఇంగ్లండ్ సమష్టిగా...

దేశవాళీలో నాలుగు రోజుల మ్యాచ్‌లు ఎక్కువగా ఆడటం పాటు 'యాషెస్' కారణంగా కూడా ఇంగ్లండ్ టీమ్ తరచుగా టెస్టు మ్యాచ్‌ల బరిలోకి దిగుతూ వస్తోంది. ఇప్పుడు కూడా ఆ జట్టు ఈ ఫార్మాట్‌లో తమ బలాన్నే నమ్ముకుంది. జట్టులో ఎక్కువ మంది సభ్యులకు టెస్టు అనుభవం ఉంది. కెప్టెన్ హీతర్ నైట్‌తో పాటు బీమాంట్, సివర్ బ్రంట్ కీలక బ్యాటర్లు కాగా...మిడిలార్డర్‌లో క్యాప్సీ, డాని వాట్ ప్రభావం చూపించగలరు. బీమాంట్‌తో పాటు రెండో ఓపెనర్‌గా డంక్లీ బరిలోకి దిగవచ్చు. కీపర్ ఎమీ జోన్స్ ధాటిగా ఆడగలదు. స్పిన్నర్ సోఫీ ఎకెల్‌స్టోన్ ఇంగ్లండ్‌కు బౌలింగ్‌లో ప్రధాన బలం. ఇతర బౌలర్లు క్రాస్, బెల్, డీన్ భారత పిచ్‌పై ఏమాత్రం ప్రభావం చూపించగలరో చెప్పలేం. ఇంగ్లండ్ జట్టు భారత గడ్డపై 2005 తర్వాత టెస్టు మ్యాచ్ ఆడటం ఇదే మొదటిసారి.

వారిద్దరే కీలకం...

భారత జట్టులో భారత కెప్టెన్‌కు 3 టెస్టుల, స్టార్ బ్యాటర్ స్మృతి మంధానకు 4 టెస్టుల అనుభవం మాత్రమే ఉండగా...మిగతా జట్టు సభ్యులకు ఆమాత్రం అనుభవం కూడా లేదు. వన్డేలు, టి20లతో పోలిస్తే క్రీజ్‌లో నిలవడంలో వీరు ఏమాత్రం పట్టుదల కనబరుస్తారనేది ఆసక్తికరం. అందుకే జట్టు విజయావకాశాలు ప్రధానంగా హర్మన్, స్మృతిలపైనే ఆధారపడి ఉన్నాయి. షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్ తమ బ్యాటింగ్ బలాన్ని ప్రదర్శించాల్సి ఉంది. ముఖ్యంగా పరిమిత ఓవర్ల క్రికెట్‌లో దూకుడుకు మారుపేరైన షఫాలీ ఇక్కడ కాస్త ఓపికను చూపించి ఆడితే భారీ స్కోరుకు అవకాశం ఉంటుంది. రోడ్రిగ్స్ కూడా టెస్టుకు తగినట్లుగా తన ఆటతీరును మార్చుకోగలదని టీమ్ మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. అనుభవజ్ఞులైన స్పిన్నర్లు స్నేహ్ రాణా, రాజేశ్వరి గైక్వాడ్ టెస్టులో ఎలాంటి ప్రభావం చూపిస్తారనేది చూడాలి. వీరితో పాటు దీప్తి శర్మ కూడా స్పిన్‌తో రాణించగలదు. భారత్ ఆడిన గత రెండు టెస్టులు కూడా విదేశీ గడ్డపైనే జరిగాయి. ఆ రెండు మ్యాచ్‌లలో జట్టు ముగ్గురు పేసర్లతో బరిలోకి దిగింది. అలా చూస్తే రేణుకా సింగ్, మేఘనా సింగ్‌లతో పాటు పూజ వస్త్రకర్‌కు అవకాశం ఉంటుంది. ఇద్దరు పేసర్లకే పరిమితమైతే మాత్రం పూజను పక్కన పెట్టి అదనపు బ్యాటర్‌గా రిచా ఘోష్‌ను తీసుకోవచ్చు.



సమం కోసం భారత్ సమరం

దక్షిణాఫ్రికాతో నేడు ఆఖరి టి20 ● జోరుమీదున్న సఫారీ
ఆల్‌రౌండ్ ప్రదర్శనపై సూర్య సేన దృష్టి ● రా.గం. 8.30 నుంచి 'స్టార్‌స్పోర్ట్స్–1'లో ప్రసారం

జొహన్నెస్‌బర్గ్: ఒకటి వాన ఖాతాలో... మరొకటి ఆతిథ్య ఖాతాలో పడిపోయాయి. ఇప్పుడు భారత్ ఖాతా తెరవాల్సిన సమయం వచ్చింది. దక్షిణాఫ్రికాతో ఆఖరి పోరులో టీమిండియా గెలిస్తేనే మూడు టి20ల సిరీస్‌ను 1–1తో సమం చేయగలదు. లేదంటే సిరీస్ చేజారుతుంది. ఈ నేపథ్యంలో ఆఖరి సమరం యువ భారత్ సత్తాకు పరీక్ష పెడుతోంది. గురువారం జరిగే మ్యాచ్‌లో సూర్యకుమార్ సేన గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. నిజానికి గత మ్యాచ్‌లో భారత్ చేసిన స్కోరు తక్కువేం కాదు. కానీ వాన ప్రతాపం, మంచ్ ప్రభావంతో బౌలర్లు కట్టు తప్పారు. ఇదే అదనుగా దక్షిణాఫ్రికా బ్యాటర్లు చెలరేగారు. ఇప్పుడు 'సీన్' అర్థమైన 'సూర్య అండ్ కో' తప్పకుండా సరైన ఎత్తుగడతోనే బరిలోకి దిగడం ఖాయం. ఇదే జరిగితే సిరీస్ చేతికి అందకపోయినా... చేజారడం మాత్రం జరగదు.

ఓపెనర్లు చెలరేగితే...

ఆస్ట్రేలియాతో సొంతగడ్డపై జరిగిన ఐదు టి20ల సిరీస్‌లో టాపార్డర్ కీలకపాత్ర పోషించింది. ఇక్కడ యశస్వి–శుబ్‌మన్ గిల్ జోడి డకౌట్లతో నిరాశపరిచింది. ఇది ఇన్నింగ్స్‌పై ప్రభావం చూపించింది. పొట్టి ఫార్మాట్‌లో పవర్ ప్లే, డెత్ ఓవర్లే స్కోరును ఒక్కసారిగా మార్చేస్తాయి. భారత్ విషయంలో అదే జరిగింది. తిలక్‌వర్మ ఉన్నంత సేపు ధాటిగా ఆడాడు. మ్యాచ్ మ్యాచ్‌కు రాటుదేలుతున్న రింకూ సింగ్‌పై అందరి దృష్టి పడింది. కచ్చితత్వంతో కూడిన భారీషాట్లు అతన్ని మరో మెట్టుపై నిలబెడుతున్నాయి. కెప్టెన్ సూర్య కుమార్ ఎలాగూ ఫామ్‌లోనే ఉన్నాడు. బ్యాటింగ్ ఆర్డర్‌పై పెద్దగా బెంగలేకపోయినా... బౌలింగ్ విభాగం తేలిపోవడమే జట్టు మేనేజ్‌మెంట్‌ను కలవర పెడుతోంది. అనుభవజ్ఞులైన రవీంద్ర జడేజా, సిరాజ్‌లు ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేయలేకపోగా...అర్ష్‌దీప్, ముకేశ్ విఫలమయ్యారు. కీలకమైన ఈ మ్యాచ్‌లో బౌన్సీ పిచ్ సహకారంతో భారత బౌలర్లు లైన్ అండ్ లెంత్‌కు కట్టుబడితే ఆశించిన ఫలితాల్ని అందుకోవచ్చు.

సిరీస్‌పై కన్నేసిన సఫారీ

రెండో మ్యాచ్ గెలిచి 1–0తో జోరుమీదున్న ఆతిథ్య దక్షిణాఫ్రికా ఇప్పుడు సిరీస్‌పై కన్నేసింది. ఆఖరి మ్యాచ్‌లోనూ భారత్‌ను కంగుతినిపించి 2–0తో సిరీస్‌ను వశం చేసుకోవాలనే లక్ష్యంతో మార్క్‌రమ్ సారథ్యంలోని సఫారీ బరిలోకి దిగుతోంది. రెండో మ్యాచ్‌లో ఓపెనర్ హెన్‌డ్రిక్స్, మార్క్‌రమ్ సుడిగాలి వేగం మిగతా బ్యాటర్లు కొట్టిన అడపాదడపా బౌండరీలతో కుదించిన లక్ష్యాన్ని దర్జాగా ఛేదించేలా చేసింది. అయితే రబడా, ఇన్‌గిడిలాంటి స్పీడ్‌స్టర్లు అందుబాటులో లేని సఫారీ బౌలింగ్ కూడా పేలవంగానే కనిపిస్తోంది. ఈ విభాగాన్ని మెరుగు పర్చుకుంటేనే సిరీస్‌ను చేజిక్కించుకుంటుంది. లేదంటే యువ భారత్ సిరీస్ సమం చేసుకుంటుంది.

జట్లు (అంచనా) భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), యశస్వి, శుబ్‌మన్, తిలక్‌వర్మ, రింకూ సింగ్, జితేశ్ శర్మ, జడేజా, అర్ష్‌దీప్, కుల్దీప్, సిరాజ్, ముకేశ్.

దక్షిణాఫ్రికా: మార్క్‌రమ్ (కెప్టెన్), హెన్‌డ్రిక్స్, బ్రీట్‌కి, క్లాసెన్, మిల్లర్, స్టబ్స్, ఫెలుక్వాయో, జాన్సెన్, కొయెట్జి, లిజాడ్ విలియమ్స్, షమ్సీ.

పిచ్–వాతావరణం

వాండరర్స్ వికెట్ బ్యాటింగ్‌కు స్వర్గధామం. భారీ స్కోర్లు, మెరుపులకు లెక్కేలేదు. అయితే పేస్ బౌలర్లకు కూడా కాస్త అనుకూలించే పిచ్ ఇది. టాస్ నెగ్గిన జట్టు ఛేదనకే మొగ్గు చూపవచ్చు. గురువారం వర్ష సూచన అయితే ఉంది. కానీ మ్యాచ్ సమయానికల్లా అనుకూల వాతావరణం ఉంటుంది.

భారత్ X జర్మనీ

జూనియర్ హాకీ వరల్డ్‌కప్‌లో నేడు సెమీస్



కౌలాలంపూర్: జూనియర్ ప్రపంచకప్ హాకీలో చక్కని ప్రదర్శన కనబరిచిన భారత్‌కు నేడు జరిగే సెమీ ఫైనల్లో జర్మనీతో క్లిష్టమైన పోరు ఎదురు కానుంది. పటిష్టమైన జర్మనీ అడ్డంకిని దాటితే ఇంచుమించు టైటిల్ గెలిచినట్లే! ఈ మెగా ఈవెంట్ చరిత్రలో జర్మనీ దుర్భేధ్యమైన ప్రత్యర్థి. గత టోర్నీ రన్నరప్ జర్మనీ ఆరుసార్లు (1982, 85, 89, 93, 2009, 13) టైటిల్ గెలిచింది. మరో రెండుసార్లు (1979, 2021) రన్నరప్‌గా నిలిచింది. అంతటి ప్రత్యర్థిని దాటుకొని భారత్ నాలుగో సారి ఫైనల్ చేరడం అంత సులువు కాదు. అయితే క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ నాలుగో ర్యాంకర్ నెదర్లాండ్స్‌పై ఆడిన తీరు, చేసిన పోరాటం, గెలిచిన వైనం చూస్తే భారత్‌ను తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. మేటి జట్టు చేతిలో 0–2తో వెనుకబడిన దశనుంచి భారత్ చివరికొచ్చే సరికి 4–3 గోల్స్ తేడాతో డచ్‌పై జయభేరి మోగించింది. ముఖ్యంగా ప్రత్యర్థి జట్టుకు పెనాల్టీ కార్నర్లు లభించినపుడు... గోల్ కీపర్ మోహిత్‌తో పాటు రక్షణశ్రేణి చూపించిన సయమస్ఫూర్తి, కనబరిచిన పోరాటం అద్వితీయంగా సాగింది. ఇప్పుడు కూడా ఉత్తమ్ సింగ్ నేతృత్వంలోని భారత్ ఇదే ఆటతీరును కొనసాగిస్తే జర్మనీని కట్టడి చేయగలదు. మరో సెమీ ఫైనల్ మ్యాచ్‌లో స్పెయిన్‌తో ఫ్రాన్స్ తలపడుతుంది.

ఆసీస్‌ను పాక్ ఆపతరమా!

- నేటినుంచి తొలి టెస్టు
- ఉ.గం.7.50నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



ఖాజా

పెర్త్: ప్రపంచకప్ గెలిచిన సమరోత్సాహంతో ఉన్న ఆస్ట్రేలియా, పేలవ ప్రదర్శనతో పరిమిత ఓవర్ల లోనూ తడబడుతున్న పాకిస్తాన్ మధ్య టెస్టు సమరానికి రంగం సిద్ధమైంది. నేటినుంచి జరిగే తొలి టెస్టులో ఇరు జట్లు తలపడనున్నాయి. సొంత గడ్డపై తిరుగులేని జట్టయిన ఆసీస్ అన్ని రకాలుగా బలంగా కనిపిస్తూ నిస్సందేహంగా ఫేవరెట్‌గా కనిపిస్తోంది. మరో వైపు వరల్డ్ కప్ వైఫల్యం తర్వాత జట్టు, కెప్టెన్ మార్పులతో పాక్ బరిలోకి దిగుతోంది. 1995లో ఆసీస్ గడ్డపై చివరి సారిగా టెస్టు మ్యాచ్ నెగ్గిన పాక్ ఒక్కసారి కూడా సిరీస్ గెలవలేదు. 1999 టూర్‌నుంచి ఆ జట్టు వరుసగా 14 టెస్టుల్లో ఓడింది. కనీసం 'డ్రా'గా కూడా ముగించలేకపోయింది. టెస్టుకు ముందు ఆసీస్ ఓపెనర్ ఉస్మాన్ ఖాజా గాజాలో పాలస్తీనాకు మద్దతు తెలుపుతున్నట్లుగా తన షూస్‌కు 'ఆల్ లైవ్స్ ఆర్ ఈక్వల్' అనే క్యాప్షన్‌తో ప్రాక్టీస్‌తో పాల్గొన్నాడు. అయితే ఐసీసీ నిబంధనల ప్రకారం ఇలాంటి క్రికెట్ మైదానంలో ప్రదర్శించరాదు. ఖాజాకు తన భావాలను ప్రదర్శించే స్వేచ్ఛ ఉందని ఆసీస్ బోర్డు, కెప్టెన్ కమిన్స్ అండగా నిలిచినా... అతను ఆ వ్యాఖ్యలు ఉన్న షూస్‌తో టెస్టు బరిలోకి దిగరాదని నిర్ణయించుకున్నాడు. తనది రాజకీయ ప్రకటన కాదని, మానవత్వం మాత్రమేనని ఖాజా అన్నాడు.

మళ్లీ ఓడిన టైటాన్స్

బెంగళూరు: ప్రొ కబడ్డీ లీగ్‌లో తెలుగు టైటాన్స్ జట్టు పరాజయాల పరంపర కొనసాగుతోంది. టోర్నీలో నాలుగో మ్యాచ్ ఆడిన జట్టు వరుసగా నాలుగో ఓటమిని ఎదుర్కొంది. బుధవారం హోరాహోరీగా జరిగిన పోరులో తమిళ్ తలైవాస్ 38–36 స్కోరుతో టైటాన్స్‌పై విజయం సాధించింది. టైటాన్స్ తరఫున కెప్టెన్ పవన్ సెహ్రావత్, రాబిన్ చౌదరి చెరో 7 పాయింట్లు సాధించారు. తలైవాస్ ఆటగాళ్లలో నరేందర్ 10, సాహిల్ 7 పాయింట్లతో జట్టు గెలిపించారు. మరో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 32–30తో జైపూర్ పింక్ పాంథర్స్‌పై గెలుపొందింది.

ప్రొ కబడ్డీ లీగ్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
బెంగాల్ వారియర్స్	4	3	0	1	18
గుజరాత్ జెయింట్స్	5	3	2	0	17
బెంగళూరు బుల్స్	6	2	4	0	14
యూపీ యోధాస్	4	2	2	0	12
పుణేరి పల్టన్	2	2	0	0	10
పట్నా పైరేట్స్	3	2	1	0	10
తమిళ్ తలైవాస్	3	2	1	0	10
జైపూర్ పింక్ పాంథర్స్	4	1	2	1	10
హరియాణా స్టీలర్స్	3	2	1	0	10
దబంగ్ ఢిల్లీ	3	1	2	0	6
యు ముంబా	3	1	2	0	6
తెలుగు టైటాన్స్	4	0	4	0	2

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు


సినిమా



● మహేశ్‌బాబు, శ్రీ లీల

నా కంటి రెప్పలో కాటుక ముగ్గు నువ్వే...

''నా కాఫీ కప్పులో షుగరు క్యూబు నువ్వే నువ్వే.. నా కంటి రెప్పలో కాటుక ముగ్గు నువ్వే నువ్వే..'' అంటూ సాగుతుంది 'గుంటూరు కారం' సినిమాలోని 'ఓ మై బేబీ' పాట. హీరో మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం ఇది. శ్రీ లీల హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి మరో హీరోయిన్. బుధవారం ''ఓ మై బేబీ.. నీ బుగ్గలు పిండాలి.. ఓ మై బేబీ నీకు ముద్దులు పెట్టాలి..'' అంటూ సాగే 'ఓ మై బేబీ..' పాట పూర్తి లిరికల్ వీడియోను విడుదల చేశారు. సంగీత దర్శకుడు తమన్ స్వరకల్పనలో రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటను శిల్పారావు ఆలపించారు. సూర్యదేవర రాధాకృష్ణ (చిన్నబాబు) నిర్మిస్తున్న ఈ సినిమా సంక్రాంతి సందర్భంగా జనవరి 12న విడుదల కానుంది. ఈ చిత్రానికి కెమెరా: మనోజ్ పరమహంస.



● రవితేజ

స్నేహమే ఇదిలే..



● 'సలార్' పోస్టర్

'సూరీడే గొడుగు పట్టి వచ్చాడే భుజము తట్టి, చిమ్మ చీకటిలోను నీడలా ఉండేటోడు..' అంటూ సాగే 'సూరీడే..' పాట 'సలార్: సీజ్ ఫైర్' చిత్రంలోనిది. ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ చిత్రంలో శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటించగా పృథ్వీరాజ్ సుకుమారన్, జగపతిబాబు కీలక పాత్రలు పోషించారు. రెండు భాగాల 'సలార్'లోని తొలి భాగం 'సలార్: సీజ్‌ఫైర్' ఈ నెల 22న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'సూరీడే..' పాట లిరికల్ వీడియోను బుధవారం విడుదల చేశారు. ''ఒకరికొకరని నమ్మి నడిచిన స్నేహమే ఇదిలే.. నూరేళ్లు నిలవాలే..' అంటూ స్నేహం విలువను చాటి చెప్పేలా ఈ పాట సాగుతుంది. తెలుగు వెర్షన్ పాటను రవి బస్రూర్ సంగీత సారథ్యంలో కృష్ణకాంత్ రాయగా, హరిణి వైతూరి పాడారు. ''ఒకే ఆత్మ అనేలా ఉండే ఇద్దరి స్నేహితుల గురించి ఈ పాట చెబుతుంది. వారే ఒకరికొకరు బలం.. వారే ఒకరికొకరు బలహీనత. 2 గంటల 55 నిమిషాల నిడివి ఉన్న ఈ సినిమా సెన్సార్ పూర్తయింది'' అని చిత్రబృందం పేర్కొంది.

ఇంకా స్పైసీగా...



● హరీష్ శంకర్

'మిరపకాయ్' వంటి మాస్ హిట్‌ను హీరో రవితేజకు ఇచ్చారు దర్శకుడు హరీష్ శంకర్. అలాగే రవితేజతో 'ధమాకా' వంటి మాస్ హిట్ చిత్రాన్ని నిర్మించారు పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వప్రసాద్. ఇప్పుడు ఈ హీరో–డైరెక్టర్–ప్రొడ్యూసర్ కాంబినేషన్ ఒకే సినిమాకి కుదిరింది. రవితేజ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో ఓ సినిమా నిర్మించనున్నట్లు బుధవారం పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ప్రకటించింది. ''ఈసారి మాస్ రీ యూనియన్ ఇంకా స్పైసీగా ఉంటుంది. త్వరలో ఇతర వివరాలు తెలియజేస్తాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.

వ్యూహంకి క్లీన్ యు



● అజ్మల్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జీవితంలోని కొన్ని ఘటనల ఆధారంగా రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'వ్యూహం'. ఈ సినిమాకు కొనసాగింపుగా 'శపథం' సినిమా రానుంది. అజ్మల్, మానస ప్రధాన పాత్రల్లో రామదూత క్రియేషన్స్ పై 'వ్యూహం'ను దాసరి కిరణ్ కుమార్ నిర్మించారు. నవంబరు 10న విడుదల కావాల్సిన ఈ సినిమాకు సెన్సార్ ఇబ్బందులు రావడంతో రిలీజ్ వాయిదా పడింది. ఈ నేపథ్యంలో రివైజింగ్ కమిటీకి పంపారు. తాజాగా 'వ్యూహం' సెన్సార్ పూర్తయింది. ''బ్యాడ్ బాయ్స్‌కు బ్యాడ్ న్యూస్. 'వ్యూహం' సినిమా సెన్సార్ పూర్తయింది. క్లీన్ యు సర్టిఫికెట్ లభించింది. డిసెంబరు 29న చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నాం'' అని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు రామ్‌గోపాల్ వర్మ. సెన్సార్ బోర్డ్ మూడు డైలాగ్‌లను మాత్రమే మ్యూట్ చేయమని పేర్కొందని, వేరే ఏ కట్ చెప్పలేదని చిత్ర యూనిట్ సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి. 2 గంటల 6 నిమిషాల నిడివితో ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కానుంది.

ఆ విజయం నా బాధ్యత పెంచింది

– విరాజ్ అశ్విన్



విరాజ్ అశ్విన్, పూజితా పొన్నాడ జంటగా అను ప్రసాద్ దర్శకత్వంలో నిరీష్ తిరువీధుల నిర్మించిన చిత్రం 'జోరుగా హుషారుగా..'. ఈ చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో విరాజ్ అశ్విన్ మాట్లాడుతూ – ''ఈ సినిమాలో చేనేత కుటుంబంలో పుట్టిన మధ్యతరగతి యువకుడు సంతోష్ పాత్ర చేశాను. తన కొడుకును ప్రయోజకుడిని చేసేందుకు ఓ మధ్యతరగతి తండ్రి ఎలాంటి త్యాగాలు చేయాల్సి వచ్చింది? కుటుంబం కోసం ఆ యువకుడు ఎలాంటి బాధ్యతలు తీసుకున్నాడు? అనేది ఈ సినిమాలోని ఆసక్తికర అంశాలు. 'బేబీ' సినిమా విజయం సాధిస్తుందని ఊహించాం కానీ అంత పెద్ద విజయం సాధిస్తుందని ఊహించలేదు. 'బేబీ' సక్సెస్ నా బాధ్యతను పెంచింది. ఇక నేను ఓ లీడ్ రోల్ చేసిన 'మరీచిక' రిలీజ్‌కి రెడీగా ఉంది. మరో రెండు కథలు విన్నాను'' అని చెప్పుకొచ్చారు.

మాస్ డుగు.. డుగు...



● మీనాక్షీ గోస్వామి

సూర్యతేజ ఏలే హీరోగా కేవీఆర్ మహేంద్ర దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'భరతనాట్యం'. పాయల్ సరాఫ్ నిర్మిస్తున్న ఈ చిత్రంలోని 'డుగు.. డుగు..' అంటూ సాగే మాస్ సాంగ్‌ని దర్శకుడు అనిల్ రావిపూడి విడుదల చేశారు. చిత్రకథానాయిక మీనాక్షీ గోస్వామిపై చిత్రీకరించిన ఈ పాటను చిత్ర సంగీత దర్శకుడు వివేక్ సాగర్ స్వరపరిచారు. సినిమానీ, నిజ జీవితాన్నీ పోలుస్తూ కాసర్ల శ్యామ్ రాసిన ఈ పాటను మంగ్లీ పాడారు. శేఖర్ మాస్టర్ నృత్య రీతులు సమకూర్చారు. ''త్వరలో ఈ చిత్రం విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

నాతో నేనే ప్రయోగాలు చేయాలనుకుంటున్నాను

– శ్రీనివాస్



''దర్శకత్వం, నటనల కంటే నాకు రైటింగ్ అంటే ఎక్కువ ఇష్టం. నేను 'ఊహలు గుసగుసలాడే' సినిమా తీసినప్పుడు ఆ తరహా చిత్రాలు అప్పుడు రాలేదు. అలానే 'జో అచ్యుతానంద' కూడా. ఇలా నా కథలతో నాతో నేనే ప్రయోగాలు చేయాలనుకుంటున్నా'' అని అన్నారు రచయిత, దర్శక–నటుడు అవసరాల శ్రీనివాస్. శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటించిన హారర్ ఫిల్మ్ 'పిండం'లో అవసరాల శ్రీనివాస్ కీలక పాత్ర పోషించారు. సాయికిరణ్ దైదా దర్శకత్వంలో యశ్వంత్ దగ్గుమాటి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో అవసరాల శ్రీనివాస్ మాట్లాడుతూ– ''సాయి కిరణ్ చేసిన 'స్మోక్' షార్ట్ ఫిల్మ్ చూసి, తనలో రచన, దర్శకత్వ ప్రతిభ ఉందని గ్రహించాను. తను చెప్పిన 'పిండం' కథ నచ్చింది. ఈ సినిమాలో అతీంద్రియ శక్తులపై పరిశోధనలు చేసే లోక్‌నాథ్ పాత్ర చేశాను. 'ప్రేమకథా చిత్రమ్' చూసినప్పుడు కొంచెం భయపెడితే ప్రేక్షకులు సినిమాను శ్రద్ధగా చూస్తారని అర్థమైంది. కానీ కథలో హారర్‌తో పాటు భావోద్వేగ సన్నివేశాలు కూడా ఉండాలి. అప్పుడే కనెక్ట్ అవుతారు. ఇక ప్రస్తుతం 'ఈగల్', 'కిస్మత్', 'కన్యాశుల్కం' సినిమాల్లో నటిస్తున్నాను. రైటర్‌గా, దర్శకుడిగా ఓ మర్డర్ మిస్టరీ సినిమా స్క్రిప్ట్ రాస్తున్నాను. నా తర్వాతి చిత్రం ఇదే కావొచ్చు. అలాగే 'కుమారి శ్రీమతి' వెబ్ సిరీస్ సీజన్ 2 ఉంటుంది'' అని చెప్పుకొచ్చారు.

మాయ కొత్తగా ఉంటుంది

– హీరోయిన్ ఎస్తేర్ నోర్హానా



● కిరణ్ ఆవల, ఎస్తేర్, రమేశ్ నాని

''రమేశ్‌గారు చెప్పిన 'మాయ' కథ విన్న వెంటనే ఓకే చేశాను. ఈ చిత్రకథ కొత్తగా ఉంటుంది'' అని ఎస్తేర్ నోర్హానా అన్నారు. కిరణ్ ఆవల, ఎస్తేర్ నోర్హానా, సిరి చందన తదితరులు కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'మాయ'. రమేష్ నాని దర్శకత్వంలో జీరో ప్రొడక్షన్స్ సమర్పణలో రాజేశ్ గొరిజవోలు నిర్మించారు. రమేశ్ నాని మాట్లాడుతూ– ''ఎస్తేర్ నా దృష్టిలో సౌత్ విద్యాబాలన్. ఈ సినిమా బోర్ కొట్టకుండా అలరించేలా ఉంటుంది'' అన్నారు. ''మా సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతోంది'' అన్నారు రాజేశ్ గొరిజవోలు. ''చిన్న సినిమాలను తొక్కేస్తారని అంటుంటారు. కానీ, సినిమాలో విషయం ఉంటే ఎవరూ తొక్కలేరని మా చిత్రం నిరూపిస్తుంది'' అన్నారు కిరణ్ ఆవల.

నవ్వుల మాయలో..



● జ్ఞానేశ్వరి, నరేశ్ అగస్త్య, భావన

నరేశ్ అగస్త్య, భావన, జ్ఞానేశ్వరి కాండ్రేగుల ప్రధాన పాత్రల్లో నటించిన ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్ 'హ్యాష్ ట్యాగ్ మాయలో..'. మేఘా మిత్ర పేర్వార్ దర్శకత్వంలో షాలినీ నంబు, రాధాకృష్ణ నంబు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న రిలీజ్ కానుంది. ఈ చిత్రం విలేకర్ల సమావేశంలో నరేశ్ అగస్త్య మాట్లాడుతూ– ''హాయిగా నవ్వుకునే చిత్రం ఇది'' అన్నారు. ''చక్కని వినోదం, మనసును హత్తుకునే భావోద్వేగాలు, ఆకట్టుకునే మాటలు ఉన్న కథ ఇది'' అన్నారు మేఘా మిత్ర. ''నిర్మాతగా నా తొలి సినిమా ఇది. నా సోదరుడితో కలిసి నిర్మించా. చాలా ప్రేమతో ఈ సినిమా చేశాం'' అన్నారు షాలినీ నంబు. ''మంచి ఫీల్‌గుడ్ మూవీ. ప్రేక్షకులను అలరిస్తుంది'' అన్నారు రాధాకృష్ణ నంబు.

ఇలాంటి సినిమా రాలేదు

– నిర్మాత రాజేశ్వరి చంద్రజ



● కొండా రాంబాబు, అనురాగ్, సోనాక్షి, రాజేశ్వరి

''రాంబాబుగారు 'కలశ' కథ చెప్పినప్పుడు ఎగ్జయిట్ అయ్యాను. ఇప్పటివరకూ భారతీయ చిత్ర పరిశ్రమలో ఇలాంటి వైవిధ్యమైన పాయింట్‌తో సినిమా రాలేదని చెప్పగలను. సైకలాజికల్ థ్రిల్లర్, హారర్ నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా ప్రేక్షకులను అలరిస్తుంది''' అని రాజేశ్వరి చంద్రజ వాడవల్లి అన్నారు. భానుశ్రీ, సోనాక్షీ వర్మ, అనురాగ్ కీలక పాత్రల్లో కొండ రాంబాబు దర్శకత్వం వహించిన చిత్రం 'కలశ'. రాజేశ్వరి చంద్రజ వాడవల్లి నిర్మించిన ఈ సినిమా నెల 15న రిలీజవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌కి అతిథులుగా విచ్చేసిన నటుడు మురళీమోహన్ 'ఓ చిట్టి తల్లి..' అనే పాటని, దర్శకుడు వీర శంకర్ 'కలశ..' అనే టైటిల్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కొండా రాంబాబు మాట్లాడుతూ– ''చంద్రజగారు, స్వామిగార్లకు ఇది తొలి సినిమా అయినా బడ్జెట్ విషయంలో రాజీ పడలేదు'' అన్నారు.

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50


సంపుటి: 16 సంచిక: 263

గురువారం 14-12-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'



ఇజ్రాయెల్‌పై బైడెన్ అసంతృప్తి !

గాజాలో విచక్షణారహితంగా బాంబు దాడులకు పాల్పడుతోందని ఆరోపణ - 6లో



టెక్ మహీంద్రా 'పాప్యులై'

తాత్కాలిక ఉద్యోగార్థుల కోసం కొత్త ప్లాట్‌ఫామ్ ఆవిష్కరణ - 11లో



మళ్లీ ఎన్డీఏనే!

ఇప్పటికిప్పుడు లోక్‌సభకు ఎన్నికలు జరిగితే ఎన్డీఏ కూటమి హ్యాట్రిక్ కొడుతుందని టైమ్స్‌నౌ నవజీవన్, ఈటీజీ ఒపీనియన్ పోల్ తెలిపింది.

వివరాలు 6లో ▸



ఎంపీ, ఛత్తీస్ సీఎంలు ప్రమాణం

మధ్యప్రదేశ్ సీఎంగా మోహన్ యాదవ్, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిగా విష్ణుదేవ్ సాయి బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు.

వివరాలు 6లో ▸



శిలాజ ఇంధనాలకు బైబై..

'శిలాజ ఇంధనాల వాడకం మానేద్దాం.. మార్పు సాధిద్దాం' అంటూ కాప్-28 సదస్సులో 200 దేశాలు ప్రతినబూనాయి.

వివరాలు 6లో ▸



'కాంట్రాక్టు'.. ఇక 'పర్మినెంట్'

సీఎం జగన్ ఇచ్చిన మాట మేరకు అర్హులైన కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసేందుకు ఆర్థిక శాఖ మార్గదర్శకాలిచ్చింది.

వివరాలు 3లో ▸

లోక్‌సభకు పొగ..

కలకలం రేపిన ఇద్దరు వ్యక్తులు

విజిటర్స్ పాస్‌తో గ్యాలరీలోకి..

సభలోకి దూకి పొగ గొట్టాలు విసిరిన వైనం

- సభ నిండా పొగ, ఎంపీల పరుగులు
- ఆగంతకులను నిర్బంధించి దేహశుద్ధి చేసిన సభ్యులు
- పార్లమెంటు ఆవరణలోనూ పొగ గొట్టాలు విసిరిన ఇద్దరు
- వారితో పాటు మరొకరి అరెస్టు, ఇంకొకరి కోసం వేట
- దారుణమైన భద్రతా వైఫల్యం: కేంద్రంపై విపక్షాల ధ్వజం
- పాస్‌లిచ్చిన బీజేపీ ఎంపీ బహిష్కరణకు డిమాండ్



ఆగంతకులు విసిరిన గొట్టాల నుంచి సభలో అలుముకున్న పొగ. చిత్రంలో ఎంపీలు

కట్టుదిట్టమైన బందోబస్తు ఉండే పార్లమెంటు మూడంచెల భద్రత వ్యవస్థను ఇద్దరు సామాన్యులు ఏమార్చారు. బూట్లలో పొగ గొట్టాలు దాచుకుని మరీ బుధవారం సాధారణ సందర్శకుల్లా దర్జాగా లోక్‌సభ గ్యాలరీలోకి ప్రవేశించారు. జీరో అవర్ కొనసాగుతుండగా గ్యాలరీలోంచి సభా ప్రాంగణంలోకి దూకి.. స్పీకర్ స్థానంకేసి దూసుకెళ్లి కలకలం రేపారు. 'నిరంకుశత్వం నశించాలి, నల్ల చట్టాలు పోవాలి' అని నినదిస్తూ పొగ గొట్టాలను విసిరేశారు. వాటి నుంచి వచ్చిన పసుపు రంగు పొగతో ఎంపీలు భయాందోళనలకు లోనయ్యారు. చివరికి వారే చొరవ చేసి ఇద్దరినీ నిర్బంధించారు. పార్లమెంటు బయట కూడా మరో ఇద్దరు పొగ గొట్టాలు విసిరి కలకలం రేపారు. వారిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నలుగురికి మరో ఇద్దరు సహకరించినట్టు తేల్చారు. సరిగ్గా 22 ఏళ్ల కిందట పార్లమెంటుపై ఉగ్రవాదులు దాడికి ప్రయత్నించిన రోజే జరిగిన ఈ ఉదంతం సంచలనం రేపింది. దీనిపై పార్టీలకతీతంగా ఎంపీలు, నేతలు ఆందోళన వెలిబుచ్చారు. నిందితులు మైసూరు ఎంపీ (బీజేపీ) ప్రతాప్ సింహ సిఫార్సుతో విజిటర్స్ గ్యాలరీ పాస్ సంపాదించినట్టు తేలింది.

6 లో



లోక్‌సభ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ, టీడీపీ గెలిచే స్థానాలు

2 లో

ఫ్యాన్‌దే ప్రభంజనం

- 25 లోక్‌సభ స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ ఘన విజయం
- రాష్ట్రంలో ఇప్పుడు ఎన్నికలు జరిగితే మళ్లీ విజయఢంకా ఖాయం.. ఒక్క స్థానంలోనూ ఉనికి చాటుకోలేని టీడీపీ
- తాజా సర్వేలో టౌమ్స్‌నౌ ఈటీజీ వెల్లడి

ఆరోగ్యానికి మరింత భరోసా

ఆరోగ్యశ్రీ కింద రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్యం

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంపై సమీక్షలో సీఎం వైఎస్ జగన్



- ఉచిత వైద్య సేవల కల్పనలో మానవీయ దృక్పథం
- పేద, మధ్య తరగతి ప్రజలకు వైద్య పరంగా మరో అడుగు ముందుకు.. ప్రజారోగ్య రంగంలో చరిత్రాత్మక నిర్ణయం
- చికిత్స అనంతరం ఫాలోఅప్ రవాణా చార్జీల కింద రూ.300 సాయం
- 18న కొత్త ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేయనున్న సీఎం
- 19 నుంచి నియోజకవర్గాల్లో పంపిణీ కార్యక్రమాలు
- జనవరి 1 నుంచి ఫేజ్-2 జగనన్న ఆరోగ్య సురక్ష

2 లో

ఉద్దానం సమస్యకు ఇక శాశ్వత పరిష్కారం

- నేడు వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ సెంటర్-సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించనున్న సీఎం
- సుజలధార ప్రాజెక్టు జాతికి అంకితం

3 లో

వారి త్యాగాలకు దేశం రుణపడింది

- 2001 పార్లమెంట్‌పై దాడిలో అమరులకు రాష్ట్రపతి, ప్రధాని నివాళులు
- ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా తుదముట్టించాలి: ముర్ము
- అమరుల త్యాగాలను దేశం గుర్తుంచుకుంటుంది: మోదీ

6 లో



ఏపీలో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్

క్రికెటర్ అంబటి రాయుడు.. 'ఆడుదాం ఆంధ్ర'కు మద్దతుగా విశాఖలో బైక్ ర్యాలీ

2 లో

ఉదారంగా ఆదుకోండి

- తుపాను నష్టం తీవ్రంగా ఉంది.. రైతులు బాగా నష్టపోయారు
- ఆయా ప్రాంతాల్లో రోడ్లు, విద్యుత్ వ్యవస్థలు దెబ్బతిన్నాయి
- కేంద్ర బృందానికి వివరించిన రాష్ట్ర ప్రభుత్వం
- న్యాయం జరిగేలా చూస్తామన్న కేంద్ర బృందం

3 లో



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

మా చదువులపై అమ్మకు బెంగలేదు



మా చదువుల కోసం ఏటా సుమారు రూ.40 వేలు ఖర్చు అయ్యేది. ఇది మాకు పెద్ద భారం. మా నాన్న చిన్నగిడ్డయ్య, అమ్మ మల్లేశ్వరి. రజకులమైన మేం కులవృత్తితో పాటు మాకున్న రెండెకరాల పొలంలో కంది, వేరుశనగ సాగు చేస్తుంటాం. తుపానులు, వర్షాభావ పరిస్థితులు లేకపోతే ఏటా సుమారు రూ.30 వేల ఆదాయం వస్తుంది. లేకపోతే లేదు. రజక వృత్తితో ఏటా రూ.20 వేలు వస్తుంది. వ్యవసాయం, కులవృత్తి ద్వారా వచ్చే ఆదాయం కలిసినా మా జీవనం సజావుగా సాగేది కాదు. ఎలాగోలా కష్టంగా నెట్టుకొస్తున్న తరుణంలో ఓ పెద్ద కుదుపు మా కుటుంబాన్ని కుదిపేసింది. నాన్న అనారోగ్యం కారణంగా మమ్మల్ని విడిచి వెళ్లిపోయారు. ఒక్కసారిగా మేమంతా శోక సంద్రంలో మునిగిపోయాం. చెల్లి లక్ష్మి మూడో తరగతి, నేను పదో తరగతి చదువుతున్నాం. మా చదువుల కోసం అమ్మ పొలం పనులతోపాటు కూలి పనులు చేసేది. పొలం పనులకు వెళ్లేటప్పుడు చాలా ఇబ్బందులు పడేది. ఈ తరుణంలో వలంటీర్ ద్వారా ప్రభుత్వ పథకాల గురించి తెలుసుకున్నాం. అమ్మ ఒడికి దరఖాస్తు చేశాం. ఏడాదికి రూ.15 వేలు మా అమ్మ ఖాతాలో పడుతున్నాయి. ఇతర త్రా పథకాలు మా కుటుంబాన్ని ఆదుకుంటున్నాయి. మా స్కూల్ చాలా చక్కగా ఉంది. మధ్యాహ్నం మంచి భోజనం పెడుతున్నారు. ఇప్పుడు మా చదువులపై అమ్మకు బెంగలేదు.

– సి.గిరికుమార్, ఎరుకలి చెరువు, క్రిష్ణగిరి మండలం, కర్నూలు జిల్లా
(కురువ జమ్మన్న, విలేకరి, కర్నూలు సిటీ)

గేలి చేసిన చోటే గెలిచా..



నాకప్పుడు సరిగ్గా నాలుగేళ్లు. ఒకరోజు అకస్మాత్తుగా తీవ్రమైన జ్వరం సోకితే మా అమ్మానాన్న ఆస్పత్రికి తీసుకెళ్లారంట. నన్ను పరీక్షించిన డాక్టర్లు కుడి కాలుకు పోలియో సోకిందని చెప్పారంట. ఇక అంతే.. ఊహ వచ్చినప్పటి నుంచి ఈ జీవితం ఎందుకని ఏడవని రోజు లేదు. చిన్నతనంలో నా తోటి వాళ్లంతా నడుస్తూ, గెంతుతూ ఉంటే నేను ఇంట్లోనే ఉండి కుమిలిపోయేవాడిని. నడవలేని సందర్భంలో నన్ను చాలా మంది గేలి చేసేవారు. ఆ సమయంలో జీవితంపై విరక్తి కలిగేది. పదిహేనేళ్ల వయస్సులో అనుకున్నా.. 'ఏదో ఒకటి సాధించి నా స్వశక్తిపై నిలబడాలని' అని రోజూ అతి కష్టం మీద నెల్లూరు వెళ్లి మిక్సీలు, గ్రైండర్లు, ఫ్యాన్లు రిపేరు చేయడం మూడేళ్లలో నేర్చుకున్నాను. తర్వాత 18 ఏళ్ల వయస్సులో సొంతగా షాపు పెట్టుకున్నాను. నాకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నా షాపు ద్వారా వచ్చిన ఆదాయంతోనే వారిని పోషించుకుంటున్నాను. నెల్లూరు సమీపంలోని శ్రామిక నగర్‌లో ఉండే నాకు నగరానికి నిత్యం రాకపోకలు సాగించటం కష్టతరంగా మారింది. నాలుగేళ్లుగా షాపు ద్వారా వచ్చే ఆదాయం కూడా బాగా తగ్గిపోయింది. నాకున్న లోపంతో కరెంటు పని కూడా చేయలేకపోతున్నాను. దీంతో చిన్న కిరాణా షాపు పెట్టుకోవాలని అనుకున్నా. టీడీపీ హయాంలో వికలాంగ పింఛన్ కోసం మూడుసార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ మంజూరు కాలేదు. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే వికలాంగ పింఛన్ మంజూరైంది. వలంటీర్ ప్రతి నెలా రూ.3 వేలు ఇంటికి తీసుకొచ్చి ఇస్తున్నాడు. రెండేళ్ల కిందట బ్యాంకర్ల ద్వారా రూ. రెండు లక్షలు రుణం పొందాను. ప్రస్తుతం ఇంటి దగ్గరే షాపు పెట్టుకున్నాను. కిరాణా షాపుతోపాటు పింఛన్ సొమ్ముతో ఇప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బతుకుతున్నాను.

– షేక్ ఖాజా మస్తాన్, నెల్లూరు రూరల్
(ఏటూరు తిరుపాల్ రెడ్డి, విలేకరి, నెల్లూరు రూరల్)

నా కుటుంబానికి గొప్ప చేయూత



నా భర్త ఏడేళ్ల కిందట చనిపోయాడు. ఆయన పోయాక సంసార బాధ్యతంతా నామీదే పడింది. నాకు ఇద్దరు మగబిడ్డలు, ఒక ఆడబిడ్డ. అతి కష్టంగా సంసారాన్ని నెట్టుకొస్తున్న సమయంలో ఈ ప్రభుత్వం ఎంతగానో ఆదుకుంది. అనేక సంక్షేమ పథకాలు మా తలుపు తట్టడంతో మా బతుకుల్లో వెలుగు వచ్చింది. మాది అన్నమయ్య జిల్లా రాజంపేట పట్టణంలోని సరస్వతీపురం కాలనీ. మేము నిరుపేదలం. మా ఆయన బతికున్నప్పుడే ఆడబిడ్డకు పెళ్లి చేశాం. ఆ సమయంలో కొంత అప్పులు చేయాల్సి వచ్చింది. పెద్ద కొడుకు 10వ తరగతి, రెండో కొడుకు 8వ తరగతి చదువుతున్నారు. మేము స్వతహాగా రజకులం కావడంతో బతికేందుకు నేను ఇస్త్రీ చేయడం మొదలుపెట్టాను. ఆ వచ్చే డబ్బుతో నెల నెల కొంత అప్పులకు కట్టేదాన్ని. మిగతా సొమ్ము సరిపోక ఇబ్బందులు పడేవాళ్లం. ఆ సమయంలో వైఎస్సార్ చేయూత పథకం ఆదుకుంది. ఈ సొమ్ముతో నా ఇస్త్రీ దుకాణాన్ని మెరుగు పరుచుకున్నాను. అప్పులు తీర్చాను. అద్దె ఇంట్లో ఉంటున్న నాకు ఇల్లు కూడా మంజూరైంది. ప్రస్తుతం నిర్మాణంలో ఉంది. అమ్మ ఒడి వల్ల కూడా లబ్ధి చేకూరింది.

– మొక్కపల్లి కృష్ణమ్మ, రాజంపేట
(జి.విక్రమ్, విలేకరి, రాజంపేట టౌన్)

సాధికార నినాదంతో మురిసిన మహేంద్ర తనయ



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే రెడ్డిశాంతి



శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో జరిగిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

- పాతపట్నంలో ఘనంగా సామాజిక సాధికార బస్సు యాత్ర
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల విజయ సంకేతాలు
- బడుగు, బలహీన వర్గాలతో కిటకిటలాడిన పాతపట్నం
- సీఎం జగన్‌కు ప్రజల జేజేలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: సాధికార నినాదంతో మహేంద్ర తనయ నది మురిసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల విజయ సంకేతాలతో మెరిసింది. మహేంద్ర తనయ తీరంలోని శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర బుధవారం ఘనంగా జరిగింది. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన బడుగు, బలహీనవర్గాలతో పాతపట్నం కిటకిటలాడింది. యాత్రకు దారి పొడవునా జనం బ్రహ్మరథం పట్టారు. బూరగాం నుంచి పాతపట్నంలో ఏర్పాటు చేసిన సభా వేదిక వద్దకు వచ్చే సరికి జనాలతో ఆ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ మంత్రులు, ఎమ్మెల్యేలు చేసిన ప్రసంగాలకు జనం జేజేలు పలికారు.

పేదల సంక్షేమంలో సీఎం జగన్ నంబర్ వన్ : మంత్రి ధర్మాన ప్రసాదరావు

మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ.. పేదలకు సంక్షేమాన్ని అందించడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మించిన వారు లేరని చెప్పారు. సంక్షేమ పథకాల ద్వారా రూ. 2.40 లక్షల కోట్లు రాష్ట్ర ప్రజలకు అందజేశారని తెలిపారు. ఆకలి చూసి, కన్నీరు తుడవడమే సీఎం జగన్‌కు తెలుసునని అన్నారు. పేదలకు గూడు, నీడ కల్పించాలన్న లక్ష్యంతో రూ. 12,800 కోట్లతో భూమి కొని మరీ 32 లక్షల ఇళ్ల నిర్మాణం చేస్తున్నారని వివరించారు. నాడు–నేడు, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్య శ్రీ వంటి పథకాలతో ప్రజల జీవన స్థితిగతుల్లో పెద్ద ఎత్తున మార్పు వస్తుందని చెప్పారు. ఒకప్పుడు విత్తనాలు, ఎరువుల కోసం క్యూలో కొట్లాటలు జరిగేవని, జగన్ పాలనలో రైతులకు అలాంటి ఇబ్బందులు లేవన్నారు. చంద్రబాబులా రాజకీయాలు చేసి లబ్ధిదారుల ఎంపిక ఏనాడూ చేయలేదని చెప్పారు. చంద్రబాబు పద్నాలుగేళ్ల పాలనలో శ్రీకాకుళం జిల్లాకు ఒక్క మంచి పని చేయలేదన్నారు. బాబు అధికారంలో జన్మభూమి కమిటీలతో ప్రజలను వేధించారని తెలిపారు.

పైసా అవినీతి జరగలేదు: స్పీకర్ తమ్మినేని సీతారాం

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సీఎం వైఎస్ జగన్ పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అందిస్తున్నారని అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం చెప్పారు. ఒక్క పైసా అవినీతి లేకుండా లక్షల కోట్లు ప్రజలకు అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో పైసా అవినీతి లేకుండా పాలన జరుగుతోందని, అవినీతి జరిగినట్లు రుజువు చేస్తే స్పీకర్ పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. బాబా సాహెబ్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని స్ఫూర్తిగా తీసుకుని సీఎం జగన్ బడుగుల అభివృద్ధికి పాటు పడుతున్నారని అన్నారు.

రాజ్యాంగ ఆశయాల సాధన: ఎమ్మెల్యే కళావతి

పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోని అత్యంత వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్ పెద్ద ఎత్తున నిధులు కేటాయించి పలు కీలక ప్రాజెక్టులు చేపడుతున్నారని వివరించారు. గిరిజనులకు పోడు భూముల హక్కులిచ్చారని తెలిపారు.

దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం: ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాలకొండ నియోజకవర్గంలో దీర్ఘకాలంగా ఉన్న సమస్యలకు వైఎస్ జగన్ పరిష్కారం చూపించారని ఎమ్మెల్యే రెడ్డి శాంతి తెలిపారు. వంశధార నిర్వాసితుల నోటి ముందున్న కూడును కూడా టీడీపీ నేతలు లాక్కున్నారని చెప్పారు. ప్రతిపక్ష హోదాలో ఇచ్చిన హామీ మేరకు వైఎస్ జగన్ సీఎం కాగానే వంశధార నిర్వాసితులకు రూ. 216 కోట్లు అదనపు పరిహారం అందించారని తెలిపారు. రూ.750 కోట్లతో వైఎస్సార్ శుద్ధ జలం ప్రాజెక్టును చేపట్టి ఉద్దానం ప్రజల కష్టాలను తీరుస్తున్నారన్నారు. పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీలు పాలవలస విక్రాంత్, వరుదు కల్యాణి, నర్తు రామారావు, ఎమ్మెల్యేలు గొర్లె కిరణ్‌కుమార్, కంబాల జోగులు, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి పాల్గొన్నారు.

ఆరోగ్యానికి మరింత భరోసా



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- ఆరోగ్యశ్రీ కింద రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్యం
- వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంపై సమీక్షలో సీఎం వైఎస్ జగన్

'విద్య, వైద్యం ప్రజలకు హక్కుగా లభించాలి. ఈ హక్కులను కాపాడటం ప్రభుత్వ బాధ్యత. అందుకే అధికారంలోకి వచ్చిన రోజు నుంచే మన ప్రభుత్వం ఈ అంశాలపై విశేష కృషి చేసింది. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఆరోగ్య పథకం కోసం ఇప్పటిదాకా దాదాపు రూ.12,000 కోట్లు, వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకం కోసం రూ.1,309 కోట్లు ఖర్చు చేశాం. 108, 104 అంబులెన్స్‌ల వ్యవస్థను బలోపేతం చేసేందుకు మరో రూ.750 కోట్లు వెచ్చించాం. ఇప్పుడు ఇంకో అడుగు ముందుకు వేస్తూ.. ఆరోగ్య శ్రీ కింద రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందించేందుకు శ్రీకారం చుడుతున్నాం. - సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి : నిరుపేద, మధ్య తరగతి కుటుంబాల ప్రజలకు ఉచిత వైద్య సేవల కల్పన విషయంలో అత్యంత మానవీయ దృక్పథంతో మనందరి ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఈ క్రమంలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.25 లక్షల వరకు ఉచిత వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చామని స్పష్టం చేశారు. ఆరోగ్య పరంగా ఎలాంటి సమస్యలు వచ్చినా సరే ఆరోగ్యశ్రీ అండగా నిలుస్తుందన్నారు. ప్రజారోగ్య రంగంలోనే ఇది చరిత్రాత్మక నిర్ణయమని ఉద్ఘాటించారు. తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆయన వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంపై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి రూ.25 లక్షల వరకు వైద్యం ఉచితంగా లభిస్తుందని తెలియజేయండి. ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందిన అనంతరం వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి. చికిత్స చేయించుకున్న వారు తిరిగి ఫాలో అప్ చెకప్ కోసం డాక్టర్ వద్దకు వెళ్లేలా చూడాలి. ఇందులో భాగంగా ఫాలో అప్ కన్సల్టేషన్ కోసం రవాణా చార్జీల కింద రూ.300 చొప్పున అందజేయండి. మరోవైపు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల నుంచి ఆస్పత్రులకు రెఫర్ చేసిన వారికి ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా వైద్యం అందిస్తున్నాం. వీరు ఆస్పత్రులకు వెళ్లడం కోసం రవాణా చార్జీల కింద రూ.500 చొప్పున అందిస్తున్నాం. మరో విషయం ఏమిటంటే.. ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా వైద్యం పొందడం ఎలా? అనే దానిపై రూపొందించిన వీడియో అందరికీ చేరేలా చూడండి. ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సహా ప్రజలందరికీ ఈ వీడియోను అందుబాటులో ఉంచాలి' అని ఆదేశించారు.

కిడ్నీ రోగులకు బాసటగా నిలవాలి

శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ రోగులకు అందుతున్న వైద్య సేవలు రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో కూడా అందించాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. స్క్రీనింగ్, మందులు, చికిత్స తదితర అంశాల్లో రోగులకు బాసటగా నిలవాలన్నారు. డయాలసిస్‌పై ఉన్న రోగులు వాడుతున్న మందులు గ్రామ స్థాయిలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో అందుబాటులోకి తీసుకురావాలని, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో అనుసంధానం చేసి.. బాధితుల ఆరోగ్యంపై వాకబు చేయాలని సూచించారు. మార్కాపురంలోనూ పలాస తరహా వైద్య చికిత్స సౌకర్యాలు అందుబాటులోకి తేవాలన్నారు. కొత్తగా కడుతున్న మెడికల్ కాలేజీలో ఇప్పటికే నెఫ్రాలజీ విభాగం కోసం ఉత్తర్వులు ఇచ్చామని చెప్పారు. దీంతో పాటు యూరాలజీ విభాగం కూడా తీసుకురావాలని, ప్రభుత్వాస్పత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యుల కొరతకు తావు లేకుండా చూడాలని ఆదేశించారు. ఆస్పత్రుల్లో పని చేసే స్పెషలిస్ట్ డాక్టర్ కోసం అవసరమైన చోట క్వార్టర్లను నిర్మించాలని సూచించారు.

18న సీఎం చేతుల మీదుగా ప్రారంభం

రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కింద రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా ఈ నెల 18వ తేదీన ప్రారంభించనుంది. 19వ తేదీ నుంచి ప్రతి నియోజకవర్గంలో 5 గ్రామాల చొప్పున జరిగే కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారు. మండలంలో వారానికి నాలుగు గ్రామాల చొప్పున కొత్త ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపడతారు. ప్రతి ఇంటికీ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ చేపట్టి, జనవరి నెలాఖరుకు పూర్తి చేయనున్నారు. ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా ఎలా వైద్యం పొందవచ్చనే దానిపై పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఏఎన్ఎం, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో), ఆశా వర్కర్లు, వలంటీర్లు, మహిళా పోలీసులు ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ సహా, పథకంపై అవగాహన పెంచే కార్యక్రమంలో పాల్గొంటారు. ఆరోగ్యశ్రీ మొబైల్ యాప్‌ను ప్రజల సెల్‌ఫోన్‌లలో డౌన్లోడ్ చేసి, యాప్ ద్వారా కలిగే ప్రయోజనాలను వివరిస్తారు. పనిలో పనిగా దిశ యాప్‌ను కూడా డౌన్లోడ్ చేస్తారు. ఇదిలా ఉండగా జనవరి ఒకటో తేదీ నుంచి ఫేజ్–2 జగన్ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించనుంది. ప్రతివారం మండలానికి ఒక గ్రామ సచివాలయం, పట్టణ ప్రాంతాల్లో ఒక వార్డు పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించనున్నారు. జిల్లాల్లో సగం మండలాల్లో మంగళవారం, సగం మండలాల్లో శుక్రవారం శిబిరాల నిర్వహణ ఉంటుంది. పట్టణ ప్రాంతాల్లో బుధవారం నిర్వహిస్తారు. వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఆరోగ్యశ్రీ సీఈవో బాలాజీ పాల్గొన్నారు.

ఏపీకి మళ్లీ జగనే సీఎం కావాలి..



ర్యాలీలో భారీగా పాల్గొన్న విద్యార్థులు

తిరుపతి ర్యాలీలో నినదించిన విద్యార్థులు

తిరుపతి సిటీ : ఏపీకి మళ్లీ వైఎస్ జగనే సీఎం కావాలంటూ విద్యార్థి లోకం నినదించింది. తిరుపతి ఎమ్మార్‌పల్లి సర్కిల్ నుంచి అన్నమయ్య సర్కిల్ వద్ద గల వైఎస్సార్ విగ్రహం వరకు బుధవారం విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ భారీ ర్యాలీనుద్దేశించి ఆ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పి చైతన్య, జిల్లా అధ్యక్షుడు బి ఓబుల్ రెడ్డిలు మాట్లాడుతూ వైఎస్ జగన్ పాలనలో విద్యారంగం రూపురేఖలు మారాయన్నారు. నాడు–నేడుతో పాఠశాలల దశ, దిశ మార్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ర్యాలీలో విద్యార్థి విభాగం రీజనల్ కోఆర్డినేటర్ లెక్కల రాజశేఖర్‌రెడ్డి, ఆ విభాగం నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్‌దే ప్రభంజనం

- 25 లోక్‌సభ స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ ఘన విజయం
- రాష్ట్రంలో ఇప్పుడు ఎన్నికలు జరిగితే మళ్లీ విజయఢంకా ఖాయం
- ఒక్క స్థానంలోనూ ఉనికి చాటుకోలేని టీడీపీ
- తాజా సర్వేలో టైమ్స్‌నౌ ఈటీజీ వెల్లడి



రాష్ట్రంలో 2019 ఎన్నికల్లో లోక్‌సభ ఎన్నికల ఫలితాలు

పార్టీ	గెలిచిన లోక్‌సభ స్థానాలు
వైఎస్సార్‌సీపీ	22
టీడీపీ	03
జనసేన	0
బీజేపీ	0
ఇతర పక్షాలు	0

టైమ్స్‌నౌ ఈటీజీ తాజా సర్వే ఫలితాలు

పార్టీ	గెలిచే లోక్‌సభ స్థానాలు
వైఎస్సార్‌సీపీ	24-25
టీడీపీ	0-1
జనసేన	0
బీజేపీ	0
ఇతర పక్షాలు	0

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని ప్రముఖ జాతీయ మీడియా సంస్థ టైమ్స్‌నౌ ఈటీజీ తాజా సర్వేలో వెల్లడైంది. రాష్ట్రంలోని 25 లోక్‌సభ స్థానాల్లో 24–25 సీట్లను ఆ పార్టీ చేజిక్కించుకుంటుందని ప్రకటించింది. ఫ్యాన్ తుపాన్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ, ఇతర పక్షాలు కొట్టుకుపోతాయని స్పష్టం చేసింది. టీడీపీ గరిష్ఠంగా ఒక స్థానంలో ఉనికి చాటుకునే అవకాశం ఉందని పేర్కొంది. జనసేన ఖాతా తెరిచే అవకాశమే లేదంది. టైమ్స్‌నౌ ఈటీజీ సర్వే ఫలితాలను బుధవారం రాత్రి టైమ్స్‌నౌ ఛానల్ ప్రసారం చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో 2019 ఎన్నికల్లో 22 లోక్‌సభ స్థానాల్లో విజయం సాధించిన వైఎస్సార్‌సీపీ.. ప్రస్తుతం మరింత బలపడిందని, ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే 24–25 లోక్‌సభ స్థానాల్లో విజయం సాధిస్తుందన్నది తేల్చింది. గత ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలనతో వైఎస్సార్‌సీపీకి ప్రజాదరణ మరింతగా పెరిగింది. అందుకే ఆ పార్టీ 22 లోక్‌సభ స్థానాల నుంచి 25 లోక్‌సభ స్థానాల్లోనూ క్లీన్ స్వీప్ చేసి, తిరుగులేని విజయం సాధించే స్థాయికి చేరుకుందని విశ్లేషించింది.

ఏపీలో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్

క్రికెటర్ అంబటి రాయుడు.. 'ఆడుదాం ఆంధ్ర'కు మద్దతుగా విశాఖలో బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో పాల్గొన్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు తదితరులు

విశాఖ స్పోర్ట్స్: రాష్ట్రంలోని క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉందని క్రికెటర్ అంబటి రాయుడు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన 'ఆడుదాం ఆంధ్ర' టోర్నమెంట్‌కు మద్దతుగా బుధవారం ఎన్ఏడీ జంక్షన్ నుంచి డీఎల్‌బీ క్వార్టర్స్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిధిలో సాగిన బైక్ ర్యాలీలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అంబటి రాయుడు మాట్లాడుతూ.. మెరికల్లాంటి క్రీడాకారులను వెలికితీసేందుకే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ముందుగా ఎన్ఏడీ ఫ్లై ఓవర్ చెంతన వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీమంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణితో కలిసి రాయుడు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీని విశాఖ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు, విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ పర్యవేక్షించారు. సచివాలయాల పరిధి పోటీల్లో పాల్గొనే ఆటగాళ్లకు ఇప్పటికే కిట్లను అందించినట్టు కేకే రాజు తెలిపారు. టోర్నీలో భాగంగా ఈ నెల 15 నుంచి క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో క్రీడల్లో పోటీలు ప్రారంభం కానున్నాయి.



ఆడుదాం ఆంధ్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అంబటి రాయుడు, చిత్రంలో గుడివాడ అమర్‌నాథ్, ముత్తంశెట్టి తదితరులు

అంతరించిపోతున్న కళలను కాపాడుకుందాం!

'కళాదీక్ష' ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: అంతరించిపోతున్న కళలను కాపాడుకుందామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. కళావైవిధ్యతకు భారతదేశం నిలయమని.. అలాంటి దేశంలో అంతరించిపోతున్న కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని పేర్కొన్నారు. భారతదేశ సంప్రదాయంలో భాగమైన ఎన్నో కళలు ప్రస్తుతం ఆదరణకు నోచుకోక అంతరించిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలోని సంగీత, నాటక అకాడమీ ద్వారా.. విస్మరణకు గురవుతున్న కళలను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన 'కళాదీక్ష' కార్యక్రమాన్ని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ.. అంతరించిపోతున్న కళలను కాపాడేందుకు కొందరు గురువులు చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. విలువైన సాంస్కృతిక పరంపరను ఒక తరం నుంచి మరోతరానికి అందించడంలో వారధిగా పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ కేంద్ర ప్రభుత్వం తరపున, ప్రధానిమోదీ తరపున అభినందనలు తెలియజేశారు. కళాదీక్ష కార్యక్రమం ద్వారా కళల సంరక్షణ, విస్మరించబడుతున్న కళల సంరక్షణకోసం పాటుపడుతున్న గురువులకు ప్రోత్సాహం అందించేందుకు కృషి జరుగుతోందన్నారు. 100కుపైగా విస్మరణకు గురవుతున్న కళలకు 'కళాదీక్ష' కార్యక్రమం ద్వారా ఆర్థికంగా సహాయం అందించేందుకు కేంద్రం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

ఉదారంగా ఆదుకోండి

తుపాను నష్టం తీవ్రంగా ఉంది.. రైతులు బాగా నష్టపోయారు

- ఆయా ప్రాంతాల్లో రోడ్లు, విద్యుత్ వ్యవస్థలు సైతం దెబ్బతిన్నాయి
- కేంద్ర బృందానికి వివరించిన రాష్ట్ర ప్రభుత్వం
- పంట నష్టాన్ని కేంద్రానికి వివరిస్తాం
- రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం
- తుపాను నష్టపరిహారం అందించేలా చూస్తాం
- కేంద్ర బృందం ప్రతినిధి రాజేంద్ర రత్నూ

సాక్షి, అమరావతి/పామర్రు/గుడివాడ/కంకిపాడు: మిచాంగ్ తుపాను ప్రభావంతో రాష్ట్రంలో ముందెన్నడూలేని విధంగా 19 జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లిందని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర బృందం దృష్టికి తీసుకెళ్లింది. ఈ నేపథ్యంలో సాయం అందించే విషయంలో ఉదారంగా ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ-విపత్తుల నిర్వహణ శాఖ) సాయిప్రసాద్ కేంద్ర బృందానికి విన్నవించారు. తుపాను ప్రభావిత జిల్లాల్లో నష్టాలను అంచనా వేయడానికి వచ్చిన కేంద్ర బృందంతో బుధవారం తాడేపల్లిలో విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ బీఆర్ అంబేడ్కర్, వ్యవసాయ శాఖ కమిషనర్ సీహెచ్ హరికిరణ్, ఉద్యాన శాఖ కమిషనర్ శ్రీధర్ తదితరులతో కలిసి సాయిప్రసాద్ సమావేశమయ్యారు. తుపాను తీవ్రతతో కురిసిన భారీ వర్షాలకు పంటలు బాగా దెబ్బతిన్నాయని, రైతులు తీవ్రంగా నష్టపోయారని కేంద్ర బృందానికి వివరించారు. ఆయా ప్రాంతాల్లో రోడ్లు, విద్యుత్ వ్యవస్థలు సైతం దెబ్బతిన్నాయని తెలిపారు.

వీలైనంత మేర ఆదుకోవడానికి సహకరిస్తాం: కేంద్ర బృందం

కేంద్ర బృందానికి నేతృత్వం వహిస్తున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేంద్ర రత్నూ మాట్లాడుతూ.. తుపానుతో తీవ్రంగా ప్రభావితమైన నాలుగు జిల్లాల్లో దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలిస్తామని చెప్పారు. తమ నివేదికను కేంద్ర ప్రభుత్వానికి వెంటనే అందించి వీలైనంత మేర ఆదుకోవడానికి తమ వంతు సహకారాన్ని అందిస్తామని తెలిపారు. తుపాను వల్ల కలిగిన నష్టాలను విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ బీఆర్ అంబేడ్కర్ కేంద్ర బృందానికి వివరించారు. శాఖాపరంగా రోడ్లు, భవనాల శాఖకు రూ.2,641 కోట్లు, వ్యవసాయ శాఖకు రూ.703 కోట్లు, పట్టణాభివృద్ధి శాఖకు రూ.100 కోట్లు, ఉద్యాన శాఖకు రూ.86.97 కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. మొత్తంగా మిచాంగ్ తుపాను ప్రభావంతో దెబ్బతిన్న వాటి పునరుద్ధరణకు రూ.3,711 కోట్లు సాయం అందించాలని విన్నవించారు. ఈ సమావేశం తర్వాత కేంద్ర బృందం తుపాను ప్రభావిత ప్రాంతాల పరిశీలనకు వెళ్లింది. గురువారం కూడా ఈ బృందం తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనుంది.



జరిగిన నష్టాన్ని కేంద్ర బృందానికి వివరిస్తున్న రైతు

రైతులకు న్యాయం చేస్తాం..

రాష్ట్రంలో పంట నష్టం గురించి కేంద్ర ప్రభుత్వానికి తెలిపి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని కేంద్ర బృందం ప్రతినిధి రాజేంద్ర రత్నూ పేర్కొన్నారు. బుధవారం కృష్ణా జిల్లా పామర్రు, కంకిపాడు, గుడివాడల్లో కేంద్ర బృందం పర్యటించింది. కంకిపాడు రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించింది. గుడివాడ మండలం రామనపూడి, వలివర్తిపాడు గ్రామాల్లో పర్యటించి పంటలను పరిశీలించింది. అలాగే పామర్రు మండలం నెమ్మలూరు, కొరిమెర్ల తదితర గ్రామాల పరిధిలో తుపాను కారణంగా దెబ్బతిన్న వరి పొలాలను జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజితాసింగ్ తదితరులతో కలిసి రాజేంద్ర రత్నూ పరిశీలించారు. నెమ్మలూరులో కౌలు రైతు ఆత్మూరి రామకోటేశ్వరరావు కేంద్ర బృందంతో మాట్లాడుతూ సాగు చేస్తున్న 40 ఎకరాలలోని వరి పంట పూర్తిగా దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశాడు. పంట కాలువలు, మురుగు డ్రెయిన్‌ల నిర్వహణ సక్రమంగా లేని కారణంగా ఏటా పంట నష్ట పోవాల్సి వస్తోందని దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ వివిధ గ్రామాల రైతులు కేంద్రం బృందానికి అర్జీలను సమర్పించారు. మొత్తం 1,270 ఎకరాల సాగులో 1,040 ఎకరాలలో పంట నష్టం జరిగిందన్నారు. జేసీ అపరాజితాసింగ్ స్థానికంగా జరిగిన పంట నష్టాన్ని కేంద్ర బృందానికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కొలుసు పార్థసారథి, కైలే అనిల్ కుమార్, మాజీ ఎంపీ వడ్డే శోభనాద్రీశ్వరరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నేడు దెబ్బతిన్న ధాన్యం పరిశీలన

తుపాను దాటికి దెబ్బతిన్న ధాన్యాన్ని పరిశీలించేందుకు ముగ్గురు సభ్యుల కేంద్ర పౌరసరఫరాల శాఖ సాంకేతిక బృందం గురువారం నుంచి రాష్ట్రంలో పర్యటించనుంది. తుపాను ప్రభావిత జిల్లాల్లో పంట కోసి తరలించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యంతో పాటు ప్రభుత్వం ఇప్పటికే సేకరించిన ధాన్యంలో విరిగిన, రంగుమారిన, మొలకెత్తిన ధాన్యం నమూనాలను సేకరించనుంది. ఈ నేపథ్యంలో తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో కేంద్ర బృందం పర్యటనకు ఏపీ పౌరసరఫరాల సంస్థ సహాయకులను ఎంపిక చేసింది. కాగా ఇటీవల కురిసిన అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడకుండా రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లు చేపట్టింది. ఈ క్రమంలో తేమ శాతంతో సంబంధం లేకుండా తడిచిన ధాన్యాన్ని సైతం సేకరించింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని తుపాను ప్రభావం కారణంగా ధాన్యం కొనుగోలులో నిబంధనలు సడలించాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ సైతం రాసింది. వర్షాలు తగ్గడంతో క్షేత్ర స్థాయిలో పరిస్థితులను అంచనా వేసేందుకు కేంద్ర బృందం రాష్ట్రానికి వస్తోంది.



వధూవరులను ఆశీర్వదించిన సీఎం వైఎస్ జగన్

శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి కుమార్తె వివాహ రిసెప్షన్‌కు సీఎం వైఎస్ జగన్ హాజరయ్యారు. బుధవారం తిరుపతిలోని తాజ్ హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వధూవరులు నిరీష, సాగర్‌లను సీఎం ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. - సాక్షి, తిరుపతి

జోరుగా.. హుషారుగా.. షికారు

- పుంజుకున్న పర్యాటక రంగం

సాక్షి, అమరావతి: ప్రపంచవ్యాప్తంగా పర్యాటక రంగం పుంజుకుంది. కోవిడ్ మునుపటి పరిస్థితులను వేగంగా చేరుకుంటోంది. ప్రజలు దేశవిదేశాల్లో జోరుగా, హుషారుగా.. షికారులు చేస్తున్నారు. వరల్డ్ టూరిజం ఆర్గనైజేషన్ నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు 97.50 కోట్ల మంది పర్యటనలు చేసినట్లు వెల్లడైంది. 2022వ సంవత్సరంతో పోలిస్తే ఇది 38 శాతం అధికం. కోవిడ్ సంక్షోభం నుంచి అంతర్జాతీయ పర్యాటక రంగం దాదాపు పూర్తిగా కోలుకున్నట్లు తాజా నివేదిక వెల్లడించింది. గతేడాది మూడవ త్రైమాసికంతో పోలిస్తే 2023లో ప్రపంచ గమ్యస్థానాలు 22 శాతం అధిక పర్యాటకులను ఆకర్షించినట్లు నివేదిక తెలిపింది. కోవిడ్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు ప్రపంచ పర్యాటక రంగంలో జూలై అత్యుత్తమ నెల అని నివేదిక పేర్కొంది. కరోనా మునుపటి పరిస్థితులను 92 శాతం మేర జూలై నెల అందుకుందని తెలిపింది.

అతిపెద్ద గమ్యస్థానంగా యూరప్..

కరోనా ముందు కంటే 20 శాతం అధిక పర్యాటకుల రాకతో మధ్యప్రాచ్య దేశాలు ముందున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద పర్యాటక గమ్యస్థానంగా యూరప్ నిలిచింది. ఈ ఏడాది మొదటి 9 నెలల్లో 55 కోట్ల మంది విదేశీ పర్యాటకులు యూరప్‌ను సందర్శించారు. ఇది ప్రపంచ పర్యాటక రంగం మొత్తంలోనే 56 శాతం. అమెరికా.. పర్యాటక రంగ పునరుజ్జీవానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. అమెరికా నుంచి కరేబియన్ గమ్యస్థానాలకు వెళ్లే పర్యాటకుల సంఖ్య వృద్ధి చెందింది. దక్షిణాసియా 95 శాతం, ఈశాన్య ఆసియా 50 శాతం పర్యాటకులను రాబట్టుకోగలిగింది. అంతర్జాతీయ పర్యాటక రాబడి 2023లో 1.40 ట్రిలియన్ అమెరికా డాలర్లకు చేరుకోవచ్చని మార్కెట్ నిపుణులు అంచనా. 2019లో రాబడి 1.50 ట్రిలియన్ అమెరికా డాలర్లుగా ఉండేది. ప్రపంచ దేశాలు పర్యాటక రంగం అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తూ.. నిధులు ఖర్చు చేస్తున్నాయి. 2019తో పోలిస్తే ప్రస్తుతం జర్మనీ 13 శాతం, అమెరికా 11 శాతం, ఇటలీ 16 శాతం ఎక్కువగా ఖర్చు చేశాయి. అంతర్జాతీయ పర్యాటక రంగం 2024లో కోవిడ్ మునుపటి స్థాయికి చేరుకుంటుందని మార్కెట్ నిపుణులు విశ్వసిస్తున్నారు.

భారత్‌లోనూ పెరుగుదల..

భారత్‌లోనూ విదేశీ పర్యాటకుల రాకపోకలు గతేడాది కంటే దాదాపు 106 శాతం పెరిగాయి. దేశీయ పర్యాటకం కూడా స్థిరత్వాన్ని సాధిస్తోంది. ఎక్కువగా పుణ్యక్షేత్రాల సందర్శకులు పెరుగుతున్నారు. జమ్మూ కశ్మీర్‌కు ఎక్కువ సందర్శనలు నమోదవుతున్నాయి. వారణాసిలో కొత్త కారిడార్ ప్రారంభించాక 10 కోట్ల మందికిపైగా భక్తుల తాకిడి పెరిగింది.

'కాంట్రాక్టు'.. ఇక 'పర్మినెంట్'

- అర్హులైనవారి రెగ్యులరైజేషన్‌కు ఆర్థిక శాఖ చర్యలు
- 15 నుంచి దరఖాస్తు చేసుకోవడానికి ప్రత్యేక సాఫ్ట్‌వేర్
- సంక్రాంతిలోపు అర్హత గల కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్
- మార్గదర్శకాలు జారీ
- దాదాపు 10 వేల మందికి మేలు
- ప్రభుత్వ నిర్ణయం పట్ల ఉద్యోగ సంఘాల హర్షం

సాక్షి, అమరావతి: కాంట్రాక్టు ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట మేరకు అర్హులైన కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసేందుకు ఆర్థిక శాఖ చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలను సర్క్యులర్ మెమో ద్వారా బుధవారం విడుదల చేసింది. ఈ నెల 15 నుంచి కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కోసం రూపొందించిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని కోరింది. సంక్రాంతి లోపు అర్హత కలిగిన ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఆర్థిక శాఖ అధికారులు తెలిపారు. 2014 ఎన్నికల ముందు చంద్రబాబు ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేస్తామని ప్రకటించి.. అధికారంలోకి వచ్చాక మొండిచేయి చూపిన సంగతి తెలిసిందే. ఈ పరిస్థితిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడానికి ఏకంగా చట్టంలో సవరణలు తీసుకువచ్చారు. దీంతో కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు మార్గం సుగమమైంది. ప్రభుత్వ నిర్ణయంతో దాదాపు 10 వేల మందికి మేలు జరిగే అవకాశముందని అధికార వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ నిర్ణయం పట్ల పలు ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

రెగ్యులరైజేషన్ ఇలా..

2014 జూన్ 2కి ముందు ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు ఉద్యోగులుగా నియమితులై అర్హులైన వారందరూ రెగ్యులరైజేషన్‌కు అర్హులని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆయా శాఖాధిపతులు, శాఖల్లో మంజూరు చేసిన పోస్టుల్లో రిజర్వేషన్, రోస్టర్ విధానంలో కాంట్రాక్టు ఉద్యోగులుగా నియమితులైన అర్హులైన వారిని రెగ్యులరైజ్ చేయనున్నారు. అర్హులైన ప్రతి కాంట్రాక్టు ఉద్యోగి ఒక్కో విధానంలో కాకుండా ఆర్థిక శాఖ రూపొందించిన సాఫ్ట్‌వేర్ ద్వారా దరఖాస్తు చేసుకునేలా ఆర్థిక శాఖ చర్యలు చేపట్టింది. దీంతో వీలైనంత త్వరగా రెగ్యులరైజేషన్ ప్రక్రియ జరుగుతుంది.

- కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ దరఖాస్తులను ఆయా శాఖాధిపతులు తొలుత వెరిఫికేషన్ చేసి సర్టిఫై చేయాలి.
- ఆ తర్వాత సచివాలయ శాఖలు ఆయా దరఖాస్తులను ధ్రువీకరించి సర్టిఫై చేయాల్సి ఉంటుంది.
- పిదప ట్రెజరీస్ డైరెక్టర్ దరఖాస్తులను ఆడిట్ చేసి సిఫార్సు చేయాలి.
- చివరగా ఆర్థిక శాఖ (హెచ్ఆర్) విభాగం అర్హులైన ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు ఆమోదం తెలుపుతుంది. కాంట్రాక్టు ఉద్యోగులు పుట్టిన తేదీ, విద్యా అర్హతలు, కమ్యూనిటీ, మంజూరైన పోస్టులో నియమించారా, లేదా అనే విషయాలను ఆయా శాఖాధిపతులు ధ్రువీకరణ చేయాల్సి ఉంటుంది.

సీఎం జగన్‌కు ఉద్యోగులు బాసటగా నిలవాలి..

పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు ఉద్యోగులందరూ బాసటగా నిలవాలి. దశాబ్దాల కాంట్రాక్టు ఉద్యోగుల కలను నెరవేర్చిన సీఎంగా జగన్ చరిత్రలో నిలిచిపోతారు. కొన్ని పత్రికలు, చానళ్లు ప్రభుత్వంపై నిత్యం విష ప్రచారం చేస్తున్నాయి. ప్రజలకు మేలు చేస్తున్న ప్రభుత్వాన్ని అక్కసుతో దించేసే కుట్రను ఉద్యోగులు అడ్డుకోవాలి. ప్రతి కాంట్రాక్టు ఉద్యోగి 100 మందిని లక్ష్యంగా పెట్టుకుని వాస్తవాలు వివరించాలి. నాడు-నేడు ద్వారా ఆస్పత్రులు, బడుల రూపురేఖలు మార్చి, ఇంటి వద్దకే వైద్యం అందిస్తున్న సీఎం జగన్‌ను మరోసారి గెలిపించుకోవాలి.

– ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డి, సెక్రటరీ జనరల్ అరవ పాల్

20 ఏళ్ల కల సాకారం

కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేయడం పట్ల ఆనందంగా ఉంది. 20 ఏళ్ల కలను సీఎం వైఎస్ జగన్ నిజం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో ఇంటర్మీడియెట్ విభాగంలో 3 వేల మందికి, పాలిటెక్నిక్, డిగ్రీ స్థాయిల్లో మరో 1,000 మందికి మేలు జరుగుతుంది.

– పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ, కేశవరపు జాలిరెడ్డి, వైఎస్సార్‌టీఏ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు

వేలాది కుటుంబాల్లో సీఎం వెలుగులు నింపారు..

పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం.. మేనిఫెస్టోలో చేర్చి మరీ కాంట్రాక్ట్ ఉద్యోగులకు సీఎం వైఎస్ జగన్ మేలు చేశారు. తాజా నిర్ణయం ద్వారా వేలాది కుటుంబాల్లో వెలుగులు నింపారు. మేమంతా ఆయనకు రుణపడి ఉంటాం.

– వై.రామచంద్రారెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, ఏపీ ప్రభుత్వ కాంట్రాక్టు లెక్చరర్స్ ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

సీఎం చిత్తశుద్ధికి నిదర్శనం..

కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులివ్వడం సీఎం జగన్ చిత్తశుద్ధికి నిదర్శనం. ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించిన సీఎంకు మా కృతజ్ఞతలు.

– కాంట్రాక్ట్ లెక్చరర్ల జేఏసీ రాష్ట్ర చైర్మన్ కుమ్మరకుంట సురేష్, కో చైర్మన్ కల్లూరి శ్రీనివాస్

ఉద్దానం సమస్యకు ఇక శాశ్వత పరిష్కారం

నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శ్రీకాకుళం జిల్లా పర్యటన

- వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ సెంటర్–సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించనున్న సీఎం
- రూ.700 కోట్ల వ్యయంతో నిర్మించిన సుజలధార ప్రాజెక్టు జాతికి అంకితం
- రూ.85 కోట్ల వ్యయంతో వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ సెంటర్ నిర్మాణం
- 200 పడకల సామర్థ్యంతో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్
- కిడ్నీ వ్యాధిగ్రస్తుల కష్టాలకు ప్రభుత్వం చెక్

సాక్షి, అమరావతి: ఉద్దానం కిడ్నీ వ్యాధిగ్రస్తుల సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపుతోంది. దీంతో వారి కష్టాలు తీరనున్నాయి. ఈ మేరకు శ్రీకాకుళం జిల్లా పలాసలో రూ.85 కోట్ల వ్యయంతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ – 200 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. అలాగే రూ.700 కోట్ల వ్యయంతో నిర్మించిన వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టును ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. ఉద్దానం ప్రాంతంలో క్లాడుటే కిడ్నీ సమస్య కనిపిస్తున్నా గతంలో ఎవరూ దీనికి పరిష్కారం చూపడానికి కూడా సాహసించలేదు. ఇలాంటి పరిస్థితిలో వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.785 కోట్లు భారీ వ్యయం చేసి మరీ.. ఉద్దానం వ్యాధిగ్రస్తుల సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపింది.

వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ సెంటర్– 200 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్..

ఉద్దానం కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందించేందుకు, అలాగే అన్ని రకాల కిడ్నీ వ్యాధులపై పరిశోధనలు చేసేందుకు పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, డయాలసిస్ యూనిట్ల ఏర్పాటు.. మూడు బ్లాకులుగా నాలుగు అంతస్తుల్లో ఆస్పత్రి నిర్మాణం. క్యాజువాలిటీ, రేడియో డయాగ్నోసిస్, పాథాలజీ, మైక్రో బయాలజీ, బయో కెమిస్ట్రీ ల్యాబ్స్, సెంట్రల్ ల్యాబ్స్, నెఫ్రాలజీ, యూరాలజీ, జనరల్ మెడిసిన్, సర్జరీ, డయాలసిస్, పోస్ట్ ఆపరేటివ్, ఐసీయూ, రీసెర్చ్ ల్యాబ్‌తో ప్రత్యేక వార్డులు. సీటీ స్కాన్, 2డీ ఎకో, హై ఎండ్ కలర్ డాప్లర్, మొబైల్ ఎక్స్ రే (డిజిటల్), ఫ్లూరియం లేజర్ యూరో డైనమిక్ మెషీన్ తదితర పరికరాలతో పాటు ఐసీయూ సౌకర్యాలు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, యూరాలజీ, నెఫ్రాలజీ వంటి స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో ఇప్పటికే 42 స్పెషాలిటీ డాక్టర్ పోస్టులు, 60 స్టాఫ్ నర్సు పోస్టులు, 60 ఇతర సహాయ సిబ్బంది పోస్టుల భర్తీ.

వైఎస్సార్ సుజలధార ప్రాజెక్ట్..

ఉద్దానం ప్రాంతంలో దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధులు (క్రానిక్ కిడ్నీ డిసీజెస్) ప్రబలంగా ఉన్న ఏడు మండలాల్లోని అన్ని గ్రామాలకు 'వైఎస్సార్ సుజలధార' ప్రాజెక్టు ద్వారా శుద్ధి చేసిన రక్షిత తాగునీరు. హిరమండలం రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకుని శుద్ధి చేసి పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల పరిధిలో 7 మండలాల్లోని 807 గ్రామాలకు రక్షిత నీటి సరఫరా. ఈ ప్రాంతంలో ప్రస్తుతం ఉన్న 6.78 లక్షల జనాభా 2051 నాటికి 7.85 లక్షలకు చేరుతుందన్న అంచనాతో అప్పటి అవసరాలకు కూడా సరిపోయేలా ఒక్కొక్కరికి రోజుకు 100 లీటర్ల చొప్పున నీటి సరఫరా చేసేలా ప్రాజెక్టు నిర్మాణం. ఇప్పటికే 613 గ్రామాలకు నీటి సరఫరా.. ఈ నెలాఖరుకు మిగిలిన గ్రామాలకు.

ఉద్దానం కిడ్నీ బాధితులకు అండగా ప్రభుత్వం చేపట్టిన చర్యలు..

- గత ప్రభుత్వంలో డయాలసిస్ రోగులకు కేవలం రూ.2,500 చొప్పున పింఛన్ ఇస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దాన్ని ఏకంగా రూ.10 వేలకు పెంచింది. ప్రతి నెలా 1న ఠంఛన్‌గా లబ్ధిదారులకు వారి ఇళ్ల వద్దే వలంటీర్లతో అందజేస్తోంది.
- ఇప్పటికే టెక్కలి, పలాస, సోంపేట, కవిటి, హరిపురం ఆస్పత్రుల్లో 74 మెషీన్లతో డయాలసిస్ సేవలు. ఇలా వరుసగా 2019–20లో 37,454 సెషన్లు, 2020- 21లో 46,162 సెషన్లు, 2021-22లో 54,520 సెషన్లు, 2022–23లో 55,520 సెషన్లు, 2023–24లో (అక్టోబర్ నాటికి) 38,513 సెషన్ల చొప్పున కిడ్నీ బాధితులకు ప్రభుత్వం డయాలసిస్ సేవలు అందించింది. ఇప్పుడు దీనికి అదనంగా మరింత మెరుగైన సేవలు అందించేందుకు కిడ్నీ రీసెర్చ్ సెంటర్–సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్.
- వైద్య పరీక్షల కోసం ఉద్దానం ప్రాంతంలోని 18 పీహెచ్‌సీలు, 5 యూపీహెచ్‌సీలు, 6 సీహెచ్‌సీల్లో సెమీ ఆటో ఎనలైజర్స్, ఎలక్ట్రోలైట్ ఎనలైజర్స్, యూరిన్ ఎనలైజర్స్ ఏర్పాటు. గత టీడీపీ ప్రభుత్వంలో డయాలసిస్ రోగులకు 20 రకాల మందులు మాత్రమే.. అది కూడా అరకొరగా అందజేశారు. ప్రస్తుతం ఇక్కడ ప్రతి ఆస్పత్రిలో 37 రకాల మందులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. కొత్త కేసుల గుర్తింపునకు నిరంతరాయంగా స్క్రీనింగ్ కొనసాగుతోంది. స్క్రీనింగ్ అనంతరం అనుమానిత లక్షణాలున్న వారి నుంచి రక్త నమూనాలు సేకరించి సీరమ్ క్రియాటినిన్ పరీక్షల కోసం సమీపంలోని పీహెచ్‌సీలకు తరలిస్తున్నారు. వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌లో పనిచేసే సీహెచ్‌వోలకు ప్రత్యేక యాప్. ఉద్దానం సమస్యలకు సంబంధించి ఏ రకమైన ఇబ్బందులు ఉన్నా..

జగనన్నకు చెబుదాం 1902 టోల్ ఫ్రీ నంబర్

సీఎం పర్యటన ఇలా..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం శ్రీకాకుళం జిల్లా పలాసలో పర్యటించనున్నారు. ఆయన గుంటూరు జిల్లా తాడేపల్లిలోని నివాసం నుంచి ఉదయం 8 గంటలకు బయలుదేరి 10.30 గంటలకు కంచిలి మండలం మకరాంపురం గ్రామానికి హెలికాప్టర్‌లో వస్తారు. అక్కడ ప్రజల నుంచి వినతులు స్వీకరించి 11.10 గంటలకు వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టు పంప్‌హౌస్ స్విచ్ నొక్కి దాన్ని ప్రారంభిస్తారు. అక్కడి నుంచి పలాస వెళ్తారు. అక్కడ ప్రజల నుంచి వినతులు స్వీకరించి 11.40 గంటలకు కిడ్నీ పరిశోధన కేంద్రానికి చేరుకుంటారు. అక్కడ ఆస్పత్రిని ప్రారంభించి దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. ఇండస్ట్రియల్ కారిడార్‌కు శంకుస్థాపన చేస్తారు. అలాగే ఎచ్చెర్లలోని బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో కొత్తగా నిర్మించిన వసతి గృహ భవనాన్ని వర్చువల్ పద్ధతిలో ప్రారంభిస్తారు. ఆ తర్వాత పాత జాతీయ రహదారి మీదుగా పలాస రైల్వే క్రీడా మైదానానికి చేరుకుంటారు. సభా ప్రాంగణంలో స్టాల్స్‌ను పరిశీలించి బహిరంగ సభలో మాట్లాడతారు. మధ్యాహ్నం 2.40 గంటలకు తిరిగి హెలికాప్టర్‌లో విశాఖకు బయలుదేరతారు.

'పొదుపు' మహిళలకే కొళాయిల మరమ్మతు పనులు

- గ్రామానికి ఇద్దరు చొప్పున పొదుపు సంఘాల మహిళలు ఎంపిక
- రాష్ట్రవ్యాప్తంగా 26,560 మందికి శిక్షణ కార్యక్రమాలు



శిక్షణను ప్రారంభిస్తున్న ఉన్నతాధికారులు

సాక్షి, అమరావతి: గ్రామాలకు సురక్షిత తాగునీటి సరఫరా ప్రక్రియలో భాగంగా కొత్తగా ఇంటింటికీ ప్రభుత్వం మంచినీటి కొళాయిలను ఏర్పాటు చేస్తోంది. ఈ క్రమంలో ఈ కొళాయిల పైపులైన్లకు భవిష్యత్తులో మరమ్మతులు అవసరమైతే ఆ బాధ్యతలను ఆయా గ్రామాల్లోని పొదుపు సంఘాల మహిళలకే అప్పగిస్తోంది. వాటి నిర్వహణకు ఇప్పటికే రాష్ట్రంలోని 13,280 గ్రామాల్లో పొదుపు సంఘాల మహిళలతో ప్రత్యేక కమిటీలను కూడా ఏర్పాటు చేసింది. ఇప్పుడు ఒక్కో గ్రామంలో ఆయా సంఘాల్లో ఉండే ఇద్దరేసి మహిళలకు మరమ్మతులకు సంబంధించి శిక్షణను అందిస్తోంది. 13,280 గ్రామ పంచాయతీల నుంచి ఇద్దరు చొప్పున సుమారు 26,560 మందికి పంబ్లింగ్, ఎలక్ట్రికల్, ఇతర అంశాల్లో శిక్షణ ఇవ్వనుంది. ఈ శిక్షణా కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో నిర్వహించే 44 కేంద్రాలను కూడా ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఇప్పటికే గుర్తించారు. రాష్ట్ర స్థాయిలో ఐదు రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమాలను బుధవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ ప్రారంభించారు. ఇందులో నైపుణ్యాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్, ఎండీ, సీఈవో వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

కరువు రైతులను ఆదుకునేలా కేంద్రానికి నివేదిక ఇస్తాం

కర్నూలు జిల్లాలో పర్యటించిన కేంద్ర బృంద సభ్యులు



కర్నూలు జిల్లా బిల్లేకల్లులో రైతులతో మాట్లాడుతున్న కేంద్ర బృంద సభ్యులు

కర్నూలు(అగ్రికల్చర్): కరువు రైతులను ఆదుకునే విధంగా కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని కేంద్ర బృందం సభ్యులు తెలిపారు. నీతిఆయోగ్ సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ బి.అనురాధ, కేంద్ర తాగునీరు, శానిటేషన్ శాఖ అసిస్టెంట్ అడ్వైజర్ ఆర్.సంతోష్, కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ సెక్రటరీ సంగీత్ కుమార్‌తో కూడిన కేంద్ర బృంద సభ్యులు బుధవారం కర్నూలు జిల్లా పత్తికొండ మండలం చిన్నహుల్తి, జూటూరు గ్రామాల్లో పర్యటించారు. పంటపొలాలను పరిశీలించి.. కరువుపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. అనంతరం ఆస్పరి మండలం బిలేకల్, శంకరబండ, ఆదోని మండలం విరుపాపురం, దేవనకొండ మండలం కప్పట్రాళ్ల, కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామాల్లో పర్యటించి కరువు పరిస్థితులను అంచనా వేశారు. రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఆ తర్వాత కర్నూలు కలెక్టరేట్‌లో ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. జేసీ నారపురెడ్డి మౌర్య కేంద్ర బృందానికి జిల్లాలో పరిస్థితిని వివరించారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, నీటి యాజమాన్య సంస్థల అధికారులు శాఖల వారీగా నివేదికలిచ్చారు. పత్తికొండ నియోజకవర్గంలోని తుగ్గలి, కోడుమూరు నియోజకవర్గంలోని కర్నూలు రూరల్ మండలాలను కూడా కరువు ప్రాంతాలుగా ప్రకటించి, రైతులను ఆదుకోవాలని కేంద్ర బృంద సభ్యులను పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ కోరారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులకు 'రెగ్యులరైజేషన్' బహుమతి

రాష్ట్ర కాంట్రాక్ట్ ఫార్మసిస్ట్స్, ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2019 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్ ఉద్యోగులకు 'రెగ్యులరైజేషన్' బహుమతిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తోందని రాష్ట్ర కాంట్రాక్ట్ ఫార్మసిస్ట్స్, ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.రత్నాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా రెగ్యులరైజేషన్‌పై ప్రభుత్వం విధివిధానాలను జారీ చేయడం హర్షణీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. తమ చిరకాల కోరికను నిజం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కాంట్రాక్ట్ ఉద్యోగులు, వారి కుటుంబాలు జీవితాంతం రుణపడి ఉంటామని వారు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా పానుగంటి



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా పానుగంటి చైతన్యను పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన విద్యార్థి విభాగం కమిటీని పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ప్రకటించింది. ఉపాధ్యక్షులుగా మద్దిరెడ్డి నరేంద్రరెడ్డి(అనంతపురం), దండమూడి రాజేశ్(ఎన్టీఆర్), వాసుపల్లి సంతోష్ కుమార్(విశాఖ) నియమితులయ్యారు. ఇతర కార్యవర్గాన్ని కూడా నియమించినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం తెలిపింది.

31న చిరుధాన్యాలు, ఔషధ మొక్కలపై సదస్సు

రైతు నేస్తం ఫౌండేషన్

సాక్షి, అమరావతి: 'రైతుకోసం– తానా,' రైతు నేస్తం ఫౌండేషన్' సంయుక్త నిర్వహణలో ఈ నెల 31వ తేదీన గుంటూరు జిల్లా కొర్నెపాడులోని రైతునేస్తం ఫౌండేషన్ కార్యాలయంలో చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం, చిరుధాన్యాలు, ఔషధ మొక్కల సాగు, ప్రకృతి వ్యవసాయంపై అనే అంశాలపై ఒకరోజు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ పద్మశ్రీ యడ్లపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆధునిక ఆహారపు అలవాట్లు అనారోగ్య సమస్యలకు, వ్యాధులకు కారణమవుతున్న నేపథ్యంలో సేంద్రీయ వ్యవసాయ విధానంలో పండించిన చిరుధాన్యాలైన కొర్రలు, సామలు, ఊదలు, అరికలు, అండుకొర్రలు వంటి దేశీయ ఆహారమైన చిరుధాన్యాల వాడకం వలన కలిగే ప్రయోజనాలపై పద్మశ్రీ పురస్కార గ్రహీత, కృషిరత్న, స్వతంత్ర శాస్త్రవేత్త, ఆహార ఆరోగ్య నిపుణులు డాక్టర్ ఖాదర్ వలి, ఔషధ మొక్కల సాగు, వాడకంపై మెడిసినల్ ప్లాంట్స్ బోర్డ్ సీఈవో జె.ఎ. చంద్రశేఖరరావు అవగాహన కల్పిస్తారని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. సాగులో అత్యాధునిక యంత్రపరికరాలు, దేశీయ విత్తనాల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. వివరాలకు 97053 83666 / 70939 73999 మొబైల్ నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.



ప్రపంచంలో ఆకలిని మించిన సాస్ (వ్యంజనం) లేదు.
– మిగెల్ డె సెర్వాంటీజ్

సాక్షి
గురువారం, 14 డిసెంబర్ 2023

మార్పులే మంత్రం!

రాజకీయాల్లో ఆశ్చర్యకర పరిణామాలు కొత్త కాదు కానీ, కొన్ని ఘటనలు అమితాశ్చర్యానికి గురి చేస్తాయి. ఆకర్షిస్తాయి. అవి సంభవించడానికి ప్రేరణ ఏమిటన్న ఆలోచనకు పురిగొల్పుతాయి. ఇటీవలి వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో 3 రాష్ట్రాల్లో విజయకేతనం ఎగరేసిన బీజేపీ కొత్త ముఖ్యమంత్రుల ఎంపిక అక్షరాలా అలాంటిదే. మూడు చోట్లా సీనియర్లను కాదని కొత్త ముఖాలను కాషాయ పార్టీ ఎంచుకున్న తీరు ఆశ్చర్యాన్నీ, ఆలోచననూ కలిగిస్తోంది. కొత్త నేతల పేర్లు పెద్దగా తెలియకున్నా... రకరకాల స్థానిక సామాజిక వర్గాల లెక్కలను పరిగణనలోకి తీసుకొన్నాకనే మధ్యప్రదేశ్‌లో మోహన్ యాదవ్, ఛత్తీస్‌గఢ్‌లో విష్ణుదేవ్ సహాయ్, రాజస్థాన్‌లో భజన్‌లాల్ శర్మలను అధిష్ఠానం ఎంపిక చేసినట్టుంది. వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలు రానున్న వేళ కమలనాథులు అనుసరిస్తున్న ఈ కొత్త సీఎం ముఖాల వ్యూహం లోతుపాతుల పట్ల అంచనాలు, విశ్లేషణలను పెంచుతోంది.

ప్రజాస్వామ్యంలో సభలో సంఖ్యా బలంతో అధికార పీఠంపై కూర్చొనే రాజకీయ పార్టీకీ, ఎన్నికైన ఆ పార్టీ చట్టసభ సభ్యులకూ తమకు నచ్చిన వ్యక్తిని ముఖ్యమంత్రిగా ఎన్నుకొనే పూర్తి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఉంటాయి. అది ఆ పార్టీల అంతర్గత వ్యవహారం. అయితే, శ్రమించి పార్టీని అధికారంలోకి తెచ్చిన, నిలబెట్టిన సీనియర్ నేతలకు సీఎం పీఠం దక్కకపోవడం, రాజస్థాన్ లాంటి చోట్ల తొలిసారి ఎమ్మెల్యేనే సరాసరి సీఎంను చేయడం, మంత్రులుగా ఎన్నడూ పనిచేయనివారిని డిప్యూటీ సీఎంలను చేయడం విచిత్రమే. కానీ నిత్యం ఎన్నికల పోరులో ఉన్నట్టే ఏడాది పొడుగూతా శ్రమించే బీజేపీకి తనవైన లెక్కలున్నాయి. విస్తృత రాజకీయ, సైద్ధాంతిక వ్యూహమూ ఈ ఎంపికలో కనిపిస్తోంది. ప్రతి రాష్ట్రంలో ప్రాంతాల మధ్య సమతూకం పాటిస్తూ, సామాజిక వర్గాల బలాబలాలను అంచనా వేసుకొంటూ ఈ కొత్త సీఎంల ఎంపికకు వ్యూహరచన చేశారని అర్థమవుతోంది. కొత్త సీఎంలు ముగ్గురూ హిందూత్వ వాదులే. ఆరెస్సెస్‌కు సన్నిహితులే. అధినేతలకు విధేయులే.

మాజీ కేంద్ర మంత్రి, ఛత్తీస్‌గఢ్ బీజేపీ అధ్యక్షుడైన విష్ణుదేవ్‌ను అక్కడి సీఎం పీఠంపై కూర్చోబెట్టడం వెనుక దేశంలోని 9 శాతం ఆదివాసీలను అక్కున చేర్చుకొనే వ్యూహం ఉంది. ఇప్పటికే ద్రౌపదీ ముర్ముతో దేశానికి తొలి గిరిజన రాష్ట్రపతిని అందించిన బీజేపీ ఆ వర్గంతో ఓట్ల బంధాన్ని బలోపేతం చేసుకోవాలనేది ఎత్తుగడ. ఇక, మధ్యప్రదేశ్‌లో మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి, విద్యామంత్రిగా పనిచేసిన మోహన్ యాదవ్ రాష్ట్రంలో బలమైన ఓబీసీ వర్గానికి చెందినవారు కావడం కలిసొచ్చిన అంశం. ఆయన డిప్యూటీలుగా బ్రాహ్మణ, ఎస్సీ వర్గీయుల్ని నియమించడంలో, ఇతర ప్రధాన ఓటుబ్యాంకుల్ని తృప్తిపరిచే యత్నం కనిపిస్తోంది. రాజస్థాన్‌లోనైతే అధికారిక ప్రకటన ముందు దాకా సమావేశ ఏర్పాట్లలో ఉన్న ఎమ్మెల్యే భజన్‌లాల్ పేరును ఆకస్మికంగా ప్రకటించారు. ఆయనే ఊహించని ఆ ఎంపిక మరోసారి పదవిపై ఆశపడ్డ వసుంధరకు అధిష్ఠానం వేసిన గుగ్లీ.

రాజవంశీయురాలైన వసుంధరా రాజె రెండు దశాబ్దాలలో తొలిసారిగా రాజస్థాన్‌లో ఇటు సీఎం కాకుండా, కనీసం సీఎం అభ్యర్థిగానైనా కాకుండా మిగిలారు. ఇక, మధ్యప్రదేశ్‌లో దీర్ఘకాలిక సీఎంగా పేరు తెచ్చుకొని, తాజా ఎన్నికల్లో ఏటికి ఎదురీది పార్టీని విజయతీరానికి చేర్చిన శివరాజ్ సింగ్ చౌహాన్‌కు మళ్ళీ పగ్గాలు దక్కలేదు. ఛత్తీస్‌గఢ్‌కు ఒకప్పుడు సీఎంగా వ్యవహరించిన రమణ్ సింగ్ పరిస్థితీ అదే. ఇప్పుడిక ఒక విషయం స్పష్టం. వసుంధరా రాజె, చౌహాన్‌లను పక్కనబెట్టడంతో కమలం పార్టీ ఇప్పుడిక ఒకప్పటి వాజ్‌పేయి, అద్వానీల శకం నుంచి పూర్తిగా బయటపడి, మోదీ, షాల కొత్త జమానాలోకి సంపూర్ణంగా చేరుకున్నట్టే. పాత కాపులుగా చక్రం తిప్పుతున్న అనేకులకు అనధికారికంగా... అధికార పీఠం నుంచి బలవంతపు పదవీ విరమణ ఇచ్చేసినట్టే. అయితే, సీఎం పదవి ఇవ్వనంత మాత్రాన బీజేపీలో ఈ సీనియర్ల కథ ముగిసిపోయిందని అనుకోలేం. రానున్న రోజుల్లో కాషాయపార్టీ వీరి సేవలను ఎలా వినియోగించుకుంటుందో వేచిచూడాలి.

ఏమైనా, ఎన్నికల్లో గెలిచిన తొమ్మిది రోజుల తర్వాత బీజేపీ ఆచితూచి సీఎంల ఎంపిక తతంగాన్ని పూర్తిచేసింది. రాజకీయాల్లో తరాల మార్పే కాక అధికార మార్పిడి సైతం సాఫీగా సాగేలా చూసుకుంది. దేశంలో 60 ఏళ్ళు ఆ పైబడ్డ ఓటర్లు 15 నుంచి 20 శాతమే అని లెక్కలు వినిపిస్తున్న వేళ పెరుగుతున్న యువ ఓటర్లను ఆకర్షించే నవతరం నేతలను భవిష్యత్ అవసరాలకు తగ్గట్టు తీర్చిదిద్దే పథకరచనకు విజయవంతంగా శ్రీకారం చుట్టింది. వ్యక్తుల కన్నా వ్యవస్థ (పార్టీ) పెద్దదనే నిష్ఠురసత్యాన్ని నసాళానికి అంటేలా సీనియర్లకు సంకేతించింది. ఇక, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో కొత్త సీఎంలు బుధవారం కొలువుతీరారు. కొన్ని ధార్మికస్థలాలే లక్ష్యమనిపించేలా బహిరంగ ప్రదేశాల్లో లౌడ్‌స్పీకర్లపై నిషేధమంటూ మధ్యప్రదేశ్‌లో మోహన్‌యాదవ్ పని మొదలెట్టేశారు. పాతవారిని మరిపించేలా పాలన అందించడమే కాక, తక్షణమే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి మరిన్ని సీట్లు సాధించే సవాలు ఈ ముగ్గురు కొత్త సీఎంల ముందుంది.

బీజేపీ మాత్రం వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోనూ తమదే విజయమన్న దిలాసా కనబరుస్తోంది. తరగని మోదీ మాయ, పార్టీ సైద్ధాంతిక పునాది, ప్రారంభం కానున్న అయోధ్య రామాలయం, ఆర్టికల్ 370 రద్దు సహా ఈ కులసమీకరణాలూ తమకు లాభిస్తాయనే భరోసాతో ఉంది. మార్పే మంత్రమని నమ్మిన బీజేపీ ఇప్పటికైతే అధికారంలో ఉన్నప్పుడైనా, లేనప్పుడైనా ఓటర్లపై పట్టు నిలుపుకోవడానికీ, పెంచుకోవడానికీ పై స్థాయిలో మార్పులు కీలకమని ఆచరణలో పెట్టింది. కొత్త యంత్రాన్ని పాత సాఫ్ట్‌వేర్‌తో కాక, కొత్త సాఫ్ట్‌వేర్‌తో నడపాలని నమ్మిన బీజేపీ వ్యూహం ఏ మేరకు ఫలిస్తుందో చూడాలి. అది ఫలిస్తే ప్రతిపక్షాలెంత ఆశపడ్డా ఢిల్లీ గద్దెపై మార్పును 2024లోనూ చూడలేవు.

రాష్ట్రాల అసమానతలు తొలగాలంటే...

అభిప్రాయం



ఎస్. మహేంద్ర దేవ్

16వ ఆర్థిక సంఘం (ఫైనాన్స్ కమిషన్) నియామకం త్వరలో జరగనుందని భావిస్తున్నారు. 15వ కమిషన్ ఏర్పాటైన 2017తో పోలిస్తే ఇప్పుడు ప్రపంచ, దేశీయ సవాళ్లు భిన్నంగా ఉన్నాయి. కోవిడ్–19 ప్రేరేపించిన ఆర్థిక షాక్‌లు, భౌగోళిక రాజకీయ సవాళ్లతో సహా ప్రపంచ స్థూల ఆర్థిక అనిశ్చితిని 16వ కమిషన్ పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. ఫైనాన్స్ కమిషన్ మినహా మరే ఇతర ప్రభుత్వ సంస్థ కూడా రాష్ట్రాల మధ్య అసమానతలపై దృష్టి సారించలేదని ఆర్బీఐ మాజీ గవర్నర్ వైవీ రెడ్డి అన్నారు. కొన్ని రాష్ట్రాలు అఖిల భారత పేదరిక నిష్పత్తిలో చాలా వెనుకబడి ఉన్నాయి. 16వ ఆర్థిక సంఘం ఈ అసమానతలను పరిశీలించి, ఆర్థిక పరిష్కారాలను అందించాలి.

2022–23లో కేంద్రం, రాష్ట్రాల సంయుక్త లోటు, అప్పులు వరుసగా 10 శాతం, 89 శాతంగా ఉన్నాయి. కేంద్ర పన్ను రాబడిలో రాష్ట్రాలకు ఎంత ఇవ్వాలి అనే క్షితిజ లంబ(వెర్టికల్) వాటాలనూ, దాన్ని రాష్ట్రాల మధ్య ఎలా పంపిణీ చేయాలి అనే క్షితిజ సమాంతర(హారిజాంటల్) వాటాలనూ ఆర్థిక సంఘం నిర్ణయిస్తుంది. కేంద్ర పన్నుల భాగస్వామ్య పూల్‌లో రాష్ట్రాల వాటాలను 14వ ఆర్థిక కమిషన్ 32 నుండి 42 శాతానికి పెంచింది. అయితే రాష్ట్రాల సంఖ్యను 28కి తగ్గించినప్పుడు, రాష్ట్రాల వాటాను 41 శాతంగా 15వ కమిషన్ సిఫార్సు చేసింది. 2022–23లో 6.5 శాతం ఆర్థిక లోటు, 58 శాతం అప్పుతో కేంద్ర ప్రభుత్వం ఆర్థిక అసమతుల్యతతో ఉన్నందున ఈ వాటాను పెంచే అవకాశం లేనట్లు కనిపిస్తోంది.

అయితే, 16వ ఆర్థిక కమిషన్ సెస్సులు, సర్‌ఛార్జీల అంశాన్ని పరిశీలించాలి. 2011–12లో ఉన్న 10 శాతం నికర పన్ను రాబడి (జీటీఆర్) నుండి 2019–20కి 20 శాతానికి పెరిగింది. వాస్తవానికి, కేంద్ర జీటీఆర్‌లో రాష్ట్రాల నిష్పత్తి 2018–19లో ఉన్న 36.6 శాతం నుండి 2022–23లో 30.2 శాతానికి తగ్గింది. సెస్సులు, సర్‌చార్జ్‌ల కోసం 10 శాతం జీటీఆర్ గరిష్ఠ పరిమితిగా ఉండాలని రంగరాజన్, శ్రీవాస్తవ సూచించారు. కమిషన్ దీనిని సిఫారసు చేయవచ్చు. అది 10 శాతాన్ని దాటితే, కేంద్ర పన్నులలో రాష్ట్రాల వాటాను పెంచవచ్చు. మరో మాటలో చెప్పాలంటే– సెస్సులు, సర్‌ఛార్జ్‌ల వాటాపై ఆధారపడి క్షితిజ లంబ వాటాను మార్పు చేయవచ్చు.

పెరుగుతున్న అంతరాలు

ఫైనాన్స్ కమిషన్ అమలు చేస్తున్న క్షితిజ సమాంతర పంపిణీ ఫార్ములా అనేది, రాష్ట్రాల అసమానతలను పరిష్కరించడానికి ఒక ముఖ్యమైన పరికరం. ఆర్బీఐ మాజీ గవర్నర్ వైవీ రెడ్డి అసమానతలపై రాసిన ఒక కథనంలో, ఫైనాన్స్ కమిషన్ మినహా మరే ఇతర ప్రభుత్వ సంస్థ కూడా రాష్ట్రాల మధ్య అసమానతలపై దృష్టి సారించలేదని సూచించారు. అంతకుముందు ప్రణాళికా సంఘం తలసరి ఖర్చులు కూడా ధనిక రాష్ట్రాలకే ఎక్కువగా ఉండేవి. కేంద్ర ప్రాయోజిత పథకాలకు తగిన వాటా రాష్ట్రాలు చెల్లించగలగాలి. కానీ దేశీయ మార్కెట్ రుణాలు, బాహ్య రుణాల నిబంధనలు, షరతులు ధనిక రాష్ట్రాలకు అనుకూలంగా ఉంటాయి. అభివృద్ధి చెందిన రాష్ట్రాలలోనే పరిశ్రమ, వ్యాపారం కేంద్రీకృతమై ఉన్నందున బ్యాంక్ రుణ పరపతి తిరోగమనంగా ఉంటుంది. కేంద్ర పన్ను రాయితీలు కూడా తిరోగమనంగానే ఉంటాయి. 12వ ఆర్థిక సంఘం నుండి 15వ ఆర్థిక సంఘం వరకు తలసరి స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ)పై పోల్చదగిన డేటాను పరిగణనలోకి తీసుకున్నప్పుడు రాష్ట్రాల్లో అసమానతలు విస్తృతమవుతున్నాయి. రాష్ట్రాల వ్యాప్తంగా 'కోఎఫిషియెంట్ ఆఫ్ వేరియేషన్' 0.46 నుండి 0.67కి పెరిగింది. తలసరి జీఎస్‌డీపీలో



అసమానతలు 15వ కమిషన్ నివేదికలో ఇచ్చిన డేటాలో అత్యధికంగా ఉన్నాయి. కాబట్టి, రాష్ట్ర స్థాయిలో ఆదాయంలో విస్తరిస్తున్న అసమానతలను 16వ కమిషన్ పరిగణనలోకి తీసుకోవాలి.

రాష్ట్రాలన్నింటిలోనూ, క్షితిజ సమాంతర పంపిణీ అనేది జనాభా, ప్రాంతం, తలసరి ఆదాయం వంటి సూచికలపైనా, జనాభా మార్పు, అటవీ విస్తీర్ణం వంటి ప్రోత్సాహక సంబంధిత సూచికలపైనా ఆధారపడి ఉంటుంది. రాష్ట్రాలన్నింటిలోనూ ఆదాయ అసమానతలను పరిష్కరించడానికి తలసరి ఆదాయంలో అంతరం అత్యంత ముఖ్యమైన సూచిక. 15వ కమిషన్‌లో ఆదాయ అంతరం 45 శాతం. ఆదాయ అంతరం వెనుక ఉన్న ముఖ్యమైన ఆలోచన ఏమిటంటే, రాష్ట్రాల మధ్య ఆర్థిక సామర్థ్య వ్యత్యాసాలు అనేవి పౌరులకు ఆరోగ్యం, విద్య, నీరు, పారిశుద్ధ్యం వంటి ప్రాథమిక సేవలను పొందడానికి ఆటంకం కాకూడదు.

ఇప్పటికీ దిగువే...

ఫైనాన్స్ కమిషన్ నివేదికల్లోని పోల్చదగిన గణాంకాలను బట్టి, బిహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, అస్సాం వంటి రాష్ట్రాలు తక్కువ ర్యాంకులో ఉన్నాయి. గత రెండు దశాబ్దాలుగా వీటిలో పెద్ద మార్పు లేదు. కనిష్ఠ తలసరి జీఎస్‌డీపీ (బిహార్‌కి చెందినది) మరియు గరిష్ఠ తలసరి జీఎస్‌డీపీ నిష్పత్తి (ఇది గోవాను మినహాయించిన తర్వాత, పంజాబ్ లేదా హరియాణాను సూచిస్తుంది) 1999–2002 లోని త్రైవార్షిక సగటు 23.3 శాతం నుండి 2016–2019లో 17.7 శాతానికి తగ్గింది. బహుమితీయ పేదరికంపై నీతి ఆయోగ్ ఇటీవలి నివేదిక ప్రకారం చూసినప్పుడు, అఖిల భారత పేదరికం నిష్పత్తి అయిన 15 శాతంతో పోలిస్తే బిహార్‌లో అత్యధిక పేదరికం (33.76 శాతం) ఉంది. తర్వాతి స్థానాల్లో జార్ఖండ్ (28.81), యూపీ (22.93), మధ్యప్రదేశ్ (20.63), అస్సాం (19.35) ఉన్నాయి.

ఈ నేపథ్యంలో, 16వ కమిషన్ సిఫార్సులు అసమానతలను తగ్గించడంలో, ప్రత్యేకించి ఆదాయం విషయంలో ముఖ్యమైనవి. క్షితిజ సమాంతర పంపిణీ అనేది రాజకీయంగా అత్యంత సున్నితమైన అంశం. అధిక పనితీరు కనబరుస్తున్న దక్షిణాది రాష్ట్రాలు, కాలక్రమేణా తమ వాటా తగ్గుముఖం పట్టిందనీ, ఆదాయం, జనాభా స్థిరీకరణ, మానవాభివృద్ధిలో మెరుగైన పనితీరు కారణంగా తమను దండిస్తున్నారనీ ఫిర్యాదు చేస్తున్నాయి. పన్నుల పంపిణీకి సమాంతర పంపిణీ సూత్రంతో ముడిపెట్టకూడదని ఒక సూచన. తక్కువ అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు గ్రాంట్లు అందించవచ్చు. కానీ పన్నుల పంపిణీ అనేది మొత్తం బదిలీలలో 80 శాతంగా ఉన్నట్లయితే ప్రగతిశీలంగా ఉంటుందనీ, గ్రాంట్లు (మొత్తం బదిలీలలో 20 శాతం)గా ఉన్నట్లయితే తిరోగమన శీలంగా ఉంటుందనీ అనుభవం సూచిస్తోంది. అందువల్ల, తక్కువ తలసరి ఆదాయ రాష్ట్రాలకు సహాయం చేయడానికి గ్రాంట్లు మరింత ప్రగతిశీలంగా ఉండాలి. సాధారణంగా, అంతర్రాష్ట్ర అసమానతలను పరిష్కరించే ఏకైక సంస్థ అయినందున, ఫైనాన్స్ కమిషన్ పన్నుల పంపిణీ, గ్రాంట్లు రెండింటిలోనూ సమధర్మ సూత్రానికి మరింత సున్నితంగా ఉండాలి.

రాష్ట్రాలే ప్రగతికి కీలకం

16వ ఆర్థిక సంఘం పరిశీలించాల్సిన ఇతర అంశాలు: సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి మరిన్ని ప్రోత్సాహకాలు, మానవాభివృద్ధిని మెరుగుపరచడం, రెవెన్యూ లోటు గ్రాంట్ల పరిశీలన, స్థానిక సంస్థలకు నిధుల బదిలీ, కేంద్రం, రాష్ట్రాలు రెండూ అందిస్తున్న ఉచితాలు, కేంద్ర ప్రాయోజిత పథకాల (సీఎస్ఎస్) పునరుద్ధరణ. సీఎస్ఎస్ విషయానికొస్తే, రాష్ట్రాలు మరింత సరళతతో పథకాల రూపకల్పనలో పాల్గొనవచ్చు. ఆదాయ వ్యయాల శాతంగా ఉచితాలపై కొంత పరిమితి ఉండాలి. ఉచితాలపై సిఫార్సులు కేంద్రం, రాష్ట్రాలు రెండింటికీ వర్తిస్తాయి. ఆర్థిక నియమాల ఆధారంగా రుణాన్ని, ఆర్థిక స్థిరత్వ విశ్లేషణను అందించడానికి స్వతంత్ర ఆర్థిక మండలిని ఏర్పాటు చేయాలనే సూచనలు కూడా ఉన్నాయి.

చివరగా, సమ్మిళిత అభివృద్ధితో 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశ హోదాను సాధించాలని భారతదేశం ఆకాంక్షిస్తోంది. ఈ లక్ష్యాలను సాధించడంలో రాష్ట్రాల పాత్ర సమానంగా లేదా అంతకంటే ముఖ్యమైనది. రాష్ట్రాలు మొత్తం ప్రభుత్వ వ్యయంలో 60 శాతం ఖర్చు చేస్తాయి. విద్య, ఆరోగ్య వ్యయంలో 70 శాతం, మూలధన వ్యయంలో మూడింట రెండు వంతులు ఖర్చు చేస్తాయి. ప్రభుత్వ ఉద్యోగులలో 79 శాతం మందిని రాష్ట్రాలు నియమిస్తున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, అంతర్రాష్ట్ర అసమానతలను తగ్గించడంలో 16వ ఆర్థిక సంఘం సిఫార్సులు ముఖ్యమైనవి.

వ్యాసకర్త హైదరాబాద్ 'ఇక్ఫాయ్'లో విశిష్ట ప్రొఫెసర్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పట్టించుకోలేదు!



భద్రతా లోపాలను రెండు సందర్భాల్లో ఎత్తిచూపాను. ప్రత్యేక సమావేశాల్లో సందర్శకుల గ్యాలరీ నుంచి స్లోగన్లు వినిపించినప్పుడు లేఖ రూపంలో; ఖలిస్తానీ తీవ్రవాది పన్నూ బెదిరింపు గురించి నిన్న జీరో అవర్లో! విషాదమేమంటే... విపక్షం నుంచి వచ్చినందువల్ల మా సూచనలను ధిక్కారంగానే చూశారు.

– ప్రియాంక చతుర్వేది, రాజ్యసభ ఎంపీ

దారుణాతి దారుణం



పార్లమెంట్ సమావేశాలు జరుగుతూ అత్యంత భద్రత ఉన్నప్పటికీ, పార్లమెంట్ మీద జరిగిన దాడి (2001 డిసెంబర్ 13)కి వార్షిక స్మరణ నేపథ్యంలో నిఘా సంస్థలు హెచ్చరికలు చేసినప్పటికీ, పన్నూ వ్యాఖ్యలతో ప్రత్యేక హెచ్చరికలు జారీ అయినప్పటికీ... పార్లమెంటులోకి చొరబాటు జరిగింది.

– శివ్ అరూర్, జర్నలిస్ట్

ఇద్దరు స్టార్లు?



ప్రతి బెంగాలీ తెలుసుకోవాల్సింది: గత రెండేళ్లలో తలసరి జీడీపీలో బెంగాల్‌ను ఒడిషా దాటిపోయింది. ఈ ఏడాది మధ్యప్రదేశ్ దాటిపోతుంది. అదృష్టవశాత్తూ బెంగాల్‌కు ఇంకా మహువా మొయిత్రా 5 స్టార్ ఫెమినిజం, మమతా బెనర్జీ 5 స్టార్ ఉదారవాదం ఉన్నాయి.

– అభిషేక్ బెనర్జీ, కాలమిస్ట్

అన్నీ అంతే!



పెప్సీ, కోక్ అనారోగ్యకరమని అందరికీ తెలుసు. కానీ ట్రాపికానా, పేపర్ బోట్, గింజర్ ఏల్, నింబూజ్ సంగతి? ఇందులో కొన్ని తమది ఆరోగ్యకరమైన పానీయంగా, విటమిన్లతో కూడినదిగా మార్కెట్ చేసుకుంటాయి. కానీ వీటిల్లో కూడా అంతే చక్కెర ఉంటుంది.

– రేవంత్ హిమత్‌సింగ్‌కా, ఫుడ్ యాక్టివిస్ట్

సుందర కశ్మీర్!



ఆర్టికల్ 370 రద్దు నిలిచింది. కశ్మీర్ సంపూర్ణంగా భారత్‌లో ఏకీకృతమైంది. కశ్మీరీ ముస్లింల గందరగోళపు అస్తిత్వం పరిష్కృతమైంది. ముప్పై ఏళ్లుగా ఆ ప్రాంతం మీద ఉన్న జిహాదీ శిక్షను వెనక్కి తిప్పే అవకాశం వారికి దక్కింది.

– అర్షియా మాలిక్, రచయిత్రి


సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్ బాక్స్

జీవితాంతం జ్వలిస్తూనే...

చరిత్రలో రెండు రకాల కవులూ, కళాకారులూ మనకు గోచరిస్తారు. ప్రభు వర్గాలనూ, పాలక వర్గాలనూ కీర్తిస్తూ వారి దోపిడీ, పీడనలను సమర్థిస్తూ వారి అడుగులకు మడుగులొత్తే వారు ఒక కోవకు చెందినవారు కాగా... దానికి భిన్నంగా ప్రజల పక్షం, పీడితుల పక్షం వహించి తమ గళాన్నీ, కలాన్నీ ప్రజా ప్రయోజనాల కోసం సంధించే వారు రెండో కోవకు చెందుతారు. 'జ్వాలాముఖి' రెండోకోవకు చెందిన కవులలో ప్రముఖుడు.

ఆయన 1938 ఏప్రిల్ 12న హైదరాబాదులోని సీతారాంబాగ్‌లో జన్మించారు. చిన్నతనంలోనే తాను నివాసముండే దేవాలయ ప్రాంగణంలోని పేద అర్చకుల ఇండ్లస్థలాల సమస్యపై పోరాటం చేసి పేద ప్రజల ప్రేమకు పాత్రుడయ్యారు. ఎన్నో రుగ్మతలకు ఆలవాలమైన నేటి దోపిడీ వ్యవస్థపై 'దిగంబరకవి'గా తిరుగుబాటు బావుటాను ఎగురవేసిన ఆయన క్రమంగా తన నిరంతర అధ్యయనం, పరిశీలన ద్వారా నేటి సమాజంలోని ప్రజల కడగండ్లకు దేశంలో కొనసాగుతున్న భూస్వామ్య, సామ్రాజ్యవాద దోపిడీ వ్యవస్థే మూలకారణమని గ్రహించారు. ఈ దోపిడీ నిర్మూలనకు మార్క్సిజం–లెనినిజం–మావో ఆలోచనా విధానమే శరణ్యమనీ అవగాహనకు వచ్చారు. అంతేగాక భారత విప్లవోద్యమ నాయకులు కామ్రేడ్స్ తరిమెల నాగిరెడ్డి (టీఎన్), దేవులపల్లి వెంకటేశ్వరరావు (డీవీ)ల సాంగత్యం, రచనలతో ప్రభావితులై భారతదేశంలో అనుసరించ వలసిన విప్లవ మార్గం పట్ల స్పష్టతను ఏర్పరచుకున్నారు.



జ్వాలాముఖి

ఒక మానవుడు మరో మానవుణ్ణి దోచుకోవటానికి వీలులేని వ్యవస్థకు బాటలు వేసే సోషలిస్టు సమాజం కోసం జ్వాలాముఖి పరితపించారు. జన చైనా చూచి రావడం తన జీవితంలో సంతోషకరమైన సంఘటనగా చెప్పుకున్నారు. సోషలిస్టు చైనా అన్ని రంగాలలో సాధిస్తున్న గణనీయ అభివృద్ధినీ, ఈ అభివృద్ధి వెనుక ఉన్న తాత్విక చింతననూ, రాజకీయ విధానాలనూ మన దేశవ్యాప్తంగా ఎలుగెత్తి చాటారు. 'బాల్యానికి శిక్షణ, యవ్వనానికి క్రమశిక్షణ, వృద్ధాప్యానికి రక్షణ లేని దేశం ఒక దేశమేనా?' అని ప్రశ్నిస్తూ ప్రజలందరికీ ఇటువంటి మౌలిక సౌకర్యాలు సోషలిస్టు సమాజంలోనే సాధ్యపడతాయని, అటువంటి సమాజంకోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని నొక్కి చెప్పేవారు.

కామ్రేడ్ జ్వాలాముఖి చక్కటి వక్త. అన్నిరంగాల ప్రజల హృదయాలలో విప్లవ భావాలను గుదిగుచ్చటంలో ఆయన మేటి. విద్యార్థులనూ, యువకులనూ భావి భారత ఆశాకిరణాలుగా జ్వాలాముఖి అభివర్ణించేవారు. భారత సమాజంలోని సమస్యలన్నింటికీ మౌలిక పరిష్కార మార్గాన్ని చూపిన కామ్రేడ్స్ డీవీ, టీఎన్‌ల విప్లవకర జీవితాలనుండి స్ఫూర్తిని పొందాలని చెప్పేవారు. పేదరికం, ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యం వంటి సమస్యలు చుట్టుముట్టినా లెక్క చేయకుండా జ్వాల విప్లవ ఆశయాల కోసం జీవితం అంతా పోరాడుతూ 2008 డిసెంబర్ 14న తుది శ్వాస విడిచారు. ఆయన జీవితం నుండి స్ఫూర్తినీ, ప్రేరణనూ పొంది, ఆయన ఆశించిన నూతన సమాజ స్థాపన కోసం కృషి చేయటమే ఆ విప్లవ తపస్వికి మనమందించే నివాళులు!

– సి. భాస్కర్, యూసీసీఆర్ (ఎం–ఎల్)

సవరణ తప్పట! రద్దు మాత్రం రైటట!!

సందర్భం



మాడభూషి శ్రీధర్

కేంద్ర ప్రభుత్వం జమ్మూ–కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని ఇచ్చే 370 అధికరణాన్ని రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తూ సుప్రీంకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ అధ్యక్షతన న్యాయమూర్తులు ఎస్కే కౌల్, సంజీవ్ ఖన్నా, బీఆర్ గవాయ్, సూర్యకాంత్ లతో కూడిన రాజ్యాంగ బెంచి కీలకమైన తీర్పును వెలువరించింది. దేశ సమగ్రతను పరిరక్షించాలంటూ సొలిసిటర్ జనరల్ 'సమర్థవంతంగా' వాదించడంతో ఒకే ఒక్క అంశం మినహా అన్ని అంశాలలో అత్యున్నత న్యాయస్థానం, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం వాదనలతో పూర్తిగా ఏకీభవించింది. రాజ్యాంగ నిపుణులూ, 'రూల్స్ ఆఫ్ లా' తెలిసిన వాళ్లూ తీవ్రంగా ఆలోచించవలసిన విషయం ఇది. ఈ 370 అధికరణ రద్దుపై తీర్పు దాదాపు అన్ని వాదాలనూ అంగీకరించింది. అయితే ఆర్టికల్ 370 రద్దు కోసం ఆర్టికల్ 367ను సవరించడం చట్టబద్ధం కాదని కోర్టు పేర్కొనడం గమనార్హం.

సుప్రీంకోర్టు చర్చించిన ఎనిమిది ప్రశ్నలకు జవాబులు వచ్చాయి. అయితే అందులో 6వ అంశాన్ని నిశితంగా పరీక్షించాల్సి ఉంది. ఈ అంశాన్నే కోర్టు తప్పు పట్టింది. ఆర్టికల్ 370ని రద్దు చేయడం కోసం ఆర్టికల్ 367ను సవరించడం మొత్తం చట్టపరమైన ప్రక్రియకు కీలకమైనది. అయితే ఈ సవరణ చట్టబద్ధం కాదని న్యాయమూర్తుల ధర్మపీఠం పేర్కొంది. ఆర్టికల్ 367 అనేది ఇంటర్‌ప్రిటేషన్ (వ్యాఖ్యానించే లేదా వివరించే) క్లాజ్ మాత్రమే. అంతేకానీ అది డెఫినిషన్‌ల (నిర్వచనాల)ను సబ్‌స్టిట్యూట్ (ప్రత్యామ్నాయంగా చూపే) చేసే క్లాజ్ కాదు. అందుకే 1954లో జమ్మూ–కశ్మీర్‌కు అనువర్తించేలా తెచ్చిన కాన్‌స్టిట్యూషనల్ ఆర్డర్ (సీఓ) 272 ప్రకారం ఆర్టికల్ 370 రద్దు కోసం ఆర్టికల్ 367ను సవరించడం చట్టవిరుద్ధం అని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. కోర్టు తీర్పులోని అంశాలను గమనిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.

ప్రధాన న్యాయమూర్తి ఇచ్చిన విస్తృతమైన తీర్పులో సీఓ 272 ఉద్దేశ్యం ఆర్టికల్ 367లో మార్పులు చేయడానికి అన్నట్టుగా మొదట కనిపించినా, అది సమర్థంగా ఆర్టికల్ 370ని పూర్తిగా మార్చివేసిందని పేర్కొన్నారు. ఈ మార్పులు గణనీయంగా బలమైనవీ, స్థిరమైనవనీ కోర్టు పేర్కొంది. సవరణ ప్రక్రియలో రాజ్యాంగ నియమ భంగం



చేస్తూ ఒక అధికరణాన్ని రద్దు చేయడానికి ఇంటర్‌ప్రెటేషన్ క్లాజ్ (వ్యాఖ్యాన నిబంధన)ను సవరించే హక్కు ప్రభుత్వానికి లేదు. ఒక రాజ్యాంగ సవరణకు నిర్దేశిత మార్గాన్ని తప్పించుకునేందుకు ఇంటర్‌ప్రిటేషన్ క్లాజ్‌ను ఉపయోగించే అధికారం లేదు కనుక ఆర్టికల్ 367ని ఆశ్రయించి ఆర్టికల్ 370కి చేసిన సవరణలు చట్టబద్ధం కాదని నిర్ధారించామనీ, ఇటువంటి అక్రమమైన పద్ధతుల ద్వారా సవరణలను అనుమతించడం దురదృష్టకరం అనీ సుప్రీం కోర్టు పేర్కొంది. ఆర్టికల్ 370 (1) (డి) కింద అధికారాన్ని ఉపయోగించి ఆర్టికల్ 370ని సవరించే అధికారం కేంద్రానికి లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ విషయంలో సీజేఐ అభిప్రాయంతో ఏకీభవిస్తూ, ఆర్టికల్ 367ను ఉపయోగించి 370ని సవరించే విషయంలో ఒక పద్ధతిని నిర్దేశించారనీ, దానిని అనుసరించకుండా దొడ్డి దారిలో అక్రమ మార్గం నుంచి సవరణ అనుమతించడం సరికాదనీ జస్టిస్ ఎస్కే కౌల్ తన తీర్పులో వ్యాఖ్యానించారు.

జమ్మూ–కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని ఇస్తున్న ఆర్టికల్ 370ని రద్దు చేయడానికి కేంద్ర ప్రభుత్వం పెద్ద కసరత్తే చేసింది. మొదటగా 'సీఓ272'గా ప్రాచుర్యం పొందిన రాజ్యాంగపు (జమ్మూ–కశ్మీర్ అనువర్తిత) ఉత్తర్వు– 1954ను రద్దు చేసి, భారత రాజ్యాంగంలోని అన్ని నిబంధనలూ జమ్మూ–కశ్మీర్‌కు వర్తిస్తాయని ప్రకటించింది. రెండవ దశలో అది రాజ్యాంగంలోని ఆర్టికల్ 367ను కూడా సవరించి, 370 ఆర్టికల్ రద్దుకు మార్గం వేసుకొంది.

పైన పేర్కొన్న రెండు దశల కన్నా ముందు, జారీ అయిన రాజ్యాంగపు (జమ్మూ–కశ్మీర్ అనువర్తిత) ఉత్తర్వు– 2019... సీఓ272 రద్దుకు కీలకమైన ఆధారం అని సుప్రీంకోర్టు నిర్ణయించింది. జమ్మూ–కశ్మీర్ రాజ్యాంగ సభ సూచనల మేరకు మాత్రమే ఆర్టికల్ 370ని సవరించాలి. కానీ ఆ రాజ్యాంగ సభ మనుగడలో లేదు కాబట్టి ఆర్టికల్ 367లో సీఓ272 ఉత్తర్వు ద్వారా ఒక క్లాజును ప్రవేశపెట్టారు. ఈ క్లాజ్ ప్రకారం ఆర్టికల్ 370 క్లాజ్(2) అనుసరించి రాష్ట్ర రాజ్యాంగ సభను 'రాష్ట్ర శాసన అసెంబ్లీ'గా చదువుకోవాలి. అయితే 2018 లోనే జమ్మూ–కశ్మీర్ శాసనసభను రద్దు చేసినందున, రాష్ట్రం రాష్ట్రపతి పాలన కింద ఉండటం వల్ల పార్లమెంటు ఆదేశం 'రాజ్యాంగ శాసన సభకు సమానం' అన్నట్టు పరిగణించారు. అంతే కాకుండా జీఓ.272లో ఉన్న 'జమ్మూ–కశ్మీర్ ప్రభుత్వం' అంటే 'జమ్మూ–కశ్మీర్ గవర్నర్'గా అర్థం చేసుకోవాలి వంటి క్లాజులను ఆర్టికల్ 367లో సృష్టించారు.

వీటన్నింటినీ ఆధారంగా చూపి ఆర్టికల్ 370ని రద్దు చేయాలని సూచిస్తూ కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధమైన తీర్మానాన్ని లోక్ సభలో ప్రవేశ పెట్టింది. ఈ తీర్మానాన్ని అత్యధిక మెజారిటీతో లోక్‌సభ ఆమోదించింది. తర్వాత రాజ్యసభ ఆమోద ముద్ర వేసింది. అయితే పార్లమెంటు ఆమోదించిన చట్టపరమైన తీర్మానంపై, 2019 ఆగస్టు 6 నాటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆర్టికల్ 370కి సంబంధించిన అన్ని క్లాజులూ '2019 ఆగస్టు 6' నుంచి నిర్వీర్యం అవుతాయని నోటిఫికేషన్ (సీఓ273)ని జారీ చేశారు. ఈ విధంగా జమ్మూ– కశ్మీర్ ప్రత్యేక హోదాను సమర్థవంతంగా కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఆర్టికల్ 370(3) కింద ఈ నోటిఫికేషన్ జారీ చేసేందుకు రాష్ట్రపతి అధికారాలను ఉపయోగించుకున్నారు.

ఈ అధికరణం రాష్ట్రపతి నిర్దేశించిన తేదీ నుంచి ఉనికిలో ఉంటుందని కానీ, లేక పని చేయడం మానేస్తుందని కానీ, లేదా మినహాయింపు, సవరింపులతో పని చేస్తుందని ప్రకటించేందుకు రాష్ట్రపతికి ఆర్టికల్ 370 (3) అధికారమిస్తుంది. కనుక రాష్ట్రాన్ని జమ్మూ–కశ్మీర్, లద్దాఖ్‌లుగా విభజించేందుకు 'జమ్మూ–కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లు–2019'ను పార్లమెంటు ఆమోదించడం అత్యంత రాజ్యాంగ వ్యతిరేక చర్య. ప్రత్యేకంగా, విడిగా చూసినప్పుడు... అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు మొత్తంలో 367 అధికరణకు సవరణ చేయడం తప్పని కోర్టు చెప్పడం కేవలం ఒక అంశంగా మాత్రమే ఉందనిపిస్తోంది. కానీ, మొత్తం తీర్పే ఈ అంశాన్నే ఆధారం చేసుకొని సమర్థించడం 'రాజ్యాంగ బద్ధమేనా?'

వ్యాసకర్త మహేంద్ర యూనివర్సిటీ 'స్కూల్ ఆఫ్ లా'లో ప్రొఫెసర్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** శు.విదియ రా.2.51 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** మూల ఉ.11.33 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** ఉ.10.00 నుండి 11.32 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.04 నుండి 10.52 వరకు, తదుపరి ప.2.31 నుండి 3.19 వరకు, **అమృత ఘడియలు:** లేవు ; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.25, **సూర్యాస్తమయం:** 5.24.

విద్యార్థి కంటిరెప్పకు అరుదైన శస్త్రచికిత్స



శస్త్రచికిత్స అనంతరం అభిలాష్‌తో వైద్య బృందం

మచిలీపట్నంటౌన్: ప్రమాదవశాత్తు కన్నుకు గేటు తగిలి కంటిరెప్ప తెగిన ఓ విద్యార్థికి అరుదైన శస్త్రచికిత్స చేసిన ఘటన బుధవారం కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని జిల్లా సర్వజన ఆసుపత్రిలో చోటు చేసుకుంది. పదో తరగతి చదువుతున్న ఎం.అభిలాష్ జిల్లాలోని మొవ్వ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఉంటున్నాడు. బుధవారం అభిలాష్‌కు వసతి గృహం గేటు తగిలి కనురెప్ప తెగిపోయింది. దీంతో అతడిని మచిలీపట్నం జిల్లా సర్వజన ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. ఆసుపత్రిలోని నేత్ర వైద్య నిపుణుడు జీ భానుమూర్తి అభిలాష్‌కు వైద్య పరీక్షలు నిర్వహించి శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు. గంటపాటు శస్త్రచికిత్స చేసి విద్యార్థికి కనురెప్ప సాధారణ స్థితికి వచ్చేలా వైద్యులు భానుమూర్తి, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ ప్రసన్న శస్త్రచికిత్స చేశారు. జగనన్న కంటి వెలుగు పథకంలో భాగంగా ఈ అరుదైన శస్త్రచికిత్సను చేసినట్లు వైద్యులు తెలిపారు.

ధాన్యం దిగుబడిలో ఏపీకి రెండో స్థానం

పంజాబ్‌కు దేశంలోనే మొదటి స్థానం / హెక్టార్‌కు ధాన్యం దిగుబడి ఏపీలో 3,730.40 కేజీలు / పంజాబ్‌లో 4,193 కేజీలు / 2022–23 నాబార్డు అధ్యయన నివేదిక వెల్లడి



సాక్షి, అమరావతి: హెక్టార్‌కు ధాన్యం దిగుబడిలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రెండో స్థానంలో ఉందని నాబార్డు అధ్యయన నివేదిక స్పష్టం చేసింది. మొదటి స్థానంలో పంజాబ్ ఉన్నట్టు నివేదిక వెల్లడించింది. 2022–23లో దేశంలోని వివిధ రాష్ట్రాల్లో హెక్టార్‌కు ధాన్యం దిగుబడిపై నాబార్డు నివేదికను విడుదల చేసింది. జాతీయ స్థాయిని మించి రాష్ట్రంలో హెక్టార్‌కు ధాన్యం దిగుబడి అత్యధికంగా ఉందని నివేదిక పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన సమగ్ర సస్య రక్షణ చర్యలపై ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలిస్తోంది. పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా పైర్లపై వచ్చే వివిధ చీడపీడలను ఎప్పటికప్పుడు అంచనాలు వేసి, వాటి వలన పంటలకు ఏ విధమైన నష్టమూ వాటిల్లకుండా.. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేలా రైతులకు ఆర్‌బీకేలు తోడుగా నిలుస్తున్నాయి. నిరోధక శక్తిగల వరి రకాలను ఎంచుకునేలాగ రైతులను ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. విత్తన శుద్ధి పాటించేలా చర్యలు తీసుకుంటున్నారు. నారుమడిలో సస్యరక్షణను పాటింపజేయడంతో పాటు నీటి యాజమాన్య పద్ధతులపై రైతులకు సలహాలు, సూచనలిస్తున్నారు. అలాగే నత్రజని ఎరువును సిఫారసుకు తగినట్టే వినియోగించేలా రైతుల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఏ తెగుళ్లు సోకితే ఎంత మోతాదులో క్రిమిసంహారక మందులు వాడాలో కూడా వ్యవసాయ శాస్త్రవేత్తల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. మెరుగైన వ్యవసాయ పద్ధతులు, దిగుబడిని పెంచే ఇన్‌పుట్‌లు మొదలైనవి రైతులకు ప్రభుత్వం సూచిస్తోంది. ఒక్క మాటలో చెప్పాలంటే గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో విత్తనం నుంచి పంట కోసి, విక్రయం వరకు ప్రభుత్వం అన్ని రకాలుగా చేదోడు వాదోడుగా నిలుస్తోంది. దీంతో హెక్టార్‌కు ధాన్యం దిగుబడిలో రాష్ట్రం రెండో స్థానంలో నిలిచింది.

2022-23లో రాష్ట్రాల్లో హెక్టార్‌కు ధాన్యం దిగుబడి ఇలా



రాష్ట్రం పేరు	హెక్టార్‌కు ధాన్యం దిగుబడి (కేజీల్లో)
పంజాబ్	4,193.00
ఆంధ్రప్రదేశ్	3,730.40
తమిళనాడు	3,500.40
తెలంగాణ	3,405.60
హరియాణ	3,362.00
త్రిపుర	3,262.70
కర్ణాటక	3,223.00
కేరళ	3,108.20
పశ్చిమబెంగాల్	3,057.00

ఫుడ్ పాయిజన్‌పై విచారణ

- తప్పు జరిగినట్లు రుజువైతే బాధ్యులపై చర్యలు
- బాధిత విద్యార్థులను పరామర్శించిన మంత్రి చెల్లుబోయిన



విద్యార్థితో మాట్లాడుతున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

అమలాపురం టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని సమనస జ్యోతీరావ్ పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై ఆర్డీవో, డీఎస్పీలతో విచారణ చేయిస్తున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ వెల్లడించారు. అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 11 మంది విద్యార్థులను మంత్రి బుధవారం పరామర్శించారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావుతో మాట్లాడి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. విచారణలో పాఠశాల, వసతి గృహం సిబ్బంది తప్పిదం ఉన్నట్లు రుజువైతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. అయితే బయట నుంచి తెచ్చిన బిర్యాని తినడంతోనే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారా..? అనే కోణంలోనూ దర్యాప్తు చేయాల్సి ఉందన్నారు. ఘటనపై అమలాపురం ఆర్డీఓ జి.కేశవవర్ధనరెడ్డి, డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్‌తో కూడిన ఓ ప్రత్యేక కమిటీ విచారణ చేస్తున్నదని తెలిపారు. అనంతరం మంత్రి వేణుగోపాలకృష్ణ సమనస పాఠశాలను సందర్శించారు. హాస్టల్‌లోని వంట విభాగాన్ని, వంట పదార్థాలను తనిఖీ చేశారు. అరటి పండ్లు తాజాగా లేవని, వాటిని మార్చాలని ఆదేశించారు. అమలాపురం మార్కెటింగ్ కమిటీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, జెడ్పీటీసీ శ్రీహరి రామగోపాల్ పాల్గొన్నారు.

వైద్య సేవలపై సమగ్ర సమాచారాన్ని అందించండి: కొమ్మినేని

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత అంశమైన వైద్య సేవల సమగ్ర సమాచారాన్ని మీడియాకు అందించడం ద్వారా ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని సి.రాఘవాచారి మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. బుధవారం విజయవాడలో రాష్ట్రంలోని ప్రభుత్వ బోధనాస్పత్రుల మెడికల్ సూపరింటెండెంట్‌లతో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో 'పౌర సంబంధాలు, మీడియా నిర్వహణ' అంశంపై కొమ్మినేని మాట్లాడారు. విద్య, వైద్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని తెలిపారు.

జనాన్ని తప్పుదోవ పట్టిస్తున్న జనసేన

పవన్ అజ్ఞాతవాసి.. మనోహర్ అజ్ఞానవాసి

- పార్టీల మధ్య బ్రోకరిజం చేసే మనోహర్ అర్థంలేని ఆరోపణలు మానుకోవాలి
- మీడియాతో మంత్రి గుడివాడ అమర్‌నాథ్



మహారాణిపేట (విశాఖ దక్షిణ): రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ముందుకెళుతున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై ఒక పొలిటికల్ బ్రోకర్ ప్రజలను తప్పుదోవ పట్టించేవిధంగా చేస్తున్న విమర్శల్ని మానుకోవాలని జనసేన నాయకుడు నాదెండ్ల మనోహర్‌ను ఉద్దేశించి రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. హిందూపురంలో పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా భూములు కేటాయిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వక్రీకరించి నాదెండ్ల మనోహర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి తీవ్రంగా స్పందించారు. విశాఖలో బుధవారం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ హిందూపురంలో 350 ఎకరాలను క్విడ్ ప్రోకో కింద నియోజన్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కి కట్టబెట్టారంటూ మనోహర్ ప్రజలను తప్పుదోవపట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో ఆ సంస్థకు పవర్‌ప్లాంట్ నిర్మాణం కోసం 350 ఎకరాలు కేటాయించారని, అయితే ఆ సంస్థ పవర్‌ప్లాంట్ నిర్మాణం సాధ్యం కాదని, ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు ప్రతిపాదించిందని తెలిపారు. రాజశేఖరరెడ్డి మరణానంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ఆ భూమి కేటాయింపును రద్దుచేయడంతో ఆ సంస్థ కోర్టుకు వెళ్లిందని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ భూమిని మళ్లీ వినియోగంలోకి తీసుకురావాలన్న ఆలోచనలతో నియోజన్ యాజమాన్యాన్ని సంప్రదించి కోర్టు కేసు విత్‌డ్రా చేసుకోవాలని సూచించారని తెలిపారు. ఇప్పుడు ఆ భూములు అందుబాటులోకి వచ్చాయని, అక్కడ పరిశ్రమల ఏర్పాటు ద్వారా వేలాదిమందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. దీనివల్ల నాదెండ్ల మనోహర్‌కి ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణ ఎన్నికల ఫలితాల తర్వాత మనోహర్ అండ్ పార్టీకి మతిభ్రమించిందని చెప్పారు. ప్రజల నుంచి ఆ పార్టీకి మద్దతు లేకుండా పోయిందని విమర్శించారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడం జనసేన, తెలుగుదేశం పార్టీలకు ఇష్టంలేదని, నిరంతరం ప్రజలను తప్పుదోవ పట్టించడమే ఆ పార్టీల లక్ష్యమని చెప్పారు. నాదెండ్ల మనోహర్ ఇలాంటి వ్యాఖ్యలు మానుకుని పార్టీల మధ్య బ్రోకరిజం చేసుకుంటూ తనపని తాను చేసుకోవాలని సూచించారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ అజ్ఞాతవాసి అని, నాదెండ్ల మనోహర్ అజ్ఞానవాసి అని ఎద్దేవా చేశారు.

సమస్యకు పరిష్కారం చూపేవాడే నాయకుడు

శ్రీకాకుళం జిల్లా ఉద్దానంలో కిడ్నీ సమస్యకు పరిష్కారం చూపించింది జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాత్రమేనని చెప్పారు. ఈ సమస్యను తానే వెలుగులోకి తీసుకువచ్చానని పవన్ కల్యాణ్ చెప్పుకుంటున్నారని, సమస్యను వెలుగులోకి తెస్తే సరిపోదు... దానికి పరిష్కారం చూపేవాడే నాయకుడు అని ఎద్దేవా చేశారు. కిడ్నీ సమస్యను పరిష్కరించేందుకు కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌ను, స్వచ్ఛమైన తాగునీటి ప్రాజెక్టును ఏర్పాటుచేసి ముఖ్యమంత్రి జగన్ నిజమైన నాయకుడని నిరూపించుకున్నారని చెప్పారు. పలాసలో సుమారు రూ.750 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం జగన్ గురువారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారని, ఇండస్ట్రియల్ పార్కుకు కూడా భూమి పూజ చేస్తారని తెలిపారు. రాష్ట్రంలోని 11 నియోజకవర్గాలకు చెందిన ఇన్‌చార్జీలను మార్చిన అంశంపై మీడియా ప్రతినిధుల ప్రశ్నకు మంత్రి సమాధానం చెబుతూ.. జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విషయాలు పరిశీలించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. విశాఖపట్నం రైల్వేజోన్‌కు రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయించడం లేదని కేంద్రమంత్రి చేసిన ప్రకటనలో నిజం లేదన్నారు. జోన్ ఏర్పాటు చేస్తామంటే 48 గంటల్లో భూమి కేటాయిస్తామని ఆయన చెప్పారు.

పలు రైళ్ల రద్దు, దారి మళ్లింపు



రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో జరుగుతున్న నిర్వహణ పనుల కారణంగా పలు రైళ్లను పూర్తిగాను, పాక్షికంగాను రద్దు చేసి, మరికొన్నింటిని దారి మళ్లించి నడపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ప్రకటించారు.

పూర్తిగా రద్దయిన రైళ్లు: ఈ నెల 18 నుంచి 31 వరకు మచిలీపట్నం–విశాఖపట్నం (17219/17220), విజయవాడ–విశాఖపట్నం (22702/22701), గుంటూరు–విశాఖపట్నం (17239/17240), బిట్రగుంట–విజయవాడ (07977/07978), బిట్రగుంట–చెన్నై సెంట్రల్ (17237/17238), విజయవాడ–తెనాలి (07279/07575), విజయవాడ–ఒంగోలు (07576/07500), విజయవాడ–గూడూరు (12744/12743) రైళ్లను పూర్తిగా రద్దు చేశారు.

పాక్షికంగా రద్దయిన రైళ్లు: ఈ నెల 18 నుంచి 31 వరకు మచిలీపట్నం–విజయవాడ (07896/07769), నర్సాపూర్–విజయవాడ (07863), విజయవాడ–మచిలీపట్నం (07866/07770), విజయవాడ–భీమవరం టౌన్ (07283), మచిలీపట్నం–విజయవాడ (07870), విజయవాడ–నర్సాపూర్ (07861) రైళ్లు రామవరప్పాడు–విజయవాడ మధ్య పాక్షికంగా రద్దు అయ్యాయి.

దారి మళ్లించిన రైళ్లు: ఈ నెల 18 నుంచి 25 వరకు యర్నాకుళం–పాట్నా (22643), ఈ నెల 23 నుంచి 30 వరకు భావ్‌నగర్–కాకినాడ పోర్టు (12756), ఈ నెల 20, 22, 27, 29 తేదీల్లో బెంగళూరు–గౌహతి (12509), ఈ నెల 18, 20, 22, 23, 25, 27, 29, 30 తేదీల్లో ఛత్రపతి శివాజీ టెర్మినస్–భువనేశ్వర్ (11019), ఈ నెల 18 నుంచి 31 వరకు ధన్‌బాద్–అలెప్పి (13351), ఈ నెల 23, 30 తేదీల్లో హతియా–బెంగళూరు (18637), ఈ నెల 19, 24, 26, 31 తేదీల్లో హతియా–బెంగళూరు (12835), ఈ నెల 22, 29 తేదీల్లో టాటా–బెంగళూరు (12889), ఈ నెల 21, 28 తేదీల్లో టాటా–యశ్వంత్‌పూర్ (18111), ఈ నెల 18, 25 తేదీల్లో హతియా–యర్నాకులం (22837) రైళ్లు రెండు మార్గాల్లో వయా విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా దారి మళ్లించారు.

లోక్‌సభకు పొగ

సభలో ఇద్దరు, బయట ఇద్దరు పొగ గొట్టాలు విసిరిన వైనం

సాక్షి, న్యూఢిల్లీ: బుధవారం మధ్యాహ్నం. ఒంటి గంట సమయం. లోక్‌సభలో జీరో అవర్ ముగింపుకు వచ్చింది. బీజేపీ సభ్యుడు ఖగేన్ ముర్ము మాట్లాడుతుండగా ఉన్నట్టుండి పెద్ద శబ్దం! ఏమైందో అర్థం కాక లోక్‌సభ సభ్యులంతా ఒక్కసారిగా అయోమయానికి లోనయ్యారు. సందర్శకుల గ్యాలరీ నుంచి ఎవరో సభలోకి పడిపోయారని తొలుత భావించారు. అదేమీ కాదని, ఒక వ్యక్తి ఉద్దేశపూర్వకంగానే సభలోకి దూకాడని అర్థమై బిత్తరపోయారు. ఆలోపే మరో వ్యక్తి కూడా సభలోకి దూకి మరింత కలకలం రేపాడు. ఇద్దరూ బెంచీలపై గెంతుతూ స్పీకర్‌ను చేరుకునేందుకు వెల్‌కేసి దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. బూట్లలోంచి పొగ గొట్టాలు తీసి విసిరారు. వాటినుంచి వెలువడ్డ పొగ హాలంతటా కమ్ముకుంది. ఈ పరిణామాలతో ఎంపీలు తీవ్ర ఆందోళనకు లోనై అటూ ఇటూ పరుగులు తీశారు. చివరికి ఎంపీలు, భద్రతా సిబ్బంది వారిని నిర్బంధించారు. అదే సమయంలో పార్లమెంటు ప్రాంగణం బయట కూడా పొగ గొట్టాలు విసిరి కలకలం రేపిన ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. 2001లో సరిగ్గా డిసెంబర్ 13వ తేదీనే పాకిస్తాన్‌లోని లష్కరే తొయిబాకు చెందిన ఉగ్రవాదులు పార్లమెంటు ప్రాంగణంపై దాడికి తెగబడి విచ్చలవిడి కాల్పులతో తొమ్మిది మందిని పొట్టన పెట్టుకోవడం తెలిసిందే. తాజా ఉదంతంపై కేంద్ర హోం శాఖ సమగ్ర దర్యాప్తుకు ఆదేశించింది.

తీవ్ర భద్రతా లోపం: ఎంపీలు

ఘటన అనంతరం మధ్యాహ్నం రెండింటికి లోక్‌సభ తిరిగి సమావేశమయ్యాక సభ్యులు తీవ్ర ఆందోళన వెలిబుచ్చారు. 2001 దాడి అనంతరం ఇది అతి తీవ్రమైన భద్రతా లోపమంటూ మండిపడ్డారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా దీనిపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 13లోగా పార్లమెంటుపై దాడికి పాల్పడతానంటూ ఖలీస్థానీ వేర్పాటువాది గురుపత్వంత్ సింగ్ పన్ను హెచ్చరించిన విషయాన్ని కొందరు సభ్యులు గుర్తు చేశారు. మొదటి వ్యక్తి తన సమీపంలోనే సభలోకి దూకాడని జేడీ(యూ) ఎంపీ రామ్‌ప్రీత్ మండల్ చెప్పారు. తామంతా తీవ్ర ఆందోళనతో అటూ ఇటూ పరుగులు తీశామన్నారు. వాళ్ల దగ్గర బాంబు, మారణాయుధాలుంటే పరిస్థితేమిటని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సుదీప్ బంధోపాధ్యాయ ప్రశ్నించారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపిస్తామని స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. సభను వాయిదా వేసి ఈ ఉదంతంపై అఖిలపక్ష భేటీ ఏర్పాటు చేశారు. కేంద్రం తక్షణం క్షమాపణ చెప్పాలని, పార్లమెంటు భద్రతను తక్షణం మరింత కట్టుదిట్టం చేయాలని విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. దుండగులకు పాస్‌లు సిఫార్సు చేసిన బీజేపీ ఎంపీ సింహాను విచారించాలన్నారు. ఆయన్ను తక్షణం సభ నుంచి బహిష్కరించాలని తృణమూల్ సభ్యులు డిమాండ్ చేశారు.

ఇలా జరిగింది...

సభలోకి దూకి కలకలం రేపిన వారిని కర్ణాటకలోని మైసూరుకు చెందిన డి.మనోరంజన్ (34), యూపీలోని లక్నోకు చెందిన సాగర్ శర్మ (26)గా గుర్తించారు. జీరో అవర్ కాసేపట్లో ముగుస్తుందనగా ముందుగా సాగర్ ఒక్కసారిగా గ్యాలరీ నుంచి సభలోకి దూకాడు. దాంతో ఎంపీలు షాక్‌కు గురై అటూ ఇటూ పరుగులు తీశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ గోరంట్ల మాధవ్, ఆరెల్పీ ఎంపీ హనుమాన్ బెనీవాల్ అతన్ని పట్టుకునేందుకు ప్రయత్నిస్తుండగానే మరో వ్యక్తి కూడా గ్యాలరీ నుంచి సభలోకి దూకాడు. ఇద్దరూ వెల్‌కేసి దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. మొదటి వ్యక్తిని బెనీవాల్ తదితర ఎంపీలు పట్టుకుని దేహశుద్ధి చేశారు. నియంతృత్వం చెల్లదని అతను నినాదాలు చేశాడు. ''దగ్గరికి రావద్దు. మేం దేశభక్తులం. నిరంకుశత్వంపై నిరసన తెలపడానికే వచ్చాం'' అంటూ బిగ్గరగా అరిచాడు. ఇద్దరూ తమ బూట్ల నుంచి పొగ గొట్టం వంటివాటిని తీసి విసిరారు. వాటినుంచి వెలువడ్డ పసుపు రంగు పొగ సభ అంతటా వ్యాపించడంతో ఎంపీలంతా తీవ్ర భయాందోళనలకు లోనయ్యారు. తర్వాత ఎంపీలంతా కలిసి వారిని నిర్బంధించారు. బాగా దేహశుద్ధి చేసి పార్లమెంటు సిబ్బందికి అప్పగించారు. వెంటనే సభాపతి స్థానంలో ఉన్న రాజేంద్ర అగర్వాల్ సభను గంటపాటు వాయిదా వేశారు.

ఆరుగురూ ఒకే ఇంట్లో...

పార్లమెంటు ఆవరణలో పొగ గొట్టాలు విసిరి పట్టుబడ్డ వారిని హరియాణాలోని హిస్సార్‌కు చెందిన నీలమ్ (42), మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన అమోల్ షిండే (25)గా గుర్తించారు. వీరికి, మనోరంజన్, సాగర్‌లకు లలిత్, విశాల్ అనే మరో ఇద్దరు కూడా సహకరించినట్టు ఢిల్లీ పోలీసులు తేల్చారు. విశాల్‌ను గురుగ్రాంలో పట్టుకున్నారు. ఐదుగురినీ లోతుగా విచారిస్తున్నారు. ఆరుగురూ గ్యాలరీలోకి వెళ్లాలనుకున్నా ఇద్దరికే పాస్ దొరికినట్టు సమాచారం. వీరందరికీ కనీసం నాలుగేళ్లుగా పరిచయముందని, సోషల్ మీడియా ద్వారా టచ్‌లో ఉండేవారని చెబుతున్నారు. అంతాకొంతకాలంగా గురుగ్రాంలో లలిత్ ఇంట్లోనే ఉంటున్నట్టు పోలీసులు తెలిపారు. వీరు 3 నెలలుగా పార్లమెంటు పాస్‌ల కోసం ప్రయత్నిస్తున్నట్టు విచారణలో తేలింది.

సభలో లేని మోదీ, అమిత్ షా

ఘటన జరిగినప్పుడు రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, మంత్రులు ప్రహ్లాద్ జోషీ, అర్జున్‌రామ్ మేఘ్వాల్‌తో పాటు కాంగ్రెస్ సభ్యులు రాహుల్ గాంధీ, అధీర్ రంజన్ చౌధరి సహా మొత్తం 100 మందికి పైగా ఎంపీలు సభలో ఉన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా లేరు.




బుధవారం పార్లమెంట్ ఆవరణలో పొగ గొట్టాలు విసిరాక పోలీసుల నిర్బంధంలో నీలం, షిండే

ఎవరీ సింహా?

దుండగులకు విజిటర్స్ పాస్‌లు సిఫార్సు చేసిన బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహా మాజీ జర్నలిస్టు. కర్ణాటకలోని మైసూరు నుంచి రెండుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. ప్రధాని మోదీ జీవిత చరిత్ర రాశారు. పార్లమెంటు కార్యకలాపాలు చూస్తామంటూ మనోరంజన్ పాస్‌లు తీసుకున్నట్టు ఎంపీ కార్యాలయం తెలిపింది. ఇలా నియోజకవర్గాల ప్రజలకు ఎంపీలు పాస్‌లు జారీ చేయడం మామూలేనంది. తాజా ఘటన నేపథ్యంలో పార్లమెంటులోకి సందర్శకులకు పాస్‌ల జారీని నిలిపేశారు.



పబ్లిక్ గ్యాలరీ నుంచి సభలోకి దూకి బల్లపైకి ఎక్కిన వ్యక్తిని పార్లమెంట్ సభ్యులు పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్న దృశ్యం

అన్యాయంపై గొంతు ఎత్తేందుకే: నీలం

తానో నిరుద్యోగ విద్యార్థినని, తమకు ఎలాంటి సంస్థతోనూ సంబంధాలు లేవని పార్లమెంటు బయట పొగ గొట్టాలు విసిరిన నీలం చెప్పింది. రైతులు, చిన్న వ్యాపారులు, అణగారిన వర్గాల వారికి జరుగుతున్న అన్యాయంపై గొంతెత్తేందుకే నిరసన తెలిపామని వివరించింది. నీలం, షిండే ఇద్దరూ భారత్‌మాతా కీ జై, జై భీం అంటూ నినాదాలు చేశారు. బీఏ చదివిన షిండే పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నాడు. తల్లిదండ్రులు, ఇద్దరు సోదరులతో పాటు కూలీ పనులు కూడా చేసేవాడని మహారాష్ట్ర పోలీసులు తెలిపారు. ఆర్మీ రిక్రూట్‌మెంట్ కోసమని చెప్పి డిసెంబర్ 9న అతను ఢిల్లీ బయల్దేరినట్టు తల్లిదండ్రులు చెప్పారు.

తప్పు చేస్తే ఉరేయండి: మనోరంజన్ తండ్రి

మైసూరు: తన కొడుకు మంచివాడని మనోరంజన్ తండ్రి దేవరాజే గౌడ అన్నారు. తప్పు చేసుంటే అతన్ని ఉరి తీయాలని మైసూరులోని విజయనగరలో మీడియాతో అన్నారు. ''మనోరంజన్ 2014లో ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. ఉద్యోగంలో చేరకుండా పొలం పనులు చేసుకుంటూ బతికాడు. ఖర్చులకు కూడా నేనే డబ్బులిచ్చేవాన్ని. విప్లవ పుస్తకాలు చదివేవాడని, స్వామి వివేకానంద సాహిత్యం చదివేవాడు. ఒక్కడే కొడుకైనా ఇంకా పెళ్లి చేసుకోలేదు'' అన్నారు. ''మూడు రోజుల క్రితం తను ఇంటి నుంచి వెళ్లాడు. ఉదయమే ఫోన్‌లో మాట్లాడా'' అని తల్లి చెప్పారు. లక్నోకు మరో నిందితుడు సాగర్ శర్మ కూడా మైసూరులోని విజయనగరలోనే ఉంటున్నాడు.

గ్యాలరీకి వెళ్లాలంటే...

ఎంపీలు, జర్నలిస్టులు, సిబ్బంది మినహా ఇతరులెవరికీ పార్లమెంటులోకి అడుగు పెట్టే అవకాశముండదు. పార్లమెంటు కొత్త భవనాన్ని సందర్శించేందుకు గత సెప్టెంబర్ నుంచి సందర్శకులు భారీగా వస్తున్నారు. వారిని అనుమతించేందుకు పెద్ద ప్రక్రియే ఉంటుంది. పార్లమెంటు సభ్యుల సిఫార్సుపై వారికి విజిటర్స్ పాస్ ఇస్తారు. సదరు సందర్శకుడు తన బంధువు/వ్యక్తిగత మిత్రుడు/వ్యక్తిగతంగా తెలిసినవాడని, అతని పూర్తి బాధ్యత తనదేనని ఎంపీ స్పష్టం చేయాల్సి ఉంటుంది. తర్వాత సందర్శకుల నేపథ్యం, గుర్తింపు కార్డు తదితరాలను క్షుణ్నంగా తనిఖీ చేసి సెక్యూరిటీ క్లియరెన్స్ ఇచ్చాకే అనుమతిస్తారు.

మూడంచెల భద్రత

గ్యాలరీలోకి అనుమతించేలోపు సందర్శకులను పార్లమెంటు ప్రవేశ ద్వారం, భవనం లోపలి ఎంట్రీ గేటు, చివరగా గ్యాలరీ రూట్లోని కారిడార్... ఇలా మొత్తం మూడంచెల్లో మెటల్ డిటెక్టర్లతో తనిఖీ చేస్తారు. వీటన్నింటినీ దాటుకుని బుధవారం మనోరంజన్, సాగర్ ఏకంగా పొగ గొట్టాలనే గ్యాలరీలోకి తీసుకెళ్లడం పార్లమెంటు భద్రతా వ్యవస్థలో తీవ్ర లోపాలను తెరపైకి తెచ్చింది...

- వారికి నిజానికి కేవలం 45 నిమిషాల కోసమే పాస్ జారీ చేశారు.
- కానీ ఏకంగా రెండు గంటల పాటు గ్యాలరీలోనే ఉన్నట్టు తేలింది.
- సాధారణంగా విజిటర్స్‌ను గంటపాటే అనుమతిస్తారు.
- గడువు ముగుస్తుండగానే భద్రతా సిబ్బంది వారిని ఖాళీ చేయిస్తారు.
- కానీ బుధవారం గ్యాలరీ వద్ద సిబ్బందే లేరని, వారిని వేరే విధుల్లో వినియోగించారని చెబుతున్నారు.
- పార్లమెంటు భద్రత నిమిత్తం 301 మంది భద్రతా సిబ్బంది భర్తీకి అనుమతి ఉంది. కానీ ఈ నియామకాలు పదేళ్లుగా నిలిచిపోయినట్టు సమాచారం. దాంతో ప్రస్తుతం 176 మంది సిబ్బందే ఉన్నారు.

శిలాజ ఇంధనాలకు బైబై

- కాప్-28 సదస్సులో చరిత్రాత్మక ఒప్పందానికి ఆమోదం
- 2050 నాటికి నెట్‌జీరో ఉద్గారాలే లక్ష్యం
- భూగోళాన్ని కాపాడుకుంటేనే భవిష్యత్తు తరాలకు మనుగడ
- కాప్-28 అధ్యక్షుడు సుల్తాన్ అల్-జబేర్ స్పష్టీకరణ

దుబాయ్: హరిత గృహ వాయువుల ఉద్గారానికి, తద్వారా భూతాపానికి, భూగోళంపై ప్రకృతి విపత్తులకు, జీవకోటి మనుగడకు పెనుముప్పుగా పరిణమించిన శిలాజ ఇంధనాల వాడకానికి వీడ్కోలు చెప్పే దిశగా అడుగులు వేసేందుకు దాదాపు 200 దేశాలు అంగీకారానికి వచ్చాయి. ఈ మేరకు దుబాయ్‌లో జరుగుతున్న 'కాప్-28' సదస్సులో చరిత్రాత్మక ఒప్పందానికి అన్ని దేశాలు మద్దతు పలికాయి. 'శిలాజ ఇంధనాల వాడకం మానేద్దాం.. మార్పు సాధిద్దాం' అంటూ ప్రతిన బూనాయి. కాప్-28 సదస్సులో బుధవారం చివరి సెషన్ జరిగింది. శిలాజ ఇంధనాలకు వ్యతిరేకంగా కీలక ఒప్పందాన్ని సభ్యదేశాల ప్రతినిధులంతా ముక్తకంఠంతో ఆమోదించారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణం కరతాళ ధ్వనులతో మార్మోగింది. 2050 నాటికి నెట్‌జీరో(సున్నా) ఉద్గారాలే లక్ష్యంగా ఒప్పందంలో 8 సూత్రాల ప్రణాళికను జోడించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఈ ఏడాది కాప్ సదస్సులో చెప్పుకోదగ్గ తీర్మానాలేవీ ఉండబోవన్న అనుమానాలు పటాపంచలయ్యాయి. భూగోళాన్ని కాపాడుకుంటేనే భవిష్యత్తు తరాలకు మనుగడ ఉంటుందని కాప్-28 అధ్యక్షుడు సుల్తాన్ అల్-జబేర్ తేల్చిచెప్పారు. పారిస్ ఒప్పందాన్ని పరిగణనలోకి తీసుకుంటూ, ఉష్ణోగ్రతల పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేయాలని, ఇందుకోసం ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా పని చేయాలని, పటిష్టమైన, నిర్మాణాత్మక చర్యలకు శ్రీకారం చుట్టాలని కాప్-28 సదస్సు పిలుపునిచ్చింది. ప్రమాదకరమైన గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాన్ని గణనీయంగా తగ్గించాల్సిన బాధ్యత అన్ని దేశాలపైనా ఉందని స్పష్టం చేసింది.

కాప్-28 టాప్ 10

1. చరిత్రాత్మక శిలాజ ఇంధన ఒప్పందంతో కాప్-28 సదస్సు ముగిసింది. ఇలాంటి కాలుష్య ఇంధనాల వాడకాన్ని క్రమంగా నిలిపివేయడానికి ప్రపంచ దేశాలు అంగీకరించాయి. పెట్రోల్, డీజిల్, బొగ్గు వినియోగం అంతమయ్యే దిశగా అడుగులు పడ్డాయని చెప్పొచ్చు.
2. సంపన్న దేశాల నిర్వాకం వల్లే వాతావరణ మార్పులు సంభవిస్తున్నాయి. వాటి వల్ల పేద దేశాలు నష్టపోతున్నాయి. పేద దేశాలకు వాటిల్లుతున్న నష్టానికి గాను బడా దేశాలు పరిహారం ఇవ్వాలన్న ప్రతిపాదన చాలాఏళ్లుగా ఉంది. ఈ సదస్సులో దానికి కార్యరూపం వచ్చింది. వాతావరణ మార్పుల వల్ల నష్టపోయే పేద దేశాలకు ఆర్థిక సాయం అందించడం కోసం ఒక ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయడానికి ఆమోదం లభించింది.
3. నిర్దేశిత గడువు కంటే నెట్‌జీరో కర్బన ఉద్గారాల లక్ష్యాన్ని సాధిస్తామని కెనడా, బెల్జియం వంటి దేశాలు ప్రకటించాయి. 2030 నాటికి ఉద్గారాలను 50 శాతం తగ్గించుకుంటామని దుబాయ్ వెల్లడించింది.
4. 2030 కంటే ముందే గ్రీన్‌హౌజ్ వాయువుల ఉద్గారాన్ని అరికట్టడానికి శుద్ధ ఇంధనాల వనరుల వాడకాన్ని గణనీయంగా పెంచుకోవాలని నిర్దేశించారు.
5. క్లైమేట్ యాక్షన్ కోసం సంపన్న దేశాల నుంచి నిధులను, సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చెందుతున్న దేశాలకు బదిలీ చేయాలన్న ప్రతిపాదనపై చర్చలు జరిగాయి.
6. జీవ వైవిధ్యానికి, మానవళికి ఎలాంటి హాని కలగకుండా వాతావరణ మార్పుల నియంత్రణకు కార్యాచరణ ప్రణాళిక చేపట్టాలని నిర్దేశించారు.
7. ప్రస్తుతం అమల్లో ఉన్న పారిస్ ఒప్పందం లక్ష్యాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా శిలాజ ఇంధనాల వినియోగం, ఉత్పత్తిని తగ్గించుకోవాలని ఆదేశించారు.
8. పర్యావరణ పరిరక్షణ కోసం గ్రీన్ క్లైమేట్ ఫండ్ తరహాలో క్లైమేట్ ఫైనాన్స్, సపోర్టింగ్ ఫండ్స్ ఏర్పాటు చేయాలన్న ఆలోచనకు కొన్నిదేశాలు, సంస్థలు మద్దతు ప్రకటించాయి.
9. కాప్-26 సదస్సు ఫలితాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత కర్బన్ ఉద్గారాల సమాచారాన్ని నమోదు చేసే విషయంలో నిబంధనలు సవరించారు.
10. అన్ని దేశాల, అన్ని వర్గాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని శిలాజ ఇంధనాల నుంచి ఇతర ప్రమాద రహిత ఇంధనాల వైపు క్రమానుగతంగా మారాలని సూచించారు.

చేతలు కావాలి: బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తిని తగ్గించుకోవాలని గతంలో జరిగిన కాప్ సదస్సుల్లో ప్రత్యేకంగా సూచించారు. ఈసారి మాత్రం ఈ ప్రస్తావన లేకపోవడం గమనార్హం. బొగ్గుతో విద్యు త్‌ను ఉత్పత్తి చేయడంలో ప్రపంచంలో చైనా, భారత్ ముందంజలో ఉన్నాయి. తమ విద్యుత్ అవసరాలు తీర్చుకోవడానికి బొగ్గుపై ఆధారపడుతున్నాయి. ఉష్ణోగ్రతల పెరుగుదలను నియంత్రించడానికి బుధవారం ఆమోదించిన ఒప్పందమే అతిపెద్ద కార్యాచరణ ప్రణాళిక అని సుల్తాన్ అల్-జబేర్ అన్నారు.

ఇజ్రాయెల్‌పై బైడెన్ అసంతృప్తి!

వాషింగ్టన్: గాజాలో పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న దండయాత్రను అమెరికా అధ్యక్షుడు బైడెన్ తొలిసారిగా తప్పుబట్టారు. బుధవారం వాషింగ్టన్‌లో నిధుల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఇజ్రాయెల్ యుద్ధరీతిపై బైడెన్ మాట్లాడారు. '' ఇజ్రాయెల్ భద్రత అనేది అమెరికాతో ముడిపడి ఉంది. ఇన్నాళ్లు ఐరోపా సమాఖ్య, యూరప్ దేశాలూ ఇజ్రాయెల్‌కు మద్దతుగా నిలబడ్డాయి. కానీ ఇప్పుడా పరిస్థితి నెమ్మదిగా మారుతోంది. గాజాపై ఇజ్రాయెల్ చేస్తున్న విచక్షణారహిత బాంబుదాడులే ఇందుకు ప్రధాన కారణం. మరి ఈ విషయం ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు తెలుసో తెలీదో. గాజావ్యాప్తంగా ఇళ్లలో ఉన్న సాధారణ ప్రజానీకాన్ని చిదిమేస్తూ భవనాలపై దారుణ బాంబింగ్ కొనసాగుతోంది. ఈ దాడుల పర్వం మరికొన్ని వారాలు, నెలలపాటు కొనసాగుతుందని ఇజ్రాయెల్ సైన్యాధికారులే చెబుతున్నారు. అమాయక పాలస్తీనియన్ల భద్రత ఇప్పుడు ప్రమాదంలో పడింది'' అని ఇజ్రాయెల్ భీకర గగనతల, భూతల దాడులను బైడెన్ ఆక్షేపించారు. ఈ విషయమై అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సలీవాన్ ఈ వారమే ఇజ్రాయెల్‌లో పర్యటించి భారీ దాడులకు ఎప్పుడు చరమగీతం పాడుతారనే దానిపై ఒక హామీ తీసుకోనున్నారు. '' 2001 సెప్టెంబర్ 11 దాడుల తర్వాత అమెరికా అఫ్గానిస్తాన్‌లో యుద్ధానికి దిగింది. అమెరికా చేసిన ఇలాంటి అతి 'స్పందన' తప్పిదాల నుంచి ఇజ్రాయెల్ ఏమీ నేర్చుకున్నట్లు కనిపించట్లేదు. ఇది ఇలాగే కొనసాగితే అంతర్జాతీయ మద్దతును ఇజ్రాయెల్ కోల్పోతుంది'' అని బైడెన్ హెచ్చరించారు. బైడెన్ వ్యాఖ్యలపై హమాస్ సాయుధసంస్థ ప్రతినిధి బీరుట్ నగరంలో మాట్లాడారు. ''ఈ యుద్ధ విపరిణామాలు ఇజ్రాయెల్‌లో త్వరలోనే కనిపిస్తాయి. అమెరికాలో అధ్యక్ష ఎన్నికల తర్వాత శ్వేతసౌధంలో బైడెన్ సీటు గల్లంతవుతుంది'' అని హమాస్ రాజకీయవిభాగం నేత ఒసామా హమ్దాన్ వ్యాఖ్యానించారు.



ఛత్తీస్ సీఎంగా విష్ణుదేవ్ ప్రమాణం



మోహన్ యాదవ్‌ను అభినందిస్తున్న ప్రధాని మోదీ

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ సీఎంలుగా మోహన్ యాదవ్, విష్ణుదేవ్ ప్రమాణం

భోపాల్/రాయ్‌పూర్: మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా మోహన్ యాదవ్, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిగా విష్ణుదేవ్ సాయి బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని లాల్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ మంగూభాయి పటేల్ సీఎంగా మోహన్ యాదవ్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే ఉప ముఖ్యమంత్రులుగా జగదీష్ దేవ్‌డా, రాజేంద్ర శుక్లా ప్రమాణం చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మోహన్ యాదవ్ ఉజ్జయిని సౌత్ స్థానం నుంచి బీజేపీ టికెట్‌పై ఎమ్మెల్యేగా గెలుపొందిన సంగతి తెలిసిందే. సీఎంగా ప్రమాణ స్వీకారం అనంతరం ఆయన మాట్లాడారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి, ఉపాధి కల్పనకు పెద్దపీట వేస్తానని చెప్పారు. అలాగే ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో సీఎంగా విష్ణుదేవ్ సాయితో రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఉప ముఖ్యమంత్రులుగా అరుణ్ సావో, విజయ్ శర్మ ప్రమాణం చేశారు. మోహన్ యాదవ్, విష్ణుదేవ్ సాయి ప్రమాణం స్వీకారోత్సవంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తదితరులు పాల్గొన్నారు.

వారి త్యాగాలకు దేశం రుణపడింది

2001 పార్లమెంట్‌పై దాడిలో అమరులకు రాష్ట్రపతి నివాళులు

న్యూఢిల్లీ: ఇరవై రెండేళ్ల క్రితం పార్లమెంట్‌పై దాడి ఘటనలో అమరులైన భద్రతాబలగాలకు దేశం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వ్యాఖ్యానించారు. బుధవారం పార్లమెంట్ దాడి మృతులకు ఆమె నివాళులర్పించారు. '' ప్రజాస్వామ్య దేవాలయంపైనే దాడికి తెగబడి అత్యున్నత స్థాయి రాజకీయనేతలను అంతం చేయాలని ఉగ్రవాదులు హేయమైన కుట్రపన్నారు. ఆ కుట్రను భారత భద్రతాబలగాలు వమ్ముచేసి ఆ క్రమంలో ప్రాణత్యాగంచేశాయి. ఆ ధైర్యశాలులకు నా నివాళులు. మాతృభూమి కోసం మీరు చేసిన ప్రాణత్యాగానికి దేశం సదా రుణపడి ఉంటుంది. ఉగ్రవాదాన్ని అంతమొందించేందుకు సిద్ధమని అందరం ప్రతినబూనుదాం'' అని సామాజిక మాధ్యమ ఖాతా 'ఎక్స్'లో ట్వీట్‌చేశారు. మానవాళికి ముప్పుగా పరిణమించిన ఉగ్రవాదం ఏ దేశంలో ఏ రూపంలో ఉన్నాసరే దానిని సమూలంగా తుదముట్టించాలని వ్యాఖ్యానించారు. ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కాంగ్రెస్ నేత సోనియా గాంధీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, ప్రహ్లాద్ జోషి, పియూష్ గోయల్, జితేంద్ర సింగ్, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, బుధవారం పార్లమెంట్ ప్రాంగణంలో అమరులకు నివాళులర్పించారు. అమరుల త్యాగాన్ని భారత్ సదా స్మరించుకుంటుందని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అన్నారు.

త్యాగాలు చిరస్థాయిగా నిలిచిపోతాయి: ప్రధాని

పార్లమెంట్‌లో అమరులకు బుధవారం ప్రధాని మోదీ సైతం నివాళులర్పించారు. '' దాడిలో ప్రాణాలు కోల్పోయిన వీరోచిత భద్రతా సిబ్బందికి నా హృదయపూర్వక నివాళులు. ఆపత్కాలంలో తెగువ చూపిన వారి త్యాగాలను యావత్ దేశం చిరస్థాయిగా గుర్తుంచుకుంటుంది'' అని మోదీ వ్యాఖ్యానించారు. అమరులకు లోక్‌సభ నివాళులర్పించింది. లోక్‌సభ కార్యకలా పాలు బుధవారం మొదలవగానే స్పీకర్ బిర్లా మాట్లాడారు. ' ఉగ్రవాదులతో పోరాటంతో ప్రాణాలు కోల్పోయిన భద్రతా బలగాల కుటుంబాలకు భారత ప్రభుత్వం అండగా ఉంటుంది. ఉగ్రవాదంపై భారత పోరు కొనసాగుతుంది'' అని అన్నారు. ఈ సందర్భంగా సభ్యులంతా లేచి నిల్చొని కొద్దిసేపు మౌనం పాటించారు.

మళ్లీ ఎన్డీఏనే!

- లోక్‌సభకు ఇప్పటికిప్పుడు ఎన్నికలొస్తే 323 సీట్లు
- ఇండియా కూటమికి 163
- టైమ్స్ నౌ-ఈటీజీ పోల్ వెల్లడి

న్యూఢిల్లీ: ఇప్పటికిప్పుడు లోక్‌సభకు ఎన్నికలు జరిగితే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమి హ్యాట్రిక్ కొడుతుందని టైమ్స్ నౌ నవజీవన్, ఈటీజీ ఒపీనియన్ పోల్ బుధవారం వెల్లడించింది. మొత్తం 543 స్థానాల్లో ఎన్డీఏ కూటమికి ఏకంగా 323 సీట్లొస్తాయని అంచనా వేసింది. విపక్ష ఇండియా కూటమి 163 సీట్లకు పరిమితమవుతుందని చెప్పింది. ఇతర ప్రాంతీయ పార్టీలన్నీ కలిపి 57 స్థానాలు దక్కించుకుంటాయని వెల్లడించింది. ముఖ్యంగా ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించిన మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోనైతే ఆ పార్టీ దాదాపుగా క్లీన్‌స్వీప్ చేస్తుందని తెలిపింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి 354 సీట్లు రావడం తెలిసిందే. కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏకు 93 సీట్లు రాగా ఇతరులకు 96 దక్కాయి.

'గాజా'పై ఐరాసలో ముసాయిదా తీర్మానం

అనుకూలంగా ఓటు వేసిన భారత్

ఐక్యరాజ్యసమితి: గాజా స్ట్రిప్‌లో వెంటనే కాల్పుల విరమణ పాటించాలని, హమాస్ మిలిటెంట్ల చెరలో ఉన్న బందీలను తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని, పాలస్తీనియన్లకు మానవతా సాయం అందించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఐక్యరాజ్య సమితి సాధారణ సభలో తాజాగా ఒక ముసాయిదా తీర్మానాన్ని ఈజిప్టు ప్రవేశపెట్టింది. సభలో మొత్తం 193 సభ్యదేశాలు ఉండగా, భారత్ సహా 153 దేశాలు ఈ తీర్మానానికి అనుకూలంగా ఓటు వేశాయి. 10 దేశాలు వ్యతిరేకంగా ఓటు వేశాయి. 23 దేశాలు గైర్హాజరయ్యాయి. గాజాలో ఇజ్రాయెల్ దాడులు నానాటికీ ఉధృతం అవుతుండడం, నిత్యం పదుల సంఖ్యలో జనం మరణిస్తుండడంతో తాజా పరిస్థితిపై చర్చించడానికి ఐరాస సాధారణ సభ అత్యవసర ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముసాయిదా తీర్మానాన్ని ఆస్ట్రియా, ఇజ్రాయెల్, అమెరికా తదితర దేశాలు వ్యతిరేకించాయి.

మహాదేవ్ యాప్ 'రవి' అరెస్టు

న్యూఢిల్లీ: సంచలనం సృష్టించిన మహాదేవ్ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ యజమాని రవి ఉప్పల్ (43)ను దుబాయ్ పోలీసులు గత వారం అదుపులోకి తీసుకున్నట్లు ఈడీ అధికారులు బుధవారం వెల్లడించారు. అతడిని భారత్‌రప్పించి విచారిస్తామని తెలిపారు.

క్లుప్తంగా...

రాష్ట్రంలో గంజాయి సాగు నేలమట్టం చేశాం

- సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి
- డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, పక్కన సీపీ క్రాంతిరాణా టాటా తదితరులు

జగ్గయ్యపేట: రాష్ట్రంలో గంజాయి సాగును పూర్తిగా నేలమట్టం చేశామని ఏపీ డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు సమీపంలోని రామ్‌కో సిమెంట్ గెస్ట్‌హౌస్‌లో జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో బుధవారం రాత్రి నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైజాగ్ ప్రాంతం నుంచి గంజాయి సరఫరా అవుతున్నట్టు గ్రహించి పంటను పూర్తిగా ధ్వంసం చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు తగ్గాయని, ఇది మంచి పరిణామమని అన్నారు. అందుకు సర్వే కూడా నిర్వహించి ఎక్కువ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకున్నామన్నారు. సైబర్ నేరాలు కొంత పెరిగాయని వాటి నియంత్రణకు పోలీస్ స్టేషన్లలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామన్నారు. సోషల్ మీడియాల్లో అసభ్యకరమైన పోస్టింగ్‌లు పెడితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడమే కాకుండా అదే సోషల్ మీడియాల్లో ఆ కేసుకు సంబంధించిన వివరాలను కూడా ప్రచారం చేస్తామన్నారు. రాష్ట్రంలో స్పందన, దిశ యాప్ కార్యక్రమాలు మహిళల రక్షణకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో విజయవాడ పోలీస్ కమిషనర్ క్రాంతి రాణా టాటా, అర్బన్, రూరల్ డీసీపీలు విశాల్ గున్ని, అజితా వేజండ్ల, అడ్మిన్ డీసీపీ సత్తిబాబు పాల్గొన్నారు.

పింఛను వివాదానికి లోకాయుక్త పరిష్కారం

వృద్ధురాలికి బకాయిలు, పింఛను అందజేత

కర్నూలు(సెంట్రల్): అరవై ఏళ్లుగా ఫ్యామిలీ పింఛను కోసం ఎదురు చూస్తున్న ఓ వృద్ధురాలికి లోకాయుక్త పరిష్కారం చూపింది. పింఛను మంజూరు చేసి బకాయిపడ్డ రూ.25 లక్షలతో పాటు నెలకు రూ.15 వేల పింఛను అందుకునేలా ఆదేశాలు ఇచ్చింది. వివరాల్లోకి వెళితే... తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు చెందిన బి.శేషగిరిరావు రోడ్లు, భవనాల శాఖలో అసిస్టెంట్ ఇంజినీరుగా పనిచేసేవారు. 1962 ఫిబ్రవరి 6న ప్రమాదవశాత్తు చనిపోయారు. భర్త మరణించడంతో పింఛను మంజూరు చేయాలని ఆయన భార్య బి.కృష్ణవేణి అప్పట్లో అధికారులను కోరారు. అయితే ఆమె భర్త సర్వీసు రికార్డు లేకపోవడంతో అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆమెకు న్యాయం చేయలేకపోయారు. దీంతో 2022లో కృష్ణవేణి లోకాయుక్తను ఆశ్రయించి 60 ఏళ్లుగా కుటుంబ పింఛను మంజూరు చేయడంలేదని ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన లోకాయుక్త చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి ఆ జిల్లా కలెక్టర్, ఆర్‌అండ్‌బీ, ట్రెజరీ శాఖల అధికారులకు నోటీసులిచ్చారు. సర్వీసు రికార్డు లేవని అధికారులు నివేదించగా, కొత్తగా సర్వీసు రికార్డును రాయాలని చైర్మన్ ఆదేశించారు. కొత్త సర్వీసు రికార్డు రాసిన అనంతరం, ఇటీవల ఆమెకు పింఛను మంజూరైంది. 1962 నుంచి ఇప్పటి వరకు రూ.25 లక్షల పింఛను బకాయిలను మంజూరు చేశారు. ఇన్‌కమ్ ట్యాక్స్ మినహాయించుకుని మిగిలిన రూ.15.70 లక్షలను కాకినాడ ట్రెజరీ అధికారులు చెల్లించారు. ఆమెకు నెలకు రూ.15 వేల ప్రకారం పింఛను కూడా చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు లోకాయుక్తకు నివేదించగా చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి కేసు మూసివేశారు. తనకు పెన్షన్‌ను మంజూరు చేసేందుకు కృషిచేసిన లోకాయుక్తకు వృద్ధురాలు బి.కృష్ణవేణి కృతజ్ఞతలు తెలిపారు.

జగనన్న పథకాలతో పేద విద్యార్థులకు ఉన్నత చదువులు

విద్యార్థుల మాటలతో లోకేశ్ అవాక్కు



విద్యార్థులతో మాట్లాడుతున్న లోకేశ్

నక్కపల్లి /ఎస్.రాయవరం (అనకాపల్లి జిల్లా): జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విద్యాదీవెన, విద్యావసతి వంటి పథకాల వల్ల తమలాంటి పేద విద్యార్థులు ఎంతోమంది ఉన్నత చదువులు చదువుకుంటున్నారని, వీటిని మీరు కూడా కొనసాగిస్తారా? అని టీడీపీ నేత నారా లోకేశ్‌ను పలువురు విద్యార్థులు ప్రశ్నించారు. అనకాపల్లి జిల్లాలో లోకేశ్ చేస్తున్న యువగళం పాదయాత్ర మూడో రోజు ఎస్.రాయవరం మండలంలో కొనసాగింది. అడ్డురోడ్డు జంక్షన్‌లో లోకేశ్‌కు స్వాగతం పలికేందుకు టీడీపీ నేతలు అడ్డురోడ్డులో ఉన్న ఒక టీడీపీ నాయకుడికి చెందిన విద్యాసంస్థ నుంచి విద్యార్థులను తీసుకువచ్చారు. లోకేశ్‌ను పలువురు విద్యార్థులు కలిశారు. జగనన్న ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్, జగనన్న విద్యాదీవెన, జగనన్న విద్యావసతి దీవెన పథకాలను అమలు చేస్తోందని, ఈ పథకాలను ఉపయోగించుకుంటూ వేలాది మంది విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకుంటున్నారని చెప్పారు. మీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఈ పథకాలు కొనసాగిస్తారా? తప్పకుండా కొనసాగించాలి. మధ్యలో ఆపేయడానికి వీల్లేదంటూ విద్యార్థులు అడిగారు. దీంతో అవాక్కయిన లోకేశ్.. వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా నవ్వుతూ వెళ్లిపోయారు.

ప్రభుత్వ బడి పిల్లలకు ట్యాబ్‌లు సిద్ధం

21న విద్యార్థులకు 4.30 లక్షలు పంపిణీ

- గతేడాది కంటే ఎక్కువ సామర్థ్యం ఉన్నవి కొనుగోలు
- 8, 9, 10 తరగతుల పాఠ్యాంశాలు అప్‌లోడ్
- ఈసారి డౌట్ క్లియరెన్స్ యాప్, ఈ–డిక్షనరీ అదనం
- ఇప్పటికే జిల్లాలకు చేరిక.. రెండు మూడు రోజుల్లో హైస్కూళ్లకు
- నాడు–నేడు రెండో దశ హైస్కూళ్లలో 30 వేల ఐఎఫ్‌పీలు కూడా..



సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థులకు మరింత మెరుగైన సదుపాయాలతో ట్యాబ్‌ల పంపిణీకి సర్వం సిద్ధమైంది. వీటిని ఈ నెల 21న విద్యార్థులకు అందించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గతేడాది కంటే మెరుగైన సామర్థ్యం ఉన్న ట్యాబ్‌లను ఎంపిక చేసి, వాటిలో ఎనిమిదో తరగతితోపాటు 9, 10 తరగతుల పాఠ్యాంశాలను చేర్చారు. గత విద్యా సంవత్సరం ఎనిమిదో తరగతి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం 5,18,740 ట్యాబ్‌లను బైజూస్ కంటెంట్‌తో పంపిణీ చేసింది. ఈ ఏడాది 4.30 లక్షల ట్యాబ్‌ల పంపిణీకి టెండర్లు పిలవగా శాంసంగ్, ఏసర్, మార్క్ వ్యూ, లావా సంస్థలు ముందుకు వచ్చాయి. ఆయా సంస్థల నుంచి 2.50 లక్షల యూనిట్లు విజయవాడలోని స్టాక్ పాయింట్‌కు చేరాయి. మరో 1.80 లక్షల యూనిట్లు ఈ వారంలో అందనున్నాయి. ఇప్పటిదాకా వచ్చిన ట్యాబ్‌ల్లో అధికారులు సాంకేతిక అంశాలను పరిశీలించారు. వీటిని మంగళవారం ప్రాంతీయ సంయుక్త అధికారుల కార్యాలయాలకు తరలించారు. రెండు, మూడు రోజుల్లో ఇవి ఉన్నత పాఠశాలలకు చేరనున్నట్టు పాఠశాల విద్యాశాఖ మౌలిక సదుపాయాల కల్పన కమిషనర్ కాటమనేని భాస్కర్ 'సాక్షి'కి తెలిపారు. అలాగే ఉన్నత పాఠశాలల్లో డిజిటల్ బోధన కోసం అందిస్తున్న ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు (ఐఎఫ్‌పీ)ను సైతం రెండో దశ నాడు–నేడు పనులు పూర్తయిన స్కూళ్లల్లో బిగించనున్నారు. రెండో దఫాలో 30 వేల ఐఎఫ్‌పీలు, 22 వేల స్మార్ట్ టీవీలు ఈ నెల 21 నాటికి స్కూళ్లకు చేరనున్నాయి.

అన్ని ట్యాబ్‌ల్లో 'డ్యులింగో' యాప్

పేదింటి పిల్లలు అంతర్జాతీయంగా రాణించేందుకు, విదేశాల్లో సైతం విజయవంతమైన కెరీర్‌ను అందుకునేందుకు వీలుగా ప్రభుత్వ పాఠశాలల్లో విదేశీ భాషలను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు ఉపాధ్యాయులకు కూడా వివిధ భాషల్లో శిక్షణ ఇవ్వాలని ఇటీవల విద్యాశాఖ అధికారులు హైదరాబాద్‌లోని ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ) అధికారులతో చర్చించారు. ఈ క్రమంలో విదేశీ భాషలు అందించే యాప్ 'డ్యులింగో'ను ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఇవ్వనున్న ట్యాబ్‌ల్లో ఇన్‌స్టాల్ చేశారు. గత డిసెంబర్‌లో ఇచ్చిన 5,18,740 ట్యాబ్‌లతోపాటు ఈ ఏడాది ఇవ్వనున్న 4.30 లక్షల ట్యాబ్‌ల్లోనూ ఈ డ్యులింగ్ యాప్ అందుబాటులోకి రానుంది. దీని ద్వారా విద్యార్థులు సులభంగా విదేశీ భాషలు నేర్చుకునే వీలుంది.

మరింత మెరుగ్గా..

గతేడాది ఎనిమిదో తరగతి విద్యార్థులకు 8.7 అంగుళాల తెర, 3 జీబీ ర్యామ్, 32 జీబీ రోమ్, 64 జీబీ ఎస్డీ కార్డు గల ట్యాబ్‌లను అందించారు. వాటిలో అదే తరగతి పాఠ్యాంశాలను అప్‌లోడ్ చేశారు. అయితే, ఈ ఏడాది ట్యాబ్‌ల సామర్థ్యం పెంచడంతోపాటు అదనపు తరగతుల డిజిటల్ పాఠాలను సైతం అప్‌లోడ్ చేయడం విశేషం. వచ్చే వారం విద్యార్థులకు ఇచ్చే ట్యాబ్‌లు 8.7 అంగుళాల తెర, 4 జీబీ ర్యామ్, 64 జీబీ రోమ్, 256 జీబీ ఎస్డీ కార్డుతో ఉండనున్నాయి. వీటిలో ఎనిమిదో తరగతితోపాటు 9, 10 తరగతుల బైజూస్ ఈ–కంటెంట్‌ను సైతం అప్‌లోడ్ చేశారు. అంతేకాకుండా విద్యార్థుల కొచ్చే సందేహాలను నివృత్తి చేసేలా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో పనిచేసే డౌట్ క్లియరెన్స్ యాప్ 'ఈ–ట్యూటర్'ను కూడా అందుబాటులో ఉంచారు. అలాగే భవిష్యత్తులో విద్యార్థులకు ఇంటర్మీడియట్ పాఠాలను సైతం అప్‌లోడ్ చేసేంత స్పేస్ కూడా ఈ ట్యాబ్‌ల్లో ఉంది.

ఉన్నత తరగతులకు కూడా ఉపయోగపడేలా..



ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. విద్యార్థులతోపాటు పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు కూడా వీటిని అందిస్తాం. ఇప్పటికే దాదాపు 2.50 లక్షల యూనిట్లు అందాయి. వారంలోగా మొత్తం 4.30 లక్షల ట్యాబ్‌లు స్కూళ్లకు చేరతాయి. ఈసారి ట్యాబ్‌ల సామర్థ్యం పెంచాం. అంతేకాకుండా 8, 9, 10 తరగతుల ఈ–కంటెంట్‌తోపాటు డౌట్ క్లియరెన్స్ యాప్‌ను, ఈ–డిక్షనరీని కూడా అప్‌లోడ్ చేశాం. కొత్త ట్యాబ్‌ల్లో భవిష్యత్తులో ఇంటర్మీడియట్ పాఠాలను సైతం అప్‌లోడ్ చేయొచ్చు. విద్యార్థులు పై తరగతులకు వెళ్లినప్పుడు పాత పాఠాలను తొలగించి కొత్త కంటెంట్‌ను అప్‌లోడ్ చేస్తాం.

– కాటమనేని భాస్కర్, కమిషనర్, పాఠశాల విద్య నాడు–నేడు మౌలిక వసతుల కల్పన

30 వేల ఐఎఫ్‌పీలు, 22 వేల స్మార్ట్ టీవీలు..

గతేడాది ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సెక్షన్‌కు ఒకటి చొప్పున 30,715 ఐఎఫ్‌పీ స్క్రీన్లను అందుబాటులోకి తెచ్చారు. అలాగే ప్రాథమిక పాఠశాలల్లో 60 మంది విద్యార్థులకు ఒక స్మార్ట్ టీవీ చొప్పున 10,038 స్మార్ట్ టీవీలను సరఫరా చేశారు. ఈ ఏడాది 30 వేల ఐఎఫ్‌పీలు, 22 వేల స్మార్ట్ టీవీలను ఈ నెల 21 నాటికి అందుబాటులోకి తేనున్నారు.

500 కిలోల గంజాయి పట్టివేత

'పుష్ప' తరహాలో బెంగళూరు తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు

చిలమత్తూరు: కర్ణాటక రాజధాని బెంగళూరుకు మత్తుపదార్థాలు రవాణా చేస్తున్న ఓ కంటైనర్ వాహనాన్ని బుధవారం 44వ నంబరు జాతీయ రహదారిపై శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం కొడికొండ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కంటైనర్‌లో గంజాయి రవాణా చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ మాధవరెడ్డికి సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు హిందూపురం డీఎస్పీ కంజాక్షన్ ఆధ్వర్యంలో చిలమత్తూరు, లేపాక్షి పోలీసులు కొడికొండ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అనంతపురం వైపు నుంచి వచ్చిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన కంటైనర్‌ను తనిఖీ చేశారు. మొదట అందులో ఏమీ కనిపించలేదు. లేపాక్షి ఎస్‌ఐ గోపీ ఆలోచన మేరకు తనిఖీలు చేపట్టగా.. సినీఫక్కీలో గంజాయి అక్రమ రవాణా బయటపడింది. 'పుష్ప' సినిమాలో పాలవ్యానును రెండు భాగాలుగా మార్చి ఎర్రచందనం తరలించిన తరహాలో.. కంటైనర్‌లో డ్రైవర్ సీటు వెనుక భాగం నుంచి పై భాగంలో ఒక తలుపును గుర్తించారు. దాన్ని తీసి చూడగా పైన 500 కిలోలకు పైగా గంజాయి బయటపడింది. దీనివిలువ కనీసం రూ.కోటి ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు.

నూతన సంవత్సర వేడుకల కోసం

బెంగళూరు నగరంలో జరిగే నూతన సంవత్సర వేడుకల్లో యువతే లక్ష్యంగా గంజాయి తరలిస్తున్నట్టు తెలిసింది. పోలీసులను తప్పుదారి పట్టించేందుకు 'పోలీసు' అని రాసి ఉన్న ఇన్నోవా వాహనం వెనుకగా కంటైనర్ నడపసాగారు. కంటైనర్‌ను పోలీసులు ఆపిన వెంటనే 'పోలీసు' అని రాసి ఉన్న ఇన్నోవా వాహనాన్ని డ్రైవర్ వేగంగా పోనిచ్చాడు. చిలమత్తూరు ఎస్‌ఐ ఆ వాహనాన్ని వెంబడించి దేమకేతేపల్లి వద్ద స్వాధీనం చేసుకున్నారు. అందులోని ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వాహనాలను చిలమత్తూరు పోలీసుస్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. విశాఖ ఏజెన్సీ నుంచి గంజాయి వచ్చినట్టుగా పోలీసులు అనుమానిస్తున్నారు. విచారణ అనంతరం పూర్తివివరాలు తెలియజేస్తామని డీఎస్పీ కంజాక్షన్ తెలిపారు.

'వాణిజ్య' ఎగుమతుల్లో దూకుడు

- రాష్ట్ర ఎగుమతుల్లో 2.77 శాతం వృద్ధి నమోదు
- దేశ ఎగుమతుల్లో 4.88 శాతం వాటాతో ఐదో స్థానంలో నిలిచిన ఏపీ
- 2030 నాటికి టాప్–3 లక్ష్యంగా అడుగులు
- సత్ఫలితాలిస్తున్న సీఎం జగన్ నిర్ణయాలు

సాక్షి, అమరావతి: వాణిజ్య ఉత్పత్తుల ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ మరోసారి సత్తా చాటింది. ఈ ఆర్థిక సంవత్సరం (2023–24) మొదటి ఆరు నెలల్లో దేశ వ్యాప్తంగా వాణిజ్య ఉత్పత్తుల ఎగుమతులు తగ్గినా రాష్ట్ర ఎగుమతుల్లో మాత్రం 2.77 శాతం వృద్ధి నమోదైంది. గతేడాది ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది ఆరు నెలల కాలంలో రాష్ట్ర వాణిజ్య ఎగుమతుల విలువ రూ.82,732.65 కోట్ల నుంచి రూ.85,021.74 కోట్లకు చేరింది. ఇదే సమయంలో దేశ వ్యాప్తంగా ఎగుమతుల విలువ రూ.18,17,640.99 కోట్ల నుంచి రూ.17,42,429.99 కోట్లకు పడిపోయింది. ఎగుమతుల విలువ పరంగా చూస్తే ఏపీకంటే అగ్రభాగాన ఉన్న కర్ణాటక –9.06, గుజరాత్ –7.91, మహారాష్ట్ర –7.04 శాతం మేర క్షీణించడం గమనార్హం. 2022–23 ఆర్థిక సంవత్సరం మొత్తం మీద రాష్ట్రం రూ.1,59,368.02 కోట్ల ఉత్పత్తులు ఎగుమతులు చేయడం ద్వారా 4.40 శాతం వాటాతో ఆరో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో రూ.85,021.74 కోట్ల ఎగుమతులు చేయడం ద్వారా దేశ ఎగుమతుల్లో రాష్ట్ర వాటాను 4.88 శాతానికి పెంచుకొని ఐదో స్థానానికి ఎగబాకింది. ఎగుమతుల్లో 2030 నాటికి 10 శాతం మార్కెట్ వాటాతో టాప్ 3 రాష్ట్రాల్లో ఒకటిగా నిలబడేలా రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుని దానికి అనుగుణంగా పలు కీలక చర్యలు తీసుకుంటోంది. దేశంలో ఏక్కడా లేని విధంగా రూ.20,000 కోట్లతో నాలుగు గ్రీన్ ఫీల్డ్ పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లను అభివృద్ధి చేస్తోంది. ఇందులో రామాయపట్నం పోర్టు ఈ ఏడాది చివరికి, మిగిలిన మూడు పోర్టులు 2025 నాటికి అందుబాటులోకి రానున్నాయి. ఎగుమతుల ప్రోత్సాహానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను నీతి ఆయోగ్ కూడా ప్రశంసించింది. 2022 సంవత్సరానికి నీతి ఆయోగ్ ప్రకటించిన ఎగుమతి సన్నద్ధత రాష్ట్రాల్లో రాష్ట్రం 59.27 పాయింట్లతో 8వ స్థానంలో నిలిచింది. ఇందులో భాగంగానే వాణిజ్య ఎగుమతులు పెంచడం ద్వారా రాష్ట్రంలో ఉపాధి అవకాశాలను పెంచే విధంగా సీఎం వైఎస్ జగన్ చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి.

'వ్యవసాయ' ఎగుమతుల్లో ఏపీ నాలుగో స్థానం

ఈ ఆర్థిక సంవత్సరం ఏడు నెలలు కాలంలో (ఏప్రిల్ – అక్టోబర్) దేశ వ్యాప్తంగా రూ.1,50,880 కోట్ల విలువైన వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతి కాగా, అందులో 10.42 శాతం వాటా రూ.15,721.69 కోట్లతో ఆంధ్రప్రదేశ్ నాలుగవ స్థానంలో ఉన్నట్లు తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వ్యవసాయ ఎగుమతుల్లో 16.29 శాతం వాటాతో గుజరాత్ మొదటి స్థానంలో ఉండగా, 14.61, మహారాష్ట్ర, 10.61 శాతంతో హర్యాణ మూడవ స్థానంలో నిలిచాయి. ఏపీలో పండించిన వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతులు చేయడం ద్వారా రైతులకు అధికాదాయం పొందే విధంగా ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా 'ఒక జిల్లా ఒక ఉత్పత్తి' పేరుతో కొన్ని వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించడంతో పాటు నియోజకవర్గ స్థాయిలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయడంతో ఎగుమతుల అవకాశాలను అందిపుచ్చుకుంటోంది. వ్యవసాయ ఉత్పత్తులకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా విలువ ఆధారితను జోడిస్తుండటంతో రానున్న కాలంలో వ్యవసాయ ఎగుమతుల్లో రాష్ట్రం మొదటి రెండు స్థానాలకు చేరుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

టీడీపీ మాజీ మంత్రి సొంతూరికి దారి

రూ.3 కోట్లతో రహదారి నిర్మాణం



గతంలో డబ్ల్యూ కొత్తపల్లెకు వెళ్లే రహదారి దుస్థితి



ప్రస్తుతం డబ్ల్యూ కొత్తపల్లె రహదారి

ఆళ్లగడ్డ: నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గం దొర్నిపాడు మండలంలోని డబ్ల్యూ కొత్తపల్లె.. టీడీపీ మాజీమంత్రి భూమా అఖిలప్రియ సొంతూరు. సాధారణంగా ప్రజాప్రతినిధులు తమ గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకోవాలని చొరవచూపుతారు. కానీ రెండేళ్లు మంత్రిగా ఉన్న ఆమె తన సొంతూరికి కనీసం దారి ఏర్పాటు చేయాలని కూడా ఆలోచించలేదు. ఆమె కుటుంబ సభ్యులు పదవులు చేపట్టినా గ్రామానికి దారి వేసుకోలేకపోయారు. 2005లో వైఎస్సార్ ప్రభుత్వంలో ఆ గ్రామానికి దారి ఏర్పాటు చేశారు. మళ్లీ 17 ఏళ్లకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏపీ జలవనరులశాఖ సలహాదారు, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ప్రత్యేక చొరవతో రూ.3 కోట్లు ఖర్చుచేసి 8.5 కిలోమీటర్ల దూరం రహదారి నిర్మించారు.

ప్రత్యేక చొరవతో రోడ్డు నిర్మించారు



మా ఊరికి దారి ఏర్పాటు చేసేందుకు ఏపీ జలవనరులశాఖ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు తెప్పించారు. కాంట్రాక్టర్ శివరామిరెడ్డి ఎలాంటి ఆలస్యం లేకుండా రోడ్డును పూర్తిచేశారు. రెండుసార్లు వైఎస్సార్ ఫ్యామిలీ ద్వారానే దొర్నిపాడు నుంచి చాకరాజువేముల మీదుగా డబ్ల్యూ కొత్తపల్లెకు దారి ఏర్పాటు చేశారు. దీంతో మండల కేంద్రం నుంచి గ్రామానికి 10 నిమిషాల్లో చేరుకుంటున్నాం. గతంలో గంటల తరబడి గతుకుల రోడ్డులో ప్రయాణించాలంటే ఇబ్బందులు పడేవాళ్లం.

– భూమా చెంచిరెడ్డి, సొసైటీ చైర్మన్, దొర్నిపాడు

పవన్‌ను నమ్మి మోసపోవద్దు

టీడీపీతో పొత్తును జీర్ణించుకోలేక రాజీనామా చేస్తున్నాం: వెంకటస్వామి, జయకళ్యాణి



గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): టీడీపీతో పొత్తును జీర్ణించుకోలేక తాము జనసేన పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఆపార్టీ లీగల్‌సెల్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు, నరసాపురం నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు ఆకుల వెంకటస్వామి, పార్టీ కేంద్ర కార్యాలయ వీరమహిళ విభాగం కోఆర్డినేటర్, అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ జయకళ్యాణి ఆకుల చెప్పారు. వారు బుధవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. వెంకటస్వామి మాట్లాడుతూ పవన్‌ప్రవర్తన నచ్చక పార్టీని వీడుతున్నట్లు తెలిపారు. పార్టీ ఆవిర్భావం నాటి ఆయన మాటలకు నేటి మాటలకు పొంతన లేదన్నారు. టీడీపీ అవినీతిలో కూరుకుపోయిందని, అధికారంలో ఉండగా రాష్ట్రాన్ని దోచేసిందని చెప్పిన పవన్ ఈ రోజు అదే పార్టీకి మద్దతివ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. జనసేనలో ఉంటూ టీడీపీని విమర్శించేవారు కోవర్టులేనంటూ ఇటీవల పవన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. వాస్తవానికి జనసేనే కోవర్టు పార్టీ అని, చంద్రబాబుకు పవన్ పెద్ద కోవర్టని విమర్శించారు. ఎవరైనా తన పార్టీ అధికారంలోకి రావాలని కోరుకుంటారని, పవన్ మాత్రం బాబును సీఎంను చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని విమర్శించారు. పదేళ్లుగా పార్టీ కేంద్ర కార్యాలయంలో స్వచ్ఛందంగా పనిచేస్తున్న 43 మందిని రోడ్డున పడేశారన్నారు. వీరిలో 30 మందికి పైగా కాపు యువత ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో జనసేన ఒక్క సీటు కూడా గెలవదని చెప్పారు. జయకళ్యాణి మాట్లాడుతూ బీటెక్ కంప్యూటర్స్ చేసిన తాను పవన్‌పై అభిమానంతో పార్టీ కేంద్ర కార్యాలయంలో స్వచ్ఛందంగా పనిచేసినట్లు తెలిపారు. ఒక ఆడిటర్ మాటలు విని తమను కోవర్టులంటూ రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

బాబువన్నీ పగటి కలలే

- ఒంటరిగా పోటీ చేసి గెలిచిన దాఖలాలు లేవు
- ఇప్పుడు పవన్ సహకారంతో అధికారంలోకి రావాలని తపన
- బాబు పాలనలో అవినీతి, అక్రమాలతో రాష్ట్రం కుదేలు
- అందుకే 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఘన విజయం
- నాలుగున్నరేళ్లుగా సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలన
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి



సాక్షి, అమరావతి: వచ్చే ఎన్నికల్లో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సహకారంతో అధికారంలోకి రావాలని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు పగటి కలలు కంటున్నారని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన తనను కలిసిన మీడియాతో మాట్లాడారు. అవినీతి, అక్రమాలతో 2014–19 మధ్య రాష్ట్రాన్ని చంద్రబాబు ధ్వంసం చేశారని ప్రజలు నిర్ధారణకు వచ్చే.. 2019 ఎన్నికల్లో 151 శాసనసభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి అఖండ విజయాన్ని అందించారని గుర్తు చేశారు. చంద్రబాబు ధ్వంసం చేసిన రాష్ట్రాన్ని నాలుగున్నరేళ్లుగా సీఎం వైఎస్ జగన్ సుపరిపాలనతో ఒక్కో ఇటుక పేర్చుకుంటూ అన్ని రంగాల్లో ప్రగతిపథంలో నిలిపారన్నారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో దేశంలో రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందని గుర్తు చేశారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ఆర్థిక ఇబ్బందులున్నా అన్ని సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజలకు దన్నుగా నిలిచారని వివరించారు. మంచి చేసిన సీఎం వైఎస్ జగన్‌కు ప్రజలు అండగా నిలుస్తున్నారు కాబట్టే 175కు 175 స్థానాల్లో గెలుపే లక్ష్యంగా తాము ముందుకెళ్తున్నామన్నారు. కార్యకర్తల నుంచి నేతల వరకూ అందరినీ సీఎం జగన్ అక్కున చేర్చుకున్నారని చెప్పారు. గత ఎన్నికల కంటే మరింత మెరుగైన ఫలితాల కోసమే ఒక చోట టికెట్ ఇవ్వలేకపోతే మరోచోట కేటాయిస్తున్నామని స్పష్టం చేశారు. సీఎం జగన్ నిర్ణయానికి వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు కట్టుబడి ఉంటారని.. ఎక్కడైనా చిన్న చిన్న అసంతృప్తులు సర్దుకుంటాయన్నారు.

భ్రమల్లో బతుకుతున్నారు..

రాష్ట్రంలో 175కు 175 స్థానాల్లో గెలుపే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ముందుకెళ్తుంటే.. సీఎం వైఎస్ జగన్ ఏం తప్పు చేస్తారా.. దానిపై ఎలా చిల్లర రాజకీయాలు చేద్దామా అనే ఆలోచనలో చంద్రబాబు ఉన్నారంటూ సజ్జల ఎద్దేవా చేశారు. ఎత్తిచూపడానికి తప్పులేవీ లేకపోవడంతో ఎల్లో మీడియాతో నిత్యం బురదజల్లిస్తూ తప్పుడు వార్తలు రాయిస్తూ.. ఆ భ్రమల్లోనే చంద్రబాబు బతుకేస్తున్నారని విమర్శించారు. 1995లో ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి టీడీపీని లాక్కున్నప్పటి నుంచి.. ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసి గెలిచిన దాఖాలాలు లేవని ఆయన గుర్తు చేశారు. శిథిలమైపోయిన టీడీపీని ఏలుతున్న చంద్రబాబుకు జనసేన కలిసిరాకపోతే ఎన్నికల్లో పోటీ చేసే ధైర్యం కూడా లేదన్నారు. జనసేనతో పొత్తు పెట్టుకుంటే కాపు సామాజికవర్గమంతా తనకు మద్దతు ఇస్తుందని పిచ్చి భ్రమల్లో బాబు ఉన్నారన్నారు. టీడీపీ 100 స్థానాలలో పోటీ చేస్తుందా.. లేక 90 టీడీపీ తీసుకుని 85 సీట్లు పవన్ కల్యాణ్‌కు ఇస్తుందా.. ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరు.. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలన్నారు. ఎందుకంటే వారికి ఏ విషయంలోనూ స్పష్టత లేదన్నారు. అసలు 175 స్థానాలలో వారికి అభ్యర్థులు ఉన్నారా.. అనేది అనుమానమేనని విమర్శించారు. జనసేన, టీడీపీ సమన్వయ కమిటీ సమావేశాల తర్వాత వారు కొట్టుకునే పరిస్థితి వచ్చిందని సజ్జల వ్యంగ్యంగా అన్నారు.

ఎంత మంది మృతులకు పరిహారం ఇచ్చారు?

'చంద్రబాబు కోసం మృతి చెందారంటున్నారు.. అందులో ఎంత మందికి పరిహారం ఇచ్చారు.. ఇచ్చిన చెక్కులు చెల్లుబాటయ్యాయా.. లోకేష్ పాదయాత్రలో మూడు వేల కిలోమీటర్లు నడిచారా.. ఇవన్నీ అనుమానమే. జైలులో వేసినప్పుడు ఎక్కడలేని రోగాలన్నీ చంద్రబాబుకే ఉన్నాయని ఆయన న్యాయవాదులు వాదించారు. ఇప్పుడేమో రొమ్ము విరుచుకుని లోకమంతా తిరుగుతానని బాబు అంటున్నారు.. ఈ శక్తి ఎక్కడ నుంచి వచ్చిందో ఆయనే చెప్పాలి. జైలులో ఉన్నప్పుడు ఆయన భార్య, కోడలు తిరుగుతారు.. ఇప్పుడు వాళ్లేమయ్యారు? ఆ రోజు తిరగాల్సిన కొడుకు ఇన్నాళ్లూ ఎక్కడ పడుకున్నాడు? ఇప్పుడు మూడు రోజుల్లో పాదయాత్ర ఎలా ముగిస్తున్నాడు? తెలంగాణాలో కాంగ్రెస్‌ను గెలిపించింది టీడీపీ అని ఊదరగొడుతున్నారు. సెటిలర్ల ఓట్లు ఎక్కువగా ఉన్న చోట్ల కాంగ్రెస్ ఓడిపోయింది.. దీనికి వారు ఏమి సమాధానం చెబుతారు' అని నిలదీశారు. వచ్చే ఎన్నికల్లో ఎంత మంది పోటీ చేసినా ఎదుర్కోవడానికి వైఎస్సార్‌సీపీ సిద్ధమని స్పష్టం చేశారు.

మూడు ముక్కల టీడీపీకి మరో సంకటం

- రాజంపేటలో టీడీపీకి జనసేన పొత్తు తెచ్చిన కష్టం
- ఇక్కడ టీడీపీలో ముగ్గురు నేతల నిత్య జగడం
- కొత్తగా రంగంలోకి జనసేన నేతలు
- టిక్కెట్ జనసేనకేనంటూ ప్రచారం..
- నేతల కొట్లాటలతో కకావికలమవుతున్న టీడీపీ, జనసేన కేడర్



సాక్షి ప్రతినిధి, కడప: అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నేతలకు కొత్త సంకటం వచ్చి పడింది. అసలే మూడు వర్గాలతో, నిత్యం కొట్లాటలతో సతమతమవుతున్న టీడీపీకి జనసేనతో పొత్తు కారణంగా కొత్తగా మరో గ్రూపు చేరింది. రాజంపేట టీడీపీని మరింత రగిలిస్తోంది. పొత్తులో భాగంగా రాజంపేట టికెట్ తమకేనంటూ జనసేన నేతలు ఘంటాపథంగా చెప్పడం టీడీపీ నేతలకు చిర్రెక్కిస్తోంది.

రాజంపేట నియోజకవర్గంలో ఇప్పటికే టీడీపీలో మూడు ముక్కలాట నడుస్తోంది. ఇక్కడి నుంచి మరోసారి పోటీ చేయాలని టీడీపీ ఇన్‌చార్జి బత్యాల చెంగల్‌రాయుడు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈయన అభ్యర్థిత్వానికి పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు మోకాలడ్డుతున్నారు. బత్యాల నాన్ లోకల్ అభ్యర్థి, పోటీలో నిలిపినా నిరుపయోగమేనంటూ ప్రచారం చేస్తున్నారు. ఇంకోవైపు రాజంపేట ఎంపీగాకంటే అసెంబ్లీకి పోటీచేయాలని గంటా నరహరి ఉవ్విళ్లూరుతున్నారు. బత్యాల, జగన్‌మోహన్‌రాజులకు గట్టిగానే అడ్డం పడుతున్నారు. వీరు చాలదన్నట్టు తాజాగా పోలు సుబ్బారెడ్డి, మేడా విజయశేఖర్‌రెడ్డి రేసులోకి వచ్చారు. వీళ్ల మధ్య నిత్యం కొట్లాటలతో కేడర్ క్రమంగా తగ్గిపోతోంది. ఇప్పుడు పొత్తులో మాకే సీటంటూ జనసేన నేతలు రంగంలోకి వచ్చారు. రాజంపేట నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జి మలిశెట్టి వెంకటరమణ టిక్కెట్ తనదేనంటున్నారు. మలిశెట్టికంటే తానే మెరుగైన అభ్యర్థి అంటూ అతికారి దినేష్ మరోపక్క ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక ప్రభుత్వ ఉన్నతోద్యోగానికి వీఆర్ఎస్ ఇచ్చిన శ్రీనివాసరాజు తానే జనసేన అభ్యర్థినంటూ తెరపైకి వచ్చారు. టీడీపీ–జనసేన ఉమ్మడి అభ్యర్థిని తానేనంటూ విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నారు. నేతల కొట్లాటలతో టీడీపీ, జనసేన వర్గాలు కకావికలవుతున్నాయి.

మైదుకూరు, రాజంపేట నేతల పైరవీలు

టీడీపీ–జనసేన పొత్తు పెట్టుకున్నా వైఎస్సార్ జిల్లాలో మైదుకూరు, అన్నమయ్య జిల్లాలో రాజంపేటని జనసేనకు అప్పగించవద్దని టీడీపీ నేతలు పైరవీలు ఆరంభించారు. వాస్తవంగా కాపు సామాజిక వర్గ ఓటర్లు గణనీయంగా ఉన్న ప్రాంతాల్లో మాత్రమే జనసేన అభ్యర్థులను నిలిపే అవకాశం బలంగా ఉంది. ఈ మేరకు ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో రాజంపేట, రైల్వేకోడూరు, మైదుకూరు ప్రాంతాల్లో మాత్రమే జనసేన సీట్లు కోరే అవకాశం ఉంది. రైల్వేకోడూరు ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానం కావడం, సరైన నాయకుడు లేకపోవడంతో రాజంపేట, మైదుకూరు సీట్లపై పట్టుబట్టనున్నారు. ఈ నేపథ్యంలో మైదుకూరులో మాజీ ఎమ్మెల్యే డీఎల్ రవీంద్రారెడ్డి జనసేన టికెట్‌పై పోటీ చేస్తారనే ప్రచారం ఉంది.

సీబీఎస్ఈ విద్యార్థులకు ఉత్తమ శిక్షణ ఇవ్వాలి

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేశ్ కుమార్ తెలిపారు. విద్యార్థుల సంక్షేమం, విద్యా సంస్కరణలకు వేలాది కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. సీబీఎస్ఈ రీజినల్ ఆఫీసర్ శేఖర్ చంద్ర, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సాన్యం భరద్వాజ్ ఆధ్వర్యంలో సీబీఎస్ఈ పరీక్షా విధానంపై విజయవాడలో బుధవారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. సీబీఎస్ఈ సిలబస్ అమలు చేస్తున్న తెలంగాణ ప్రైవేటు పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఏపీలో సీబీఎస్ఈ అమలు చేస్తున్న ప్రభుత్వ పాఠశాలల ప్రిన్సిపాల్స్ మొత్తం 700 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురేశ్ కుమార్ మాట్లాడుతూ 2024–25 విద్యా సంవత్సరంలో సీబీఎస్ఈ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచేలా తర్ఫీదు ఇవ్వాలన్నారు. డాక్టర్ భరద్వాజ్ మాట్లాడుతూ.. ప్రతి స్కూల్లోను విద్యార్థుల నమోదు అడ్మిషన్ రిజిస్టర్, పుట్టిన తేదీ ధ్రువీకరణ నమోదు వివరాలు తప్పుల్లేకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా బోర్డు విధివిధానాలు, పరీక్షల తీరుపై పలువురి ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో సీబీఎస్ఈ, మోడల్ స్కూల్ డైరెక్టర్ ఎం.వి.కృష్ణారెడ్డి, వి.అరుణ తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంతో పునర్జన్మ

- వెంకటాపురం వాసికి బ్రెయిన్ డెడ్
- కళ్లు రెడ్‌క్రాస్‌కు, కిడ్నీలు మెడికవర్ ఆస్పత్రికి..



శ్రీకాకుళం రూరల్: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా రేగిడి మండలం ఎ.వెంకటాపురం గ్రామానికి చెందిన పనస వెంకట్‌నాయుడు (49) అనారోగ్యానికి గురికాగా, బ్రెయిన్ డెడ్ అయ్యింది. దీంతో ఆయన కుటుంబ సభ్యులు బుధవారం అవయవదానానికి అంగీకరించారు. వివరాల్లోకి వెళ్తే.. వెంకట్ నాయుడు ఇనుప వస్తువుల వ్యాపారం చేస్తుంటారు. ఈయనకు భార్య, డిగ్రీ చదివిన ఇద్దరు కుమారులు ఉన్నారు. కొన్నాళ్లుగా వెంకట్ నాయుడు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈనెల 9వ తేదీన బీపీ ఎక్కువ కావడంతో రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటికే మెదడులో తీవ్ర రక్తస్రావం జరగడంతో శస్త్రచికిత్స చేయలేమని వైద్యులు స్పష్టం చేశారు. ఈక్రమంలోనే 12వ తేదీన అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. డాక్టర్లు బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించగా, కుటుంబ సభ్యులు వెంకట్ నాయుడు అవయవాలను దానం చేయాలని నిర్ణయించారు. దీన్లో భాగంగా బుధవారం కిడ్నీలను విశాఖపట్నంలోని మెడికవర్ ఆసుపత్రికి, నేత్రాలను రెడ్‌క్రాస్‌కు గ్రీన్‌చానల్ ద్వారా అందజేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు.

మత్స్యావతారంలో రామయ్య

భద్రాద్రిలో ఘనంగా వైకుంఠ అధ్యయనోత్సవాలు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీసీతారామ చంద్రస్వామి వారి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారిని తొలుత బేడా మండపంలో వేదికపై ఆళ్వార్లతో కలిపి ఆశీనుల్ని చేశారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశాక, మత్స్యావతారంలో అలంకరించిన స్వామివారిని మేళతాళాలు, కోలాటాల నడుమ ఊరేగింపుగా మిథిలా స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై భక్తుల సందర్శనార్థం కొలువుదీర్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా స్థానాచార్యులు స్థలశాయి స్వామివారి మత్స్యాలంకరణ విశిష్టతను వివరించాక తిరువీధి సేవ గావించారు.

దేశరక్షకులకు ఏయూ బాసట

రక్షణరంగ సంస్థలతో ఆంధ్రావర్సిటీ ఒప్పందాలు

దేశరక్షణ కోసం చిన్నతనంలోనే పనిచేసే సైనికులు.. ఉద్యోగ విరమణ తరువాత ఉపాధి అవకాశాల కోసం అన్వేషిస్తూ.. విద్యార్హతల విషయంలో భంగపడేవారు. సైనికుల సమస్యలకు పరిష్కారం చూపుతూ త్రివిధ దళాల్లో పనిచేస్తున్న సైనికులకు ఉన్నత విద్యను చేరువచేసే దిశగా ఆంధ్ర విశ్వవిద్యాలయం తీసుకున్న నిర్ణయం.. వారి జీవితాల్లో కొత్త వెలుగులు తీసుకొచ్చింది. దేశంలోనే తొలిసారిగా సైనికోద్యోగులకు ఉన్నత విద్య అవకాశాలను, నైపుణ్యం కలిగిన కోర్సులను అందించింది. సైనికులకు మరిన్ని సేవలందించేందుకు సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్‌ని స్కూల్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్‌గా మార్చింది.

సాక్షి, విశాఖపట్నం



ఆంధ్ర విశ్వ విద్యాలయం

- రిటైరైన సైనికులకు ఉపాధి బాటలు
- పలు కోర్సులు అందిస్తున్న విశ్వవిద్యాలయం
- ఐఎన్ఎస్ విశ్వకర్మ సిబ్బందికి డిగ్రీ కోర్సులు
- ఇప్పటికే ఏయూలో పీహెచ్‌డీ చేసిన 38 మంది డిఫెన్స్ అధికారులు
- సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్.. స్కూల్ ఫర్ డిఫెన్స్ స్టడీస్‌గా మార్పు

దేశరక్షణ కోసం అహర్నిశలు సరిహద్దుల్లో పోరాడుతున్న ఉద్యోగులకు, మాజీ సైనికులకు అవసరమైన విద్యాసంబంధ కోర్సులను అందించాలని ఏయూ సంకల్పించింది. దీన్ని ఆచరణలో పెట్టే దిశగా 2017లో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల వేదికగా ఇండియన్ నేవీ, డైరెక్టర్ జనరల్ ఆఫ్ రీసెటిల్‌మెంట్ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించింది. ఏయూతో ఒప్పందాలు చేసుకునేందుకు వారు ముందు కొచ్చారు. ఇంటర్ విద్యార్హతతో ఎయిర్‌ఫోర్స్‌లో చేరేవారికి డిప్లొమా కోర్సులను అందించడం ప్రారంభించారు. అలా ఒక డిప్లొమా కోర్సుతో మొదలుపెట్టిన ఏయూ అధికారులు ఇప్పుడు 26 డిప్లొమా కోర్సుల్ని అందిస్తున్నారు. కెమికల్, ఎలక్ట్రికల్, అకౌంటింగ్–మేనేజ్‌మెంట్, ఆఫీస్ మేనేజ్‌మెంట్, ఫిజికల్ ఫిట్‌నెస్ ట్రైనింగ్, సెక్యూరిటీ అండ్ ఇంటెలిజెన్స్ సర్వీస్, టీచింగ్ అండ్ ఎడ్యుకేషన్ సర్వీసెస్, హౌస్‌కీపింగ్, మ్యూజిక్, ఎయిర్‌ఫీల్డ్ సేఫ్టీ, అకౌంటింగ్ అండ్ ఆడిట్ మేనేజ్‌మెంట్, క్యాటరింగ్ మేనేజ్‌మెంట్, ఎయిర్‌సేఫ్టీ, మెటరలాజికల్ అసిస్టెన్స్ తదితర కోర్సులు అందిస్తున్నారు. సైనికులకు విద్యనందించాలన్న ఆశయంతో ఏర్పాటు చేసిన సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్‌ని స్కూల్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్‌గా ప్రత్యేక కేంద్రంగా మార్చి సేవలను విస్తరించారు.



బీఎస్సీ డిగ్రీలు, పీహెచ్‌డీలు

ఐఎన్ఎస్ విశ్వకర్మలో పనిచేస్తున్న సిబ్బందికి డిగ్రీలు అందించే దిశగా అవగాహన ఒప్పందం చేసుకున్నారు. ఉద్యోగ విరమణకు దగ్గరలో ఉన్న వారికోసం ప్రత్యేకంగా నూతన ఉపాధి అవకాశాల కల్పన గురించి ఆలోచించిన ఏయూ.. పలు ప్రీ రిలీజ్ కోర్సులను ప్రారంభించింది. ఏడాదికి 15 బ్యాచ్‌ల వరకు ఈ కోర్సులను నిర్వహిస్తున్నారు. ఒక్కో కోర్సులో 30 నుంచి 50 మంది వరకు సైనికోద్యోగులు పాల్గొంటున్నారు. వీటికి ప్రత్యేకమైన సిలబస్ రూపొందించి ఏయూ అకడమిక్ సెనేట్‌లో ఆమోదించారు. ఇప్పటివరకు 58 బ్యాచ్‌లను నిర్వహించిన ఆంధ్ర విశ్వవిద్యాలయం 2,900 మందికిపైగా సైనికోద్యోగులకు ధ్రువపత్రాల్ని అందించింది. ఎగ్జిక్యూటివ్ కేటగిరీలో ఉన్న ఎయిర్‌ఫోర్స్ అధికారులకు పీహెచ్‌డీలో ప్రవేశాలు కల్పిస్తోంది. ఇప్పటికే 38 మంది అధికారులు పీహెచ్‌డీ చేశారు.


శిక్షణ తరగతులపై నేవీ సిబ్బందికి అవగాహన

కాలేజ్ ఆఫ్ ఎయిర్ వార్‌ఫేర్‌తో జత

హైదరాబాద్‌లో ఉన్న కాలేజ్ ఆఫ్ ఎయిర్ వార్‌ఫేర్, దుండిగల్‌లోని ఎయిర్‌ఫోర్స్ అకాడమీతో ఏయూ ఒప్పందాలు చేసుకుంది. ఎయిర్ వార్‌ఫేర్ కాలేజీతో ఎం.ఏ. పొలిటికల్ సైన్స్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్ కోర్సుల్ని అందిస్తోంది. గ్రూప్ కెప్టెన్, వింగ్ కమాండర్ స్థాయి వారికి ఈ కోర్సును అందిస్తున్నారు. ఎయిర్‌ఫోర్స్ అకాడమీలోని జూనియర్ ఆఫీసర్ ట్రైనీగా పనిచేస్తున్న వారికి పీజీ డిప్లొమాని డిజైన్ చేసి అందిస్తున్నారు. ఇంజినీరింగ్ విద్యను మధ్యలో ఆపేసిన ఎయిర్‌ఫోర్స్, ఇండియన్ నేవీ అధికారులకోసం బీటెక్‌లో లేటరల్ ఎంట్రీ విభాగం ఏర్పాటు చేసింది. ఇప్పటివరకు దాదాపు ఆరువేలమంది సైనికులు ఈ ఎంవోయూ ఫలితంగా బీఏ డిగ్రీలను పొంది బ్యాంకులు తదితర రంగాల్లో ఉద్యోగులుగా స్థిరపడ్డారు.

సైనికులకు సమగ్ర అవకాశాలు



దేశరక్షణకు ప్రాణాలకు తెగించి శ్రమిస్తున్న సైనికులకు ఏయూ వందనం చేస్తోంది. వారి సేవల్ని గుర్తించి.. సైనికుల జీవితాల్ని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఉన్నతవిద్య అందిస్తోంది. గత వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ప్రసాదరెడ్డి చొరవతో ఎయిర్‌ఫోర్స్, నేవీ, ఆర్మీతో ఒప్పందాలు చేసుకున్నాం. ఇంజనీరింగ్, లా, ఫార్మసీ కోర్సుల్లో సైనికోద్యోగులకు, సైనిక వీరులకు ప్రవేశాలు కల్పిస్తున్నాం. నేవీ సిబ్బంది ఎంటెక్ చదివే అవకాశం ఉంది. ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో శిక్షణ పొందిన సైనికోద్యోగులకు బీపీఈడీ కోర్సు సర్టిఫికెట్లు ఇస్తున్నాం. ఇండియన్ కోస్ట్‌గార్డ్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌తోను ఎంవోయూ కుదుర్చుకున్నాం.

– ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్, ఏయూ రిజిస్ట్రార్

ధర ఎగ్‌సే

పౌల్ట్రీ చరిత్రలో కోడిగుడ్డు ఆల్‌టైమ్ రికార్డు

- ఫామ్ గేటు వద్ద ధర రూ.5.79
- రిటైల్ మార్కెట్‌లో రూ.7కు చేరిన ధర
- రానున్న రోజుల్లో మరింతగా పెరిగే చాన్స్



సాక్షి, భీమవరం/అమరావతి: పౌల్ట్రీ రంగంలో సరికొత్త రికార్డు నమోదైంది. కోడి గుడ్డు రైతు ధర రూ.5.79కు చేరి పాత రికార్డులను తిరగరాసింది. ఈ ఏడాది ఇదే అత్యధిక రైతు ధర కావడం గమనార్హం. కాగా.. పెరిగిన మేత ధరలతో గుడ్డు ధర పెరిగినా ప్రయోజనం అంతంత మాత్రమేనని పౌల్ట్రీ రైతులు అంటున్నారు. మరోపక్క రిటైల్ మార్కెట్‌లో గుడ్డు రూ.7కు చేరింది. ఇదే ధర మరికొంత కాలం కొనసాగితే.. నష్టాల నుంచి గట్టెక్కుతామని పౌల్ట్రీ రైతులు చెబుతున్నారు.

60 శాతం ఉత్తరాదికి ఎగుమతి

రాష్ట్రంలో 2 వేలకు పైగా కోళ్లఫారాలు ఉండగా.. వాటిలో ప్రస్తుతం 5.60 కోట్లకు పైగా కోళ్లు ఉన్నాయి. రోజుకు 6 కోట్ల గుడ్ల ఉత్పత్తి సామర్థ్యం ఉన్నప్పటికీ.. ప్రస్తుతం సగటున 4.20 కోట్ల నుంచి 4.75 కోట్ల మధ్య గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. వీటిలో 40 శాతం స్థానికంగానే వినియోగిస్తుండగా.. మిగిలిన 60 శాతం బీహార్, పశ్చిమ బెంగాల్, అసోం, నాగాలాండ్, మణిపూర్, ఒడిశా రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. శీతల ప్రభావం ఉండే నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు పౌల్ట్రీకి ముఖ్య సీజన్‌గా భావిస్తారు. ఏటా ఈ సీజన్‌లో అత్యధిక ధర నమోదవుతుంటుంది. 2017–18 సీజన్‌లో రూ.5.45 అత్యధిక ధర నమోదైంది. ఆ తర్వాత ఉత్తరాది రాష్ట్రాల్లో పౌల్ట్రీలు విస్తరించడం, ఎగుమతుల్లో ఇతర రాష్ట్రాల పోటీతో సీజన్ కలిసి రాక రైతు ధర రూ.5 దాటడం గగనంగా ఉండేది.

చరిత్రలో ఇదే గరిష్ట ధర

ఉత్తరాదిన కోళ్లు ఫ్లూ బారిన పడటంతో ఎగుమతులకు డిమాండ్ ఏర్పడి నాలుగేళ్ల తర్వాత 2022–23 పౌల్ట్రీ సీజన్‌లో రూ.5.57 గరిష్ట ధర పలికింది. కాగా.. ప్రస్తుత సీజన్ ఆరంభంలో ధరలో ఒడిదొడుకులు ఎదురైనా.. వారం, 10 రోజుల నుంచి ఫామ్ గేట్ వద్ద గుడ్డు ధర అనూహ్యంగా పెరుగుతూ బుధవారం రూ.5.79కి చేరి ఆల్‌టైమ్ రికార్డు నమోదైంది. కార్తీక మాసం ముగియడం, క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు, సంక్రాంతి పండగల నేపథ్యంలో స్థానిక వినియోగం మరింత పెరగనుండటంతో ఫామ్ గేట్ వద్ద ధర మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు.

నూకలు దొరకట్లేదు

పౌల్ట్రీ పరిశ్రమలో విరివిగా ఉపయోగించే నూకలు టన్ను రూ.13 వేల నుంచి ఏకంగా రూ.25 వేలకు చేరింది. నూకలను ఎక్కువగా ఇథనాల్ ఉత్పత్తికి మళ్లిస్తుండటంతో మార్కెట్‌లో దొరకని పరిస్థితి నెలకొంది. ఫలితంగా నూకలకు బదులు మొక్కజొన్నపైనే రైతులు ఆధారపడాల్సి వస్తోంది. మొక్కజొన్న కూడా టన్ను రూ.17 వేల నుంచి రూ.25 వేలకు పెరిగింది. సోయాబీన్ టన్ను రూ.48 వేల నుంచి రూ.50 వేల మధ్య పలుకుతోంది. ఆయిల్ తీసిన తవుడు (డీవోపీ) టన్ను రూ.12 వేల నుంచి రూ.18 వేలకు పెరిగింది. పెరిగిన మేత ధరలతో పాటు మందులు, వ్యాక్సిన్ల ధరలు, కార్మికుల జీతాలు పెరగడం పౌల్ట్రీల నిర్వహణ వ్యయాన్ని గణనీయంగా పెంచేసింది. ఫలితంగా పిల్ల దశ నుంచి గుడ్డు పెట్టే దశ వరకు ఒక్కో కోడికి గతేడాది రూ.300–310 ఖర్చు కాగా.. ప్రస్తుతం రూ.360–370 ఖర్చవుతోంది. పట్టణ ప్రాంతాల్లో రిటైల్ మార్కెట్‌లో గుడ్డు ధర రూ.7, మారుమూల పల్లెల్లో రూ.7.50 వరకు పలుకుతోంది. సాధారణంగా రైతు ధరకు 40–50 పైసలు అదనంగా చేర్చి బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తుంటారు.

ధర నిలకడగా ఉంటే ప్రయోజనం

మేత ధరలు, నిర్వహణ వ్యయం విపరీతంగా పెరిగిపోవడంతో కొన్నేళ్లుగా గుడ్డు ధర గిట్టుబాటుకాక కొన్నేళ్లుగా కోళ్ల పరిశ్రమ తీవ్ర నష్టాల్లో ఉంది. ప్రస్తుతం రైతు ధర ఆశాజనకంగా ఉండటం ఊరటనిస్తోంది. ఈ ధర నిలకడగా ఉంటే పాత నష్టాలు కొంత భర్తీ చేసుకునే వీలుంటుంది.

– జి.గంగాధరరావు, నెక్ జిల్లా చైర్మన్, తాడేపల్లిగూడెం


పెరుగుతున్న ధరతో ఊరట



72–75 వారాలకు కోళ్లను అమ్మేస్తాం. ప్రస్తుతం ఫామ్స్ వద్ద పెద్ద కోళ్లు ఎక్కువ ఉన్నాయి. అందువల్ల గుడ్ల ఉత్పత్తి తగ్గింది. 90 శాతం గుడ్లకు గాను ప్రస్తుతం 80 శాతమే వస్తోంది. పెరిగిన మేత, నిర్వహణ ధరల నేపథ్యంలో ఫామ్ గేటు వద్ద సగటున గుడ్డుకు రూ.5 ధర లభించాల్సి ఉండగా.. ఈ ఏడాది సగటున రూ.4.50 ధర లభించింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రస్తుతం పెరుగుతున్న ధరలు రైతులకు నిజంగా ఊరటనిస్తాయి.

– పడాల సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి, ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్


చాలా రోజుల తరువాత..



చాలా రోజుల తర్వాత పౌల్ట్రీ రైతుకు గిట్టుబాటు ధర లభిస్తోంది. ఇది పౌల్ట్రీ పరిశ్రమకు శుభపరిణామం. శీతల ప్రభావంతో ఉత్పత్తి తగ్గడం, పొరుగు రాష్ట్రాలకు ఎగుమతులు పెరగడమే కారణం. తమిళనాడు మాదిరిగానే ఆంధ్రా నుంచి కూడా విదేశాలకు ఎగుమతి చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. కోళ్ల మేతకు వినియోగించే మొక్కజొన్న, సోయా, నూకలు వంటి వాటిని పౌల్ట్రీలకు సబ్సిడీపై సరఫరా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– తుమ్మల కుటుంబరావు, చైర్మన్, ఎన్ఈసీఎస్, విజయవాడ జోన్

టుడేస్ గ్రాఫిక్



జైళ్లు సరిపోవట్లే!

సామర్థ్యానికి మించి ఖైదీలున్నారని పార్లమెంటులో కేంద్రం వెల్లడి

- దేశవ్యాప్తంగా 1,330 జైళ్లు.. వాటి సామర్థ్యం 4.36 లక్షల మంది
- కానీ ఉన్న ఖైదీలు 5.73 లక్షలపైనే..
- ఢిల్లీ, యూపీ, ఎంపీ, బిహార్ సహా పలు రాష్ట్రాల జైళ్లలో అధికంగా ఖైదీలు..
- తెలంగాణ, ఏపీలలో సామర్థ్యానికన్నా తక్కువే..



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోని జైళ్లలో ఉండాల్సిన సంఖ్య కంటే ఎక్కువమంది కిక్కిరిసి ఉంటున్నారని కేంద్ర ప్రభుత్వ గణాంకాలు చెప్తున్నాయి. దేశవ్యాప్తంగా మొత్తం 1,330 జైళ్లలో 4,36,266 మంది ఖైదీలను ఉంచేందుకు వీలుండగా.. గతేడాది డిసెంబర్ 31 నాటికి ఏకంగా 5,73,220 మంది ఖైదీలు ఉన్నారు. ముఖ్యంగా ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్, పంజాబ్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, జార్ఖండ్ జైళ్లలో సామర్థ్యానికి మించి ఖైదీలు ఉన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఈ పరిస్థితి కాస్త మెరుగ్గానే ఉంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని జైళ్లలో సామర్థ్యం కంటే తక్కువగా ఖైదీలు ఉన్నారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని జైళ్లలో సామర్థ్యం కంటే స్వల్పంగా ఎక్కువ సంఖ్యలో ఖైదీలు ఉన్నారు. బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు పార్లమెంటులో అడిగిన ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్‌కుమార్ మిశ్రా లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో ఈ వివరాలను వెల్లడించారు.

యూపీలో అత్యధికంగా..

- దేశంలోనే అత్యధికంగా ఉత్తరప్రదేశ్(యూపీ)లోని 77 జైళ్లలో 67,600 మంది ఖైదీల సామర్థ్యం ఉండగా.. ఏకంగా 1,21,609 మంది ఖైదీలు మగ్గుతున్నారు. బీహార్‌లోని 59 జైళ్లలో 47,750 మంది సామర్థ్యానికి గాను 64,914 మంది ఖైదీలు ఉన్నారు.
- మధ్యప్రదేశ్‌లోని 132 జైళ్లలో 48,857 మంది ఖైదీలు.. మహారాష్ట్రలోని 64 జైళ్లలో 41,070 మంది ఖైదీలు.. పంజాబ్‌లోని 26 జైళ్లలో 30,801 మంది ఖైదీలు.. జార్ఖండ్‌లోని 32 జైళ్లలో 19,615 ఖైదీలు.. ఢిల్లీలోని 16 జైళ్లలో 18,497 మంది ఖైదీలు ఉన్నారు.
- తెలంగాణలోని 37 జైళ్లలో 7,997 మంది సామర్థ్యానికి గాను 6,497 మంది ఖైదీలు ఉన్నారు. ఇందులో 2,102 మంది దోషులు, 4,221 మంది విచారణ ఖైదీలు, 174 మంది నిర్బంధిత ఖైదీలు ఉన్నారు.
- ఆంధ్రప్రదేశ్‌లోని 106 జైళ్లలో 8,659 ఖైదీల సామర్థ్యానికిగాను 7,254 మంది ఖైదీలు ఉన్నారు. ఇందులో 1,988 మంది దోషులు, 5,123 మంది విచారణ ఖైదీలు, 134 మంది నిర్బంధిత ఖైదీలు, 9 మంది ఇతరులు ఉన్నారు.

యువత ఫిట్‌నెస్ మంత్ర

- ఇందుకోసం కొత్త ఏడాదిలో తీర్మానం
- ఆరోగ్యకర జీవనానికి ఓటు
- ఫోర్బ్స్ హెల్త్, వన్‌పోల్ 2024 సర్వేలో నిర్ణయం
- మహిళల్లోనే ఫిట్‌నెస్‌పై ఎక్కువ ఆసక్తి



సాక్షి, అమరావతి

మరికొద్ది రోజుల్లో నూతన సంవత్సరం రాబోతోంది. ఈ కొత్త ఏడాదిలో కొత్త నిర్ణయాలకు యువత ప్రాధాన్యం ఇస్తోంది. ఆ వరుసలో ఫిట్‌నెస్‌కు మొదటి స్థానం కల్పిస్తోంది. తాజాగా ఫోర్బ్స్ హెల్త్, వన్‌పోల్ 2024 సర్వేలో అమెరికన్లతో పాటు యావత్తు ప్రపంచ యువత వైఖరి ఆసక్తిని రేకెత్తిస్తోంది. 48 శాతం మంది తమ ఫిట్‌నెస్‌ను మెరుగుపర్చుకోవడానికి ఓటు వేశారు.ఇందులో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఉండటం విశేషం. ఇక 36శాతం మంది మానసిక ఆరోగ్యాన్ని పెంచుకునేందుకు, 55 శాతం మంది శారీరక, మానసిక ఆర్యోగానికి సమాన ప్రాముఖ్యత కల్పించారు. ఇక వచ్చే ఏడాదైనా మేలైన ఆర్థిక స్థితి పొందాలని 38శాతం మంది కోరుకున్నారు.

'బరువు'పైనే దృష్టి


ప్రపంచాన్ని పీడిస్తున్న ఊబకాయ సమస్యను ఎదురించాలని యువత నిశ్చయించుకుంది. వయసుతో సంబంధం లేకుండా అధిక బరువును తగ్గించుకోవాలని 34శాతం మంది దృఢంగా నిర్ణయించుకున్నారు. ఇందుకోసం జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని, పౌష్టికాహారం తినేలా జీవన విధానంలో మార్పు చేసుకోవాలని తీర్మానించుకున్నారు. 20శాతం లక్ష్యాన్ని చేరుకోవడం, జవాబుదారీతనం పెంచుకోవాలని నిర్ణయించుకున్నారు. అయితే గతేడాదితో పోలిస్తే ఇది చాలా వరకు తగ్గింది.

పనితీరుపై... కేవలం 3శాతమే దృష్టి..

ఇక...అతి స్వల్పంగా 6శాతం మంది ప్రయాణాలను ఎంపిక చేసుకోగా 5శాతం క్రమం తప్పకుండా యోగ, 3శాతం మద్యపానం తగ్గించడం, మరో 3శాతం పనిలో మెరుగైన తీరును ప్రతిబింబించేలా తీర్మానాలు చేసుకున్నారు. ఇక్కడ విచిత్రమైన విషయమేమంటే... ఆయా తీర్మానాలకు ఎక్కువ కాలం కట్టుబడి ఉండట్లేదు. ఇది సగటున కేవలం 4 నెలలు మాత్రమే కొనసాగుతోంది. 8శాతం మంది మాత్రమే నెల పాటు తమ లక్ష్యాల దిశగా ఆలోచిస్తున్నారు. 22 శాతం మంది రెండు/మూడు నెలలు, 13 శాతం మంది నాలుగు నెలలు కొనసాగిస్తుంటే, 6శాతం మాత్రమే ఏడాది పొడవునా అమలు చేస్తున్నారు.

ఫిట్‌నెస్ యాప్‌లపై నజర్

ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు యువత ఫిట్‌నెస్ యాప్‌లను ఆశ్రయించనున్నారు. 30 శాతం మంది తమ తీర్మానాలు ఒకటి నుంచి రెండేళ్లలోనే ప్రభావాన్ని చూపిస్తాయని నమ్మితే.. 57శాతం మంది మూడేళ్ల కంటే ఎక్కువ సమయం పడుతుందని అభిప్రాయపడ్డారు.



మంచి దొంగ.. పోలీసులు ఫిదా

చెన్నై: కోయంబత్తూర్‌లోని జ్యూయెల్ షాప్ జోస్ అలుక్కాస్‌లో నవంబర్ 28న ఓ దోపిడీ జరిగింది. ఆ షోరూమ్‌లో 3 కేజీల బంగారం ఎత్తుకెళ్లారు. విచారణలో చోరీ చేసింది విజయ్ మునిరత్నం అని గుర్తించారు. అతని ఇంటికి వెళితే విజయ్ ఎస్కేప్ అయ్యాడు గానీ, అతని భార్య, మూడు నెలల వయసున్న కుమార్తెను పోలీసులు అరెస్టు చేశారు. దొంగతనం చేసిన సొత్తులో చాలా మొత్తం రికవరీ చేశారు. అయితే కథ ఇక్కడితో అవ్వలేదు. విజయ్‌ను పట్టుకోవడానికి 47 మందితో ఐదు బృందాలను పోలీసులు ఏర్పాటు చేశారు. పరారీలో ఉన్న విజయ్.. తిరుపతి, శ్రీకాళహస్తి, నెల్లూరుల్లో తిరిగి చివరికి ఈనెల 11న చెన్నైలో పోలీసులకు చిక్కాడు. అన్ని కిలోల బంగారం అక్కడ ఉండగా కేవలం 3 కిలోలే ఎందుకు పట్టుకెళ్లావని విచారణలో విజయ్‌ని ప్రశ్నించగా.. అతను చెప్పింది విని పోలీసులు ఫిదా అయ్యారు. తనకు లక్ష రూపాయలు మాత్రమే చాలని, అందుకే ఎక్కువ పట్టుకెళ్లలేదని విజయ్ చెప్పాడు. ఇంకా విజయ్ ఏమి చెప్పాడంటే.. "నేను ఓ బస్, లారీ క్లీనర్‌ను. కోయంబత్తూర్‌లో ఇంటిని రెంట్‌కు తీసుకోవడం కంటే లీజుకు తీసుకోవడం బెటర్ అనిపించింది. దీని కోసం నా ఫ్రెండ్‌కు ఇవ్వడానికి లక్ష రూపాయలు కావాల్సి వచ్చింది. మొదట నేను సెల్ ఫోన్లు దొంగలించి ఆ సొమ్ము సంపాదించాలని అనుకున్నాను. కానీ ఆ షోరూమ్‌ల వద్ద జనం అర్ధరాత్రులు కూడా ఉండటంతో దొంగతనం కుదరలేదు. అందుకే బంగారం షోరూం ఎంచుకున్నాను. మొదట షోరూమ్‌లో డబ్బుకోసం చూశాను. డబ్బు దొరకలేదు. అక్కడ కిలోల కొద్దీ బంగారం ఉంది. వజ్రాలు కూడా ఉన్నాయి. కానీ నాకు కావాల్సిన డబ్బు మేరకే బంగారం తీసుకెళ్లాను" అని తెలిపాడు. మూడో ఫ్లోర్‌లో ఉన్న బంగారం షాపులోకి విజయ్ ఎలా ప్రవేశించాడో కూడా పోలీసులు తెలిపారు. అతను ఒక స్పైడర్‌మ్యాన్‌లా రెండు ఇరుకు గోడల మధ్య పాకుతూ.. నీళ్ల గొట్టాలను పట్టుకుని పైకి ఎక్కాడని, చాలా కష్టమైన పనిని విజయ్ సులువుగా పూర్తి చేశాడని చెప్పారు.

ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. వివరించే కార్యక్రమంలో భాగంగా..



ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రాణిగారితోటలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్



పశ్చిమగోదావరి జిల్లా ఉండిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం శిలగాంలో సంక్షేమ పథకాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు



పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలంలోని సారిక సచివాలయం వద్ద సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

■ తెలంగాణ

ద.మ.రైల్వే అధికారులకు అతి విశిష్ట రైలు సేవా పురస్కారాలు

సాక్షి, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వేకు చెందిన ఏడుగురు అధికారులకు జాతీయ స్థాయి అతి విశిష్ట రైలు సేవా పురస్కారాలు లభించాయి. డిసెంబర్ 15న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వారికి పురస్కారాలను అందించనున్నారు. కాజీపేటకు చెందిన డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ (కన్‌స్ట్రక్షన్) డీఎస్ రామారావు, విజయవాడ లోకోషెడ్ ట్రాక్షన్ రోలింగ్ స్టాక్ డివిజనల్ ఎలక్ట్రిక్ ఇంజనీర్ దినేశ్‌రెడ్డి, సికింద్రాబాద్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ మల్లెల శ్రీకాంత్, సికింద్రాబాద్ డివిజనల్ సిగ్నల్ టెలికమ్యూనికేషన్స్ ఇంజనీర్ శివకుమార్ కశ్యప్, నిజామాబాద్ రైల్వే రక్షక దళం సబ్ ఇన్‌స్పెక్టర్ టి.ప్రత్యూష, సికింద్రాబాద్ డీసీఎమ్ స్క్వాడ్ ముఖ్య టికెట్ ఇన్‌స్పెక్టర్ నటరాజన్, బీదర్ ట్రాక్ మెయింటెయినర్ గ్రేడ్–1 సీనియర్ సెక్షన్ ఇంజనీర్ రంగయ్యలకు వారివారి విభాగాల్లో విశిష్ట పనితీరుకుగాను ఈ పురస్కారాలు దక్కాయి. ఉత్తమ పనితీరు కనబరిచి, ఇతర సిబ్బందికి ఆదర్శంగా నిలిచిన వారిని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ అభినందించారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే పైచేయి

- 8–10 లోక్‌సభ సీట్లు గెలిచే అవకాశం
- బీఆర్‌ఎస్‌కు 3–5 స్థానాలు, బీజేపీకీ అంతే
- టైమ్స్ నౌ–ఈటీజీ ఒపీనియన్ పోల్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ఇప్పటికిప్పుడు పార్లమెంట్ ఎన్నికలు జరిగితే అధికార కాంగ్రెస్ పార్టీకి మెరుగైన ఫలితాలు దక్కే అవకాశం ఉందని ఈటీజీ సంస్థతో కలిసి టైమ్స్ నౌ చేపట్టిన ఒపీనియన్ పోల్‌లో వెల్లడైంది. పోల్ వివరాలను టైమ్స్ నౌ బుధవారం వెల్లడించింది. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు గాను కాంగ్రెస్ 8 నుంచి 10 స్థానాలు గెలిచే వీలుందని తెలిపింది. బీఆర్‌ఎస్ 3 నుంచి 5 స్థానాలు సాధించే అవకాశాలు కన్పిస్తున్నాయని పేర్కొంది. బీజేపీ కూడా కనిష్టంగా మూడు, గరిష్టంగా 5 స్థానాలు దక్కించుకునే వీలుందని తెలిపింది. వాస్తవానికి బీజేపీ 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 6.92 శాతం ఓట్లు సాధిస్తే, 2023లో 13.9 శాతం తెచ్చుకుంది. 8 అసెంబ్లీ స్థానాలను గెలుచుకుంది. అదే సమయంలో కాంగ్రెస్‌కు ఓటింగ్ 10.97 శాతం పెరిగింది. బీఆర్‌ఎస్‌కు ఓట్లు 9.52 శాతం తగ్గాయి.

మా పార్టీ సభ్యులను విడుదల చేయాలి

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్

చర్ల: వయోభారం, అనారోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తమ పార్టీ సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకుని తప్పుడు కేసులతో జైలులో పెట్టడం సరికాదని, వారిని వెంటనే విడుదల చేయాలని మావోయిస్టు పార్టీ డిమాండ్ చేసింది. మావోయిస్టు పార్టీ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శివర్గ సభ్యుడిగా, సెంట్రల్ టెక్నికల్ కమిటీ సభ్యుడిగా పనిచేసిన 74 ఏళ్ల వేంగ్ అలియాస్ గంగాధర్‌రావు, టెక్నికల్ విభాగం సభ్యురాలిగా పనిచేసిన ఆయన భార్య 60 ఏళ్ల భవాని వయోభారం, అనారోగ్య సమస్యలతో మంచిర్యాల జిల్లా ఇందారంలో చికిత్స పొందుతుండగా పోలీసులు అరెస్టు చేశారని పార్టీ వెల్లడించింది. ఈ సందర్భంగా పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ బుధవారం ఓ లేఖ విడుదల చేశారు. వీరికి మెరుగైన వైద్యం అందించడమే కాక జైలు నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వీరు పార్టీకి విరాళాల వసూళ్లు, యువతను నియమించడం, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడానికి వచ్చారంటూ పోలీసులు ప్రకటించడం సరికాదన్నారు. ఇలాంటి తప్పుడు కేసులతో సుదీర్ఘకాలం వారిని జైలులో నిర్బంధించాలనే కుట్ర జరుగుతోందని, తెలంగాణలో పుంజుకుంటున్న విప్లవోద్యమాన్ని అణచివేసేందుకే పోలీసులు ఇలావ్యవహరిస్తున్నారని అభయ్ మండిపడ్డారు.

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ శాసనసభ స్పీకర్‌గా వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్పీకర్ పదవికి బుధవారం ప్రసాద్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. గురువారం ఉదయం 10.30 గంటలకు శాసనసభ సమావేశాలు ప్రారంభమైన వెంటనే ప్రొటెమ్ స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ నూతన స్పీకర్ పేరును అధికారికంగా ప్రకటిస్తారు. అనంతరం ప్రసాద్‌కుమార్‌ను స్పీకర్ స్థానం వద్దకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు వివిధ పక్షాలకు చెందిన ఎమ్మెల్యేలు తీసుకొని వెళతారు. ఆపై నూతన స్పీకర్ ఎన్నికకు సంబంధించి అధికారపక్షం ప్రతిపాదించే ధన్యవాద తీర్మానంపై వివిధ పార్టీల ఎమ్మెల్యేలు మాట్లాడతారు. ప్రసాద్‌కుమార్ నామినేషన్ పత్రాలపై కాంగ్రెస్, బీఆర్‌ఎస్, ఎంఐఎం, సీపీఐ ఎమ్మెల్యేలు సంతకాలు చేశారు. అయితే స్పీకర్ ఎన్నికకు బీజేపీ ఎమ్మెల్యేలు దూరంగా ఉన్నారు. తెలంగాణ తొలి శాసనసభలో బీసీ సామాజికవర్గానికి చెందిన మధుసూదనాచారి స్పీకర్‌గా పనిచేయగా, రెండో శాసనసభలో ఓసీ సామాజికవర్గానికి చెందిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి స్పీకర్‌గా వ్యవహరించారు. ప్రస్తుత మూడో శాసనసభలో దళిత సామాజికవర్గానికి చెందిన గడ్డం ప్రసాద్‌కుమార్ స్పీకర్‌గా ఎన్నికయ్యారు.

విద్యుత్ పొదుపుతో భవిష్యత్‌కు వెలుగు

ప్రపంచవ్యాప్తంగా వచ్చే 39 ఏళ్లకు మాత్రమే సరిపడా విద్యుత్ ఉత్పత్తి వనరులు

- బొగ్గు కొరత, ఇతర కారణాలతో ఇప్పటికే పలు దేశాల్లో విద్యుత్ సంక్షోభం
- భవిష్యత్ తరాలకు విద్యుత్ అందించడంపై నిపుణుల ఆందోళన
- మరోవైపు ప్రత్యామ్నాయ ప్రాజెక్టులతో దేశానికే ఆదర్శంగా నిలిచిన ఆంధ్రప్రదేశ్



నేడు జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం

సాక్షి, అమరావతి: ఇంట్లో కావాల్సినంత వెలుతురు ఉంటుంది.. కానీ విద్యుత్ దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉంటాయి. బయటి నుంచి చల్లగాలి శరీరాన్ని తాకుతున్నా.. ఫ్యాన్లు, ఏసీలు ఆపడానికి ఇష్టపడం. ఈ విధంగా విద్యుత్ పొదుపులో మనం చేస్తున్న చిన్నపాటి నిర్లక్ష్యమే భవిష్యత్ తరాలకు తీవ్ర ఇబ్బందులు తీసుకువచ్చే ప్రమాదముంది. వచ్చే 39 ఏళ్లలో ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ ఉత్పత్తి వనరులు అంతరించిపోతాయని శాస్త్రవేత్తలు, నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పుడు మేలుకోకపోతే విద్యుత్ వెలుగులకు దూరమవ్వాల్సిన పరిస్థితి వస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ పొదుపుతో పాటు పర్యావరణంలో కర్బన ఉద్గారాలను తగ్గించడంపై దృష్టి సారించాలని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే భారత్ సహా అనేక దేశాలు విద్యుత్ పొదుపు చర్యలకు నడుం బిగించాయి. మన దేశంలో ఈ బృహత్తర యజ్ఞానికి ఆంధ్రప్రదేశ్ పెద్దపీట వేసి.. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది. విద్యుత్ ఉత్పత్తి కోసం ప్రత్యామ్నాయ ప్రాజెక్టులు చేపట్టింది. అలాగే జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం సందర్భంగా గురువారం నుంచి ఈ నెల 20 వరకు వారోత్సవాలను నిర్వహిస్తోంది.

బొగ్గు కొరతతో తిప్పలు..

ఇటీవల రష్యా, ఉక్రెయిన్ యుద్ధం వల్ల అణు విద్యుత్ కేంద్రాలు ధ్వంసమయ్యాయి. చైనా, ఆస్ట్రేలియాలో బొగ్గు కొరత వల్ల పలు దేశాలు విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. జపాన్ లోనూ విద్యుత్ సంక్షోభం నెలకొంది. శీతాకాలంలోనైనా వెచ్చదనాన్నిచ్చే దుస్తులు ఉపయోగించాలని.. హీటర్లకు వాడే విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలని అక్కడి ప్రభుత్వం తాజాగా ఆదేశాలిచ్చింది. అమెరికాలో గతేడాది కంటే 15 శాతం విద్యుత్ వినియోగంతో పాటు సహజ ఇంధన ధరలు పెరగడంతో అక్కడ ప్రతి ఆరు ఇళ్లలో ఒక ఇల్లు విద్యుత్ బకాయి చెల్లించలేని పరిస్థితి వచ్చింది. భారత్‌లో మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో 70 శాతం థర్మల్ నుంచే వస్తోంది. అలాంటి థర్మల్ కేంద్రాలకు బొగ్గు కొరత వల్ల ఇబ్బందులు తప్పడం లేదు.

భవిష్యత్ తరాల కోసం..

మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో ఇతర రాష్ట్రాల కంటే మెరుగ్గా విద్యుత్ సరఫరా చేసి రికార్డు సృష్టిస్తోంది. అలాగే భవిష్యత్‌లో విద్యుత్ కోసం ఇబ్బంది పడే పరిస్థితి రాకుండా ముందస్తు ప్రణాళికల అమలుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే 33,240 మెగావాట్ల సామర్థ్యంతో 29 పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. భవిష్యత్ విద్యుత్ అవసరాలకు ఇవి అందుబాటులోకి రానున్నాయి. మరోవైపు వ్యవసాయానికి 30 ఏళ్ల పాటు పగటిపూట 9 గంటలు ఉచిత విద్యుత్ అందించేందుకు 7 వేల మెగావాట్లను సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ నుంచి తీసుకుంటోంది. మన దేశంలో 2070 నాటికి కర్బన ఉద్గారాలను జీరో స్థాయికి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. దీనికి తోడ్పాటునందిస్తున్న మొదటి పది రాష్ట్రాల్లో ఏపీ స్థానం సంపాదించింది. ఇప్పటికే 4.76 మిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గించి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో ఏపీ.. 42 ఇంధన అవగాహన ఒప్పందాలను కుదుర్చుకుంది. పంప్డ్ స్టోరేజ్ హైడ్రో, గ్రీన్ హైడ్రోజన్, బయో డీజిల్, కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్రాజెక్టుల కోసం రాష్ట్రానికి దాదాపు రూ.9.57 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు రానున్నాయి. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు సైతం ఇంధన భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ప్రశంసిస్తున్నాయి. అయితే విద్యుత్ వెలుగులను భావితరాలకు అందించడానికి నేటి తరం కూడా తమ వంతు బాధ్యతగా విద్యుత్ పొదుపు పాటించాల్సిన అవసరముంది. ఆ దిశగా ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం ఇంధన పరిరక్షణ వారోత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది.



ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంపై రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ ఉత్పత్తి

ఈపీడీసీఎల్‌కు ఈఈఎస్ఎల్ ప్రశంసలు

సాక్షి, విశాఖపట్నం: ఈ ఆర్థిక సంవత్సరంలో ఏకంగా రూ.3,265.47 కోట్ల విలువైన 5,062.48 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఆదా చేసి ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీఈపీడీసీఎల్) ఆదర్శంగా నిలిచింది. ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన సమీక్షలో ఈపీడీసీఎల్‌ను ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీస్ లిమిటెడ్ సీఈవో విశాల్‌కపూర్ ప్రశంసించారు. అలాగే 2018–19 నాటికి 6.68 శాతంగా ఉన్న నష్టాలను.. 2023–24 సెప్టెంబర్ నాటికి 5.14 శాతానికి తగ్గించుకుంది. ఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ మాట్లాడుతూ.. 'ఇంధన పొదుపు సామర్థ్య కార్యక్రమాల నిర్వహణకు రాష్ట్ర ఇంధన శాఖ ప్రవేశపెట్టిన పాలసీని అమలుచేస్తూ విజయాలు సాధిస్తున్నాం. పరిశ్రమలు, భవన నిర్మాణ రంగం, మున్సిపల్, వ్యవసాయం, రవాణా రంగాల్లో ఇంధన పొదుపు ఎక్కువగా జరిగేలా చూస్తున్నాం. రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ వంటి ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై దృష్టి పెట్టాం. వినియోగదారులు చేస్తున్న ప్రతి ఫిర్యాదునూ పరిష్కరిస్తున్నాం' అని చెప్పారు.

■ తెలంగాణ

బస్తర్ అడవుల్లో పీఎల్‌జీఏ వారోత్సవాలు

వీడియోలు విడుదల చేసిన మావోయిస్టులు

చర్ల: ఈనెల 2 నుంచి 8వ తేదీ వరకు పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) 23వ వారోత్సవాలను జరుపుకోవాలని పిలుపునిచ్చిన మావోయిస్టు పార్టీ.. బస్తర్ అడవుల్లో వారోత్సవ సభ నిర్వహించినట్లు తెలిసింది. ఈ సభకు పెద్ద సంఖ్యలో మావోయిస్టులతో పాటు మిలీషియా సభ్యులు, కొరియర్లు, సానుభూతిపరులు హాజరైనట్లు సమాచారం. దీనికి సంబంధించి మావోయిస్టు పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ బుధవారం వీడియోలను విడుదల చేసింది. పాలస్తీనాకు మద్దతుగా మావోయిస్టులు భారీ ప్రదర్శన నిర్వహించి నినాదాలు చేసినట్లు వీడియోలో తెలుస్తోంది. అనంతరం సభావేదిక వద్ద భారత ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు, ఇజ్రాయెల్ ప్రధానికి వ్యతిరేకంగా నినాదాలు చేశాక దిష్టిబొమ్మలను దహనం చేసినట్లు వీడియోలో కనిపిస్తోంది. ఈ సందర్భంగా అమరులైన మావోయిస్టుల స్మారకార్థం ఏర్పాటు చేసిన స్థూపాలను పార్టీ ఆవిష్కరించినట్లు తెలుస్తోంది. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన మావోయిస్టులు ఎక్కువ సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరైనట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రాష్ట్ర అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి కొనసాగింపు?

- నచ్చజెప్పిన బీజేపీ జాతీయ నాయకత్వం
- అంగీకరించిన కేంద్రమంత్రి!

సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని కొనసాగించాలని ఆ పార్టీ జాతీయ నాయకత్వం నిర్ణయించినట్టు సమాచారం. కాగా అందుకు ఆయన అంగీకరించారని పార్టీలో ప్రచారం జరుగుతోంది. గతంలో బండి సంజయ్ స్థానంలో నియమించినప్పుడే.. శాసనసభ ఎన్నికల దాకే ఆ బాధ్యతలు నిర్వహిస్తానని కిషన్‌రెడ్డి నాయకత్వానికి చెప్పారని, అదీగాక ఈ ఎన్నికల్లో పార్టీ ఆశించిన ఫలితాలు సాధించక పోవడంతో తనను బాధ్యతల నుంచి తప్పించాల్సిందిగా కోరారని తెలిసింది. సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి పూర్తి సమయం కేటాయించాలని కిషన్‌రెడ్డి భావిస్తున్నట్టు చెబుతున్నారు. అయితే లోక్‌సభ ఎన్నికలు ముగిసేదాకా కొనసాగాలని నాయకత్వం ఆయనకు నచ్చజెప్పినట్టు సమాచారం. దీంతో పార్లమెంటు ఎన్నికల దాకా కొనసాగేందుకు ఆయన ఒప్పుకున్నట్టుగా పార్టీలో ప్రచారం జరుగుతోంది. మరో 3, 4 నెలల్లోనే ఈ ఎన్నికలు జరగాల్సి ఉండగా, ఫిబ్రవరిలోనే షెడ్యూల్ వెలువడే అవకాశం ఉండడంతో.. ఇంత తక్కువ వ్యవధిలో కొత్త అధ్యక్షుడు కుదురుకోవడం సాధ్యం కాదని బీజేపీ నాయకత్వం అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. కీలకమైన ఎన్నికలు కావడంతో పాటు తెలంగాణ నుంచి అధిక సీట్లు (గతంలో గెలిచిన 4 సీట్ల కంటే ఎక్కువగా) గెలిచేందుకు అవకాశం ఉందన్న అంచనాల మధ్య కిషన్‌రెడ్డినే కొనసాగించాలని భావించినట్టు సమాచారం.

భట్టి అధికార నివాసంగా ప్రజాభవన్

సాక్షి, హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అధికార నివాసంగా వినియోగించిన ప్రగతిభవన్ (ప్రజాభవన్)ను ఇకపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికార నివాసంగా వినియోగించుకోనున్నారు. ప్రస్తుత సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి తన సొంత ఇంటినే అధికార నివాసంగా ఎంచుకోవడంతో.. రాష్ట్ర ప్రభుత్వం డిప్యూటీ సీఎంకు ఈ భవనాన్ని కేటాయించింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. భట్టి మంగళవారమే ప్రజాభవన్‌ను పరిశీలించి అంగీకరించినట్టు తెలిసింది. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, ఎవరు ముఖ్యమంత్రి అయినా.. అధికారిక నివాసంగా వినియోగించుకునే ఉద్దేశంతో గత బీఆర్‌ఎస్ సర్కారు ప్రగతిభవన్‌ను నిర్మించింది. ఇందులో విశాలమైన ప్రాంతంలో సీఎం నివాసాన్ని, దాని పక్కనే మరో భవనాన్ని కట్టించింది. నిజానికి ప్రగతిభవన్‌ను నిర్మించడానికి ముందే.. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సీఎం అధికార నివాసం, క్యాంపు కార్యాలయం కోసం భవనాలు నిర్మించారు. వైఎస్సార్ ఆ అధికార నివాసంలో ఉంటూ.. పక్కనే ఉన్న క్యాంపు కార్యాలయంలో అధికారుల కోసం ఏర్పాట్లు చేయించారు. అక్కడే ప్రతీరోజు ప్రజలను కలుసుకునే వారు. వైఎస్సార్ ఆకస్మిక మరణం తర్వాత తదుపరి సీఎంలు రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి ఆ అధికార నివాసాన్ని వినియోగించలేదు. క్యాంపు కార్యాలయాన్నే వినియోగించుకున్నారు. 2014లో కేసీఆర్ సీఎం అయ్యాక ఆ ప్రాంతంలోని భవనాలన్నింటినీ తొలగించి ప్రగతిభవన్‌ను నిర్మించారు. దీనిని ఇప్పుడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు అధికార నివాసంగా కేటాయించారు. పక్కనే ఉన్న మరో భవనంలో ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

కేసీఆర్‌కు ప్రముఖుల పరామర్శ

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును బుధవారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. కేసీఆర్‌ను పరామర్శించిన వారిలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మాజీ కేంద్ర మంత్రి రేణుకా చౌదరి, సినీ నటుడు నాగార్జున ఉన్నారు. కేసీఆర్‌ను పరామర్శించిన వారిలో మాజీ మంత్రి హరీశ్‌రావు, కొప్పుల ఈశ్వర్, లక్ష్మారెడ్డి, జగదీశ్‌రెడ్డి, కడియం శ్రీహరి, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి ఉన్నారు.



కుళాయిల ఏర్పాటు పనులు పర్యవేక్షిస్తున్న పొందుగల మహిళలు

పొందుగల పొదుపు మహిళల సత్తా

15 రోజుల్లోనే పనులు పూర్తి..

గ్రామంలోని ఎస్టీ కాలనీకి చెందిన 65 కుటుంబాలను సర్వే చేయగా 50 కుటుంబాలకు కుళాయిలు అవసరమని తేలింది. వీధి పంపులకు అనుసంధానం చేస్తూ 35 కుళాయిలతో 50 కుటుంబాలకు నీటి సరఫరాను అందించేందుకు రూ.3.50 లక్షల వ్యయానికి అంచనాలు రూపొందించారు. పనుల నిర్వహణకు ఏడుగురు పొదుపు సంఘాల సభ్యులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌తో గ్రామ స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. 'కమ్యూనిటీ కాంట్రాక్టింగ్ వర్క్స్ కమిటీ, పొందుగుల' పేరిట బ్యాంక్ ఖాతా తెరిచారు. 54 మీటర్ల మేర ప్రధాన పైపులైను, 350 మీటర్ల అంతర్గత పైపులైనుతో 35 కుళాయిలు బిగించాలనేది ఒప్పందం. అయితే 35 కుళాయిలకు బదులు 50 ఏర్పాటు చేశారు. అంతేకాకుండా అంచనా వ్యయం కంటే తక్కువగా రూ.2.55 లక్షల్లోనే ముగించారు. తద్వారా ప్రభుత్వానికి రూ.95 వేలు ఆదా చేయగలిగారు. అలాగే పనులు పూర్తి చేసేందుకు నెల రోజులు గడువు ఇవ్వగా 15 రోజుల్లోనే పనులు పూర్తిచేసి రికార్డు సృష్టించారు.

జలజీవన్ మిషన్ కుళాయిల ఏర్పాటుకు పొందుగల గ్రామాన్ని ఎంపిక చేసిన కేంద్రం

- కమ్యూనిటీ కాంట్రాక్ట్ విధానం ద్వారా గ్రామ పొదుపు సంఘాల మహిళలకు పనులు
- నిర్ణీత కాలం కంటే ముందే పూర్తి చేసి రికార్డు
- అంచనా కంటే తక్కువ వ్యయంతోనే కుళాయిల ఏర్పాటు
- ప్రభుత్వానికి రూ.95 వేలు ఆదా
- జిల్లా కలెక్టర్ నుంచి ప్రశంసలు





గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం పొందుగల గ్రామ పొదుపు సంఘాల మహిళలు రికార్డు సృష్టించారు. జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయిల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో పొందుగల గ్రామాన్ని ఎంపిక చేసింది. కమ్యూనిటీ కాంట్రాక్ట్ విధానంలో ఈ పనులు దక్కించుకున్న పొందుగల పొదుపు సంఘాల మహిళలు అంచనా కంటే తక్కువ వ్యయంతోనే పూర్తి చేసి సత్తా చాటారు. ఒప్పందం చేసుకున్న వాటి కంటే అదనంగా కుళాయిలను ఏర్పాటు చేయడమే కాకుండా నిర్దేశిత సమయం కంటే ముందుగానే పనులు పూర్తి చేశారు. తద్వారా జిల్లా కలెక్టర్ నుంచి ప్రశంసలు సైతం అందుకున్నారు. అలాగే రాష్ట్రంలో ఇతర మహిళా సంఘాలకు స్ఫూర్తిగా నిలిచారు.

రాష్ట్రంలోనే మొదటిసారి..

2024 చివరి నాటికి వ్యక్తిగత గృహ కుళాయి కనెక్షన్ల ద్వారా స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ పథకాన్ని ప్రారంభించింది. ప్రజల భాగస్వామ్యంతో ఉద్యమ పంథాలో తాగునీటిని సరఫరా చేయాలన్నదే పథకం ఉద్దేశం. ఇందులో భాగంగా కుళాయిల ఏర్పాటు పనులను కమ్యూనిటీ కాంట్రాక్టు విధానంలో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోనే మొదటిసారి పొందుగుల గ్రామాన్ని ఎంపిక చేసింది. ఈ గ్రామ సమాఖ్య.. కమ్యూనిటీ కాంట్రాక్ట్ విధానంలో ఈ పనులు చేపట్టేందుకు ఒప్పందం చేసుకుంది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ), పంచాయతీరాజ్ అధికారులు గ్రామాన్ని సందర్శించి కమ్యూనిటీ కాంట్రాక్ట్ విధానంపై పొదుపు సంఘాల మహిళలకు అవగాహన కల్పించారు.


అత్యంత నాణ్యతతో నిర్మాణం



వర్క్ ప్రపోజల్ రావడంతోనే లబ్ధిదారుల ఎంపిక ప్రారంభించాం. నాణ్యత కలిగిన పైపులు, ఇతర సామగ్రి కోసం స్వయంగా నాలుగైదు కంపెనీలను సంప్రదించాం. చివరకు మంచి నాణ్యత కలిగిన మెటీరియల్‌ను ఎంపిక చేశాం. రూ.3.50 లక్షలతో అంచనాలు రూపొందించినా రూ.2.55 లక్షల్లోనే పనులు పూర్తిచేసి ప్రభుత్వానికి రూ.95 వేలు ఆదా చేయగలిగాం. రోజుకు ముగ్గురు చొప్పున పనులు పర్యవేక్షించి 15 రోజుల వ్యవధిలోనే పైపులైన్, కుళాయిల నిర్మాణాన్ని పూర్తి చేశాం.

– భూక్యా ఆదిలక్ష్మి, అధ్యక్షురాలు, వర్క్స్ కమిటీ

ఏ పని అప్పగించినా చేయగలమని నిరూపించారు..



పొందుగల గ్రామ సమాఖ్య మహిళలు నిర్ణీత సమయానికి కంటే ముందే పనులు చేశారు. ఏ పని అప్పగించినా చేయగలమని నిరూపించారు. తద్వారా తోటి పొదుపు సంఘాల మహిళలకు స్ఫూర్తిగా నిలిచారు.

– కె.శ్రీనివాసరావు, పీడీ, డీఆర్‌డీఏ

కమ్యూనిటీ కాంట్రాక్టు విధానం అంటే..

పొదుపు సంఘాల్లోని మహిళలను భాగస్వాములను చేసి గ్రామాల్లో పారదర్శకంగా మౌలిక సదుపాయాలను కల్పించడం. స్థానిక వనరులను వీలైనంత ఎక్కువగా ఉపయోగించుకోవడం. సభ్యుల్లో సామాజిక భావన, యాజమాన్య భావన, స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించడం, జవాబుదారీతనం పెంచడం.

క్లుప్తంగా...

హజ్ చార్జీలు తగ్గించండి

- కేంద్రమంత్రి స్మృతి ఇరానీకి సీఎం జగన్ విజ్ఞప్తి
- వినతిపత్రాన్ని అందజేసిన ఎంపీలు విజయసాయిరెడ్డి, అవినాష్, శ్రీకృష్ణదేవరాయలు



సాక్షి, న్యూఢిల్లీ: హజ్ యాత్రికుల కోసం విజయవాడలో ఏర్పాటు చేసిన ఎంబార్కేషన్ నుంచి చార్జీలు తగ్గించాలని కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి స్మృతి ఇరానీకి సీఎం వైఎస్ జగన్ విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్, ముంబయి, బెంగళూరు ఎంబార్కేషన్ పాయింట్లతో పోలిస్తే విజయవాడ నుంచి రూ.85 వేలు ఎక్కువ అవుతోందని తెలిపారు. 2023 హజ్‌యాత్ర సమయంలో ఏపీలో ఇదే విధంగా చార్జీలు తగ్గించాలని వినతిపత్రం అందజేశామని, ఆసమయంలో తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారని గుర్తుచేశారు. 2024 హజ్ యాత్రకు సంబంధించి నవంబర్ 29న హజ్ కమిటీ నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. ఇతర ఎంబార్కేషన్ పాయింట్లతో చూస్తే విజయవాడ నుంచి అధికంగా చార్జీలు ఉన్నాయన్నారు. ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించి చార్జీలు తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. ఈ వినతిపత్రాన్ని బుధవారం వైఎస్సార్‌సీపీ ఎంపీలు విజయసాయిరెడ్డి, అవినాష్‌రెడ్డి, లావు శ్రీకృష్ణదేవరాయలు కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి అందజేశారు. హజ్ యాత్రికుల ఇబ్బందిని పరిష్కరించాలని కోరారు.

పార్లమెంట్ ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

వైఎస్సార్‌సీపీ ఎంపీ మార్గాని భరత్



రాజమహేంద్రవరం రూరల్: పార్లమెంట్‌లో ఆగంతకుల కలకలం సమాచారం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ సమావేశ హాలులోకి ప్రవేశించడం సాధారణ విషయం కాదని, ఎంపీలకే మూడంచెల తనిఖీ ఉంటుందని చెప్పారు. అటువంటిది ముగ్గురు ఆగంతకులు ఎలా లోపలకు వెళ్లారనేది ఆశ్చర్యంగా ఉందన్నారు. షూష్‌లో టియర్ గ్యాస్ షెల్స్ పెట్టుకెళ్లి సభలో విసిరినట్లు టీవీల్లో వస్తున్న సమాచారాన్ని బట్టి తెలిసిందన్నారు. ఇది పూర్తిగా భద్రతా వైఫల్యమేనని చెప్పారు.

ప్రత్యేక హోదాకు మద్దతు ఇవ్వండి

ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా విద్యార్థి, యువజన జేఏసీ

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా విషయంలో మద్దతు ఇవ్వాలని ఎంపీలు, వివిధ రాజకీయ పార్టీల నేతలకు ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా విద్యార్థి, యువజన జేఏసీ నేతలు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా విద్యార్థి, యువజన జేఏసీ ఆధ్వర్యంలో రెండవ రోజు నిరసనలు కొనసాగాయి. జేఏసీ అధ్యక్షుడు షేక్ జిలానీ నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ఎంపీలు ఆర్.కృష్ణయ్య, బీద మస్తాన్‌రావు, బీజేపీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్, జాతీయ యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఎలవూరు కృష్ణను కలిసి తమ పోరాటానికి మద్దతు ఇవ్వాలని వినతి పత్రాలు అందజేశారు. పార్లమెంటులో డిమాండ్‌ను లేవనెత్తి సాధన కోసం కృషి చేస్తామని ఎంపీలు హామీ ఇచ్చారు. ప్రత్యేక హోదా సాధనకు తమ సహకారం ఉంటుందని కాంగ్రెస్, బీజేపీ నేతలు భరోసా ఇచ్చారు.

ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణకు నాన్ బెయిలబుల్ వారెంట్

ఎడిటర్ సహా మరో నలుగురికి కూడా..

జగ్గయ్యపేట అర్బన్: ఆంధ్రజ్యోతి మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ, ఎడిటర్ శ్రీనివాస్‌తో పాటు మరో నలుగురికి ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట అదనపు మున్సిఫ్ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీచేసింది. స్థానికంగా ఉన్న ఒక సాయంకాల పత్రిక ఎడిటర్‌పై గతంలో ఆంధ్రజ్యోతి దినపత్రికలో అవమానకరమైన రీతిలో వార్తలను ప్రచురించారు. దీనిపై సదరు దినపత్రిక ఎడిటర్ జగ్గయ్యపేట సీనియర్ న్యాయవాది సామినేని వెంకటేశ్వరరావు ద్వారా జగ్గయ్యపేట కోర్టులో 2017లో కేసు వేశారు. ఈ కేసులో ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ, ఎడిటర్ శ్రీనివాస్, కృష్ణాజిల్లా ఇన్‌చార్జ్ మాధవి, జగ్గయ్యపేట పట్టణ, రూరల్ విలేకరులకు కోర్టు సమన్లు జారీచేసింది. వీరు గతంలో కూడా కోర్టుకు హాజరుగాకపోవడంతో ఎండీ రాధాకృష్ణతో పాటు మిగిలిన వారికి నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీచేయగా, వారంతా కోర్టుకు హాజరై రీకాల్ చేసుకున్నారు. బుధవారం జగ్గయ్యపేట కోర్టులో వాయిదాకు హాజరు కానందున ఎండీ వేమూరి రాధాకృష్ణ, ఎడిటర్ శ్రీనివాస్, జిల్లా ఇన్‌చార్జ్ మాధవి, జగ్గయ్యపేట టౌన్, రూరల్ విలేకరులకు న్యాయాధికారి నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీచేశారని న్యాయవాది వెంకటేశ్వరరావు తెలిపారు.

దేశ మౌలిక రంగంలో 10% ఏపీలోనే

దేశవ్యాప్తంగా రూ.70 లక్షల కోట్ల విలువైన మౌలిక రంగ నిర్మాణాలు

- వీటిలో ఒక్క ఏపీలోనే 6.75 లక్షల కోట్ల పనులు
- దక్షిణాదిలో మౌలిక వసతులపై అత్యధికంగా ఖర్చు చేస్తున్న రాష్ట్రం ఏపీ
- ఏపీ మీదుగా నాలుగు ఆర్థిక కారిడార్లు
- పేదరిక నిర్మూలన, విద్య, వైద్యానికి తొలి ప్రాధాన్యం ఇస్తున్న ఏకైక సీఎం జగన్
- పేదలకు ఇచ్చే సంక్షేమాన్ని సోమరితనంతో పోల్చడం సిగ్గు చేటు
- ఇదే సుస్థిర పాలన కొనసాగితే మరో పదేళ్లలో సింగపూర్‌లా ఏపీ
- ఏపీ ప్రజల మెదళ్లను కలుషితం చేస్తున్న ఎల్లో మీడియా
- ఏపీలో మౌలిక రంగం అభివృద్ధి నాడు – నేడు'పై సదస్సులో విద్యావేత్తలు, మేధావులు

సాక్షి, అమరావతి: 'వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మౌలిక రంగ అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ దూసుకెళ్తోంది. దేశవ్యాప్తంగా రూ.70 లక్షల కోట్ల విలువైన మౌలిక రంగ నిర్మాణాలు జరుగుతుంటే, వీటిలో ఒక్క ఏపీలోనే 6.75లక్షల కోట్ల పనులు చేస్తున్నారు. అంటే 10 శాతం అభివృద్ధి ఒక్క ఏపీలోనే జరుగుతోంది. దక్షిణ భారతదేశంలోనే ఆంధ్రప్రదేశ్ మౌలిక రంగంపై అత్యధికంగా ఖర్చు చేస్తోంది. పారిశ్రామిక రంగంలో 23.36 శాతం వృద్ధి రేటుతో 2022–23లో ఏపీ అగ్రస్థానంలో ఉంది. వాస్తవ స్థితి ఇలా ఉంటే ఎల్లో మీడియా మాత్రం విష ప్రచారం చేయడం శోచనీయం' అని ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'ఆంధ్రప్రదేశ్‌లో మౌలిక రంగం అభివృద్ధి నాడు – నేడు' అంశంపై బుధవారం విజయవాడలో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో విద్యావేత్తలు, మేధావులు చెప్పారు. 'గత నాలుగున్నరేళ్లుగా మౌలిక రంగంలో ఏపీ సాధిస్తున్న ప్రగతిని జాతీయ స్థాయి సంస్థలు సైతం ప్రశంసిస్తున్నాయి. నాలుగు ఎకనమిక్ కారిడార్లతో వాణిజ్యానికి కేంద్ర బిందువుగా రాష్ట్రం మారుతోంది. ఈస్ట్ కోస్ట్, విశాఖ – చెన్నై, చెన్నై – బెంగళూరు, హైదరాబాద్ – బెంగళూరు ఆర్థిక కారిడార్లతో ప్రత్యక్షంగా 10 లక్షలు, పరోక్షంగా 17 లక్షల మందికి ఉపాధి లభిస్తుంది. ఏపీలో పోర్టుల ద్వారా 2 వేల రకాల ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఆగ్నేయ ఆసియా దేశాలకు నేరుగా నౌకలను పంపించి వాణిజ్యం చేయగల సత్తా ఏపీ సొంతమైంది' అని తెలిపారు. గత ప్రభుత్వాలు ప్రచార పిచ్చితో రాష్ట్రాన్ని చీకటి యుగంగా మార్చేస్తే.. సీఎం జగన్ పేదల కోసం 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వడం ద్వారా రూ. 2 లక్షల కోట్లకుపైగా సంపద సృష్టించారని ప్రశంసించారు. తప్పుడు కథనాలు అచ్చేసి పత్రికలు ఉచితంగా పంచినంత మాత్రాన ఎల్లో మీడియా వాస్తవాలను దాచిపెట్టలేదని అన్నారు. సదస్సులో మేధావుల అభిప్రాయాలు వారి మాటల్లోనే..

సీఎం జగన్ గొప్ప రాజనీతిజ్ఞుడు



పేదలకు సంక్షేమ పథకాలు ఇస్తే సోమరిపోతులు అయిపోతారనడం సిగ్గుచేటు. దశాబ్దాల సుస్థిర పాలన నడిచింది కాబట్టే సింగపూర్ గొప్ప దేశంగా ఆవిర్భవించింది. ఏపీలోనూ సుస్థిర పాలన కొనసాగిస్తే ఇక్కడే సింగపూర్‌ను చూడొచ్చు. అప్పుడు విదేశీయులు ఇక్కడికి వచ్చి ఉద్యోగాలు చేస్తారు. ఒక దేశానికి ఉండాల్సిన లక్షణాలు ఏపీకి ఉన్నాయి. సుదీర్ఘ తీర ప్రాంతం, పర్యాటకం, గనులు, మానవ వనరుల సామర్థ్యం ఉంది. వీటిని సద్వినియోగం చేసుకుంటూ సీఎం జగన్ పాలన చేస్తున్నారు. 23 సార్లు ప్రధాన మంత్రిని కలిసి, రాష్ట్ర అభివృద్ధిపై చర్చించిన సీఎం జగన్ ఒక్కరే. కేంద్రంతో మంచి సంబంధాలు ఉన్నాయి కాబట్టే పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతోంది. సీఎం జగన్ రాజకీయ నాయకుడి నుంచి రాజనీతిజ్ఞుడిగా ఎదిగారనడానికి ఇదే నిదర్శనం.

– వీవీఆర్ కృష్ణంరాజు, ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

బిల్డింగులు మాత్రమే అభివృద్ధా?



రాష్ట్రంలో గ్రామీణ జనాభా ఎక్కువ. అందుకే సీఎం వైఎస్ జగన్ పాఠశాలలు, ఆస్పత్రులు, గ్రామ, వార్డు సచివాలయాల రూపంలో గ్రామాల్లోనే పెద్ద ఎత్తున మౌలిక వసతులను పెంచారు. పట్టణాల్లో నాలుగు బిల్డింగులు కట్టేసి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇస్తేనే అభివృద్ధా? పాఠశాలలను బాగు చేయడాన్ని ఎందుకు అభివృద్ధిగా చూడలేరు? సుదీర్ఘ తీర ప్రాంతం ఉన్న ఏపీలో 4 పోర్టులు, 6 సెజ్‌లు, 10 హార్బర్లు వచ్చాయి. గతంలో ఇవన్నీ ఎందుకు తేలేకపోయారు? రాష్ట్రంలో రూ.66 వేల కోట్లకుపైగా పెట్టుబడులతో 120 భారీ పరిశ్రమలు వచ్చాయి. 83 వేల మందికి ఉపాధినిస్తున్నాయి. మరో 3.85 లక్షల కోట్ల పెట్టుబడులతో 86 ప్రాజెక్టులు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. వీటి ద్వారా మన యువతకు 2.63 లక్షల ఉద్యోగాలు వస్తాయి. 2 లక్షలకు పైగా ఎంఎస్ఎంఈ యూనిట్లలో 13 లక్షల మంది ఉపాధి పొందుతున్నారు. ఇవన్నీ ఏపీ ప్రగతికి సూచికలే.

– వెంకట్ మేడపాటి, ఏపీ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ అధ్యక్షుడు

మేధావులు మౌనం వీడాలి..



గతంలో ఎల్లో పత్రికలకు కోట్ల రూపాయలు దోచిపెట్టారు. సీఎం జగన్ రావడంతో అవన్నీ ఆగిపోయాయి. అందుకే వాళ్లకు కడుపు మంట. తప్పుడు రాతలు రాస్తున్నారు. ఇలాంటి సమయంలో మేధావుల మౌనం టెర్రరిస్టుల విధ్వంసం కంటే దారుణమైనది. మేధావులు మౌనం వీడాలి. ఏనాడూ ఊహించని ప్రభుత్వ పాఠశాలలలో అంతర్జాతీయ స్థాయి విద్యనుసీఎం జగన్ సాధ్యం చేసి చూపించారు. ఓట్ల కోసమే అయితే బడులు ఎందుకు బాగు చేయడం? ఆయన పిల్లల భవిష్యత్తు కోసం ఆలోచించారు. ఉద్యోగాలు ఇవ్వట్లేదని గుండెలు బాదుకుంటున్న ఎల్లో మీడియా.. చంద్రబాబు హయాంలో 13,700 ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారన్న విషయాన్ని దాచి పెడుతోంది. సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే 1.30 లక్షలకు పైగా గ్రామ/వార్డు సచివాలయాల్లో ఉద్యోగాలిచ్చారు. ఇప్పటివరకు 2 లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చారు.

– మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బెటర్ ఏపీ సంస్థ అధ్యక్షుడు

సంక్షేమం వృథా కాదు



ఆంధ్రప్రదేశ్‌లో 2014–19 వరకు చీకటి పాలన నడిచింది. అప్పటి అప్పులు, తప్పులను సరిదిద్దుతూ ఇప్పుడు సీఎం జగన్ సంక్షేమ పాలన అందిస్తున్నారు. దీనిని జీర్ణించుకోలేని ఎల్లో మీడియా బురద జల్లుతోంది. సామాజిక అభివృద్ధి లేకుండా ఆర్థిక అభివృద్ధి సాధ్యపడదు. అందుకే సీఎం జగన్ విద్యపైనే దృష్టి పెట్టారు. సంక్షేమం చేస్తే ప్రజాధనం వృథా కాదు.

– ఎన్.రాజశేఖర్ రెడ్డి, ఓపెన్ మైండ్స్ సంస్థ అధ్యక్షుడు

ఇబ్బందులకు వెరవని సీఎం జగన్



సీఎం జగన్ పేదల కోసం ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వెనుకడుగు వేయట్లేదు. లోటు బడ్జెట్‌లోనూ సంక్షేమాన్ని విస్మరించకుండా సమర్థవంతంగా పాలన సాగిస్తున్నారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో నైపుణ్యం కలిగిన మానవ వనరుల అభివృద్ధి జరుగుతోంది. మరో పదేళ్లు సీఎం జగన్ అధికారంలో ఉంటే ఏపీ సింగపూర్ అవ్వడం ఖాయం. టీడీపీకి మరొక్కసారి అధికారం ఇస్తే 50 ఏళ్లు వెనక్కి తీసుకెళ్తారు.

– అశోక్ కుమార్, ఆంధ్ర అడ్వొకేట్స్ ఫోరమ్ కన్వీనర్

పిల్లాడు బడికెళ్తే ఆ కుటుంబం జీవితమే మారిపోతుంది



ప్రపంచంలో ఏ దేశమైనా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల దిశగానే పయనిస్తేనే అభివృద్ధి సాధ్యం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో ప్రాధానమైన పేదరికం నిర్మూలన, విద్య, వైద్యంపై ఎక్కువ దృష్టి సారించారు. ఒక పిల్లాడిని బడికి పంపించడం ద్వారా ఆ కుటుంబం జీవితమే మారిపోతుంది. అందుకే ఏ ప్రభుత్వం చేయని విధంగా రూ. 1.12 లక్షల కోట్లు విద్యపైనే ఖర్చు చేశారు. విద్య, వైద్యం ఉచితంగా ఇవ్వడంతో పేదలపై ఆర్థిక భారం తగ్గిపోయింది. బలహీన వర్గాలకు ప్రైవేటు వర్సిటీల్లో విద్య చెప్పిస్తున్న ఏకైక ప్రభుత్వం ఇదే. పేదరికాన్ని అరికట్టడంలో తెలంగాణకంటే ఏపీ గణనీయమైన వృద్ధిని సాధించింది. అందుకే మేలు జరిగితేనే ఓటు వేయమని ధైర్యంగా అడిగిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే.

– ఇ.శ్రీనివాసరెడ్డి, ఆచార్య నాగార్జున వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్

సీబీఐకి అప్పగిస్తే అభ్యంతరం లేదు

- స్కిల్ కుంభకోణం దర్యాప్తుపై హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఈడీకి అప్పగించినా అభ్యంతరం లేదు
- అసైన్డ్ భూములు, ఫైబర్‌నెట్ కుంభకోణాలపై గతంలోనే సీబీఐ దర్యాప్తు కోరాం
- రాష్ట్రంలో ఎక్కడైనా దర్యాప్తు చేసేందుకు సీబీఐకి అనుమతి సైతం ఇచ్చాం
- హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసిన హోంశాఖ ముఖ్య కార్యదర్శి
- పలువురు నోటీసులను తిరస్కరించారని ఉండవల్లి వెల్లడి
- వారికి నోటీసులు అందజేయాలని ఉండవల్లి అరుణ్‌కుమార్‌కు చెప్పిన ధర్మాసనం
- తదుపరి విచారణ 2 వారాలకు వాయిదా

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం దర్యాప్తును సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) లేదా ఏ దర్యాప్తు సంస్థకు అప్పగించినా అభ్యంతరం లేదని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం తీవ్రత దృష్ట్యా దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని కోరుతూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాద రావు, జస్టిస్ మండవ కిరణ్మయి ధర్మాసనం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా దర్యాప్తును సీబీఐకి అప్పగించినా అభ్యంతరం లేదంటూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున హోంశాఖ ముఖ్య కార్యదర్శి హరీష్ కుమార్ గుప్తా కౌంటర్ దాఖలు చేశారు. ఈ కుంభకోణంలో పలు చిక్కులున్నాయని రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్‌లో పేర్కొంది. మనీలాండరింగ్ కూడా జరిగిందని వివరించింది. సీఆర్‌డీఏ పరిధిలో జరిగిన అసైన్డ్ భూముల కుంభకోణం, ఏపీ ఫైబర్‌నెట్ కుంభకోణాలపై 2020లోనే సీఐడీ దర్యాప్తు చేపట్టిందని, వీటిపై దర్యాప్తు చేయాలని సీబీఐని కూడా కోరినట్లు తెలిపింది. సీబీఐ రాష్ట్రంలో దర్యాప్తు చేసేందుకు సూత్రప్రాయ అంగీకారం కూడా తెలిపామంది. ఇందుకు జీవోలు కూడా జారీ చేశామని తెలిపింది. ఉండవల్లి వ్యాజ్యంలో కోర్టు ఏ ఆదేశాలు జారీ చేసినా కట్టుబడి ఉంటామని తెలిపింది. కోర్టు ఆదేశాల మేరకు కౌంటర్ దాఖలు చేశామని రాష్ట్ర ప్రభుత్వం తరఫున



అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్. శ్రీరామ్ తెలిపారు.

ఇతర మార్గాల్లో నోటీసులు పంపేందుకు అనుమతివ్వండి

నోటీసులు ఎవరికి అందాయి, ఎవరికి అందలేదని ధర్మాసనం ప్రశ్నించగా.. కొందరికి అందాయని, కొందరు తిరస్కరించారని, డోర్ లాక్, ఇంట్లో లేరు వంటి కారణాలతో కొన్ని వెనక్కి వచ్చాయని ఉండవల్లి తరఫు సీనియర్ న్యాయవాది కేజీ కృష్ణమూర్తి వివరించారు. నోటీసులు అందని వారికి పత్రికలు, వాట్సాప్, ఇతర మార్గాల్లో పంపేందుకు అనుమతివ్వాలని కోరారు. సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ.. ఇప్పటి వరకు సీఐడీ చేసిన దర్యాప్తు వివరాలతో ఓ నివేదికను కోర్టు ముందుంచుతామని తెలిపారు. ప్రతివాదులందరికీ నోటీసులు వెళ్లాక నివేదికపై నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం తెలిపింది. నోటీసులు అందని వారికి వాటిని అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని ఉండవల్లిని ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

మా అప్పీళ్ల విచారణార్హతపై అభ్యంతరం ఉంటే అనుబంధ పిటిషన్లు వేసుకోమనండి

- అప్పుడు ఆ పిటిషన్లను ముందు తేల్చాల్సి ఉంటుంది
- ఆ తర్వాత కేసు లోతుల్లోకి వెళ్లాల్సి ఉంటుంది
- సీఐడీ తరఫున హైకోర్టుకు నివేదించిన అడ్వొకేట్ జనరల్

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆర్థిక అవకతవకలు, ఇతర చట్ట ఉల్లంఘనలపై రామోజీరావు, శైలజా కిరణ్‌లతో పాటు ఆ సంస్థకు చెందిన పలువురు కీలక వ్యక్తులు, ఉద్యోగులపై నమోదు చేసిన కేసులో తాము దాఖలు చేసిన చార్జిషీట్‌లను గుంటూరు, విశాఖపట్నంలలోని డిపాజిటర్ల పరిరక్షణ చట్టం ప్రత్యేక కోర్టులు 'రిటర్న్' చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ సీఐడీ దాఖలు చేసిన అప్పీళ్లపై విచారణ 19కి వాయిదా పడింది. ఈ అప్పీళ్ల విచారణార్హతపై అభ్యంతరం ఉంటే ఆ అభ్యంతరాలను తెలియచేస్తూ అనుబంధ పిటిషన్‌లు(ఐఏ) లేదా కౌంటర్ దాఖలు చేయాలని రామోజీరావు, శైలజా కిరణ్ తదితరుల తరఫు న్యాయవాదులను హైకోర్టు ఆదేశించింది. అప్పీళ్ల విచారణార్హతపై ముందు తేల్చి, ఆ తర్వాత కేసు లోతుల్లోకి వెళతామని హైకోర్టు స్పష్టం చేసింది. విచారణార్హతపై వాదనల నిమిత్తం తదుపరి విచారణను 19కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులిచ్చారు. తమ చార్జిషీట్‌లను రిటర్న్ చేస్తూ ప్రత్యేక కోర్టులు జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయడంతో పాటు, కేసును విచారణకు స్వీకరించేలా ఆ కోర్టులను ఆదేశించాలని కోరుతూ సీఐడీ అదనపు ఎస్పీ అప్పీళ్లను దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ అప్పీళ్లపై బుధవారం జస్టిస్ సురేష్‌రెడ్డి విచారణ జరిపారు. ఈ సందర్భంగా రామోజీ తదితరుల తరఫున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ ఈ అప్పీళ్ల విచారణార్హతపై తాము మొదట వాదనలు వినిపిస్తామని తెలిపారు.

నిబంధనల ప్రకారం అనుబంధ పిటిషన్లు వేసుకోవాల్సిందే..

ఆ సమయంలో సీఐడీ తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ జోక్యం చేసుకుంటూ విచారణార్హతపై వాదనలు వినిపిస్తామంటే తమకు అభ్యంతరం లేదని, అయితే విచారణార్హతపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ అనుబంధ పిటిషన్‌లు లేదా కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంటుందన్నారు. రిట్ నిబంధనలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. అలా అనుబంధ పిటిషన్‌లు లేదా కౌంటర్ దాఖలు చేశాక, విచారణార్హతపై వాదనలు వినాల్సి ఉంటుందన్నారు. అనుబంధ పిటిషన్ లేదా కౌంటర్ దాఖలు చేసినప్పుడే అందుకు తగిన సమాధానం ఇచ్చేందుకు తమకు అవకాశం ఉంటుందని ఆయన వివరించారు. మొదట విచారణార్హతపై కోర్టు నిర్ణయం వెలువరించాక కేసు లోతుల్లోకి వెళ్లాల్సి ఉంటుందన్నారు. మార్గదర్శి ఆస్తులను జప్తు చేస్తూ సీఐడీ ఇచ్చిన ఉత్తర్వులను గుంటూరు కోర్టు రద్దు చేసిందని, దానిపై తాము హైకోర్టులో అప్పీల్ దాఖలు చేయనున్నామని తెలిపారు. ఏజీ చేసిన ఈ వాదనలతో న్యాయమూర్తి సైతం ఏకీభవించారు. సీఐడీ అప్పీళ్ల విచారణార్హతపై అనుబంధ పిటిషన్‌లు లేదా కౌంటర్ దాఖలు చేయాలని దమ్మాలపాటి శ్రీనివాస్‌కు స్పష్టం చేశారు. విచారణార్హతను తేల్చిన తర్వాతనే కేసు లోతుల్లోకి వెళతామని తెలిపారు. విచారణార్హతపై మీరు (రామోజీ తదితరులు) విజయం సాధిస్తే ఏజీకి తదుపరి వాదనలు వినిపించేందుకు ఆస్కారం ఉండదన్నారు. ఇందుకు దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ.. అనుబంధ పిటిషన్ దాఖలు చేసేందుకు అభ్యంతరం లేదని, ఇందుకు కొంత గడువునివ్వాలని కోరారు. దీంతో న్యాయమూర్తి అందుకు అంగీకరించారు.

టీటీడీ నిధులను ఇష్టారీతిన ఖర్చు చేయరాదు

- అధికారులకు ధర్మాసనం ఆదేశం.. విచారణ 27కి వాయిదా

సాక్షి, అమరావతి: తిరుమల వచ్చే భక్తుల సౌకర్యార్థం తిరుపతిలో రోడ్ల నిర్మాణానికి, పారిశుధ్య పనులకు టీటీడీ నిధులను వెచ్చించేందుకు టీటీడీ అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు ప్రాథమికంగా తప్పుబట్టింది. టీటీడీ నిధులను ఇష్టారీతిన ఖర్చుచేయడానికి వీల్లేదని, అవి దేవుడికి భక్తులు ఇచ్చిన సొమ్ములని తెలిపింది. పారిశుధ్య పనుల కోసం టెండర్లను ఆహ్వానించిన నేపథ్యంలో టెండర్ ప్రక్రియను కొనసాగించవచ్చని అధికారులకు స్పష్టం చేసింది. అయితే కాంట్రాక్టును మాత్రం ఎవరికీ కేటాయించవద్దని, నిధులను సైతం విడుదల చేయవద్దని ఆదేశించింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని టీటీడీని, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్‌ను ఆదేశించింది. విచారణను ఈ నెల 27కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. తిరుపతిలో రోడ్ల నిర్మాణం, పారిశుధ్య పనులకు టీటీడీ నిధులను ఖర్చుచేయడాన్ని చట్టవిరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ బీజేపీ నేత జి.భానుప్రకాశ్‌రెడ్డి గతవారం హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై బుధవారం సీజే ధర్మాసనం విచారించింది.

భక్తుల సౌకర్యార్థమే నిధుల వినియోగం

టీటీడీ తరఫున సీనియర్ న్యాయవాది చిత్తరవు రఘు వాదనలు వినిపిస్తూ.. తిరుపతిలో టీటీడీ ఆధ్వర్యంలో పలుసంస్థలు, పాఠశాలు నడుస్తున్నాయని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం వసతి గదులను సైతం నిర్వహిస్తోందన్నారు. కార్పొరేషన్ తరఫు న్యాయవాది సురేష్‌కుమార్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పారిశుధ్య పనుల కోసం కార్పొరేషన్ రూ.50 కోట్లు వెచ్చిస్తోందని తెలిపారు.

రాజ్యసభ

కేంద్ర విద్యాసంస్థల క్యాంపస్‌ల నిర్మాణాన్ని వేగవంతం చేయండి

రాజ్యసభలో కేంద్రానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి విజ్ఞప్తి



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో నెలకొల్పిన కేంద్ర విద్యాసంస్థలకు శాశ్వత కాంపస్‌ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు విజయసాయిరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర విశ్వవిద్యాలయాల సవరణ బిల్లుపై బుధవారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ఏపీ పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీల మేరకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో గిరిజన విశ్వవిద్యాలయంతోపాటు సుమారు అన్ని కేంద్ర విద్యాసంస్థలను ప్రారంభించిందన్నారు. వాటికి శాశ్వత క్యాంపస్‌ల నిర్మాణంలో మాత్రం జాప్యం జరుగుతోందని తెలిపారు. ఈ కారణంగా ఆయా విద్యాసంస్థలలో కొన్ని ఇంకా తాత్కాలిక క్యాంపస్‌ల నుంచే పనిచేస్తున్నాయని, తద్వారా ఆ విద్యాసంస్థల్లో కోర్సులు, ఇతర అకడమిక్ కార్యకలాపాల విస్తరణకు అవకాశం లేకుండా పోతోందని చెప్పారు. శాశ్వత క్యాంపస్‌ల నిర్మాణం పూర్తయితేగానీ ఈ విద్యాసంస్థలు పూర్తిస్థాయిలో తమ అకడమిక్ కార్యకలాపాలను నిర్వహించలేవన్నారు. ఆయా విద్యాసంస్థల శాశ్వత క్యాంపస్‌ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసి వాటిలో ఉన్నత విద్యాప్రమాణాలు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఉపాధి హామీ బకాయిలు 122 కోట్లు

ఉపాధి హామీ పథకంలో వేతన కాంపోనెంట్ కింద ఈ ఏడాది డిసెంబర్ 1వ తేదీ నాటికి ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం చెల్లించాల్సిన బకాయిలు రూ.122.75 కోట్లు ఉన్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయమంత్రి సాధ్వి నిరంజన్‌జ్యోతి చెప్పారు. విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి బదులిస్తూ.. ఉపాధిహామీ పథకం అమలుకు కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు నిధులు విడుదల చేయడమన్నది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. క్షేత్రస్థాయిలో పని డిమాండ్‌ను బట్టి వాటికి నిధులు సమకూర్చేందుకు కేంద్రం కట్టుబడి ఉందని చెప్పారు.

గిరిజన ప్రాంతాల్లో డీబీటీ ద్వారా ఉపాధి వేతన చెల్లింపులు

గ్రామీణాభివృద్ధిశాఖ అందించిన సమాచారం ప్రకారం గిరిజన ప్రాంతాల్లో ఉపాధి వేతనదార్లకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) విధానంలో వేతనాలు చెల్లించేందుకు నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఎన్ఈఎఫ్ఎంఎస్)ను ప్రవేశపెట్టినట్లు విజయసాయిరెడ్డి మరో ప్రశ్నకు కేంద్ర గిరిజన వ్యవహారాలశాఖ సహాయమంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ బదులిచ్చారు.

ఏపీకి ఐదేళ్లలో 118.75 కోట్ల పనిదినాలు



ఉపాధిహామీ పథకంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు 2018–19 నుంచి 2022–23 వరకు 118.75 కోట్ల పనిదినాలు మంజూరు చేసినట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయమంత్రి సాధ్వి నిరంజన్‌జ్యోతి సమాధానమిచ్చారు.



ఏపీ ఇన్ పార్లమెంట్

లోక్‌సభ

ఈఎల్ఎఫ్ త్వరగా పూర్తిచేయాలి

లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ మాగుంట డిమాండ్



సాక్షి, న్యూఢిల్లీ: చిలకలూరిపేట–సింగరాయకొండ మధ్య 3.6 కిలోమీటర్ల మేర తలపెట్టిన ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ (ఈఎల్ఎఫ్) నిర్మాణం త్వరగా పూర్తిచేసేలా ఆదేశాలివ్వాలని కేంద్రాన్ని వైఎస్సార్‌సీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. లోక్‌సభ జీరో అవర్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ ఈఎల్ఎఫ్‌లో చిన్న చిన్న వంపులు సరిదిద్దాల్సిన అవసరాన్ని తనిఖీ బృందం గుర్తించిందని చెప్పారు. దీనికి రూ.20.60 కోట్లు, భూసేకరణకు రూ.6 కోట్లు ఖర్చవుతుందని అంచనా వ్యయ వివరాలు ఎన్‌హెచ్ఏఐకు జనవరిలోనే పంపారని, ఇప్పటికీ ఆమోదం రాలేదని తెలిపారు. వీలైనంత త్వరగా ఆమోదించాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులను ఆదేశించాలని కేంద్ర జాతీయ రహదారులు, ఉపరితల రవాణాశాఖ మంత్రిని ఆయన కోరారు.

చైనాతో వాణిజ్య అసమతుల్యతపై దృష్టి సారించాలి



చైనాతో వస్తున్న వాణిజ్య అసమతులత్యపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని వైఎస్సార్‌సీపీ ఎంపీ గోరంట్ల మాధవ్ చెప్పారు. జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ ఎగుమతుల నేపథ్యంలో గుంటూరు తదితర జిల్లాల్లో పొగాకుపై పెట్టుబడులు పెడుతున్నారన్నారు. అదే విధంగా విశాఖ, తూర్పుగోదావరిజిల్లాల నుంచి ఫార్మాస్యూటికల్స్ ఉత్పత్తులు కూడా అధికంగా ఎగుమతి అవుతున్నాయని చెప్పారు. ఇలాంటి ఎగుమతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

ఏపీకి 10,14,246.95 మెట్రిక్ టన్నుల ఆహారధాన్యాలు



ఆంధ్రప్రదేశ్‌కు 2023–24లో అక్టోబరు వరకు 10,14,246.95 మెట్రిక్ టన్నుల ఆహారధాన్యాలు పంపిణీ చేసినట్లు కేంద్ర వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన కింద పేదలకు ఆహారధాన్యాలు అందిస్తున్నామని వైఎస్సార్ సీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రశ్నకు సమాధానమిచ్చారు.

ఏపీలో 1,806 స్టార్టప్‌లు



ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఏడాది అక్టోబర్ వరకు 1,806 గుర్తింపు పొందిన స్టార్టప్‌లు ఉన్నాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ సహాయమంత్రి సోమ్‌ప్రకాశ్.. వైఎస్సార్‌సీపీ ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ ప్రశ్నకు జవాబిచ్చారు.

డిజిటల్ లావాదేవీల్లో నాలుగో స్థానంలో ఏపీ



డిజిటల్ లావాదేవీల్లో ఏపీ నాలుగో స్థానంలో ఉందని కేంద్ర ఐటీశాఖ సహాయమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ తెలిపారు. 2022–23లో రూ.13.47 లక్షల కోట్ల విలువైన 548.54 కోట్ల లావాదేవీలు జరిగాయని వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి ప్రశ్నకు జవాబిచ్చారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 34	69,585
నిఫ్టీ ▲ 20	20,926

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	14,533	▽	1
డోజోన్స్	36,579	▲	1
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,548	▲	6
డాక్స్	16,766	▽	26
షాంఘై	2,969	▽	35
నికాయ్	32,926	▲	83

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	61,201 ▽	76
బంగారం (99.5 స్వచ్ఛత)	60,956 ▽	76
వెండి (కేజీ)	70,898 ▽	677

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.97	83.99
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	103.45	106.00
€	యూరో	ఒకటి	88.72	91.07
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	56.67	57.96
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.06	55.99
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.38	63.37
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.22	21.98
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	21.79	23.58
¥	చైనా యువాన్	ఒకటి	10.45	12.56

అదానీ ఎనర్జీ భారీ పెట్టుబడులు

హరిత ఇంధనంపై రూ. 8,33,000 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ గ్రూప్ హరిత ఇంధనం(గ్రీన్ ఎనర్జీ)పై భారీ స్థాయిలో పెట్టుబడులకు సిద్ధపడుతోంది. రానున్న దశాబ్ద కాలంలో 100 బిలియన్ డాలర్ల(రూ. 8,33,000 కోట్లు) వెచ్చించేందుకు ప్రణాళికలు అమలు చేయనుంది. వెరసి కంపెనీ కార్యకలాపాలు విస్తరించిన నౌకాశ్రయాలు, విద్యుత్, సిమెంట్ బిజినెస్‌లలో 2050కల్లా కాలుష్య సృష్టిలేని(నెట్‌జీరో) గ్రూప్‌గా అవతరించాలని ఆశిస్తోంది. పునరుత్పాదక ఇంధన విభాగంలో సామర్థ్యాలను 45 గిగావాట్లకు విస్తరిస్తున్న సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా సోలార్ ప్యానల్స్, పవన విద్యుత్ టర్బయిన్లు, హైడ్రోజన్ ఎలక్ట్రోలైజర్స్ తయారీకి మూడు గిగా ఫ్యాక్టరీలను నిర్మిస్తోంది. గ్రూప్‌లోని ఐదు పోర్ట్‌ఫోలియో కంపెనీల ద్వారా 2050కల్లా నెట్‌జీరోగా ఆవిర్భవించాలని అదానీ లక్ష్యంగా పెట్టుకుంది.అదానీ గ్రీన్‌ఎనర్జీ ద్వారా పునరుత్పాదక ఇంధనం, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ ద్వారా విద్యుత్ ప్రసారం, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ ద్వారా నౌకాశ్రయాలు, మౌలిక సదుపాయాలు, ఏసీసీ, అంబుజా సిమెంట్స్ ద్వారా సిమెంట్ బిజినెస్‌లోనూ నెట్‌జీరో లక్ష్యాలను సాధించాలని చూస్తోంది. ఇందుకు అనుగుణంగా పునరుత్పాదకాలు, కార్యకలాపాల విద్యుదీకరణ, బయోఇంధనాల వినియోగం, వేస్ట్ హీట్ రికవరీ, ఎనర్జీ స్టోరేజీ టెక్నాలజీలకు తెరతీస్తోంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

14-12-2023	
విశాఖ	590-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	579-00
విజయవాడ	579-00
రిటైల్ ధర (డజను)	72.00
13-12-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	560-00
వరంగల్	562-00
రిటైల్ ధర	6.20

గిగ్ వర్కర్ల కోసం.. టెక్ మహీంద్రా 'పాప్యులై' ప్లాట్‌ఫామ్

న్యూఢిల్లీ: తాత్కాలిక ఉద్యోగార్థులు (గిగ్ వర్కర్లు) ప్రముఖ కంపెనీల్లో చిరుద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేలా సహాయపడేందుకు ఐటీ దిగ్గజం టెక్ మహీంద్రా కొత్తగా 'పాప్యులై' పేరిట క్రౌడ్‌సోర్సింగ్ ప్లాట్‌ఫామ్‌ను ఆవిష్కరించింది. ఇందులో ఉద్యోగార్థుల కోసం కంటెంట్ రేటింగ్, డేటా కలెక్షన్, డేటా ట్రాన్స్‌క్రిప్షన్, డేటా అనోటేషన్ వంటి తాత్కాలిక ఉద్యోగావకాశాలు ఉంటాయి. అటు కంపెనీలపరంగా చూస్తే అర్హత కలిగిన నిపుణుల డేటాబేస్ అందుబాటులో ఉంటుంది. తద్వారా ఇటు ఉద్యోగార్థులకు, అటు కంపెనీలకు ఇది ప్రయోజనకరంగా ఉంటుందని టెక్ మహీంద్రా బిజినెస్ హెడ్ (బిజినెస్ ప్రాసెస్ సర్వీసెస్) బీరేంద్ర సేన్ తెలిపారు. తదుపరి తరం కృత్రిమ మేధ (ఏఐ) సొల్యూషన్స్‌ను రూపొందించాలంటే గణనీయంగా సమయంతో పాటు సాధారణంగా కంపెనీల్లో ఉండే ఉద్యోగులే కాకుండా బైటి నిపుణుల అవసరం



కూడా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే పాప్యులై ప్లాట్‌ఫాం అంతర్జాతీయ స్థాయిలో గిగ్ నిపుణులను, కంపెనీలను అనుసంధానిస్తుందని తెలిపారు. దీనితో కంపెనీలు వ్యయాలు తగ్గించుకుంటూ, ఉత్పాదకత పెంచుకుంటూ .. ఏఐ సొల్యూషన్స్ రూపకల్పనను వేగవంతం చేసుకోవచ్చని సేన్ చెప్పారు. అలాగే గిగ్ నిపుణులు టాప్ ఏఐ ప్రాజెక్టులను దక్కించుకోవచ్చని, మరిన్ని వనరుల ద్వారా ఆదాయం పొందవచ్చని ఆయన పేర్కొన్నారు.

మెర్సిడెస్ బెంజ్ కార్ల ధరల పెంపు



న్యూఢిల్లీ: మెర్సిడెస్ బెంజ్ జనవరి ఒకటి నుంచి కొన్ని మోడళ్ల ధరలను 2% వరకు పెంచనున్నట్లు బుధవారం ప్రకటించింది. ఇన్‌పుట్ వ్యయాలు, కమోడిటీ ధరలు, రవాణా సరఫరా ఖర్చులు అధికమవడంతో పాటు ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల కారణంగా కార్ల ధరలు పెంచుతున్నట్లు కంపెనీ తెలిపింది. సీ-క్లాస్ కారుపై రూ.60,000 నుంచి, టాప్ ఎండ్ మెర్సిడెస్ మేబ్యాచ్ ఎస్680పై రూ.3.4 లక్షల వరకు పెంపుదల ఉంటుంది. మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఏ-క్లాస్ సెడాన్ నుంచి ఎస్‌యూవీ జీ63 ఏజీఎం వరకు వివిధ మోడళ్ల కార్లను రూ.46 లక్షలు - రూ.3.4 కోట్ల ధరల శ్రేణిలో విక్రయిస్తుంది.

ఆఖర్లో 'కొనుగోళ్ల' రికవరీ

స్వల్ప లాభాల ముగింపు

ముంబై: ఆఖరి గంటలో ఆటో, యుటిలిటీ, ఎఫ్‌ఎంసీజీ, విద్యుత్, సర్వీసుల రంగాల షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు బుధవారం ఇంట్రాడే నష్టాలను భర్తీ చేసుకుని స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ఫెడరల్ రిజర్వ్ బ్యాంకు ద్రవ్య పాలసీ ప్రకటన (బుధవారం రాత్రి) ముందు ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. ప్రథమార్థంలో నష్టాల్లో కదలాడిన సూచీలు యూరప్ మార్కెట్ల లాభాల ప్రారంభం నుంచి సానుకూల సంకేతాలు అందిపుచ్చుకున్నాయి. ట్రేడింగ్‌లో 450 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్ చివరికి 34 పాయింట్ల లాభంతో 69,585 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 136 పాయింట్ల పతనం నుంచి తేరుకొని 20 పాయింట్ల స్వల్ప లాభంతో 20,926 వద్ద నిలిచింది. చిన్న, మధ్యతరహా రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 1.06%, 0.73 శాతం పెరిగాయి. మరోవైపు ఐటీ, టెలికం, బ్యాంకులు, ఇంధన, టెక్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.4,711 కోట్ల షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.958 కోట్ల షేర్లు అమ్మేశారు. అమెరికా



మార్కెట్లు లాభాల్లో కదలాడుతున్నాయి.

- ఫెడరల్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్ల వెల్లడికి ముందు ఐటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్ 2%, టెక్ మహీంద్రా 1%, విప్రో, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు అరశాతం చొప్పున నష్టపోయాయి.
- కమ్యూనికేషన్ సేవల సంస్థ తాన్లా ప్లాట్‌ఫామ్స్ షేరు 18% లాభపడి రూ.1092 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 20% ఎగసి రూ.1111 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకుంది.
- నిధుల సమీకరణ ప్రతిపాదనను పరిశీలించేందుకు డిసెంబర్ 15న డైరెక్టర్ల బోర్డు సమావేశం కానుందని వార్తలు వెలువడంతో బ్యాంక్ ఆఫ్ బరోడా షేరు 2% లాభపడి రూ.221 వద్ద స్థిరపడింది.

1.66 లక్షల కోట్లు 'సిప్' చేశారు!

- 11 నెలల్లో పెట్టుబడుల విలువ ఇది..
- గతేడాది కంటే అధికం
- 17 వేల కోట్లు దాటిన నెలవారీ పెట్టుబడులు

న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్‌లో క్రమానుగత పెట్టుబడులకు (సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్/సిప్) ఇన్వెస్టర్లు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందుకు నిదర్శంగా ఈ ఏడాది 11 నెలల్లో (జనవరి–నవంబర్) సిప్ రూపంలో ఫండ్స్‌లోకి రూ.1.66 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. సిప్ కనిష్ట పెట్టుబడిని రూ.250కు తగ్గించే దిశగా పనిచేస్తున్నట్టు సెబీ చైర్‌పర్సన్ మాధురి పురి బుచ్ ఇటీవలే ప్రకటించడం గుర్తుండే ఉంటుంది. ఇది అమల్లోకి వస్తే సిప్ పెట్టుబడులు మరింతగా పెరుగుతాయని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. 2022 సంవత్సరం మొత్తం మీద సిప్ రూపంలో ఫండ్స్‌లోకి వచ్చిన పెట్టుబడులు రూ.1.5 లక్షల కోట్లుగా ఉంటే, ఈ ఏడాది మరో నెల మిగిలి ఉండగానే దీన్ని అధిగమించడం గమనార్హం. ఇక 2021లో సిప్ రూపంలో ఫండ్స్‌లోకి వచ్చిన పెట్టుబడులు రూ.1.14 లక్షల కోట్లుగా, 2020లో రూ.97,000 కోట్లుగా ఉన్నట్టు మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) గణాంకాలు వెల్లడిస్తు



న్నాయి. ఇక మీదట ఏటా సిప్ పెట్టుబడులు స్థిరంగా పెరుగుతూ వెళతాయని మోతీలాల్ ఓస్వాల్ ఏఎంసీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ అఖిల్ చతుర్వేది పేర్కొన్నారు. ఆర్థిక వృద్ధికి సంబంధించి ఆశావహ అంచనాలు, మార్కెట్లో ఇన్వెస్టర్ల ప్రాతినిధ్యం పెరగిన నేపథ్యంలో.. ఫండ్స్‌లో సిప్ ద్వారా పెట్టుబడులు పెట్టేందుకు ఇన్వెస్టర్లు సానుకూలంగా ఉన్నట్టు చెప్పారు. మార్కెట్లు బలంగా ఉండడం, చక్కని రాబడులకు ఉన్న అవకాశాల నేపథ్యంలో 2024లో సిప్ రూపంలో వచ్చే పెట్టుబడులు పెరుగుతాయనే నమ్మకం బలపడుతున్నట్టు తెలిపారు.

మద్దతిస్తున్న అంశాలు

2022 డిసెంబర్ నెలలో సిప్ రూపంలో ఈక్విటీ పథకాల్లోకి వచ్చిన పెట్టుబడులు రూ.11,305 కోట్లు కాగా, 2023 నవంబర్ నెలకు ఈ మొత్తం రూ.17,073 కోట్లకు పెరిగాయి. ఈ ఏడాది అక్టోబర్, సెప్టెంబర్ నెలల్లోనూ రూ.16వేల కోట్లకు పైనే సిప్ పెట్టుబడులు వచ్చాయి. మ్యూచువల్ ఫండ్స్ సంస్థల నిర్వహణలోని సిప్ ఆస్తులు నవంబర్ చివరికి రూ.9.31 లక్షల కోట్లకు పెరిగాయి. 2022 డిసెంబర్ చివరికి ఇవి రూ.6.75 లక్షల కోట్లుగా ఉన్నాయి. యాంఫి నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు, అధిక జనాభా, ఈక్విటీలపై అధిక రాబడులు, పెట్టుబడుల సౌలభ్యం తదితర అంశాలు మ్యూచువల్ ఫండ్స్‌లోకి పెట్టుబడుల రాక పెరగడానికి అనుకూలించే అంశాలుగా మార్కెట్ నిపుణులు ప్రస్తావిస్తున్నారు. ''సిప్, ఈక్విటీ పెట్టుబడుల వల్ల వచ్చే ప్రయోజనాలపై అవగాహన కల్పించడంలో యాంఫి ముఖ్య పాత్ర పోషిస్తోంది. ఈక్విటీలకు ఒక పెట్టుబడి సాధనంగా చూసే ధోరణి పెరగడం కూడా సిప్ పెట్టుబడులు పెరగానికి అనుకూలిస్తోంది''అని అఖిల్ చతుర్వేది వివరించారు. సిప్ ద్వారా ఇన్వెస్టర్ తాను ఎంపిక చేసుకున్న పథకంలో నిర్ణీత రోజులకు ఒకసారి పెట్టుబడి పెట్టుకోవచ్చు. మార్కెట్ ర్యాలీలు, పతనాల్లోనూ సిప్ పెట్టుబడి కొనసాగడం వల్ల కొనుగోలు ధర సగటుగా మారి, రాబడులు మెరుగ్గా ఉంటాయి. ప్రస్తుతం సిప్ కనీస పెట్టుబడి రూ.500గా ఉంది. అందరికీ ఆర్థిక సేవలను చేరువ చేయాలన్న లక్ష్యంలో భాగంగా సిప్ కనీస పెట్టుబడిని రూ.250కి తగ్గించాలని సెబీ భావిస్తోంది.

డోమ్స్ ఐపీవోకు రిటైలర్ల క్యూ..

తొలి రోజే 5.7 రెట్లు అధిక బిడ్స్

న్యూఢిల్లీ: పెన్సిళ్ల తయారీ దిగ్గజం డోమ్స్ ఇండస్ట్రీస్ పబ్లిక్ ఇష్యూకి తొలి రోజే(బుధవారం) ఇన్వెస్టర్లు క్యూ కట్టారు. కంపెనీ 88 లక్షలకుపైగా షేర్లను ఆఫర్ చేయగా.. 5 కోట్లకుపైగా షేర్ల కోసం బిడ్స్ దాఖలయ్యాయి. వెరసి 5.7 రెట్లు అధిక సబ్‌స్క్రిప్షన్ లభించింది. ఎన్ఎస్ఈ గణాంకాల ప్రకారం రిటైల్ ఇన్వెస్టర్లు ఏకంగా 19 రెట్లు అధికంగా దరఖాస్తు చేయడం విశేషం! ఈ బాటలో సంస్థాగతేతర ఇన్వెస్టర్లు 8 రెట్లు బిడ్ చేయగా.. అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల(క్విబ్) నుంచి కేవలం 6% మాత్రమే స్పందన నమోదైంది. ఇష్యూలో భాగంగా కంపెనీ రూ. 350 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుండగా.. మరో రూ. 850 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచారు. వెరసి ఇష్యూ ద్వారా రూ. 1,200 కోట్లు సమీకరించనుంది. ఒక్కో షేరుకి రూ. 750–790 చొప్పున ధరల శ్రేణిని ప్రకటించిన కంపెనీ మంగళవారం యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ. 538 కోట్లు సమకూర్చుకుంది.



రేపు వేల్యూ జోన్ హైపర్ మార్ట్ ప్రారంభం

హైదరాబాద్: వేల్యూ జోన్ హైపర్ మార్ట్ కొత్త అవుట్‌లెట్ మాల్ హైదరాబాద్‌లోని పటాన్‌చెరులో గురువారం (రేపు) ప్రారంభం కానుంది. సినీ నటుడు బాలకృష్ణ లాంఛనంగా ఆవిష్కరించనున్నారు. ఇందులో ప్రముఖ బ్రాండ్లపై 40% డిస్కౌంట్ లభిస్తుంది. అవుట్‌లెట్ చుట్టుపక్కల ఇక్రిశాట్, నిమ్స్, ఐఐటీ, ప్రధాన సంస్థలు ఉండటంతో విద్యార్థులు, కుటుంబాలు, నిపుణులను మాల్ ఆకర్షిస్తుందన్న విశ్వాసాన్ని యాజమాన్యం వ్యక్తం చేసింది. ''మాల్ ఆర్కిటెక్చర్, లేవుట్ నిర్మాణం భాగ్యనగర సంస్కృతి, అభివృద్ధికి వేదికగా నిలిచింది. వెడల్పైన కారిడార్లు, సహజకాంతి, అధునాతన పద్ధతుల్లో రూపొందించిన స్టోర్ల మిశ్రమం సందర్శకులకు గొప్ప షాపింగ్ అనుభూతి పంచుతాయి'' అని యాజమాన్యం వివరించింది.



భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: ఇండియన్ జాగ్రఫీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీలో 81 గ్రూప్-1 పోస్టులకు నోటిఫికేషన్

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ).. వివిధ ప్రభుత్వ శాఖల్లో గ్రూప్-1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 81
- » ఎంపిక విధానం: స్క్రీనింగ్ టెస్ట్, మెయిన్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ, సర్టిఫికేట్ల వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 01.01.2024.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 21.01.2024.
- » స్క్రీనింగ్ టెస్ట్(ప్రిలిమినరీ పరీక్ష) తేది:17.03.2024
- » వెబ్‌సైట్: https://psc.ap.gov.in

ఇగ్నోలో 102 ఉద్యోగాలు

జాబ్స్ ఇన్ఫో

ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ(ఇగ్నో).. తాజాగా 102 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ), స్కిల్ టెస్ట్/టైపింగ్ టెస్టుల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అర్హతలు, ఆసక్తి గల అభ్యర్థులు డిసెంబర్ 21వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

- మొత్తం పోస్టుల సంఖ్య: 102

జూనియర్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్ (జేఏటీ)-50

- **అర్హత:** ఈ పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే వారు 10+2 లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులవ్వాలి. కంప్యూటర్‌పై ఇంగ్లిష్‌లో నిమిషానికి 40 పదాలు/హిందీలో నిమిషానికి 35 పదాలు టైప్ చేయగలగాలి. డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది. **వయసు:** 21.12.2023 నాటికి 18–27 ఏళ్ల మధ్య ఉండాలి.

స్టెనోగ్రాఫర్ పోస్టులు-52

- **అర్హత:** ఇంటర్మీడియట్ లేదా 10+2 తత్సమాన విద్యార్హత కలిగిన అభ్యర్థులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. కంప్యూటర్‌పై ఇంగ్లిష్‌లో నిమిషానికి 40 పదాలు /హిందీలో నిమిషానికి 35 పదాలు టైప్ చేయగలగాలి. షార్ట్‌హ్యాండ్‌లో నిమిషానికి 80 పదాల వేగం ఉండాలి. డిగ్రీ ఉత్తీర్ణత సాధించి, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యమిస్తారు. **వయసు:** 21.12.2023 నాటికి 18–30 ఏళ్ల మధ్య ఉండాలి. గరిష్ఠ వయోపరిమితిలో ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ (ఎన్‌సీఎల్)కు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు 10–15 ఏళ్లు, ఎక్స్‌సర్వీస్‌మెన్‌కు వారికి మూడేళ్ల సడలింపు లభిస్తుంది.

ఎంపిక ఇలా

అభ్యర్థుల ఎంపికకు రెండు దశల్లో అర్హత పరీక్షలను నిర్వహిస్తారు. అవి..టైర్-1, టైర్-2 పరీక్షలు.

- **టైర్-1:** (జేఏటీ, స్టెనోగ్రాఫర్ పోస్టులకు): ఇందులో 5సెక్షన్‌లు ఉంటాయి. సెక్షన్-1లో మ్యాథమెటికల్ ఎబిలిటీస్-30 మార్కులు,సెక్షన్-2లో రీజనింగ్ అండ్ జనరల్ ఇంటెలిజెన్స్-30 మార్కులు,సెక్షన్-3లో హిందీ/ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్-30 మార్కులు, సెక్షన్-4లో జనరల్ అవేర్‌నెస్-30 మార్కులు,సెక్షన్-5లో కంప్యూటర్ నాలెడ్జ్-30 మార్కులుంటాయి.
- **టైర్-2:** ఈ పరీక్ష రెండు పోస్టులకు వేర్వేరుగా ఉంటుంది.

సిలబస్ ఇలా

- **మ్యాథమెటికల్ ఎబిలిటీస్:** నంబర్ సిస్టమ్స్, ఆల్జీబ్రా, మెన్సురేషన్, టిగ్రనోమెట్రీ, స్టాటిస్టిక్స్-ప్రాబబిలిటీ తదితర అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- **రీజనింగ్ అండ్ జనరల్ ఇంటెలిజెన్స్:** వెర్బల్-నాన్ వెర్బల్, వెన్‌డయాగ్రమ్స్, నంబర్ సిరీస్, క్రిటికల్ థింకింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్, ఎమోషనల్, సోషల్ ఇంటెలిజెన్సీ, వర్డ్ బిల్డింగ్, కోడింగ్-డీకోడింగ్, న్యూమరికల్ ఆపరేషన్స్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.
- **ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్:** వొకాబ్యులరీ, గ్రామర్, సెంటెన్స్ స్ట్రక్చర్, సినానిమ్స్, యాంటనిమ్స్, స్పాట్ ద ఎర్రర్, ఫిల్ ఇన్ ద బ్లాంక్స్, స్పెల్లింగ్స్, డిటెక్టింగ్ మిస్ స్పెల్డ్ వర్డ్స్, ఇడియమ్స్, ఫ్రేజెస్, యాక్టివ్, పాసివ్ వాయిస్ ఆఫ్ వెర్బ్స్, కాంప్రహెన్షన్ పాసేజ్‌ల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- **జనరల్ అవేర్‌నెస్:** సమాజ పరిస్థితులపై అభ్యర్థుల అవగాహనను పరీక్షించే విధంగా ప్రశ్నలుంటాయి. అలాగే ఇండియన్ హిస్టరీ, కల్చర్, ఆర్థిక వ్యవస్థ, భౌగోళిక పరిస్థితులను గురించి ప్రశ్నలను అడుగుతారు.
- **కంప్యూటర్ నాలెడ్జ్:** కంప్యూటర్ బేసిక్స్, వర్కింగ్ విత్ ఇంటర్నెట్ అండ్ ఈ-మెయిల్స్, ఈ-బ్యాంకింగ్, సైబర్ సెక్యూరిటీ తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 21.12.2023
- దరఖాస్తు ఎడిట్ ఆప్షన్: 2023 డిసెంబర్ 22–25 తేదీల వరకు
- వెబ్‌సైట్: https://exams.nta.ac.in

క్యాట్.. మలిదశలో మెరిసేలా!

- » ముగిసిన క్యాట్-2023 పరీక్ష
- » గత ఏడాదికంటే క్లిష్టంగా ప్రశ్నలు
- » 77–80 మార్కులతో 99 పర్సంటైల్
- » మలి దశకు సిద్ధమవ్వాలంటున్న నిపుణులు

కామన్ అడ్మిషన్ టెస్ట్.. క్యాట్‌గా సుపరిచితం! దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు.. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) క్యాంపస్‌లలో.. ఎంబీఏ, పీజీడీఎం తదితర మేనేజ్‌మెంట్ పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష! వీటితోపాటు దేశ వ్యాప్తంగా మరో 1200కు పైగా మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశాలకు ప్రామాణిక పరీక్ష క్యాట్! ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన క్యాట్-2023కు 2.88 లక్షల మంది హాజరయ్యారు. ఈ నేపథ్యంలో.. క్యాట్-2023 విశ్లేషణ, కటాఫ్ అంచనా, మలి దశలో ఐఐఎంల ఎంపిక ప్రక్రియ, సన్నద్ధత తదితర వివరాలు..



ఈ ఏడాది క్యాట్ పరీక్ష విధానంలో ఎలాంటి మార్పు లేదు. గత సంవత్సరం మాదిరిగానే మూడు విభాగాల నుంచి 66 ప్రశ్నలు అడిగారు. వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్ నుంచి 24 ప్రశ్నలు; డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 20 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఎబిలిటీ నుంచి 22 ప్రశ్నలు చొప్పున అడిగారు. ప్రతి విభాగంలోనూ బహుళైచ్ఛిక ప్రశ్నల(ఎంసీక్యూ)తో పాటు నాన్-ఎంసీక్యూలు కూడా ఉన్నాయి. వీఏఆర్‌సీ విభాగంలో నాలుగు;డీఐఎల్ఆర్‌లో 8; క్యూఏలో 7 నాన్-ఎంసీక్యూలు అడిగారు. దీంతో..అభ్యర్థులకు సమయాభావ సమస్య ఎదురైంది.

క్వాంటిటేటివ్ ఎబిలిటీ

- ఒకే రోజు మొత్తం మూడు స్లాట్లలో క్యాట్ నిర్వహించారు. ఈ పరీక్షలో క్వాంటిటేటివ్ ఎబిలిటీనే ఎక్కువ క్లిష్టంగా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అదే విధంగా డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్‌లో ఓ మోస్తరు క్లిష్టతతో ప్రశ్నలు ఉన్నాయి. వీఏఆర్‌సీ మాత్రం కాసింత సులభంగా ఉందని అంటున్నారు.
- స్లాట్-1లో క్వాంటిటేటివ్ ఎబిలిటీలో ఆల్జీబ్రా నుంచి ఎక్కువ ప్రశ్నలు అడగడం అభ్యర్థులకు కొంత ఇబ్బందికరంగా మారింది. ఏడు ప్రశ్నలు అర్థమెటిక్ నుంచి, నాలుగు ప్రశ్నలు జామెట్రీ, సైక్లిక్ క్వాడ్రిలేటరల్‌పై అడిగిన ప్రశ్నలు పూర్తి స్థాయిలో గణితంపై పట్టు ఉన్న అభ్యర్థులు మాత్రమే సమాధానాలు ఇచ్చే విధంగా ఉన్నాయి.
- స్లాట్-2లో కూడా ఇదే తీరుగా క్వాంటిటేటివ్ ఎబిలిటీ నుంచి ప్రశ్నలు అడిగారు. మొత్తం 22 ప్రశ్నలకు గాను ఆల్జీబ్రా నుంచి 8, అర్థమెటిక్ నుంచి 7, జామెట్రీ నుంచి మూడు ప్రశ్నలు, మోడ్రన్ మ్యాథ్స్, నంబర్స్ నుంచి 2 ప్రశ్నలు చొప్పున అడిగారు.
- స్లాట్-3లో మాత్రం ఆల్జీబ్రా నుంచి నాలుగు ప్రశ్నలు; అర్థమెటిక్ నుంచి 8 ప్రశ్నలు అడగడం కాసింత ఉపశమనం కలిగించే అంశంగా అభ్యర్థులు భావిస్తున్నారు.

ఆ విభాగాలు ఓ మోస్తరు

వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్; డేటా ఇంటర్ ప్రిటేషన్ సెక్షన్లు ఓ మోస్తరు క్లిష్టతతో ఉన్నాయి. వెర్బల్ ఎబిలిటీలో అధిక భాగం ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు అడిగారు. ఇవి కూడా సమకాలీన అంశాలకు సంబంధించినవి కావడంతో కరెంట్ అఫైర్స్,కాంప్రహెన్షన్‌పై పట్టు ఉన్నవారు మాత్రమే సమధానాలు ఇచ్చే విధంగా ఉన్నాయి. డేటా ఇంటర్‌ప్రిటేషన్‌లో అరేంజ్‌మెంట్స్ ప్రశ్నలు సులభంగా ఉండడంతో అభ్యర్థులు ఊరట చెందారు.

కటాఫ్‌ల అంచనా.. ఇలా

- క్వాంటిటేటివ్ ఎబిలిటీ క్లిష్టంగా, మిగతా రెండు విభాగాలు ఓ మోస్తరుగా ఉండటంతో స్లాట్‌ల వారీగా వేర్వేరు కటాఫ్ అంచనాలు వ్యక్తమవుతున్నాయి.
- స్లాట్-1లో 89 స్కోర్‌తో 99.5 పర్సంటైల్, 80 స్కోర్‌తో 99పర్సంటైల్ సాధించొచ్చని అంచనా.
- స్లాట్-2లో 91 మార్కులతో 99.5 పర్సంటైల్; 81 మార్కులతో 99 పర్సంటైల్,59 మార్కులతో 95 పర్సంటైల్, 50 మార్కులతో 90 పర్సంటైల్ పొందొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.
- స్లాట్-3లో 86–88 స్కోర్‌తో 99.5 పర్సంటైల్; 76–77 స్కోర్‌తో 99 పర్సంటైల్; 56–58 స్కోర్‌తో 95 పర్సంటైల్; 48–50 స్కోర్‌తో 90 పర్సంటైల్ సాధించొచ్చని అంచనా.
- మొత్తంగా.. ఈ మూడు స్లాట్లను నార్మలైజేషన్ ప్రక్రియ ద్వారా క్రోడీకరించి పర్సంటైల్స్‌ను నిర్ధారించే క్రమంలో.. 77–80 స్కోర్‌తో 99 పర్సంటైల్; 56–60 స్కోర్‌తో 95 పర్సంటైల్; 48–50 స్కోర్‌తో 90 పర్సంటైల్ పొందే వీలుందని నిపుణులు పేర్కొంటున్నారు.

నిర్దిష్ట కటాఫ్ పర్సంటైల్

తొలితరం ఐఐఎంల్లో మలి దశ ఎంపిక ప్రక్రియకు క్యాట్ కటాఫ్ 99–100 పర్సంటైల్‌గా ఉంటుందని అంచనా. మిగతా ఐఐఎంల్లో మాత్రం 94–95 పర్సంటైల్‌తో కూడా మలి దశకు అర్హత పొందే అవకాశం ఉంది. ఐఐఎం-షిల్లాంగ్, బోధ్‌గయ వంటి క్యాంపస్‌ల్లో 90–92 పర్సంటైల్ వచ్చినా అర్హత లభించే వీలుంది. తుది జాబితా రూపకల్పన, గత రెండు, మూడేళ్ల ప్రవేశాలను పరిగణనలోకి తీసుకుంటే.. 93 శాతంపైగా పర్సంటైల్ ఉంటేనే ప్రవేశం ఖరారవుతోంది. ఐఐఎం-కోల్‌కత, ఐఐఎం-అహ్మదాబాద్ వంటి తొలి తరం ఐఐఎంలలో ప్రవేశం పొందాలంటే.. 99కి పైగా పర్సంటైల్ ఉంటేనే సాధ్యమని గత గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

మలి దశకు సిద్ధంగా

నిర్దిష్ట క్యాట్ స్కోర్ ఆధారంగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి.. తదుపరి దశలో రిటెన్ ఎబిలిటీ టెస్ట్, గ్రూప్ డిస్కషన్‌లను నిర్వహిస్తున్నాయి. వీటిలో ప్రతిభ ఆధారంగా చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. ఈ పర్సనల్ ఇంటర్వ్యూలోనూ విజయం సాధిస్తే.. ఐఐఎంల్లో ప్రవేశం ఖరారవుతుంది.

గ్రూప్ డిస్కషన్

మలి దశకు అర్హత సాధించిన అభ్యర్థులకు ఆయా ఐఐఎం క్యాంపస్‌లలో గ్రూప్ డిస్కషన్ నిర్వహిస్తారు. అభ్యర్థులను బృందాలుగా విభజించి ఏదైనా ఒక అంశాన్ని ఇచ్చి దానిపై చర్చించమంటారు. కోర్ నుంచి కాంటెంపరరీ వరకు ఈ అంశాలు ఉంటున్నాయి. కాబట్టి అభ్యర్థులు సబ్జెక్ట్ నాలెడ్జ్‌తోపాటు సమకాలీన పరిణామాలపైనా ఇప్పటి నుంచే అవగాహన పెంచుకోవాలి.

రిటెన్ ఎబిలిటీ టెస్ట్

గ్రూప్ డిస్కషన్ తర్వాత రిటెన్ ఎబిలిటీ టెస్ట్(ఆర్ఏటీ) ఉంటుంది. నిర్దిష్టంగా ఏదైనా ఒక అంశాన్ని పేర్కొని అభ్యర్థుల అభిప్రాయం లేదా సలహాలు వ్యక్తీకరించే విధంగా ప్రశ్నలు అడుగుతున్నారు. ఒక అంశానికి సంబంధించి మూడు వందల నుంచి నాలుగు వందల పదాల మధ్యలో అభ్యర్థులు తమ సమాధానం రాయాల్సి ఉంటుంది. ఆర్ఏటీ టాపిక్స్ సబ్జెక్ట్ నాలెడ్జ్, సోషల్ అవేర్‌నెస్ సమ్మిళితంగా ఉంటున్నాయి.

పర్సనల్ ఇంటర్వ్యూ

గ్రూప్ డిస్కషన్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్‌లో విజయం సాధించిన వారికి చివరిగా పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. ఈ ఇంటర్వ్యూలో.. సదరు అభ్యర్థికి మేనేజ్‌మెంట్ విద్య పట్ల ఉన్న వాస్తవ ఆసక్తి, అతని భవిష్యత్తు లక్ష్యాలు, వాటిని అందుకునేందుకు ఎంచుకున్న మార్గాలు తదితర అంశాలను నిపుణులైన ప్రొఫెసర్స్ కమిటీ పరిశీలిస్తుంది.

వెయిటేజీ ఆధారంగా

వంద మార్కుల వెయిటేజీ ఫార్మట్‌లో 35 నుంచి 50 శాతం మేరకు జీడీ, పీఐలకు వెయిటేజీ లభిస్తోంది. దీంతోపాటు జండర్ డైవర్సిటీకి, అడమిక్ ప్రతిభకు కూడా తుది ఎంపికలో వెయిటేజీ ఉంటుంది. పదో తరగతి, ఇంటర్మీడియెట్, బ్యాచిలర్ డిగ్రీ కోర్సులకు ఒక్కో కోర్సుకు ప్రత్యేకంగా వెయిటేజీ ఉంటోంది. ఐఐఎంలు తుది జాబితా రూపకల్పనలో పని అనుభవానికి కూడా వెయిటేజీ కల్పిస్తున్నాయి.

అకడమిక్ డైవర్సిటీ

ఐఐఎంలలో ప్రవేశ ప్రక్రియ, క్యాట్‌లో ఉత్తీర్ణత సాధించడం వంటి విషయాల్లో.. ఇంజనీరింగ్ అభ్యర్థులే ముందంజలో ఉంటున్నారనే అభిప్రాయం నెలకొన్న సంగతి తెలిసిందే. ఫలితాలు కూడా ఈ అభిప్రాయాలు నిజమనేలానే ఉంటున్నాయి. దీంతో నాన్-ఇంజనీరింగ్ విద్యార్థులకు అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఐఐఎంలు అకడమిక్ డైవర్సిటీకి కూడా పెద్ద పీట వేస్తున్నాయి. నాన్-ఇంజనీరింగ్ బ్యాచిలర్ డిగ్రీ విద్యార్థులకు కనిష్టంగా 15 శాతం.. గరిష్టంగా 30 శాతం వెయిటేజీ కల్పిస్తున్నాయి.

'క్యాట్'కు 40 శాతం వెయిటేజీ

తుది జాబితా రూపకల్పనలో మొత్తం వంద మార్కులకు క్యాట్ స్కోర్‌కు 40 శాతంగానే వెయిటేజీ ఉంటోంది. గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలకు 40 నుంచి 50 శాతం వెయిటేజీ లభిస్తోంది. ప్రొఫైల్, పని అనుభవం తదితర అంశాలకు దాదాపు 20 శాతం మేరకు వెయిటేజీని ఐఐఎంలు కల్పిస్తున్నాయి.

క్లుప్తంగా...

గ్రూప్-4 ఫలితాలు విడుదల

- 21న ధ్రువపత్రాల పరిశీలన

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వశాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూప్-4 పోస్టుల భర్తీకి ఈ ఏడాది అక్టోబర్‌లో నిర్వహించిన పరీక్ష ఫలితాలను ఏపీపీఎస్సీ విడుదల చేసింది. ఇందులో 01, 02 కోడ్‌లో ఉన్న పోస్టులను ప్రతిభ ఆధారంగా ఆయా జిల్లా కలెక్టర్లు భర్తీ చేస్తారని సర్వీస్ కమిషన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. మిగిలిన 03, 04, 05, 06 కోడ్ పోస్టులకు ఈ నెల 21న ఒరిజనల్ సర్టిఫికెట్ల పరిశీలన, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ ధ్రువపత్రాలతో ఈ నెల 21న విజయవాడలోని సర్వీస్ కమిషన్ కార్యాయంలో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. ఫలితాల కోసం https://psc.ap.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చని తెలిపారు.

ఆధార్ ఉచిత అప్‌డేట్ గడువు మరోసారి పెంపు

సాక్షి, అమరావతి: ఆధార్‌లో అడ్రసు తదితర వివరాలను సొంతంగా అధికారిక ఆన్‌లైన్ వెబ్ పోర్టల్‌లో అప్‌డేట్ చేసుకునే వారికి ఆ సేవలను ఉచితంగా అందజేసే గడువును ఆధార్‌కార్డుల జారీ సంస్థ యూఐడీఏఐ మరోసారి వచ్చే ఏడాది మార్చి 14వ తేదీ వరకు పొడిగించింది. ఆధార్‌కార్డులు కలిగి ఉన్న ఎవరైనా ఆ కార్డు పొందిన పదేళ్ల గడువులో ఒక్కసారైనా వారికి సంబంధించి తాజా అడ్రసు తదితర వివరాలను కచ్చితంగా అప్‌డేట్ చేసుకోవాలని యూఐడీఏఐ గతంలోనే సూచించింది. ఆధార్‌కు సంబంధించి వివిధ రకాల సేవలను పొందాలంటే యూఐఏడీఐ నిర్ధారించిన నిర్ణీత ఫీజు చెల్లించాల్సి ఉండగా.. ఆన్‌లైన్‌లో సొంతంగా ఆధార్ వివరాలు అప్‌డేట్ చేసుకునే వారికి ఆ సేవలకు మినహాయింపు ఉంటుందని కూడా అప్పట్లో ప్రకటించింది.

పొగాకు నుంచి ప్రత్యామ్నాయ ఉత్పత్తులు

- 'భారత వ్యవసాయ పరిశోధన మండలి' అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ యాదవ్



ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పొగాకు పంట నుంచి ప్రత్యామ్నాయ ఉత్పత్తులను ప్రోత్సహించాలని, ఆ దిశగా శాస్త్రవేత్తలు పరిశోధనలు జరపాలని భారత వ్యవసాయ పరిశోధన మండలి విత్తన వాణిజ్య పంటల అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ డీకే యాదవ్ కోరారు. రాజమహేంద్రవరంలో బుధవారం కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ(సీటీఆర్ఐ) 75 వసంతాల ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు నిర్వహించారు. ఈ వేడుకలను ప్రారంభించిన యాదవ్ మాట్లాడుతూ మన దేశం నుంచి ఎగుమతి అయ్యే వ్యవసాయ ఉత్పత్తుల్లో పొగాకుకు ప్రాధాన్యముందన్నారు. పొగాకు నుంచి ప్రత్యామ్నాయ ఉత్పత్తులు నూనె, కేన్సర్ కారకాలను తగ్గించడానికి పరిశోధనలు చేయాలని చెప్పారు. ఎంపీ మార్గాని భరత్ మాట్లాడుతూ పొగాకు రైతుల కష్టాలపై కేంద్రం దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల తుపానుకు నష్టపోయిన పొగాకు రైతులకు నష్ట పరిహారంగా కనీసం రూ.10వేలు అందించినప్పుడే ఈ వేడుకలకు సార్థకత ఉంటుందన్నారు. సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ శేషుమాధవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి, నన్నయ్య వర్సిటీ వీసీ పద్మరాజు, టుబాకో బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్, బీజేపీ నేత సోము వీర్రాజు పాల్గొన్నారు.

చట్టమై వచ్చిన స్వప్నం

రాష్ట్రంలో విజయవంతంగా భూ హక్కుల చట్టం.. అమల్లోకి తెచ్చిన సీఎం జగన్

- ఈ చట్టం చేయడానికి దేశంలో 30 ఏళ్లుగా ప్రయత్నాలు
- లాండ్ టైట్లింగ్ చట్టం కోసం అనేక రాష్ట్రాల్లో విఫలయత్నాలు
- అన్ని రాష్ట్రాలూ టైట్లింగ్ చట్టం చేయాలని 2019లో నీతి ఆయోగ్ సిఫారసు
- అందుకనుగుణంగా దేశంలోనే తొలిసారి టైట్లింగ్ చట్టాన్ని తెచ్చిన సీఎం వైఎస్ జగన్



అడుగడుగునా భూ వివాదాలు..
పేట్రేగిపోతున్న భూ మాఫియా..
అస్తవ్యస్తమైన భూ రికార్డుల వ్యవస్థ..
సివిల్ కోర్టుల్లో పేరుకుపోయిన లక్షలాది భూ వివాద కేసులు..
దశాబ్దాలుగా వ్యవస్థను స్తంభింపజేస్తున్న ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం?
..లాండ్ టైట్లింగ్ చట్టం మాత్రమే
భూ చట్టాల నిపుణులు ఎన్నో ఏళ్లుగా చెబుతున్న వాస్తవమిది.

రాష్ట్రాలు ఈ చట్టం అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాలు స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి చెబుతూనే ఉన్నాయి. కానీ, ఈ చట్టాన్ని ఎలా అమలు చేయాలో తెలియక అనేక రాష్ట్రాలు ప్రయత్నించి విఫలమయ్యాయి. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభుత్వం సాహసోపేతంగా లాండ్ టైట్లింగ్ చట్టాన్ని సమర్థవంతంగా అమల్లోకి తెచ్చింది. మన రాష్ట్రంలో మాత్రమే ఇది సఫలీకృతమైంది. ఈ చట్టం గురించి అవగాహన లేక, ప్రజల విశాల ప్రయోజనాలు పట్టక కొందరు విమర్శలు చేస్తున్నారు.

సాక్షి, అమరావతి: భూ యజమానుల హక్కులకు భరోసా ఇచ్చే ఈ చట్టం కోసం ఏపీ ప్రభుత్వం చాలా శ్రమించింది. అనేక ప్రయత్నాల తర్వాతే చట్టాన్ని అమల్లోకి తీసుకురాగలిగింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేసిన పాదయాత్రలో ఎక్కువగా భూ సమస్యలు ఆయన దృష్టికి వచ్చాయి. వాటన్నింటికీ పరిష్కారం చూపాలని అప్పుడే నిర్ణయించుకున్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే భూముల సమస్యల పరిష్కారానికి దేశంలో ఎక్కడా లేని విధంగా లాండ్ టైట్లింగ్ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. భూముల రీ సర్వేను కూడా చేపట్టారు. రీ సర్వే విజయవంతంగా జరుగుతున్నా లాండ్ టైట్లింగ్ బిల్లు విషయంలో ఆటంకాలు ఎదురయ్యాయి. అసెంబ్లీ ఆమోదించిన బిల్లును కేంద్రం ఆమోదం కోసం పంపినప్పుడు రకరకాల సమస్యలు ఏర్పడ్డాయి. వాటన్నింటినీ ఓపిగ్గా పరిష్కరించుకుని ఇటీవలే మార్గం సుగమం చేసుకుంది. కేంద్రం ఆమోదం తర్వాత అక్టోబర్ 31వ తేదీ నుంచి రాష్ట్రంలో ఆ చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చింది.

ఎన్డీఏ వచ్చాక డీఐఎల్ఆర్ఎంపీ పథకం

కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడ్డాక ఎన్ఐఎల్ఆర్ఎంపీ పథకం డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మోడరనైజేషన్ ప్రోగ్రాం (డీఐఎల్ఆర్ఎంపీ)గా మారింది. ఎన్ఐఎల్ఆర్ఎంపీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యం ఉండగా, డీఐఎల్ఆర్ఎంపీలో వంద శాతం నిధులు తామే భరిస్తామని ఎన్డీఏ ప్రభుత్వం తెలిపింది. 2024 నాటికి దేశవ్యాప్తంగా టైటిల్ గ్యారంటీ వ్యవస్థ తేవడమే లక్ష్యంగా పని చేయాలని నిర్దేశించింది. అదే క్రమంలో 2015లో ఒకసారి, 2019లో మరోసారి ముసాయిదా చట్టాల్ని తయారు చేశారు. దీని ప్రకారమే 2019లో నీతి ఆయోగ్ ఒక నివేదిక ఇచ్చి దేశంలో టైటిల్ గ్యారంటీ చట్టం ఎలా తీసుకురావాలో సూచించింది. నీతి ఆయోగ్ చెప్పిన ప్రకారమే ఏపీ ప్రభుత్వం దేశంలోనే తొలిసారిగా లాండ్ టైట్లింగ్ చట్టాన్ని తీసుకువచ్చింది. భూ హక్కులకు భరోసా ఇచ్చేందుకు దేశవ్యాప్తంగా అమలు చేయాలనే లక్ష్యాన్ని మొదట సాధించిన రాష్ట్రంగా ఏపీ నిలిచింది.

రాజస్థాన్‌లో విఫలం

2015లో కేంద్ర ముసాయిదా చట్టం తయారైనప్పుడు రాజస్థాన్ ప్రభుత్వం ఆ రాష్ట్రంలో లాండ్ టైట్లింగ్ చట్టం తేవడానికి ప్రయత్నం చేసింది. దాన్ని పట్టణ ప్రాంత భూములకు మాత్రమే పరిమితం చేస్తూ టైటిల్ సర్టిఫికేషన్ చట్టం తెచ్చారు. అయినా సరిగా అమలు చేయలేక పోయారు.

2004లో నేషనల్ లాండ్ రికార్డ్స్ మోడరనైజేషన్ ప్రోగ్రాం

వాద్వా కమిటీ సిఫారసుల ఆధారంగానే 2004లో అప్పటి యూపీఏ ప్రభుత్వం భూమి రికార్డులపై నేషనల్ ల్యాండ్ రికార్డ్స్ మోడరనైజేషన్ ప్రోగ్రాం (ఎన్ఎల్ఆర్ఎంపీ) తెచ్చింది. భూమి రికార్డులన్నింటినీ కంప్యూటరీకరించడం, రికార్డుల స్వచ్ఛీకరణ, అన్ని శాఖలతో వాటిని అనుసంధానం చేయడం.. అంతిమంగా టైటిల్ గ్యారంటీ వ్యవస్థ తేవాలనేది ప్రాజెక్టు లక్ష్యం. ఈ ప్రాజెక్టు ఆధారంగానే 2005-06లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉమ్మడి రాష్ట్రంలో నిజామాబాద్ జిల్లాలో భూ భారతి పేరుతో ఒక పైలట్ ప్రాజెక్టు చేపట్టారు. జిల్లా మొత్తం కొత్త టెక్నాలజీతో రీ సర్వే చేసి టైటిల్ గ్యారంటీ ఇవ్వాలనే ప్రయత్నం అప్పట్లోనే జరిగింది. కానీ, ఆయన హఠాన్మరణంతో ఆ ప్రాజెక్టు ఆగిపోయింది. సర్వే జరిగింది కానీ ఆ రికార్డును నోటిఫై చేయలేదు. చట్టం కూడా రాలేదు. 2009లో యూపీఏ-2 ప్రభుత్వం టైట్లింగ్ వ్యవస్థ కోసం ఒక ముసాయిదా చట్టాన్ని తీసుకువచ్చింది. అప్పటి నుంచి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి.

30 ఏళ్ల క్రితమే బీజం

వాస్తవానికి దేశంలో భూ హక్కులకు భరోసా ఇవ్వాలనే ప్రయత్నం 1989లో మొట్టమొదటిగా చట్టబద్ధంగా మొదలైంది. అప్పటి ప్లానింగ్ కమిషన్ ప్రొఫెసర్ డీసీ వాద్వా ఆధ్వర్యంలో ఏక సభ్య కమిషన్‌ను కేంద్రం నియమించింది. అప్పట్లో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్లానింగ్ కమిషన్ డిప్యూటీ చైర్మన్‌గా ఉన్నారు. దేశంలో భూమి రికార్డులను అధ్యయనం చేసి ఎలాంటి రికార్డుల వ్యవస్థ ఉండాలో నివేదిక ఇవ్వాలని వాద్వా కమిటీని కేంద్రం కోరింది. ఆ కమిషన్ దేశమంతా తిరిగి అధ్యయనం చేసి 1990లో ఒక ప్రాథమిక నివేదిక ఇచ్చింది. దేశంలో ఇప్పుడున్న రికార్డుల వ్యవస్థ స్థానంలో భూమి హక్కులకి ప్రభుత్వమే పూర్తి భరోసా ఇచ్చే టైటిల్ గ్యారంటీ వ్యవస్థ ప్రవేశపెట్టాలని సిఫారసు చేసింది. భూమి రికార్డుల వ్యవస్థలో ఉన్న లోపాలన్నింటినీ ఆయన తన నివేదికలో వివరించారు. రికార్డుకి గ్యారంటీ లేకపోవడంవల్లే దేశంలో భూ వివాదాలు పెరుగుతున్నాయని, గ్యారంటీ ఇస్తే వివాదాలు తగ్గుతాయని స్పష్టం చేసింది. తద్వారా పెట్టుబడులు పెరుగుతాయని, ఆర్థికాభివృద్ధి వేగవంతం కావాలంటే ఇలాంటి వ్యవస్థ రావాలని వాద్వా ఆ నివేదికలో పేర్కొన్నారు.

బ్రిటిష్ హయాం నుంచి ఆలోచనలు

భూ హక్కులకు గ్యారంటీ ఇచ్చేందుకు బ్రిటిష్ హయాం నుంచే ప్రయత్నాలు మొదలయ్యాయి. 1900 సంవత్సరంలో తొలిసారి ఈ ఆలోచన పుట్టింది. ఆ తర్వాత 1908లో రిజిస్ట్రేషన్ చట్టం వచ్చినప్పుడే టైటిల్ గ్యారంటీ వ్యవస్థ తేవాలని చూశారు. కానీ అప్పుడు పరిస్థితులు అనుకూలంగా లేవు. పేదరికం, నిరక్షరాస్యత వల్ల అప్పట్లో ఆ ఆలోచలను విరమించుకున్నారు. 1971లో రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్ఓఆర్) చట్టం వచ్చినప్పుడు కూడా దీనిపై ఒక చర్చ జరిగింది. అప్పుడూ సాధ్యం కాలేదు. ఆ తర్వాత 1989లో ఆ చట్టం తేవడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. కానీ ఏ రాష్ట్రంలోనూ ఆచరణాత్మకంగా ఒక చట్టం రాలేదు. ఏపీ మాత్రమే ఈ చట్టాన్ని తీసుకువచ్చింది. భూముల వ్యవస్థలో ఇది ఒక కొత్త అధ్యాయంగానే చెప్పాలి.

– సునీల్‌కుమార్, భూ చట్టాల నిపుణులు, నల్సార్ లా వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్

ఎన్ఆర్ఐ శ్రీనాథ్ మృతి కేసులో కీలక మలుపు

- అమెరికాలో ఏడాది క్రితం గుంటూరుకు చెందిన శ్రీనాథ్ మృతి
- కుమారుడి మరణంపై తల్లిదండ్రుల అనుమానం
- కోడలు, ఆమె తల్లితండ్రులపై ఫిర్యాదు.. కేసు నమోదు చేసిన సీఐడీ పోలీసులు



శ్రీనాథ్ (ఫైల్)

సాక్షి, అమరావతి/నగరంపాలెం: ఏడాది క్రితం అమెరికాలో మృతి చెందిన గుంటూరుకు చెందిన ఎన్ఆర్ఐ గంగూరి శ్రీనాథ్ కేసు కీలక మలుపు తిరిగింది. శ్రీనాథ్ మృతిపై అమెరికాలో ఫిర్యాదు చేయకుండా కోడలు, ఆమె తలిదండ్రులు అడ్డుకోవడంతో ఇండియా వచ్చేసిన తర్వాత అతని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ కోడలు సాయి చరణి, ఆమె తల్లిదండ్రులే శ్రీనాథ్ మృతికి కారణమని వారు సీఐడీకి ఫిర్యాదు చేశారు. దీంతో వారు కేసు నమోదు చేసి పూర్తి స్థాయి విచారణకు సిద్ధమయ్యారు. శ్రీనాథ్ భార్య సాయి చరణి, మామ సుఖవాసి శ్రీనివాసరావు, అత్త రాజశ్రీలపై కేసు నమోదు చేశారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీనాథ్, సాయి చరణి 2016 డిసెంబర్‌లో వివాహం జరిగ్గా, 2017 జనవరిలో వారిద్దరు అమెరికా వెళ్లారు. అప్పటికే వర్జీనియాలోని సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న శ్రీనాథ్ భార్యను డిపెండెంట్ వీసా మీద అక్కడికి తీసుకెళ్లారు. అక్కడకు వెళ్లిన కొద్ది రోజులకే తనకు ఈ పెళ్లి ఇష్టం లేదని, తల్లిదండ్రుల బలవంతంపై ఈ పెళ్లికి అంగీకరించానని చరణి చెప్పటం ప్రారంభించింది. ఎప్పటికైనా నా తన కొడుకు చంపేస్తానని ఆమె బెదిరించేదని, ఈ విషయం పలుమార్లు కుమారుడు తనకు చెప్పాడని బాబూరావు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఆయన తన వియ్యంకుడితో మాట్లాడినా ఫలితం లేకపోయింది. ఆ తర్వాత కొద్దిరోజులకు సాయి చరణి తాను అనుకున్నది సాధించడం కోసం చాకుతో చేయి నరాలు కోసుకుంటానని బెదిరించటం, అమెరికాలో రాంగ్ రూట్‌లో కారు నడిపి ప్రమాదాలు చేసుకోవడం వంటి పలు ఘటనలు జరిగాయి.

పెళ్లి కాలేదంటూ ఇన్‌స్టాలో రీల్స్..

శ్రీనాథ్‌కి తెలియకుండా సాయి చరణి పిల్లలు పుట్టకుండా మందులు వాడటం ప్రారంభించడంతోపాటు తనకు పెళ్లి కాలేదని చెబుతూ ఇన్‌స్టాగామ్‌లో రీల్స్ కూడా చేసింది.ఈ నేపథ్యంలో గత ఏడాది అక్టోబర్ 16న తన అత్తామామలకు ఫోన్ చేసిన చరణి శ్రీనాథ్ చనిపోయాడని చెప్పింది. దిగ్భ్రాంతికి లోనైన బాబూరావు దంపతులు, వియ్యంకుడు శ్రీనివాసరావుతో కలిసి అమెరికా వెళ్లి అక్కడ కుమారుడి అంత్యక్రియలు పూర్తి చేశారు. అంత్యక్రియలకు సాయి చరణి రాకపోగా, శ్రీనాథ్ తల్లిదండ్రులను ఇంట్లోకి సైతం రానీయలేదు. తమ అబ్బాయి ఎలా చనిపోయాడని ఆమెను శ్రీనాథ్ తల్లిదండ్రులు అడిగితే తమ ఇద్దరం రెండు రోజులపాటు యోనోహిల్స్‌కు ట్రెక్కింగ్ వెళ్లామని, మొదటి రోజు బాగానే తిరిగి వచ్చామి, రెండో రోజు శ్రీనాథ్ కాలు జారి లోయలోకి పడిపోయాడని చెప్పింది. వెంటనే పోలీసులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని అడగ్గా, పొంతన లేని సమాధానాలు చెబుతుండడంతో శ్రీనాథ్ తండ్రి బాబూరావు తన కుమారుడిది అనుమానాస్పద మరణమని నిర్ధారణకు వచ్చి అమెరికాలో ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. కానీ ఆయన వియ్యంకుడు సుఖవాసి శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేయవద్దని బెదిరింపులకు దిగటంతోపాటు అమెరికాలోనే నివసిస్తున్న శ్రీనాథ్ సోదరి కుటుంబాన్ని ఇబ్బందులకు గురి చేస్తామని హెచ్చరించారు. దీంతో ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో ఇండియా వచ్చేశారు. ఇన్ని రోజులు కుమారుడి మరణాన్ని మౌనంగానే భరించిన బాబూరావు సన్నిహితులు, న్యాయవాదుల సలహామేరకు సీఐడీ పోలీసులను ఆశ్రయించారు. సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పుల మార్గదర్శకాలకు అనుగుణంగా, న్యాయ నిపుణుల సలహా మేరకు కేసు నమోదు చేసినట్లు సమాచారం.

ఖనిజాన్వేషణ సంస్థలకు సంపూర్ణ సహకారం

- మైనింగ్ శాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది



సాక్షి, అమరావతి: ఖనిజాన్వేషణ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారాన్ని అందించేందుకు సిద్ధంగా ఉందని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (మైనింగ్) గోపాలకృష్ణ ద్వివేది స్పష్టం చేశారు. దేశ ప్రగతిలో కీలకమైన ఖనిజ వనరుల కోసం విస్తృతంగా అన్వేషణలు జరగాలని సూచించారు. విజయవాడలో బుధవారం రాష్ట్ర జియోలాజికల్ ప్రోగ్రామింగ్ బోర్డు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అపారమైన ఖనిజ వనరులున్నాయని, వాటిని గుర్తించడం కోసం జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా వంటి సంస్థలు మరింత చురుగ్గా తమ అన్వేషణలను కొనసాగించాలని కోరారు. విదేశ జీడీపీలో మైనింగ్ వాటా 1.5 శాతం ఉండగా, మన రాష్ట్ర జీడీపీలో మాత్రం మైనింగ్ వాటా 2.7 శాతం ఉండడం గర్వకారణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి మేజర్ మినరల్ మైనింగ్ కోసం ఎక్స్‌ప్లోరేషన్ ఏజెన్సీలు 56 బ్లాకులను రాష్ట్రానికి కేటాయించాయని తెలిపారు. రాష్ట్రంలోని 270 మేజర్ మినరల్ బ్లాకులను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురానున్నట్లు తెలిపారు. రాష్ట్ర గనుల శాఖ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో విస్తరించి ఉన్న అపారమైన సముద్రతీరంలో అనేక మేజర్ మినరల్స్ నిక్షేపాలున్నాయన్నారు. రాష్ట్రంలో మాంగనీస్, ఐరన్ ఓర్, లైమ్ స్టోన్, బీచ్ శాండ్, గోల్డ్, డైమండ్ వంటి ఖనిజ నిక్షేపాలున్నాయని వాటిపై దృష్టి సారించి మైనింగ్ నిర్వహిస్తే పారిశ్రామిక ప్రగతి పరుగులు పెడుతుందని తెలిపారు. అలాగే క్రిటికల్ మినరల్స్‌గా ఉన్న కాపర్, గ్రాఫైట్, లిథియం, కోబాల్ట్, నికిల్ వంటి మినరల్స్ మీద ఎక్స్‌ప్లోరేషన్ ఏజెన్సీలు దృష్టి పెట్టాలని కోరారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మహాపాత్రో రెండు మాంగనీస్ బ్లాక్‌లకు సంబంధించిన నివేదికలను ప్రభుత్వానికి సమర్పించారు. జీఎస్ఐ మెరైన్ వింగ్ డైరెక్టర్ శుభాంకర్ దత్తా, ఎన్ఎండీసీ, ఓఎన్‌జీసీ, ఎంఈసీఎల్, ఐబీఎం, ఎంఓఐఎల్ సంస్థల ప్రతినిధులు, వివిధ యూనివర్సిటీలకు చెందిన ప్రొఫెసర్లు, గనుల శాఖ, ఏపీఎండీసీ అధికారులు పాల్గొన్నారు.

అదనంగా మరో 2 కోట్ల పనిదినాల 'ఉపాధి'

- 21.5 కోట్ల నుంచి 23.5 కోట్ల పనిదినాల పెంపు
- రూ. 900 కోట్లకు పైగా లబ్ధి
- ఇప్పటికే 21.44 కోట్ల పనిదినాలు కల్పించిన ప్రభుత్వం
- 45 లక్షల కుటుంబాలకు రూ.5,320 కోట్ల ప్రయోజనం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంత పేదలకు ఉపాధి హామీ పథకం ద్వారా అదనంగా మరో 2 కోట్ల పనిదినాల పాటు పనులు కల్పించేలా లేబర్ బడ్జెట్‌ను పెంచేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. రాష్ట్ర ఉపాధి హామీ పథకం లేబర్ బడ్జెట్ పెంపు అంశంపై వర్చువల్ విధానంలో బుధవారం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ సెక్రటరీ అమిత్ కటారియా ఆధ్వర్యంలో కేంద్ర-రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖల ఉన్నతాధికారుల ఉమ్మడి సమావేశం జరిగింది. ఈ ఆర్థిక ఏడాదిలో ఇప్పటికే రాష్ట్రానికి కేటాయించిన 21.5 కోట్ల పనిదినాల లక్ష్యం దాదాపు పూర్తి కావడంతో ఈ సమావేశం నిర్వహించారు. కాగా, ఈ ఆర్థిక ఏడాదిలో ఈ పథకం ద్వారా 21.5 కోట్ల పనిదినాలు కల్పించేందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆమోదం తెలపగా.. ఇప్పుడు ఆ పనిదినాల సంఖ్యను 23.5 కోట్ల పనిదినాలకు పెంచింది. ఆర్థిక సంవత్సరం ముగిసే 2024 మార్చి నెలాఖరుకు ముందే ఈ కేటాయింపుల లక్ష్యం పూర్తయితే, మరో విడత పనిదినాల కేటాయింపు పెంచుతామని సమావేశంలో కేంద్ర అధికారులు హామీ ఇచ్చినట్లు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు వివరించారు. కాగా, రాష్ట్రానికి అదనంగా రెండు కోట్ల పనిదినాల పెంపు ద్వారా గరిష్టంగా రూ.900 కోట్లకు పైగా కేంద్రం నుంచి రాష్ట్రానికి అదనపు నిధులు వచ్చే అవకాశం ఉందని అధికారులు వివరించారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం ఈ ఒక్క ఆర్థిక ఏడాదిలోనే ఏప్రిల్ ఒకటో తేదీనుంచి ఇప్పటి వరకు దాదాపు 45 లక్షల కుటుంబాలకు 21.44 కోట్ల పనిదినాల పాటు పనులు కల్పించింది. దీని ద్వారా కూలీలే ప్రత్యక్షంగా ఈ ఆర్థిక ఏడాదిలోనే ఇప్పటి వరకు రూ. 5,320 కోట్ల మేర లబ్ధి పొందారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, కమిషనర్ సూర్యకుమారి, ఉపాధి హామీ పథకం డైరెక్టర్ చిన్నతాతయ్య, జాయింట్ కమిషనర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.



హోరాహోరీగా ఖోఖో పోటీలు

కృష్ణా యూనివర్సిటీ అంతర కళాశాలల ఖోఖో మహిళల పోటీలు శ్రీదుర్గామల్లేశ్వర మహిళ సిద్ధార్థ కళాశాలలో బుధవారం హోరాహోరీగా జరిగాయి. -IIలో▸



చిల్లకల్లులో డీజీపీ నేర సమీక్ష

జగ్గయ్యపేట: మండలంలోని చిల్లకల్లు సమీపంలో డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం రాత్రి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. సీపీ టీకే రాణా పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో తనిఖీలు



ఎన్టీఆర్ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను డీఎంహెచ్‌వో డాక్టర్ మాచర్ల సుహాసిని అర్ధరాత్రి తనిఖీలు చేపట్టారు. విధుల్లో ఉంటున్న సిబ్బంది, అందిస్తున్న సేవలను పరిశీలించారు. -IIలో▸

న్యూస్‌రీల్

నేడు కరువు మండలాల్లో కేంద్ర బృందం పర్యటన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలోని కరువు మండలాల్లో స్థితిగతులను అధ్యయనం చేసేందుకు అంతర్ మంత్రిత్వ కేంద్ర బృందం (ఐఎంసీటీ) గురువారం జిల్లాలో పర్యటించనుందని జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి. సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తిరువూరు మండలం లక్ష్మీపురం, ఎర్రమాడు, గంపలగూడెం మండలం గుళ్లపూడి గ్రామాల్లో బృందం పర్యటిస్తుందని పేర్కొన్నారు. తిరువూరు మండలం లక్ష్మీపురం గ్రామంలో ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటుచేయాలని సూచించారు. వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ జాయింట్ సెక్రటరీ పంకజ్ యాదవ్ నేతృత్వంలో డైరెక్టరేట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.పొన్నుస్వామి, మహేష్ కుమార్, సంసద్ ఆదర్శ గ్రామీణ యోజన అండర్ సెక్రటరీ కై లాశ్ శంక్లా బృందంలో ఉన్నారని తెలిపారు.

కేఆర్‌యూ బాస్కెట్‌బాల్ విజేత మేరీస్ స్టెల్లా



విజయవాడ స్పోర్ట్స్:కృష్ణా యూనివర్శిటీ అంతర కళాశాలల బాస్కెట్‌బాల్ మహిళల చాంపియన్‌షిప్‌ను మేరీస్ స్టెల్లా కాలేజీ కై వసం చేసుకుంది. రెండో స్థానాన్ని ఆంధ్రా లయోల కాలేజీ, మూడో స్థానాన్ని సిద్ధార్థ మహిళా కాలేజీ, నాల్గో స్థానాన్ని కేబీఎన్ కళాశాల దక్కించుకున్నాయి. అక్కినేని మహిళల ఆసుపత్రి చైర్‌పర్సన్ అక్కినేని మణి విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఏపీ నెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బి.శివరాం, బాస్కెట్‌బాల్ కోచ్ వి.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.


22 నుంచి ఫల, పుష్ప ప్రదర్శన

లబ్బీపేట(విజయవాడతూర్పు): పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్డు లోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల గ్రౌండ్‌లో ఈ నెల 22 నుంచి 27 వరకు ఫల పుష్ప ప్రదర్శన, అమ్మకం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గరిమెళ్ళ జానకిరామయ్య తెలిపారు. మొగల్రాజపురంలోని ఓ హోటల్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రదర్శన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగలను దృష్టిలో ఉంచుకుని ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రదర్శన ప్రారంభానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ పాల్గొంటున్నారని పేర్కొన్నారు. నర్సరీల ప్రతినిధులు మాట్లాడుతూ మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ఒక వేదికను ఏర్పాటు చేయడం మంచి పరిణామమని తెలిపారు. అన్ని నర్సరీలను ఒక చోటకు తీసుకురావడం అభినందనీయమన్నారు. ఆర్గానిక్ ఫుడ్స్ సైతం ప్రదర్శనలో ఉంచుతామని వెల్లడించారు.

వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కమిటీ నియామకం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కమిటీలో ఎన్టీఆర్ జిల్లాకు చెందిన పలువురికి చోటు లభించింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దండమూడి రాజేష్, కార్యదర్శిగా గునుపూడి చందు, సంయుక్త కార్యదర్శిగా మద్దూరి శ్యాం సుందర్‌ను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

సేవలపై ఏఎన్‌ఎంలకు శిక్షణ



లబ్బీపేట(విజయవాడతూర్పు): గ్రామీణ ప్రాంతాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విస్తరించిన వైద్య సేవలపై గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అజిత్‌సింగ్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా నోటి ఆరోగ్యం, అత్యవసర చికిత్సలు, వృద్ధులకు అందించాల్సిన సేవలు, మానసిక వ్యాధులు వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని మాట్లాడుతూ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌ల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. జాతీయ హెల్త్ మిషన్ డీపీఎంఓ డాక్టర్ నవీన్, డీపీఓ మహేష్, వత్సవాయి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుష్మా, డాక్టర్ వాసంతి, డాక్టర్ బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.





పోయిరావమ్మా పోలి..

పోయిరావమ్మా పోలమ్మ అంటూ భక్తులు పోలిని స్వర్గానికి సాగనంపారు. కార్తిక మాసం పూర్తి కావడంతో బుధవారం పెద్ద ఎత్తున భక్తులు పోలిని స్వర్గానికి సాగనంపేందుకు దుర్గాఘాట్‌తో పాటు కృష్ణానది పరివాహక ప్రాంతాల్లోని స్నానఘాట్‌లకు తరలివచ్చారు. తెల్లవారుజామున రెండు గంటల నుంచే పెద్ద ఎత్తున భక్తులు చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం అరటి దొప్పల్లో దీపాలను వెలిగించి నీటిలో వదిలారు. మరో వైపున నదీ తీరానికి రాలేని భక్తులు తమ ఇళ్ల, అపార్టుమెంట్లలో నీటి తొట్టెలను ఏర్పాటు చేసుకుని అందులో అరటి దొప్పల్లో దీపాలను వెలిగించి వదిలారు.

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ)

బస్సు యాత్ర జయప్రదం చేయండి

– ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్



కంచికచర్ల: ఈ నెల 17వ తేదీన సామాజిక సాధికార బస్సు యాత్ర నందిగామ రానుందని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ తెలిపారు. మండలంలోని పరిటాల, గనిఆత్కూరు, చెవిటికల్లు తదితర గ్రామాల్లో బుధవారం ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఈ యాత్రను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్ ప్రజా రంజకమైన పాలన అందిస్తున్నారని చెప్పారు. సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయని తెలిపారు. లిడ్‌క్యాప్ చైర్మన్ రాజశేఖర్, సర్పంచ్ ఆనందజ్యోత్స్న, ఎంపీటీసీ మాధవి, సచివాలయ మండల కన్వీనర్ చింతా రవీంద్రనాథ్, వినయభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాఖలో ఉద్యోగాల విప్లవం

- ఉమ్మడి కృష్ణాలో పెద్ద ఎత్తున నియామకాలు
- నాలుగున్నరేళ్లలో రెండువేలకు పైగా ఉద్యోగాల భర్తీ
- ఒక్క ఖాళీ లేకుండా నిరంతరం నియామక ప్రక్రియ
- తాజాగా టీచింగ్ వైద్యుల నియామకాలకు నోటిఫికేషన్
- పూర్తిస్థాయి సిబ్బందితో మెరుగైన వైద్య సేవలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేషంగా కృషి చేస్తున్నారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించి ప్రాణాలకు భరోసా కల్పిస్తున్నారు. అనారోగ్యాలతో బాధపడే ఏ ఒక్కరూ వైద్యం అందక అవస్థలు పడకూడదని భావించి వైద్య ఆరోగ్యశాఖలో ఎన్నో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. ఇంటింటికీ వైద్యులను పంపించి అందరి ఆరోగ్య సమాచారం సేకరించారు. జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహణ ద్వారా లక్షలాది మంది ప్రజలకు వైద్య సేవలు చేరువ చేశారు. గ్రామీణ స్థాయి నుంచి జిల్లా స్థాయి ప్రభుత్వ ఆస్పత్రుల వరకు వైద్యులు, వైద్య నిపుణులు, నర్సులు, సాంకేతిక సిబ్బందిని నియమించారు. వైద్యశాఖలో ఉద్యోగాల విప్లవం కొనసాగుతోంది. ఎన్నడూ లేనంతగా ఉద్యోగ నియామకాలు చేపడుతున్నారు. అవసరమైన పోస్టులను కొత్తగా క్రియేట్ చేసి, వెనువెంటనే నియామకాలు చేపడుతున్నారు. పదవీ విరమణ, ఉద్యోగోన్నతి ఇలా ఏదైనా పోస్టు ఖాళీ అయితే, నెలరోజుల్లో తిరిగి ఆ పోస్టుకు రిక్రూట్‌మెంట్ జరిపి భర్తీ చేస్తున్నారు. ఎక్కడా, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా, చాలా పారదర్శకంగా, జిల్లా సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మెరిట్ ప్రాతిపదికన నియమిస్తున్నారు. ఇలా వైద్యశాఖలో నాలుగున్నరేళ్లలో ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఏకండా రెండు వేలకు పైగా పోస్టులు భర్తీ చేశారంటే ఒక చారిత్రాత్మక ఘటనగా వైద్యులు పేర్కొంటున్నారు.

ఖాళీ అయిన పోస్టులు వెంటనే భర్తీ...

ప్రభుత్వాస్పత్రుల్లో ఒక్క పోస్టు కూడా ఖాళీ లేకుండా నిరంతరం నియామకాలు జరుపుతున్నారు. గతంలో ఏదైనా పోస్టు ఖాళీ అయితే, నియామకాలు చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి ఆదేశాల కోసం ఎదురుచూడాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. జిల్లా ఎంపికల కమిటీ ద్వారా రోస్టర్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం మెరిట్ ఆధారంగా ఉద్యోగ నియామకాలు చేస్తున్నారు. దీంతో ఖాళీలనేవి లేకుండా పూర్తిస్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉండటంతో రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నాయి.

పారదర్శకంగా ఎంపికలు....

ఎలాంటి సిఫార్సులకు తావులేకుండా ఉద్యోగ నియామకాలన్నీ చాలా పారదర్శకంగా చేపడుతున్నారు. గత ప్రభుత్వంలో సిఫార్సు ఉంటేనే ఉద్యోగం వచ్చేది. ఇప్పుడు మెరిట్ ఆధారంగానే ఉద్యోగాలు ఇవ్వడంతో, నియామకాల్లో ఎవరూ జోక్యం చేసుకోవడం లేదు. డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ఏర్పాటు చేసి, ప్రతి నియామకాన్ని పారదర్శకంగా చేపడుతున్నారు. మెరిట్ ఆధారంగా నియామకాలు చేపడుతున్నారు. ఎలాంటి అనుమానాలకు తావులేకుండా మెరిట్ లిస్టులను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. దీంతో అవినీతికి తావులేకుండా, రూపాయి ఖర్చులేకుండా ఉద్యోగాలు పొందగలుగుతున్నారు.

రోగులకు మెరుగైన సేవలు....

ఒకప్పుడు సిబ్బంది కొరతతో రోగులకు అరకొర వైద్య సేవలు అందేవి. ప్రస్తుతం పరిస్థితి మారింది. పూర్తిస్థాయిలో సిబ్బంది ఉండటంతో ఎలాంటి లోపాలు తలెత్తకుండా సేవలు అందిస్తున్నారు. గతంలో విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో 230 మంది స్టాఫ్‌నర్సులు ఉండేవారు. ఇప్పుడు స్టాఫ్ నర్సులు 500 మంది దాటారు. కొత్తగా 275 స్టాఫ్‌నర్సు పోస్టులను క్రియేట్ చేసి నియామకాలు చేపట్టారు. సూపర్ స్పెషాలిటీ, స్పెషాలిటీ విభాగాల్లో సైతం 50 మంది వైద్యులను కొత్తగా నియమించారు. మచిలీపట్నం జిల్లా ఆస్పత్రిని బోధనాస్పత్రిగా మార్చి పెద్ద ఎత్తున నియామకాలు చేపట్టారు. జిల్లాలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు ఉండేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ఎక్కడ చూసినా పూర్తిస్థాయి వైద్య సిబ్బంది అందుబాటులో ఉండటంతో మెరుగైన వైద్యం అందించగలుగుతున్నారు.

నాలుగున్నరేళ్లలో నియామకాలు ఇలా...

జీజీహెచ్/ఎస్ఎంసీ విజయవాడలో	
స్టాఫ్‌నర్సులు:	275 మంది
పారామెడికల్‌సిబ్బంది:	105
వైద్యులు :	75
నాల్గవ తరగతి ఉద్యోగులు:	80
ఇతర సిబ్బంది :	100 వరకూ
జిల్లా వైద్యశాఖలో	
ఎంఎల్‌హెచ్‌పీలు:	650
ఏఎన్ఎంలు:	185
కంప్యూటర్ ఆపరేటర్‌లు:	52
ఇతర పోస్టులు:	50
పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో	
వైద్యులు:	65
స్టాఫ్‌నర్సులు:	132
కంప్యూటర్ ఆపరేటర్‌లు:	60
ల్యాబ్ టెక్నీషియన్స్ :	65
మచిలీపట్నం బోధనాస్పత్రిలో..	
స్టాఫ్‌నర్సులు :	60
ఇతర సిబ్బంది:	350

ఎప్పటి ఖాళీలు అప్పుడే భర్తీ



వైద్యశాఖలో నియామకాల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది. జోనల్ కేడర్ పోస్టులను రాజమండ్రిలోని ఆర్డీ కార్యాలయం ఆధ్వర్యంలో చేపడుతున్నారు. రాష్ట్ర క్యాడర్ పోస్టులు డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌లో జిల్లా క్యాడర్ పోస్టులను జిల్లా సెలక్షన్ కమిటీ నియామకాలు చేపడుతుంది. నాలుగున్నరేళ్లలో అనేక పోస్టులు క్రియేట్ చేయడంతో పాటు, నియామకాలు చేపట్టారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బందిని నియమించాం.

– డాక్టర్ మాచర్ల సుహాసిని,
జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, ఎన్టీఆర్‌జిల్లా

మంచి పరిణామం



వైద్యశాఖలో ఒక్క ఖాళీ కూడా లేకుండా ఉద్యోగాలు భర్తీ చేయడం మంచి పరిణామం. ఎప్పటికప్పుడు అధికారుల నుంచి ఖాళీల వివరాలను తీసుకుని, నోటిఫికేషన్‌లు ఇస్తూ ఉద్యోగ నియామకాలు చేపడుతున్నారు. దీంతో పూర్తిస్థాయిలో ఉద్యోగులు అందుబాటులో ఉండటంతో రోగులకు సకాలంలో సేవలు అందించగలుగుతున్నారు. ఒకప్పుడు ఇద్దరు, ముగ్గురు చేసే పనిని ఒకరు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రభుత్వం సమస్యను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంది. పదోన్నతులు సైతం అందరికీ కల్పించింది.

– డాక్టర్ మెహబూబ్ షేక్,
రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం

తుపాను నష్టంపై పూర్తి నివేదిక

- జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేంద్ర రత్నూ
- కంకిపాడు, దావులూరు గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటన



కంకిపాడు ఆర్‌బీకేలో పంట నష్టం వివరాలు తెలుపుతున్న ఎమ్మెల్యేలు పార్థసారథి, కైలే

కంకిపాడు: తుపాను నష్టం వివరాలను సమగ్రంగా సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని అంతర్ మంత్రిత్వ కేంద్ర బృందం, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేంద్ర రత్నూ అన్నారు. రాజేంద్ర రత్నూతో పాటు కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఏడీ మహేంద్ర చెందేలియా, రోడ్డు రవాణా, హైవేస్ ఎస్ఈ రాకేష్‌కుమార్‌తో కూడిన బృందం బుధవారం కృష్ణా జిల్లాలో పర్యటించింది. కంకిపాడు రైతుభరోసా కేంద్రంలో ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను బృందం పరిశీలించింది. మిచాంగ్ తుపానుతో జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన పంటలకు వాటిల్లిన నష్టం, దెబ్బతిన్న రహదారులు, విద్యుత్ లైన్లు, వివిధ రంగాలకు వాటిల్లిన నష్టాన్ని జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ కేంద్ర బృందానికి వివరించారు. 1,01,862 హెక్టార్లలో వరి పంట నష్టం వాటిల్లిందని, 913.62 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం జరిగిందని వెల్లడించారు. ఆర్అండ్‌బీ శాఖకు చెందిన 57 రహదారులు 312 కిలోమీటర్లు, పంచాయతీ రాజ్‌కు చెందిన ఆరు రహదారులు 17.16 కిలోమీటర్లు మేర దెబ్బతిన్నాయని వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర బృంద ప్రతినిధి రాజేంద్ర రత్నూ విలేకరులతో మాట్లాడుతూ తుపాను నష్టంపై మొదటి రోజు కృష్ణా జిల్లా పర్యటన చేపట్టామన్నారు. పంట పొలాల్లో నీరు నిలిచి ఉందని, పనలు దెబ్బతిని ఉన్నాయన్నారు. పంట నష్టంపై జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయి సర్వే చేపట్టిందన్నారు. పొలాల్లో మురుగు ఉండటం వల్ల సర్వే పూర్తి స్థాయిలో సాగలేదన్నారు. తుపాను నష్టం, రైతుల పరిస్థితులను ఎమ్మెల్యేలు కొలుసు పార్థసారథి, కైలే అనిల్‌కుమార్, మాజీ మంత్రి వడ్డె శోభనాద్రీశ్వరరావు కేంద్ర బృందానికి వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రాఘవరావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.పద్మావతి, సివిల్‌సప్లయిస్ డీఎం రాజు, ఉద్యానశాఖ అధికారి జె.జ్యోతి, జెడ్పీటీసీ బాకీ బాబు పాల్గొన్నారు.

గుడివాడరూరల్: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాలను కేంద్ర కమిటీ బృందం సభ్యులు బుధవారం పరిశీలించారు. మండలంలోని రామనపూడి, వలివర్తిపాడు గ్రామాల్లో అంతర్ మంత్రిత్వ కేంద్ర బృందం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేంద్రరత్నూ, కేంద్ర కమిటీ సభ్యులు, జాయింట్ కలెక్టర్ అపరాజిత పర్యటించారు. తొలుత పలువురు రైతులతో మాట్లాడారు. రాజేంద్రరత్నూ మాట్లాడుతూ తడిచి, మొక్క మొలిచిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేసిందని స్పష్టం చేశారు. పంట నష్ట పరిహార అంచనాలు సక్రమంగా రూపొందించి రైతులకు న్యాయం చేయాలని సంబంధితశాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో పి.పద్మావతి, వ్యవసాయశాఖ ఏడీ నిమ్మగడ్డ రమాదేవి, తహసీల్దార్ కె.ఆంజనేయులు, మండల వ్యవసాయశాఖ అధికారి బి.అనంతలక్ష్మి, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావు, ఆర్ఐ నాగబాబు పాల్గొన్నారు.

అర్ధమండల దీక్షలు ప్రారంభం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ అర్ధ మండల దీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఎరుపు దుస్తులను ధరించి ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి విగ్రహం, మహా మండపం ఆరో అంతస్తులోని అమ్మవారి ఉత్సవ మూర్తి వద్ద అర్ధమండల దీక్షలను స్వీకరించారు. 17వ తేదీ వరకు భక్తులు దీక్షలు స్వీకరిస్తారని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. భవానీ దీక్షలలో భాగంగా ఈ నెల 26వ తేదీన కలశజ్యోతి మహోత్సవాన్ని నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ వైదిక కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఊరేగింపులో అమ్మవారి ప్రచార రథం, శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులతో ప్రత్యేక వాహనంతో ముందుకు సాగుతారు. కలశ జ్యోతులతో భవానీలు, అమ్మవారి భక్తులు ఊరేగింపుగా ఇంద్రకీలాద్రికి చేరుకుంటారు. కనకదుర్గనగర్‌లో కలశజ్యోతులను సమర్పించి అమ్మవారిని దర్శించుకుంటారు. నగరంతో పాటు చుట్టు పక్కల గ్రామాలు, పల్లెల నుంచి పెద్ద ఎత్తున భవానీలు, భక్తులు జ్యోతులతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుంటారు.

అట్టహాసంగా ఆడుదాం.. ఆంధ్రా

- రేపటి నుంచి క్రీడా పోటీలు ప్రారంభం
- జిల్లాలో సిద్ధమైన 225 మైదానాలు
- 6,350 మంది న్యాయ నిర్ణేతల పర్యవేక్షణలో పారదర్శకంగా పోటీలు



ఆటల పోటీల నిర్వహణకు ఇబ్రహీంపట్నంలో సిద్ధమైన క్రీడా మైదానం

విజయవాడ స్పోర్ట్స్: ఆడుదాం.. ఆంధ్రా క్రీడా పోటీలను జిల్లాలో అట్టహాసంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. యువతలోని క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 100 కోట్ల వ్యయంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ పోటీలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ నెల 15వ తేదీ శుక్రవారం నుంచి పోటీలు ప్రారంభం కానున్నాయి. 28వ తేదీ వరకు 11 రోజుల పాటు (సెలవులు మినహాయించి) వార్డు/గ్రామ సచివాలయాల స్థాయిలో, జనవరి రెండు నుంచి ఆరో తేదీ వరకు, ఎనిమిది నుంచి 10వ తేదీ వరకు మండల స్థాయిలో, జనవరి 16 నుంచి 19వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయిలో, జనవరి 22 నుంచి 25వ తేదీ వరకు జిల్లా స్థాయిలో ఈ పోటీలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు పూర్తి చేశారు.

225 మైదానాల్లో....

కబడ్డీ, క్రికెట్, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో ఈ పోటీలు జరగనున్నాయి. ముందుగా జిల్లాలోని 605 సచివాలయాల పరిధిలో నిర్వహిస్తారు. జనవరి 28వ తేదీ వరకు జరిగే ఈ క్రీడా సంబరాలకు జిల్లాలో 225 మైదానాలు సిద్ధం చేశారు. వీటిల్లో అత్యధికంగా జగ్గయ్యపేటలో 42, నందిగామలో 20, విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో 13, సెంట్రల్ నియోజకవర్గంలో 13, తూర్పు నియోజకవర్గంలో 12 మైదానాలున్నాయి. సచివాలయాల స్థాయి పోటీలు ఆయా సచివాలయాల పరిధిలో జరిగేలా.., మండల స్థాయి పోటీలు మండల కేంద్రాల్లో, నియోజకవర్గ స్థాయి పోటీలు నియోజకవర్గ స్థాయి కేంద్రాల్లో, జిల్లా స్థాయి పోటీలు విజయవాడలో నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే క్రీడలకు సంబంధించిన కిట్లను ఆయా మండలాల ఎంపీడీవోలకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు సరఫరా చేశారు.

పకడ్బందీగా పోటీలు....

సచివాలయ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఈ పోటీలను అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. సచివాలయ స్థాయిలో జరిగే పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించేందుకు ఒక్కో సచివాలయ పరిధిలోని 10 మంది క్రీడా ఔత్సాహికులను అధికారులు ఎంపిక చేసి వారికి ఇటీవలే శిక్షణ ఇచ్చారు. క్షేత్ర స్థాయి పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించేందుకు జిల్లాలో ఉన్న 605 సచివాయాల్లో 6,050 మంది క్రీడా ఔత్సాహికులను ఎంపిక చేశారు. వీరితో పాటు 150 మంది ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే పీఈటీలను, మరో 150 మంది ప్రైవేటు ప్రభుత్వం నియమించింది. సచివాలయ స్థాయిలో జరిగే పోటీలను ఆయా సచివాలయాల సెక్రటరీ, వీఆర్వో, పోలీస్ కానిస్టేబుల్, ఏఎన్ఎం, స్కూల్ హెచ్ఎం పర్యవేక్షిస్తారు. మండల స్థాయి పోటీలను ఎంపీడీవో, తహసీల్దార్, ఎస్ఐ, మండల మెడికల్ ఆఫీసర్, ఈవోపీఆర్డీ, ఎంఈవో, నియోజకవర్గ స్థాయి పోటీలను ఆర్డీవో, తహసీల్దార్, ఎంపీడీవో, సీఐ, ఎంఈవో, ఇంజినీరింగ్ సెక్షన్ జేఈ/ఎఈ, జిల్లా స్థాయి పోటీలను జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, పోలీస్ కమిషనర్, డీఈవో, జెడ్పీ సీఈవో, డీపీవో, డ్వామా పీడీ, డీఎంఅండ్‌హెచ్‌వో, ఫారెస్ట్ ఆఫీసర్, డీఆర్‌డీఏ పీడీ పర్యవేక్షణలో జరుగుతాయి.

లక్షకు చేరిన క్రీడాకారుల రిజిస్ట్రేషన్లు...

ఎన్టీఆర్ జిల్లాలోని 605 సచివాలయాల్లో 1.37 లక్షల క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. గత నెల 27 నుంచి క్రీడాకారులు వారి పేర్లను నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. తొలి దశలో క్రీడాకారుల నమోదు ప్రక్రియ కాస్త మందకొడిగా సాగినా గడిచిన రెండు మూడు రోజుల్లో ఊపందుకుంది. బుధవారం సాయంత్రం ఆరు గంటలకు క్రీడాకారుల నమోదు ప్రక్రియ లక్షకు చేరుకుని 72 శాతాన్ని నమోదు చేసుకుంది. క్రీడాకారుల నమోదు ప్రక్రియలో పలువురు కోచ్‌లు, పాఠశాలల ఉపాధ్యాయులు, క్రీడాకారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు చురుగ్గా వ్యవహరించినట్లు అధికారులు భావిస్తున్నారు.

క్లుప్తంగా

ఢిల్లీ వెళ్లిన కృష్ణా జిల్లా కలెక్టర్



చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ఎన్నికలకు సంబంధించిన శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు బుధవారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. న్యూఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ (ఐఐఐడీఈఎం)లో ఈ నెల 14,15 తేదీల్లో నిర్వహించే వర్క్‌షాపులకు జిల్లా ఎన్నికల అధికారిగా రాజాబాబు హాజరవుతారు.

21న సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ (కోరుకొండ)లో ప్రవేశాలకు ఈ నెల 21వ తేదీన పరీక్ష జరుగుతుందని ఎన్టీఆర్ జిల్లా ఉప విద్యాశాఖాధికారి కె.వి.ఎస్.కుమార్ బుధవారం తెలిపారు. జిల్లాలోని పాఠశాలల తనిఖీ అధికారులు, ప్రధానోపాధ్యాయులు తమ విద్యాసంస్థల్లోని విద్యార్థులను పరీక్షకు సిద్ధం చేయాలని సూచించారు. ప్రవేశ పరీక్ష రాసేందుకు ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరూ అర్హులని తెలిపారు. విద్యార్థులు ఈ నెల 16వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు సైనిక్ స్కూల్ వెబ్‌సైట్‌లో రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకునేలా పాఠశాలల తనిఖీ అధికారులు, ప్రధానోపాధ్యాయులు చూడాలని ఆ ప్రకటనలో కోరారు.

హోరాహోరీగా కృష్ణా వర్సిటీ ఖోఖో పోటీలు



విజయవాడ స్పోర్ట్స్: కృష్ణా యూనివర్సిటీ అంతర కళాశాలల ఖోఖో మహిళల పోటీలు విజయవాడ శ్రీదుర్గామల్లేశ్వర మహిళ సిద్ధార్థ కళాశాల (ఎస్‌డీఎంఎస్‌కే) ప్రాంగణంలో బుధవారం హోరాహోరీగా జరిగాయి. పీబీ సిద్ధార్థ ఆర్ట్స్, సైన్స్, ఏజీఎస్‌జీ సిద్ధార్థ (ఉయ్యూరు), ఎస్‌డీఎంఎస్‌కే, డాక్టర్ ఎల్‌హెచ్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (మైలవరం), విద్యాలయ డిగ్రీ కళాశాల (గుడివాడ), సిద్ధార్థ ఫార్మసీ కళాశాల జట్లు ఈ పోటీల్లో నాకౌట్ కం లీగ్ పద్ధతిలో తలపడ్డాయి. పోటీలను ఎస్‌డీఎంఎస్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.విజయలక్ష్మి ప్రారంభించారు. టోర్నీ చైర్‌పర్సన్‌గా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్పన, ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు చెందిన ఆరుగురు ఈ పోటీలకు రిఫరీలుగా వ్యవహరించారు. ఈ పోటీల్లో సిద్ధార్థ మహిళా కాలేజీ జట్టు అత్యుత్తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి ఫైనల్‌కు చేరింది.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు హిందీ తప్పనిసరి

విజయవాడ ఏడీఆర్ఎం శ్రీకాంత్



అధికార భాష అమలు కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ఎం శ్రీకాంత్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): కేంద్ర ప్రభుత్వ సంస్థల ఉద్యోగులు రోజువారీ విధుల్లో తప్పనిసరిగా అధికార భాష హిందీని ఉపయోగించాలని విజయవాడ డివిజన్ ఏడీఆర్ఎం, అదనపు ముఖ్య రాజభాష అధికారి ఎం.శ్రీకాంత్ పేర్కొన్నారు. విజయవాడ రైల్వే డివిజనల్ కార్యాలయంలో బుధవారం 185వ డివిజన్ అధికార భాష అమలు కమిటీ సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏడీఆర్ఎం శ్రీకాంత్ మాట్లాడుతూ.. ముందుగా డివిజన్‌లో అధికార భాష హిందీ అమలు లక్ష్యాలను అధిగమించడంపై పలు శాఖల అధికారులను అభినందించారు. డివిజన్‌లో నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించి 83 శాతం రోజువారీ విధుల్లో హిందీలో ఉత్తరప్రత్యుత్తరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జాతీయ సమైక్యత కోసం అధికారిక భాష అమలు ప్రాముఖ్యతను వివరించారు. ఉద్యోగులు రోజువారీ విధుల్లో హిందీ భాషను ఉపయోగించడాన్ని బాధ్యతగా తీసుకోవాలని పేర్కొన్నారు. డివిజన్‌లో అధికార భాష అమలులో సాధించిన పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాజభాష అధికారి ఆశా మహేష్ వివరించారు. గత త్రైమాసికంలో డివిజన్‌తో పాటు పలు యూనిట్లలో నిర్వహించిన హిందీ వర్క్‌షాపులు, సెమినార్‌లు, శిక్షణ తరగతుల గురించి వివరించారు. రాజభాష అమలు కోసం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి ఉద్యోగులు సిద్ధంగా ఉండాలని కోరారు. హిందీ అనువాదం కోసం ఉద్యోగులు 'కాంతస్థ యాప్', వెబ్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించాలని ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ టోర్నీకి జేఎన్‌టీయూకే జట్టు ఎంపిక



ఎంపికైన జట్టును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నప్రసాద్

పెనమలూరు: మండలంలోని కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం జేఎన్‌టీయూకే ఫెన్సింగ్ జట్టును ఎంపిక చేశారు. ఈ మేరకు కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ పోతిన రఘు బుధవారం ఈ వివరాలు వెల్లడించారు. ఈ నెల 23వ తేదీన ఔరంగాబాద్‌లో సౌత్, వెస్ట్ జోన్ యూనివర్సిటీ ఫెన్సింగ్ పోటీలు జరుగుతాయని రఘు తెలిపారు. జేఎన్‌టీయూకే పరిధిలో కాలేజీలకు ఫెన్సింగ్ పోటీలు నిర్వహించామన్నారు. అనంతరం జీపీ రాజు ఆధ్వర్యంలో జేఎన్‌టీయూకే జట్టును ఎంపిక చేశామని పేర్కొన్నారు. వీఆర్ సిద్ధార్థ నుంచి జేఎన్‌టీయూకే జట్టుకు సీహెచ్.మౌనిక, కె.సంధ్య ఎంపికయ్యారని తెలిపారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.వి.రత్నప్రసాద్, డీన్ బావినేని పాండురంగారావు, జి.నాగశ్రీనివాసులు ఎంపికైన జట్టుకు అభినందనలు తెలిపారు.

రసవత్తరంగా బ్యాడ్మింటన్ టోర్నీ



హోరాహోరీగా సాగుతున్న మ్యాచ్‌లు

విజయవాడ స్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) 67వ జాతీయ అండర్–19 బాలబాలికల బ్యాడ్మింటన్ టోర్నీ రసవత్తరంగా సాగుతోంది. పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో మంగళవారం టీం చాంపియన్‌షిప్ లీగ్ పోటీలు ప్రారంభమైన విషయం తెలిసిందే. బాలికల లీగ్ పోటీల్లో పూల్ హెచ్‌లోని ఆంధ్రప్రదేశ్ జట్టు అత్యుత్తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించింది. అదే పూల్‌లోని హిమాచల్‌ప్రదేశ్, పశ్చిమబెంగాల్, కేవీఎస్ జట్లను అవలీలగా ఓడించి క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. రాత్రి ఏడు గంటలకు జరిగిన క్వార్టర్స్‌లో హరియాణాపై ఏపీ బాలికల జట్టు 2–0 తేడాతో గెలిచి సెమీ ఫైనల్‌కు చేరింది. పూల్ ఎఫ్ నుంచి పోటీ పడిన ఏపీ బాలుర జట్టు లీగ్ మ్యాచ్‌లలో అదే పూల్‌లోని సీబీఎస్ఈ, జమ్మూకశ్మీర్, పంజాబ్ జట్లను ఓడించి క్వార్టర్స్‌కు చేరింది. క్వార్టర్స్ ఫైనల్స్‌లో హరియాణా జట్టును 2–0 తేడాతో ఓడించి సెమీస్‌కు చేరింది. బాలుర విభాగంలో మహారాష్ట్ర, కేరళ, బాలికల విభాగంలో ఢిల్లీ, చండీఘర్, పంజాబ్ జట్లు సెమీస్‌కు చేరాయి. నేడు టీం చాంపియన్‌షిప్ సెమీస్, ఫైనల్స్ జరుగుతాయి.

25 నాటికి గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ సేకరణ పూర్తిచేయాలి

ఎన్టీఆర్ జిల్లా జేసీ సంపత్ కుమార్



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జాతీయ రహదారి – 163జీలో భాగమైన ఖమ్మం – విజయవాడ గ్రీన్ ఫీల్డ్ హైవే సెక్షన్‌కు సంబంధించి ఎన్టీఆర్ జిల్లా పరిధిలో భూసేకరణను ఈ నెల 25వ తేదీ నాటికి పూర్తిచేసేందుకు కృషిచేయాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.సంపత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఖమ్మం – విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే సెక్షన్ భూసేకరణ పురోగతిపై ఎన్‌హెచ్ఏఐ, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో క్యాంపు కార్యాలయం నుంచి జాయింట్ కలెక్టర్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ.. నాగపూర్ – విజయవాడ కారిడార్ కింద ఎన్‌హెచ్–163జీలో భాగంగా ఖమ్మం – విజయవాడ గ్రీన్ ఫీల్డ్ హైవే సెక్షన్ అలైన్‌మెంట్‌కు 2019లో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ఆమోదం లభించినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి జిల్లాలో గంపలగూడెం, జి.కొండూరు, విజయవాడ రూరల్ మండలాల పరిధిలో 15 గ్రామాల్లో 243 ఎకరాల భూమిని సేకరిస్తున్నట్లు తెలిపారు. ఇందులో 11 గ్రామాలకు సంబంధించి ఇప్పటికే అవార్డులను ఖరారు చేశామని వివరించారు. మిగిలిన నాలుగు గ్రామాలకు సంబంధించిన ప్రక్రియను ఈ నెల 25 నాటికి పూర్తిచేయాలని జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ ఆదేశించారు. ఈ సమావేశంలో నేషనల్ హైవేస్ ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ యూనిట్ (ఖమ్మం) పీడీ దుర్గాప్రసాద్, భూ సేకరణ అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

ఒక కుటుంబం.. ఒకే పోలింగ్ బూత్



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ సంపత్‌కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఒక కుటుంబానికి చెందిన ఓట్లన్నీ ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. సంక్షిప్త ఓటర్ల జాబితాకు సంబంధించి నమోదవుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. జేసీ కార్యాలయంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం బుధవారం జరిగింది. ప్రత్యేక సంక్షిప్త సవరణలో భాగంగా జరుగుతున్న వివిధ కార్యకలాపాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో ఒకే కుటుంబానికి చెందిన ఓట్లను ఒకే పోలింగ్ బూత్‌లో నమోదుచేసేలా ఇప్పటికే బూత్ స్థాయి అధికారులను ఆదేశించామన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసిన నాటి నుంచి ఇప్పటి వరకు నమోదవుతున్న దరఖాస్తులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. యువ ఓటర్ల పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండే వారిని ఓటర్లుగా నమోదుచేస్తున్నామన్నారు. వారం వారం దరఖాస్తుల పరిష్కారంపై ప్రగతి చూపుతున్నామన్నారు. దరఖాస్తులపై బీఎల్వోలు, ఏఈఆర్వోలు, ఈఆర్వోలు క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించి విచారణ చేస్తున్నారన్నారు. ఈ నెల 26వ తేదీ నాటికీ అన్ని దరఖాస్తులను పెండింగ్ లేకుండా పరిష్కరించి జనవరి ఒకటో తేదీ నాటికీ దోష రహిత ఓటర్ల జాబితాను ఎన్నికల కమిషన్‌కు అందజేస్తామని పేర్కొన్నారు. జనవరి ఐదో తేదీన తుది ఓటర్ల జాబితాను ఎన్నికల కమిషన్ ప్రకటించనుందని సంపత్ కుమార్ తెలిపారు.

అర్ధరాత్రి పీహెచ్‌సీల్లో డీఎంహెచ్ఓ తనిఖీలు



పెండ్యాల పీహెచ్‌సీలో బాలింత ఆరోగ్యంపై ఆరాతీస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రాత్రి వేళల్లో విధుల్లో ఉంటున్న సిబ్బంది, అందిస్తున్న సేవలను డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని అర్ధరాత్రి తనిఖీలు చేసి పరిశీలించారు. మంగళవారం రాత్రి 10.15 గంటల సమయంలో పెండ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది, సేవలను పరిశీలించారు. అనంతరం రాత్రి 11.15 గంటల సమయంలో కంచికచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి నుంచి అల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సేవలను పరిశీలించారు. పెండ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వార్డులో ప్రసవం అయిన తల్లీబిడ్డల క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. వైద్యులు, సిబ్బంది ప్రసూతి సేవలను 24 గంటలు అందించాలని సూచించారు. అందుకు అనుగుణంగా విధులకు హాజరు కావాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినా, తనిఖీల్లో ఎవరైనా విధులకు గైర్హాజరు అయినట్లు గుర్తించినా షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. తనిఖీలు జరిగిన మూడు పీహెచ్‌సీల్లో ఉండాల్సిన సిబ్బంది విధుల్లో ఉన్నట్లు డీఎంహెచ్ఓ గుర్తించారు.

జాతీయస్థాయి ఈత పోటీలకు ఎస్ఆర్ఆర్ అధ్యాపకుడు



యుగంధర్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): న్యూఢిల్లీలో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు జరిగే ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ ఈత పోటీలకు రాష్ట్రం తరఫున మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్‌సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ డి.యుగంధర్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో వ్యాయామ విద్య విభాగం ఆధ్వర్యాన డాక్టర్ యుగంధర్ అభినందన కార్యక్రమం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, డాక్టర్ ఎం.పద్మనాభం మాట్లాడుతూ.. తమ కళాశాల వ్యాయామ విద్య అధ్యాపకుడు డాక్టర్ యుగంధర్ ఆలిండియా సివిల్ సర్వీస్‌ఈత పోటీలకు ఎంపిక కావటం కళాశాలకే గర్వకారణమన్నారు. ఆలిండియా పోటీల్లో సత్తాచాటి నగర ఖ్యాతిని ఇనుమడింప చేయాలని ఆకాంక్షించారు. కళాశాల వ్యాయామ విద్య విభాగాధిపతి డాక్టర్ మండ కోటేశ్వరరావు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు యుగంధర్‌ను ఘనంగా సత్కరించారు.

ప్రపంచ తెలుగు సాహిత్య ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ



ప్రపంచ తెలుగు సాహిత్య, కళా ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న విజయబాబు తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): తెలుగు భాషాభివృద్ధికి తోడ్పడేలా 'ప్రపంచ తెలుగు సాహిత్య, కళా ఉత్సవాల పేరిట ప్రతి నెలా ఒక్కో జిల్లాలో సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం చైర్మన్ పి.విజయబాబు అన్నారు. మాచవరంలో సాహిత్య సాంస్కృతిక సేవాసంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యాన బుధవారం 'ప్రపంచ తెలుగు సాహిత్య, కళా ఉత్సవాలు 2023' బ్రోచర్‌ను ఆవిష్కరించారు. విజయబాబు ముఖ్య అతిథిగా హాజరై బ్రోచర్‌ను ఆవిష్కరించి ప్రసంగించారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యాన పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో 'ప్రపంచ తెలుగు సాహిత్య, కళా ఉత్సవాలు' ఏర్పాటు చేయటం అభినందనీయమని కొనియాడారు. శ్రీశ్రీ కళావేదిక ఉమ్మడి కృష్ణా జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ కె.ఆర్.జి.శేషుకుమార్ మాట్లాడుతూ.. ఈ నెల 16, 17 తేదీల్లో 30 గంటల 30 నిమిషాల 30 సెకన్ల పాటు నిరంతరాయంగా జరిగే సాహిత్య ఉత్సవాల్లో పాల్గొనేందుకు సుమారు 600 మందికి పైగా కవులు, రచయితలు, కళాకారులు, సాహిత్యాభిమానులు పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. ప్రపంచ రికార్డు స్థాయిలో జరిగే ఈ సాహితీ క్రతువులో పాల్గొన్న కవులు, కళాకారులందరికీ ఉచిత భోజన వసతి, ప్రశంసాపత్రం, జ్ఞాపిక బహూకరించి, సంప్రదాయరీతిలో సన్మానం చేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ దళిత్ లెక్చరర్ల రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొల్లేటి రమేష్, శ్రీశ్రీ కళావేదిక యువజన విభాగం జిల్లా ప్రతినిధి దుంపల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టుటైమ్ ఉద్యోగం పేరుతో రూ.3 లక్షలు స్వాహా

పెనమలూరు: పార్టుటైమ్ ఉద్యోగం చేయాలనే ఆసక్తితో ఉన్న యువతి వద్ద సైబర్ నేరగాళ్లు రూ.3 లక్షలు స్వాహా చేశారు. పెనమలూరు సీఐ టి.వి.వి.రామారావు కథనం మేరకు.. పెనమలూరు గ్రామానికి చెందిన వీరంకి జయమాధవి పోరంకిలో మెడికల్ షాపులో పని చేస్తోంది. ఆమె పార్టుటైం ఉద్యోగం కోసం ఇన్‌స్టాగ్రాంలో చూసిన ఉద్యోగానికి లింక్ క్లిక్ చేసింది. టాస్కు పూర్తి చేస్తే సొమ్ము ఇస్తామని చెప్పగా టాస్కు పూర్తి చేసి వాట్సాప్‌లో అకౌంట్ నంబర్ పెట్టగా ఆమె ఖాతాలో రూ.150 జమచేశారు. మరికొన్ని టాస్కులు పూర్తి చేస్తే ఎక్కువ సొమ్ము వస్తుందని నమ్మబలికారు. వారి మాటలు నమ్మిన జయమాధవి పలు దఫాలుగా రూ.3 లక్షలు పంపింది. ఆ తరువాత వారి నుంచి స్పందన లేకపోవడంతో తాను మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

గుడివాడరూరల్: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. రైల్వే ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. గుడివాడ మందపాడు రైల్వేగేటు దాటి తర్వాత ఓహెచ్‌సీ షెడ్ వద్ద ట్రైన్ ఢీకొనడంతో 40–45 ఏళ్ల వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. అతను గళ్లచొక్కా, ప్యాంట్ ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిసిన వారు 94406 27570, 08674–244352 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

నలుగురు రౌడీషీటర్ల నగర బహిష్కరణ

పటమట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని విజయవాడ పటమట స్టేషన్ ప్రాంతంలో ఉండే నలుగురు రౌడీషీటర్లను నగరం నుంచి బహిష్కరిస్తున్నామని పోలీస్‌కమిషనర్ టి.కె.రాణా మంగళవారం తెలిపారు. పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తున్న రౌడీషీటర్లు తుమ్మల విష్ణుశ్వర్, నీలం కార్తీక్, వల్లభనేని ప్రభు దాస్, బాణావతు శ్రీను నాయక్‌ను నగరం నుంచి బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. వారంతా గతంలో పలు కేసుల్లో జైలు శిక్ష అనుభవించి బయటకు వచ్చారని, అయినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదని వివరించారు. పటమట స్టేషన్ పరిధిలో ఇటీవల ఈ నలుగురు రౌడీ షీటర్లు ఆగడాలు పెరిగిపోవడంతో నగర బహిష్కరణకు విధిస్తున్నామని వివరించారు. పటమట స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే నగర బహిష్కరణకు సిఫార్సు చేస్తామని సీఐ డీకే విశ్వనాథ్ హెచ్చరించారు

31లోగా మూడో దశ రీ సర్వే పూర్తికి చర్యలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):ఎన్టీఆర్ జిల్లాలో జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష కింద చేపట్టిన సమగ్ర రీసర్వే పనులు లక్ష్యాలకు అనుగుణంగా జరుగుతున్నాయని జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్ తెలిపారు. ఈ నెల 31వ తేదీ లోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర సర్వే, సెటిల్‌మెంట్ కమిషనర్ సిద్ధార్థ్ జైన్ అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్లతో బుధవారం సమగ్ర రీసర్వే పనుల పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీసర్వే పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ జిల్లాకు సంబంధించిన పురోగతిని వివరించారు. జిల్లాలో మూడో దశ కింద 100 గ్రామాల్లో సర్వే జరుగుతోందన్నారు. వీటిలో అన్ని గ్రామాలకు సంబంధించి ఇప్పటికే గ్రౌండ్ ట్రూతింగ్ (జీటీ) పూర్తయినట్లు తెలిపారు. 55 గ్రామాలకు సెక్షన్ 13 నోటిఫికేషన్ కూడా జారీచేసినట్లు వివరించారు. వివిధ దశల్లో ఉన్న సమగ్ర భూ సర్వే కార్యకలాపాలను ఈ నెల 31వ తేదీలోగా పూర్తిచేసేందుకు ప్రణాళికబద్ధంగా పనిచేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ తెలిపారు. సమావేశంలో సర్వే విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ గీతాబాయి

చిలకలపూడి(మచిలీపట్నం): లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, వాటికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని కృష్ణా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జి.గీతాబాయి హెచ్చరించారు. బుధవారం సాయంత్రం తన చాంబర్‌లో పీసీపీఎన్‌డీటీ కమిటీ సమావేశాన్ని డీఎంహెచ్ఓ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో స్కానింగ్ కేంద్రాల కొత్త రిజిస్ట్రేషన్ కోసం రెండు దరఖాస్తులు, రెన్యువల్ కోసం రెండు దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిని పరిశీలించి కమిటీ ఆమోదం కోసం సమావేశంలో ఉంచామని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నట్లు తమకు సమాచారం వస్తే వెంటనే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. స్కానింగ్ కేంద్రాలను తరచూ ఆకస్మిక తనిఖీలు చేస్తామన్నారు. డీఐఓ ఎ.సీతాకుమారి, పిడియాట్రిషియన్ హారిక, గైనకాలజిస్ట్ అనురాధ, సభ్యులు కె.సుశీల, ఎన్.ధర్మతేజ, పి.మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల చోరీ కేసులో నిందితుడికి రిమాండ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వాహనాల చోరీకి పాల్పడిన నిందితుడికి కోర్టు రిమాండ్ విధించింది. వన్‌టౌన్ పోలీసుస్టేషన్ల పరిధిలో పలు వాహనాల చోరీ ఘటనలపై కేసులు నమోదయ్యాయి. వన్‌టౌన్ సీఐ రావి సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కేసులను దర్యాప్తు చేశారు. బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం చింతపల్లిపాడు గ్రామానికి చెందిన పాలపర్తి నాగరాజు (28)ను నిందితుడిగా పోలీసులు గుర్తించారు. నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు అతని వద్ద నుంచి నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నాగరాజును బుధవారం న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్ విధించారు.

ఇద్దరు పాత నేరస్తుల అరెస్టు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు పాత నేరస్తులను జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నాలుగు ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ పోలీసుల కథనం మేరకు.. మధ్యప్రదేశ్‌కు చెందిన పాత నేరస్తులు బీరేంద్ర బహదూర్ సింగ్(37), దిల్‌చాంద్ బర్మన్(27) బుధవారం ఉదయం విజయవాడ రైల్వేస్టేషన్‌లోని ఏడో నంబర్ ప్లాట్‌ఫాంపై అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు దాడి చేసి వారిని అరెస్టు చేశారు. వారి వద్ద నాలుగు ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా

క్రీడా కిట్లు పంపిణీ



లబ్బీపేట(విజయవాడతూర్పు): క్రీడలు ఆడటం వల్ల శారీరక దారుఢ్యంతో పాటు, మానసికోల్లాసం లభిస్తుందని 7వ డివిజన్ కార్పొరేటర్ మెరకనపల్లి మాధురి అన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా బుధవారం శాప్ డైరెక్టర్ దామోదర్‌తో కలిసి మెరకనపల్లి మాధురి డివిజన్‌లోని యువతకు క్రీడా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా మాధురి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువతను ప్రోత్సహించే విధంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. అనంతరం శాప్ డైరెక్టర్ దామోదర్ మాట్లాడుతూ యువత వ్యసనాలకు బానిసలు కాకుండా మెరుగైన సమాజ నిర్మాణంలో కీలకపాత్ర పోషించాలన్నారు.

జమాక్ ఎన్నికల్లో నాగచంద్ విజయం



ఆటోనగర్(విజయవాడతూర్పు): జవహర్ ఆటోనగర్‌లోని జమాక్ రెసిడెన్షియల్ హౌసింగ్ కాంప్లెక్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 422 ఓట్లు ఉండగా.. 351 పోలయ్యాయి. అధ్యక్ష అభ్యర్థి త్రిపురనేని హనుమాల్ నాగచంద్ (గడియారం గుర్తు)కు 192 ఓట్లు వచ్చాయి. ఆయన సమీప అభ్యర్థి మేరుగ వెంకటరాజారావు(పుష్పం గుర్తు)కు 149 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఉదయం 8 గంటల నుంచి 2 గంటల వరకు ఎన్నికలు జరిగాయి. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటలకు వరకు కౌటింగ్ ప్రక్రియ కొనసాగింది. అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులతో పాటు పలువురు మెంబర్లు గడియారం గుర్తు ప్యానల్ అభ్యర్థులు గెలుపొందారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు హనుమాల్ నాగచంద్ మాట్లాడుతూ జమాక్ భవన సముదాయం అభివృద్ధికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. పటమట ఎస్‌ఐ జాన్‌బాషా ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

అమర గాయకుల సేవలు ఆదర్శనీయం



విజయవాడకల్చరల్: అమర గాయకుల సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సీనియర్ గాయకుడు సయ్యద్ అలీ అన్నారు. ఫ్రెండ్స్ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై బుధవారం అమర గాయకుడు కిషోర్‌కుమార్, మహ్మద్ రఫీ, మన్నాడే, లతా మంగేష్కర్, ఘంటసాల తదితర గాయనీ గాయకుల స్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. సయ్యద్ అలీ మాట్లాడుతూ హిందీ చిత్రగీతాలకు జాతీయ స్థాయి గుర్తింపును తీసుకువచ్చారని తెలిపారు. కళా పోషకుడు మీరాకుమార్ మాట్లాడుతూ హిందీ గాయకులను తెలుగు వారు సమాదరించినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన కొప్పరపు బలరామకృష్ణ మూర్తి, చిట్టిబాబు, పరచూరి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. డి.చంద్రశేఖర్, మల్లాది స్వాతి, రూపాశ్రీ, రాంబాబు తదితరులు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు. సయ్యద్ అలీని, గాయకుడు రాంబాబును నిర్వాహకులు సత్కరించారు.

వట్టి మాటలు కాదు.. గట్టి పనులు

చేతల్లో అభివృద్ధిని చూపిస్తున్న ప్రభుత్వం

- 19వ డివిజన్‌లో రూ.7.10 కోట్ల మేర పనులు
- దశాబ్దాల షాదీఖానా సమస్యకు పరిష్కారం
- నాలుగేళ్లుగా ప్రగతి పథాన డివిజన్
- సీసీ, బీటీ రోడ్లతో పాటు సైడ్ డ్రెయిన్‌లు ఏర్పాటు



బృందావనకాలనీలోని సింధ్‌భవన్ సీసీ రోడ్డు



బృందావన కాలనీలో వేసిన బీటీ రోడ్డు

లబ్బీపేట(విజయవాడతూర్పు): దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న షాదీఖానా సమస్య పరిష్కారమైంది. శిథిలమైన రోడ్లు సుందరంగా మారాయి. పగిలిన సైడ్ డ్రెయిన్‌లు బాగుపడ్డాయి. రజకులకు షెడ్డు అందుబాటులోకి వచ్చింది. వెరసి అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది విజయవాడ నగరం. వైఎస్సార్ సీపీ పాలనలో సంక్షేమంతో పాటు, అభివృద్ధిలోనూ దూసుకుపోతోంది. తూర్పు నియోజకవర్గంలోని 19వ డివిజన్లో రూ. 7.10 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నడూ లేనంతగా తమ ప్రాంతం అభివృద్ధి చెందిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూపు మారిన రోడ్లు..

డివిజన్‌లోని అమెరికన్ ఆస్పత్రి సమీపంలోని కాలనీలో మూడు అంతర్గత రోడ్డు సీసీ రోడ్డు వేశారు. చెన్నుపాటి పెట్రోలు బంకు పక్క రోడ్డు, పిచ్చయ్య వీధిలోని చిన్నమసీదు రోడ్డు, బందరు కాల్వ ఒడ్డున ఆర్‌అండ్‌బీ క్వార్టర్స్ రోడ్డు, గ్రీన్‌లాండ్స్ ప్రాంతంలో మూడు అంతర్గత రోడ్లను సీసీ, బీటీ రోడ్డుగా వేశారు. బృందావనకాలనీలోని నందమూరు రోడ్డు, సింధు భవన్‌రోడ్డు, ప్రగతినగర్ రోడ్డు వేశారు. దాదాపు 15 రోడ్లను సీసీ, బీటీ రోడ్లుగా తీర్చిదిద్దారు.

ఇతర అభివృద్ధి పనులు..

డివిజన్‌లో డ్రెయిన్ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. లబ్బీపేట ఉర్దూ స్కూల్ వీధిలో సీసీ డ్రెయిన్ నిర్మాణం చేపట్టారు. దానితో పాటు పలు ప్రాంతాల్లో డ్రెయిన్‌లు నిర్మాణం జరిగింది. ముఖ్యంగా రజకులు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న పున్నమ్మతోటలో దోబీఖానా వద్ద రూ. 15 లక్షలతో షెడ్డు నిర్మాణం చేశారు. దీంతో వర్షాకాలంలో రజకులు పడుతున్న ఇబ్బందులు పరిష్కారమయ్యాయి. ఫకీరుగూడెంలో రూ.7 లక్షలతో చేపట్టే డ్రెయినేజీ పనులను ప్రారంభించనున్నారు.



షాదీఖానా నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న డెప్యూటీ సీఎం అంజాద్‌బాషా, అవినాష్ (ఫైల్)

వేగంగా అభివృద్ధి పనులు..



మా డివిజన్‌లో నాలుగేళ్లలో అనేక అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. గత ప్రభుత్వంలో సమస్యలు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదు. రోడ్లు సైతం వేయలేదు. కానీ నేడు ఏ సమస్య ఉన్నా నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ దృష్టికి తీసుకెళ్తే వెంటనే పరిష్కారం అవుతోంది.

– చింతగుంట విజయ్ ఆనంద్ కుమార్, ఫకీరుగూడెం

సమస్యలు పరిష్కరిస్తున్నాం..



డివిజన్‌లో నెలకొన్న అనేక సమస్యలను పరిష్కరించగలిగాం. నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ చొరవతో వేగంగా అభివృద్ధి చేయగలుగుతున్నాం. కొన్ని సమస్యలు కార్పొరేషన్ అధికారుల ద్వారా పరిష్కరిస్తున్నాం.

– రెహానా నాహీద్, కార్పొరేటర్, 19వ డివిజన్

అదే విధంగా డివిజన్‌లో రూ.22 లక్షలతో మంచినీటి పైప్‌లైన్ పనులు చేశారు.

రూ.2.10 కోట్లతో షాదీఖానా..

దశాబ్దాలుగా ఎదురు ముస్లిం మైనార్టీలు ఎదురు చూస్తున్న షాదీఖానా ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. పిచ్చయ్య వీధి చివరిలో బందరు కాలువ ఒడ్డున రూ.2.10 కోట్లతో నిర్మాణం చేపడుతున్నారు. దీంతో మైనార్టీల కల నెరవేరినట్లయింది.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని



లబ్బీపేట(విజయవాడతూర్పు): వికసిత్ భారత్, భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. ఆమె కేదారేశ్వరపేట మ్యాంగో మార్కెట్ సమీపంలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆ శిబిరంలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి, వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పలు సూచనలు ఇచ్చారు. అనంతరం శిబిరానికి వచ్చిన రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో బాప్టిస్టుపాలెం యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేఘనందిత, ఇతర ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

రేపు వార్డు వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న వార్డు వలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకున్నవారికి ఈ నెల 15వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పటమటలోని సర్కిల్–3 కార్యాలయంలోని జోనల్ కమిషనర్ చాంబర్లో ఈ నెల 15వ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని, అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని పేర్కొన్నారు. వివరాలకు స్పెషల్ సెల్ (వార్డు సెక్రటేరియట్స్) లేదా 8185933187 నంబర్లో సంప్రదించాలని ఆయన సూచించారు.

విద్యార్థులకు అవగాహన కోసమే ఇన్ఫర్మేషన్ పార్క్

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



ప్లాంట్‌లో జరుగుతున్న ఆధునిక పనులను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని అజిత్ సింగ్‌నగర్‌లోని ఎక్సెల్‌ప్లాంట్ ప్రాంగణంలో వీఎంసీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఇన్ఫర్మేషన్ పార్కును బుధవారం వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ప్లాంట్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ ఎలా జరుగుతుందీ, వ్యర్థ పదార్థాల నుంచి ఉపయోగపడే వస్తువులను ఎలా తయారు చేస్తున్నారనే దానిపై ప్రజలకు, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరించేలా మ్యూజియం ఇన్ఫో పార్క్‌లో త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యర్థ పదార్థాల నిర్వహణ చూపించే సూక్ష్మ 3డీ మోడల్స్ పనులపై ఆరా తీశారు. ఎక్సెల్ ప్లాంట్‌లో ఫ్లవర్ వేస్ట్ మేనేజ్మెంట్, విండో కంపోస్టింగ్, వర్మీ కంపోస్ట్ ప్లాంట్, బయో మిథనేషన్ ప్లాంట్, ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మ్యానేజ్మెంట్ ప్లాంట్లు, మినీ సూయిజ్ ట్రీట్మెంట్ ప్లాంట్, ట్రీ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్, టౌన్ ప్లానింగ్ సెక్షన్ స్క్రాప్, స్క్రాప్ ప్లేసింగ్ యూనిట్, మ్యాట్రెస్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్, సి–డి వేస్ట్ రీసైక్లింగ్ యూనిట్‌లు ఉన్నాయన్నారు. వీటి గురించి త్రీడీ పద్ధతిలో ప్రత్యక్షంగా విద్యార్థులకు, పిల్లలకు, ప్రజలందరికీ సమాచారాన్ని చూపించడమే ఇన్ఫర్మేషన్ పార్కు ముఖ్య ఉద్దేశమని కమిషనర్ వివరించారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏఎస్ఎన్ ప్రసాద్, ఏడీహెచ్ శ్రీనివాసు, డీసీపీ జుబిన్ సిరెన్ రాయ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ప్రజల క్షేమం కోసం తపించే నాయకుడు సీఎం జగన్

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్



క్రీడాకారులకు ఆడుదాం ఆంధ్రా కిట్స్ పంపిణీ చేస్తున్న దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని ప్రజలందరికీ మంచి చేయాలని అనుక్షణం తపించే ఏకైక నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు.బుధవారం రాణిగారితోట, 17వ డివిజన్‌లోని 80 వార్డు సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అవినాష్ పాల్గొని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు వివిధ పథకాల రూపంలో అందిన లబ్ధిని తెలిపే సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలు కూడా నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నాలుగున్నరేళ్ల కాలంలో ఈ డివిజన్‌లో రూ.15కోట్లు 81లక్షలను సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలకు వెచ్చించడం జరిగిందన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ అని తిరుగుతున్న చంద్రబాబు పార్టీకే గ్యారెంటీ లేదన్నారు. అనంతరం 80వ వార్డు సచివాలయం పరిధిలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి పేర్లు నమోదు చేసుకున్న క్రీడీకారులకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 17వ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి, శాప్ డైరెక్టర్ కావటి దామోదర్, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ సుజాత, వైఎస్సార్ సీపీ నాయకులు కాశీం, బొడ్డు అప్పలనాయుడు, అయ్యపరెడ్డి, నరసింహారెడ్డి, బుచ్చిబాబు, కమలమ్మ పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాల్లో సమాన అభివృద్ధి

- నగర మేయర్ భాగ్యలక్ష్మి
- 22వ డివిజన్‌లో రూ. 80లక్షల విలువైన పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, దేవినేని అవినాష్, తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగనన్న పాలనలో అభివృద్ధి పరుగులు పెడుతోందని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. కృష్ణలంక, 22వ డివిజన్‌లో సుమారు రూ.80లక్షల ప్రభుత్వ నిధులతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు బుధవారం వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగరాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు.

వివక్ష లేకుండా అభివృద్ధి..

అవినాష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో నూతన రోడ్లు, డ్రెయినేజీ, మంచినీటి పైప్‌లైన్, పార్కులు వంటి అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఏదైనా నియోజకవర్గంలో ఓడిపోతే ఆ నియోజకవర్గంలో అభివృద్ధి గురించి పట్టించుకునేవారు కాదని, కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రమంతా సమ అభివృద్ధి జరుగుతుందని, అందుకు నిదర్శనమే తూర్పులో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు అని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ నియోజకవర్గ అభివృద్ధి గురించి మాట్లాడకుండా రాష్ట్ర సమస్యలంటూ ప్రగల్భాలు పలుకుతున్నారని ఎద్దేవా చేశారు. డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, స్టాండింగ్ కమిటీ మెంబర్, డివిజన్ కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు జోగారాజు, నాగిరెడ్డి, గోపాల్‌రెడ్డి, రమణారెడ్డి, ఫజులుద్దీన్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతో అన్ని విధాలా అభివృద్ధి

ఆటోనగర్(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాతనే డివిజన్‌లో అభివృద్ధి శరవేగంగా జరిగిందని విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. బుధవారం 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్ కరకట్ట ప్రజలకు తాగునీటి అవసరాలకు గాను రూ.30 లక్షలతో నిర్మించే వాటర్ పైప్‌లైన్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ రూ. కోట్లాది రూపాయలతో తాగునీరు, అంతర్గత రహదారులు, డ్రెయినేజీ, మంచినీటి ట్యాంకులతో పాటు పైపులైన్ల నిర్మాణ పనులు పెద్ద ఎత్తున చేశామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తన దృష్టికి తీసుకు వచ్చిన సమస్యల్లో సుమారు 95 శాతానికి పైగా పరిష్కరించినట్టు చెప్పారు. డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, వైఎస్సార్ సీపీ నాయకులు ఆళ్ల చెల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఆర్‌లో కెమిస్ట్రీ డే వేడుకలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్‌సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యాన కెమిస్ట్రీ డే వేడుకలు జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ కెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.నారాయణ అతిథి ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన రసాయనశాస్త్రం ప్రాముఖ్యతను వివరించారు. కెమిస్ట్రీ డే పురస్కరించుకుని విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు శ్రీనివాసరావు, ప్రసాద్, ఎం.మాల్యాద్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

27న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడలోని ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి ఈ నెల 27న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ కొలసాని శ్రీనివాసరావు తెలిపారు. ఆ రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ నిర్వహించే ఇంటర్వ్యూలకు ఆసక్తి అర్హతలున్న అభ్యర్థులు హాజరు కావచ్చని సూచించారు. పూర్తి వివరాలకు http://gdchvja.in/ వెబ్‌సైట్‌లో చూడవచ్చునని ఆయన తెలిపారు.




పోలి కాంతులు

పోలిస్వర్గం దీప కాంతులతో కృష్ణానది దేదీప్యమానంగా వెలిగిపోయింది. కార్తిక మాసం ముగింపు సందర్భంగా విజయవాడ దుర్గాఘాట్‌లో బుధవారం తెల్లవారు జామున వేలాది మంది మహిళలు, భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం తమ వెంట తెచ్చుకున్న అరటి దొప్పలలో అలంకరించిన కార్తిక వత్తులు వెలిగించి, నది ఒడ్డున పూజలు చేసిన పిదప పోలి పోయి రావమ్మా అంటూ ఆ దొప్పలను నదిలో వదిలారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





సంక్షేమాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

గడప గడపకు మన ప్రభుత్వంలో దేవినేని అవినాష్



స్థానిక సమస్యలు తెలుసుకుంటున్న దేవినేని అవినాష్

గుణదల (విజయవాడ తూర్పు): ప్రజా సంక్షేమంతో పాటు మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ తూర్పు ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ అన్నారు. 2వ డివిజన్ పరిధిలోని మాచవరం కొండ ప్రాంతంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మమేకం అయ్యారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారుల దృష్టికి వాటిని తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనంతర ఆయన మాట్లాడుతూ ప్రజలకు మేలు చేసే నిమిత్తమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జన జీవనం అస్తవ్యస్తంగా మారిందని గుర్తు చేశారు. వారి సమస్యలు మరుగు పడ్డాయన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించి ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించాలనే సంకల్పంతో సీఎం జగన్ మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రమే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమైందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే దిశగా పథకాలను అమలు పరుస్తూ జనరంజకమైన పాలన అందించడంలో సీఎం జగన్ సఫలమయ్యారని పేర్కొన్నారు. గత నాలుగున్నరేళ్ల కాలంలో సంక్షేమంతో పాటు మౌలికాభివృద్ధి చేరువచేయటంలో ప్రభుత్వం నిబద్ధతగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో 2వ డివిజన్ కార్పొరేటర్ అంబడిపూడి నిర్మలా కుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు మోయిన్, పెద బాబు, మురళీ, కిరణ్ పాల్గొన్నారు.

పర్యావరణం



శిలాజ ఇంధనాలను అంతం చేయండి... భవిష్యత్తును, భూగోళాన్ని కాపాడండి. - లిసిప్రియ

నిండు సభలో... నిగ్గదీసి అడిగిన అగ్గిస్వరం

వాన కురిస్తే, హరివిల్లు విరిస్తే మురిసే చిన్నారి హృదయాలకు ప్రకృతి ఆత్మీయ నేస్తం. అలాంటి అందమైన, ఆత్మీయమైన ప్రకృతి ఎదుట విలయ విధ్వంసం కరాళనృత్యం చేస్తుంటే... లిసిప్రియలాంటి చిన్నారులు 'పాపం, పుణ్యం ప్రపంచ మార్గం' అని ఊరుకోరు. ప్రకృతికి సంబంధించి మనం చేస్తున్న పాపం ఏదో, పుణ్యం ఏదో కళ్లకు కట్టేలా ప్రచారం చేస్తారు. దుబాయ్‌లో జరిగిన 'యునైటెడ్ నేషన్స్ క్లైమెట్ చేంజ్ కాన్ఫరెన్స్-2023'లో తన నిరసనను బహిరంగంగా తెలియజేసింది మన దేశానికి చెందిన పన్నెండు సంవత్సరాల లిసిప్రియ కంగుజామ్. 'శిలాజ ఇంధనాలను అంతం చేయండి... భవిష్యత్తును, భూగోళాన్ని కాపాడండి' అంటూ నినదించింది. కొద్దిసేపు ప్రసంగించింది. ఆమె నిరసనను ప్రపంచ ప్రతినిధులు కొందరు చప్పట్లతో ఆమోదం పలికారు. ప్రపంచ దృష్టిని ఆకర్షించిన మణిపూర్‌కు చెందిన క్లైమెట్ యాక్టివిస్ట్ లిసిప్రియ గురించి....

లిసిప్రియ కంగ్‌జామ్ మణిపూర్‌లోని బషిక్‌హోంగ్‌లో జన్మించింది. తల్లిదండ్రుల ద్వారా, స్కూల్లో ఉపాధ్యాయుల ద్వారా విన్న పర్యావరణపాఠాలు ఈ చిన్నారి మనసుపై బలమైన ప్రభావాన్ని చూపాయి. పర్యావరణ సంరక్షణ కోసం తన వంతుగా ఏదైనా చేయాలనుకుంది. ఏడు సంవత్సరాల వయసులోనే అందరూ ఆశ్చర్యపడేలా పర్యావరణ సంబంధిత విషయాలు మాట్లాడేది.

నా నేరం ఏమిటి?

నిరసన తరువాత అధికారులు నన్ను 30 నిమిషాలకు పైగా నిర్బంధించారు. నేను చేసిన నేరం ఏమిటంటే పర్యావరణ సంక్షోభానికి ప్రధాన కారణం అయిన శిలాజ ఇంధనాలను దశల వారీగా తొలగించమని అడగడం. నన్ను 'కాప్ 28'లో లేకుండా చేశారు.

– లిసిప్రియ, యాక్టివిస్ట్

యాక్ట్ నౌ

దుబాయ్‌లో జరిగిన క్లైమేట్ కాన్ఫరెన్స్-2023లో 190 దేశాల నుంచి 60,000 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. చిన్నారి ప్రియ ధైర్యంగా వేదిక మీదికి వచ్చి 'అవర్ లీడర్స్ లై. పీపుల్ డై' అని గట్టిగా అరిచింది. సదస్సు ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఆ తరువాత ప్రేక్షకుల నుంచి ప్రశంసలు లభించాయి.

'ఎవరు ఈ అమ్మాయి?' అంటూ చాలామంది ఆరా తీశారు. చిన్న వయసు నుంచే పర్యావరణ ఉద్యమంలో చురుకైన పాత్ర నిర్వహిస్తున్న ప్రియ గురించి తెలుసుకొని ఆశ్చర్యానందాలకు గురయ్యారు.

2018లో ప్రకృతి విధ్వంసంపై మంగోలియాలో ఐక్యరాజ్య సమితి నిర్వహించిన సదస్సులో తండ్రితో కలిసి పాల్గొంది. ఈ సదస్సులో వక్తల ఉపన్యాసాల నుంచి ఎన్నో కొత్తవిషయాలు నేర్చుకుంది.

ఈ సదస్సు ప్రియ జీవితాన్ని మార్చేసిన సదస్సు అని చెప్పవచ్చు.

ఈ సదస్సు స్ఫూర్తితో 'చైల్డ్ మూమెంట్' అనే సంస్థను మొదలుపెట్టింది. మొక్కల పెంపకం వల్ల ప్రకృతికి జరిగే మేలు, ప్రకృతి విధ్వంసం వల్ల జరిగే నష్టాలు... మొదలైన వాటి గురించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎన్నో స్కూల్స్‌లో ప్రచారకార్యక్రమాలు విరివిగా నిర్వహించింది.

2019లో స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో జరిగిన యునైటెడ్ నేషన్స్ క్లైమేట్ ఛేంజ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొంది. ఇదే సంవత్సరం అంగోలా దేశంలో జరిగిన ఆఫ్రికన్ యూనియన్ సదస్సులో పాల్గొంది. ఈ సదస్సులో ఎంతోమంది దేశాధ్యక్షులతో పాటు ప్రియ ప్రసంగించడం విశేషం.

చిన్నవయసులోనే ఎన్విరాన్‌మెంటల్ యాక్టివిస్ట్‌గా ప్రపంచవ్యాప్తంగా పెద్ద పేరు తెచ్చుకుంది లిసిప్రియ.

ప్రియకు డబ్బులను పొదుపు చేయడం అలవాటు. అవి తన భవిష్యత్ అవసరాలకు ఉద్దేశించి కాదు. సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించడం కోసం పొదుపు చేస్తుంటుంది. 2018లో కేరళ వరద బాధితులకు సహాయంగా ముఖ్యమంత్రి సహాయనిధికి లక్షరూపాయలు విరాళంగా ఇచ్చింది. దిల్లీలోని వాయు కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకొని 'సర్వైవల్ కిట్ ఫర్ ది ఫ్యూచర్' అనే డివైజ్‌కు రూపకల్పన చేసింది. ఈ జీరో బడ్జెట్ కిట్ వాయుకాలుష్యాన్ని తగ్గిస్తుంది. ఎవరైనా, ఎక్కడైనా సులభంగా తయారు చేసుకోవచ్చు. ఈ పరికరాన్ని పంజాబ్ అసెంబ్లీలో లాంచ్ చేసింది ప్రియ. వాతావరణ మార్పులపై కార్యచరణ కోసం, మన దేశంలో క్లైమెట్ లా కోసం వందలాదిమందితో కలిసి దిల్లీలోని ఇండియా గేట్ దగ్గర ప్రదర్శన నిర్వహించింది.

'సందేశం ఇవ్వాలనుకోవడం లేదు. సమస్యను అర్థం చేసుకోమని చేతులు జోడించి వినమ్రంగా వేడుకుంటున్నాను' అంటుంది లిసిప్రియ.

న్యూస్‌మేకర్ ఆషిక్



కుమారునికి వంట నేర్పితే?

ఏమవుతుంది?

బహుశా 'మాస్టర్ చెఫ్' విజేతగా 25 లక్షలు ఇంటికి తీసుకొస్తాడు. అబ్బాయిలు వంట గదిలోకి వస్తే 'ఏంట్రా ఆడపిల్లలాగా' అని మందలిస్తారు. కాని వంట స్త్రీలకూ, పురుషులకూ రావాలి. పిల్లలు ఎంత బాగా చదువుకున్నా వారికి కొద్దో గొప్పో వంట తెలిసుండాలి. 'మాస్టర్ చెఫ్' తాజా విజేత ఆషిక్ మా అమ్మ నేర్పిన వంట వల్లే గెలిచాను అన్నాడు. మంగళూరులో చిన్న జ్యూస్ షాప్ నడుపుకునే ఆషిక్ ఇంత పెద్ద గెలుపుతో ప్రపంచాన్ని ఆకర్షించాడు.

'సోనీ లివ్' చానల్ వారి ప్రఖ్యాత రియాలిటీ షో 'మాస్టర్ షెఫ్' సీజన్ 8 ఆడిషన్స్ రౌండ్‌లో ఆషిక్ చేసిన మంగళూరు స్టయిల్ ఫిష్ ఫ్రైను జడ్జీలు వెంటనే ఓకే చేయలేదు. 'కొంత బాగుంది కొంత బాగలేదు. మళ్లీ చెప్తాం' అన్నారు. కాని ఆ తర్వాత ఆషిక్‌కు అవకాశం ఇచ్చారు. అప్పటినుంచి అంటే అక్టోబర్ 18 నుంచి డిసెంబర్ 8 ఫైనల్స్ వరకూ ఆషిక్ చేసిన వంటకాల ప్రయాణం ఉద్వేగభరితంగానే సాగింది. ఎందుకంటే అతడు వంటను శాస్త్రోక్తంగా నేర్చుకోలేదు. అమ్మ దగ్గర ఇంట్లో వంటగదిలో నేర్చుకున్నాడు.

24 ఏళ్ల కుర్రాడు

మంగళూరుకు చెందిన ఆషిక్ వయసు 24 ఏళ్లు. దిగువ మధ్య తరగతి కుటుంబం. ఇంటర్ తర్వాత హోటల్ మేనేజ్‌మెంట్ చేద్దామనుకున్నాడు. కాని ఫీజు కట్టే పరిస్థితి లేక కట్టలేదు. ఏం చేయాలి. వంట బాగా వచ్చు. యూ ట్యూబ్‌లో చూసి రకరకాల వంటకాలు చేయడం నేర్చుకున్నాడు. దానికి కారణం చిన్నప్పటి నుంచి అతని ఆటలన్నీ వంట గదిలోనే సాగేవి. నానమ్మ వంట చేస్తుంటే అక్కడే కూచుని చెంబులు తప్పేళాలతో ఆడుకునేవాడు. అమ్మ హయాం వచ్చేసరికి వంటలో సాయం పట్టడం మొదలెట్టాడు. తల్లి – 'ఏమిటీ ఆడంగి పనులు' అని తిట్టకుండా కొడుకును ప్రోత్సహించింది. ఇంటికి ఎవరొచ్చినా ఆషిక్ వంట చేసే పద్ధతి చూసి ఆశ్చర్యపోయేవారు. ఆ ఆత్మవిశ్వాసంతో మంగళూరులో 'కులుక్కి' పేరుతో చిన్న జ్యూస్ షాప్ పెట్టాడు ఆషిక్. అయితే అది సగటు జ్యూస్‌షాప్ కాదు. ఆషిక్ కనిపెట్టిన రకరకాల ఫ్లేవర్లు, మిక్స్‌డ్ కాంబినేషన్లు అందులో దొరుకుతాయి. జనం బాగా కనెక్ట్ అయ్యారు. అతని జ్యూస్ షాప్ మంచి హిట్. కాని ఇంకా జీవితంలో సాధించాలి అంటే ఏదైనా పెద్దగా చేయాలనుకున్నాడు ఆషిక్. 'మాస్టర్ షెఫ్' అందుకు వేదికగా నిలిచింది.

విఫలమైనా ముందుకే

2022 మాస్టర్ షెఫ్ ఆడిషన్స్‌కు వచ్చిన ఆషిక్ రిజెక్ట్ అయ్యాడు. 'చాలా డిప్రెషన్‌లోకి వెళ్లాను. మళ్లీ ఏమీ వండలేననే అనుకున్నాను. కాని సాధించాలి... మనసుపెట్టి పోరాడాలి అని నిశ్చయించుకున్నాను. 2023 ఆడిషన్స్ వచ్చేవేళకు చాలా కష్టపడి తర్ఫీదు అయ్యాను సొంతగా. షో ముందుకు వెళ్లేకొద్దీ సవాళ్లు ఎదురైనా ఛేదిస్తూ విజేతగా నిలిచాను' అన్నాడు ఆషిక్.


తల్లితో ఆషిక్

ఫైనల్స్ ఎపిసోడ్‌లో ఆషిక్ తల్లిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఆమె సమక్షంలోనే ఆషిక్‌ను విజేతగా ప్రకటించారు. కొడుకు విజేత అవుతాడో లేదో నని ఆమె ఉత్కంఠగా ఎదురు చూసింది. ఆపై కొడుకు విజయానికి పులకించిపోయింది.

కాగా ఈ సీజన్‌లో మేఘాలయాకు చెందిన స్కూల్ ప్రిన్సిపల్ నంబి మొదటి రన్నర్ అప్‌గా, జమ్ము-కశ్మీర్‌కు చెందిన రుక్సర్ అనే ఫుడ్ టెక్నిషియన్ సెకండ్ రన్నర్ అప్‌గా నిలిచారు. ప్రసిద్ధ షెఫ్‌లు వికాస్ ఖన్నా, రణ్‌వీర్ బ్రార్, గరిమా అరోర జడ్జీలుగా వ్యవహరించారు. రొయ్యలతో ఆషిక్ చేసిన 'క్రిస్పీ ప్యారడైజ్' అనే వంటకాన్ని రుచి చూసిన జడ్జ్ రణ్‌వీర్ బ్రార్ తన సంతకం కలిగిన కిచెన్ నైఫ్ బహూకరించడం విశేషం.

హోటల్ రంగంలోగాని, స్వయం ఉపాధికిగాని పాకశాస్త్రం నేడు చాలా అవసరంగా ఉంది. మంచి షెఫ్‌లకు చాలా డిమాండ్ ఉంది. అదెలా ఉన్నా తెల్లారి లేస్తే మూడుపూట్లా తినాలి కనుక, వంట కేవలం ఆడవారి వ్యవహారం అనే భావన పోయి, ఇకమీదైనా అబ్బాయిలకు తల్లులు కనీసం అవసరమైనంత వంట నేర్పడం మంచిది. ఏమో... వారు ఇంకా బాగా నేర్చుకుంటే మరో మాస్టర్ షెఫ్ అవుతారేమో. ఏ ప్లేట్‌కు ఏ పదార్థం రాసి పెట్టుందో ఎవరు (రుచి) చూసొచ్చారు కనుక.

కిచెన్‌టిప్స్

కరకరలాడాలంటే...

బిస్కెట్లు మెత్తగా అవ్వకుండా కరకరలాడాలంటే ఇలా చేసిచూడండి...

- ప్లాస్టిక్, అల్యూమినియం డబ్బాలు, గాజు పాత్రల్లో బిస్కెట్లు, కుకీలను నిల్వచేయాలి. గాలి చొరబడకుండా పెడితే ఎక్కువరోజులపాటు క్రిస్పీగా ఉంటాయి.
- డబ్బాల్లో నిల్వచేసేటప్పుడు అడుగు భాగంలో రెండు మూడు వరుసల్లో టిష్యూపేపర్లు వేసి తరువాత బిస్కెట్లు పెట్టాలి. బిస్కెట్లపైన మరో రెండు వరుసల్లో టిష్యూపేపర్లు వేసి పైన బిస్కెట్లు పెట్టాలి. ఇలా నిండుగా పెట్టి గాలిచొరబడకుండా మూత పెట్టాలి.
- జిప్‌లాక్ పౌచ్‌లలో నిల్వచేస్తే కూడా కుకీలు తాజాగా ఉంటాయి.
- గాలి చొరబడని డబ్బాలు, జిప్‌లాక్ పౌచ్‌లను రిఫ్రిజిరేటర్‌లో పెడితే మరిన్ని రోజులు బిస్కెట్లు తాజాగా ఉంటాయి.
- అనుకోకుండా సరిగా నిల్వచేయనప్పుడు మెత్తబడిన కుకీలను అవెన్ లేదా ఎయిర్‌ఫ్రైయర్‌లో ఉంచి వేడి చేస్తే మళ్లీ క్రిస్పీగా మారతాయి. వీటిని కూడా నిల్వచేసుకోవచ్చు.



బ్యూటిప్స్ హెయిర్ కేర్

జుట్టుకు బలాన్నిచ్చే టానిక్

బీట్‌రూట్ ఒకటి తీసుకుని చెక్కు తీసి ముక్కలుగా తరగాలి. రెండు ఉసిరి కాయలను గింజలు తీసేసి ముక్కలుగా కోయాలి. వీటికి పన్నెండు రెమ్మల కరివేపాకు, గ్లాసు నీళ్లు కలపాలి. ఈ మిశ్రమాన్ని పదినిమిషాల పాటు మీడియం మంట మీద మరిగించాలి. చక్కగా మరిగాక దించేసి చల్లారిన తరువాత ఈ రసాన్ని వడగట్టి సీసాలో నిల్వచేసుకోవాలి. ఈ టానిక్‌ను వారానికి రెండు మూడుసార్లు కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించాలి. రెండు గంటల తరువాత సాధారణ షాంపుతో కడిగేయాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే కుదుళ్లకు పోషకాలు అందుతాయి. రక్తప్రసరణ చక్కగా జరిగి జుట్టు ఊడడం తగ్గుతుంది. చివర్లు చిట్లకుండా చక్కగా పెరుగుతాయి.



జెల్ మెరుపులు

టేబుల్ స్పూను పంచదార పొడిలో స్పూను వేడి నీళ్లు పోసి కలపాలి. దీన్లో రెండు టీస్పూన్ల పచ్చి పాలు, స్పూను అలోవెరా జెల్ వేసి కలపాలి. శుభ్రంగా కడిగిన ముఖానికి ఈ మిశ్రమాన్ని రాసి మర్దన చేయాలి. పదినిమిషాలపాటు ఆరనిచ్చి కడిగేయాలి. వారానికి మూడు సార్లు ఈ ప్యాక్ వేయడం వల్ల చర్మానికి తేమ అంది, మృదువుగా నిగారింపుతో కనిపిస్తుంది.



- మరుగుతున్న రెండు గ్లాసుల నీటిలో మూడు టేబుల్ స్పూన్ల టీపొడి, పది గులాబీ పువ్వులు వేసి పదినిమిషాలపాటు మరిగించాలి. ఇది చల్లారిన తర్వాత వడగట్టి ఒక సీసాలో పోయాలి. తల స్నానం చేసిన జుట్టుకు ఈ డికాషన్‌ను పట్టించి, టవల్ చుట్టుకోవాలి. నీటితో కడగకూడదు. ఇది కండీషనర్‌లా పనిచేసి జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది.

హెల్త్‌కేర్ ఇండస్ట్రీలో మహిళలు తక్కువ ఆదాయాలను పొందే ఫ్రంట్‌లైన్ పాత్రలలోనే కనిపిస్తున్నారు అని దస్రా ఆర్గనైజేషన్ ఒక డేటా విడుదల చేసింది. మహిళలు వైద్యవిద్యలలో 29 శాతం ఉంటే, నర్సింగ్ సిబ్బందిలో 80 శాతం ఉన్నారు. ఇక 100 శాతం ఆశావర్కర్లుగా ఉన్నారు. ఆరోగ్య సంరక్షణలో నాయకత్వ స్థానాల్లో కేవలం 18 శాతం మాత్రమే మహిళలు ఉన్నారు. ఈ రంగంలో పురుషుల కంటే 34 శాతం స్త్రీలు తక్కువ సంపాదిస్తున్నారు.



* హెల్త్ కేర్ నివేదిక

'రోల్' లేదు 'మోడల్' లేదు!

హెల్త్‌కేర్‌లో మహిళలు ఫ్రంట్‌లైన్‌కే పరిమితం

లాభాపేక్ష లేకుండా, అన్ని రంగాలలో సామాజిక మార్పునకు కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థ దస్రా. ఈ సంస్థ హెల్త్ కేర్ రంగంపై దృష్టి పెట్టి, ఓ నివేదికను రూపొందించింది. ఈ నివేదికలో పొందుపర్చిన విషయాలలో ముఖ్యంగా గమనించాల్సింది మహిళలకు రోల్‌మోడల్స్ లేకపోవడం, వారి పనిని తక్కువ అంచనా వేయడం, అంతర్గత పక్షపాతాలు, లింగ సమానత్వం గురించి సరైన అవగాహన లేకపోవడం అని పేర్కొంది.

ఫ్రంట్‌లైన్ పాత్రలలోనే..

భారతదేశంలో ప్రధానమైన హెల్త్‌కేర్ రంగం కొన్ని సంవత్సరాలుగా సాంకేతికత, నైపుణ్యాలు, విద్య, వృత్తిపరంగా గణనీయమైన అభివృద్ధి, విస్తరణను చవిచూసింది. అయినప్పటికీ ఆరోగ్య సంరక్షణ రంగంలో మహిళలు తక్కువ ఆదాయాలను పొందే ఫ్రంట్‌లైన్ పాత్రలలో కనిపిస్తున్నారని దస్రా నివేదిక సూచిస్తుంది. దస్రా డైరెక్టర్ శైలజా మెహతా మాట్లాడుతూ 'ఆరోగ్య సంరక్షణ రంగంలో మహిళల నాయకత్వంలో మార్పు తీసుకురావడం చాలా అవసరం. ఎందుకంటే, ఇతర రంగాలను కూడా హెల్త్‌కేర్ ప్రభావితం చేయడమే కారణం. లింగ సమానత్వం విషయంలో మా పనిలో మేం మహిళల పురోగతికి సంబంధించిన గ్యాప్‌పై దృష్టి పెట్టాలనుకున్నాం' అని తెలిపారు.

అతి తక్కువ శాతం

నివేదిక ఫలితాల ప్రకారం మొత్తం హెల్త్‌కేర్ వర్క్ ఫోర్స్‌లో 54 శాతం ఉన్న ప్రైవేట్ హాస్పిటల్ సెక్టార్‌లో మహిళలు దాదాపు 25 నుంచి 30 శాతం నాయకత్వ స్థానాలను ఆక్రమించారు. ఫార్మాస్యూటికల్, బయోటెక్ రంగాలలో 5 నుంచి 10 శాతం మాత్రమే నాయకత్వపాత్రల్లో మహిళలు ఉన్నారు. మార్కెటింగ్ కార్యకలాపాల స్థానాల్లో కూడా మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది. ప్రవేశ స్థాయి స్థానాల్లో మహిళలు 40 నుంచి 50 శాతం ఉండగా, సీనియర్ పాత్రలలో ఈ శాతం గణనీయంగా 15 నుంచి 20 శాతానికి పడిపోయింది.

పరిమిత ప్రాధాన్యం

మహిళలు ఆర్ అండ్ డి, నర్సింగ్, హెచ్ఆర్, పరిపాలన, నాణ్యత హామీ, చట్టపరమైన, నియంత్రణ వ్యవహారాలు వంటి విధుల్లో బాగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇవి పరిమిత ప్రభావాన్ని కలిగి ఉంటాయి. ముఖ్యంగా ఎంట్రీ లెవల్ హెచ్ఆర్ పాత్రల కోసం మహిళలకు ప్రాధాన్యత ఉంటుంది. దీని ఫలితంగా గణనీయంగా 70–80 శాతం ప్రాతినిధ్యం ఉంది. ఇదే నాయకత్వ స్థానాల్లో 20 నుంచి 30 శాతానికి పడిపోతుంది. నివేదిక ఫలితాలు, రోగుల సేవా బృందాలు, ఎఫ్ అండ్ బి మొదలైన వాటిలో ఇదే విధమైన నమూనాను గమనించాయి. ప్రవేశ స్థాయులలో 40 నుంచి 60 శాతం మహిళలను ప్రాధాన్యంగా నియమించుకుంటారు. అయితే సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ స్థాయులకు వారి పురోగతి పరిమితంగా ఉంది. ఇది 15 నుంచి 20 శాతానికి మాత్రమే చేరుకుంది.

రోల్ మోడల్స్ లేకపోవడమే..

లీడర్‌షిప్ క్వాలిటీ పెంపొందించుకోవడానికి మహిళలకు ప్రధాన అవరోధం రోల్ మోడల్స్ లేకపోవడమే. మహిళల పనిని తక్కువ అంచనా వేయడం, అంతర్గత పక్షపాతాలు, లింగ సమానత్వం, వైవిధ్యం గురించి నమ్మదగిన సాంస్కృతిక కథనం లేకపోవడం అని నివేదిక హైలైట్ చేసింది. శైలజా మెహతా మరిన్ని వివరాలు చెబుతూ 'అడ్డంకులు చాలా రెట్లు ఉన్నాయి. మహిళలు నిజంగా ప్రభావవంతంగా ఉన్నారా.. మంచి నాయకులు కాదా... అని ప్రశ్నించే మూస పద్ధతి కూడా ఒక కారణంగా ఉంది. మహిళల నాయకత్వానికి వ్యతిరేకంగా ప్రతికూల పక్షపాతాలు, నిబంధనలు, ప్రవర్తనలు, ఊహాజనితాలు ఎన్నో ఉన్నాయి. వీటిని వదులుకోవడం అంత సులభం కాదు. సంస్థలు మెరుగైన వ్యాపారం కోసం ఆలోచిస్తాయే తప్ప మహిళా ఉన్నతిని పెద్దగా పట్టించుకోవు. హెల్త్‌కేర్ రంగంలో మహిళలు లీడర్‌షిప్ స్థాయిలో ప్రాతినిధ్యం వహించడానికి చాలా కష్టపడాల్సి ఉంటుంది. భారతదేశంలో చాలా మంది మహిళలకు వారి ఆకాంక్షలకు కఠినమైన అడ్డంకులు ఉంటాయి. మహిళల లక్ష్యం నర్సు కావడమే అన్నట్టుగా ఉంటుంది. మేనేజర్‌గా లేదా సీఈవోగా ఉండటానికి వారికి అవకాశం ఇవ్వరు.

'మహిళలు తమ పరిమితులను దాటి, విస్తరించాలి. అడ్డుగోడలను, నిబంధనలను తొలగించుకుంటూ తమను తాము ప్రోత్సహించుకుంటూ ముందడుగు వేయాలి. అప్పుడే భవిష్యత్తు తరాలకు రోల్‌మోడల్స్‌గా నిలుస్తారు' అని చెబుతున్న దస్రా నివేదిక మనందరినీ ఆలోచింపజేస్తుంది.